భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

అక్టోబరు 1955

సంపుటము 32 : : సంచిక 10

విడిపత్రిక వెల ఒక రూపాయి



HVM. 236-X52 TL

ವಿಷಯಾನುಕ್ರಮಣಿಕೆ [illegible]

విషయానుక్రమణిక

అక్టోబరు 1955

త్రివర్ణ చిత్రము: విద్యావతి—చిత్రకారుడు: శ్రీ కేతినీడి భాస్కరరావు



ద్విశక్తిగల మోబిల్‌గ్యాస్ పూర్తి శక్తిని, అధిక పొదుపు యిస్తుందని బస్సు రవాణా నిర్వాహకులు చెబుతారు— అందుకే ఎంతోమంది దానిని ఎల్లప్పుడూ కొంటున్నారు!

ద్విశక్తిగల

మోబిల్‌గ్యాస్

వాడి అదనపు ఇంజను శక్తిని పొందండి

నేడు దొరకుతున్న పెట్రోలులలో ఒకటి మాత్రమే మీకు అంత ఎక్కువ అదనపు శక్తిని యిస్తుంది—అదే ద్విశక్తిగల మోబిల్‌గ్యాస్. ఎందుకంటె అది ఏ యితర పెట్రోలుకన్న ఎక్కువ ఇంజను బాధలను సరిచేయును!

ద్విశక్తిగల మోబిల్‌గ్యాస్ వాడితే మిక్కిలి చక్కని అక్సిలరేషన్, ప్రతి గాలనుకు ఎక్కువ మైళ్లు మీకు లభించును. మీ కారు లేక లారీ అది యివ్వాలన్నంత పనిని మీరు పొందుదురు.

ద్విశక్తిగల మోబిల్‌గ్యాస్ వాడుట నేడే ప్రారంభించండి. దీనిలో మాత్రమె మోబిల్ పవర్ కాంపౌండ్ కలదు—ఈ కాంపౌండ్ ఏ పెట్రోలులోనూ యిప్పటివరకు చేరని అడిటివ్‌ల అత్యధిక శక్తిగల మిశ్రమము. మోబిల్‌గ్యాస్ వాడుట లాభము, ఎందుకంటె అది మీ డబ్బుకి అధిక విలువ నిచ్చును.

ఇది ఎగురుచున్న ఎఱ్ఱని గుఱ్ఱపు చిహ్నముగల చోట దొరకుతోంది

స్టాండర్డ్-వాక్యూమ్ ఆయిల్ కంపెనీ

(కంపెనీ సభ్యుల బాధ్యత పరిమితము)

V. 2066

సంధ్యాసుందరి

శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య

పశ్చిమాశాంతరమ్మున బగలు రేయి
రాపిడి జనించు నగ్నిహోత్రం బదేమొ!
కాక—కనకాద్రి రవి తురంగమ ఖురాళి
గలయరేగినదేమొ బంగారు ధూళి!

ధాతుప్రస్తరముల్ ద్రవింపగ దినాంత స్వర్ణ నైపథ్య సం
కేతస్థానమునన్ హిరణ్మయ విపంచీ తంత్రులన్ మీటి సం
గీతం బిమ్మగ నాలపించెడి శుభాంగీ! మాకు నొందిపు మ
ద్వైతానందపదమ్ము రూప రస గంధ స్పర్శ శబ్దంబులన్

ఈ నీరామని మబ్బు తున్కల కౌసల్ హేమింప, సిందూర శో
భానందంబులు సందడింపగను సంధ్యారంగమం దీవు కా
లూనన్ గేలు గదల్ప రక్తిమలు కాయున్ రాగముల్ సాగు, బా
లా! నర్తింపుము రాగరక్తిమలు కొల్లల్ కొల్లలై పోవగన్

రాలె ముత్యాలు నీ నాట్య రభసమందు
వ్రీలె కబరీభరంబు—నా కాలి క్రింది
కసవునుండి నక్షత్ర లోకంబు దాక
ప్రాకి పోయె నిశ్శబ్దతాభరము తమము.

కాంతిలేని దీపాలు

శ్రీ మంథా వెంకటరమణారావు

రంగం : పానశాల

సమయం— రెండవ ఝామురాత్రి. ద్వారంవద్ద చేతులు లేని కుర్చీమీద ముస్తాక్ కూర్చొనిఉంటాడు. అతని ముందు డ్రాయరున్న చిన్న టేబిలు. దానిమీద ఇత్తడిగంట - ఒకమూల పొగవల్ల మాసిన 'స్టాండ్ స్క్రీను' - గది రకరకాల వ్యక్తులతో నిండి ఉంటుంది. సెర్వర్లు తలలకు నల్లటి గుడ్డలు చుట్టుకొని 'స్క్రీను' వెనుకకు గదిలోకి విశ్రాంతి లేకుండా తిరుగుతూ ఉంటారు. 'స్క్రీను' వెనుకనుండి గ్లాసుల చప్పుళ్లు, ప్లేట్ల చప్పుళ్లు వినవస్తూంటాయి. అంతా గందరగోళంగా వుంటుంది.

స్క్రీనుకు దగ్గరగా, గోడకానుకుని నేలబెంచీమీద కూర్చొనిఉంటుంది విమల. తలదించుకుని కాలిగోటితో పగిలిన గచ్చునుండి మన్ను పెల్ల గిస్తూ — ఆమెకు రెండు వైపులా ఇద్దరు స్త్రీలు - పక్క బెంచీమీద కూర్చున్న వ్యక్తుల క్రీనీడలు వాళ్లని కొంత కప్పేస్తున్నాయి. చాలా మంది వాళ్లను గమనించినట్టు ప్రవర్తించరు. కొద్దిమంది మాత్రం క్రీగంట చూస్తూఉంటారు, గ్లాసులు మూతి దగ్గరుంచుకొని.

ఇంతలో స్క్రీను వెనుకనుండి గ్లాసులు నేలబడిపగిలిన సడివినవస్తుంది:

ముస్తాక్ : (గంట గట్టిగా కొట్టి) అసీఫ్! అక్తార్! హుస్సేన్! ప్రపంచం ఉందా మంట గలిపేసేరా? నా సర్వస్వం కుంపనాశనం చేసిసేరా లేదా? గాడిద కొడుకులు... మిమ్మల్ని పక్కనోడ్ని మీద పెట్టి చిత్రవధ చెయ్యాలి ... [ముగ్గురు సెర్వర్లూ వచ్చి నిల్చుంటారు టేబిలు ముందు] ఒంటిమీద తెలివి లేదురా? ఒళ్లు కొవ్వెందా.. లేక మీకూ తలో డ్రామా పుచ్చుకున్నారా... నీ కన్నిసార్లు చెప్పేరా హుస్సేన్! గాడిద కన్నా కనాకష్టంగా ఉంది నీ మెదడు....

హుస్సేన్ : అది నా తప్పేం కాదండి... తప్పెవర్దో తెల్సుకోకుండా ఎందుకండీ ఒకర్ని నింద చేస్తారు?

ము : ఎందుకు నిందచేస్తానా? బావుంది! నువ్వో ఎదురుప్రశ్న వేసేవరకు వచ్చింది నా బతుకు— సరి... సరి...

హు : మీరు సరిగా బోధచేసుకోటం లేదు...

ము : (టేబిలు గుద్దుతూ) అనుగో మళ్లా... నోర్మూయ్యి గాడిదా... ఎవరుచేస్తే నేం... మీలో ఏవొక్కడు చేసినా తప్పు అందరిదీనూ...

హు : అదేటండీ ... అలా గంటారు .... ఎవడో తప్పుచేస్తే నే నేంచేసేను .... మధ్య...

ము : పెద్ద లా హార్ అయిపోయేవే లా హార్! విన్నావుం అక్తార్ మీ వాడి ధోరణి... ఈ పప్పులేం నా దగ్గర ఉడకవ్ ... నే నేదంటే అది సరేతే చే ఉండటం... లేకపోతే సెలవు పుచ్చుకోవచ్చు...

హు : అసలు సంగతి వినకండా ఏటండీ? ఇందులో మా ఎవ్వరితప్పు లేదు.

ము : అదికూడా నా పైగా ... కుకోణం అంతా ధ్వంసం చేసి... ఛీ!... ఛీ!

హు : వినకుండా...

ము : నేను వినదల్చుకోలేదు...

హు : ఆ తప్పంతా మీ దేనండి...

ము : (ఆశ్చర్యపోయి, కోపంతో) ఆఁ? ఆఁ? ఏఁటిఁటి పేలుతున్నావ్?

హు : ఆ తప్పంతా మీ దేనండి...

ము : నాదా ....తప్పంతా నాదా! ఆ గ్లాసులు బద్దలవటం నా దా తప్పు..ఒళ్లు తెల్సుకునిమాట్లాడు..

హు : గ్లాసులు పెట్టే టేబిలు కాలు ఏనాడో విరిగి ఉంది... మీ కెన్నిసార్లు చెప్పినా లెక్కా పద్దా? ఇవాళ అది విరిగూరుకుంది పూర్తిగా...

ము : ఏమిటీ...? స్టూలు కాలు విరిగిందా... ఇన్నాళ్లు ఎలా నిల్చుంటూ వచ్చింది... ఇవాళ విరగడానికి... మీరు దాన్ని ఏమీ చెయ్యక పోతే ఎందుకు విరగబడుతుంది?

[అందరూ సంఘర్షణ జరిగే వేపు ఆత్రంగా చూస్తూ ఉంటారు.]

బిల్లు చెల్లించడానికి వచ్చిన ఒక వ్యక్తి: ముస్తాక్ భాయి....దీని కింత రాద్ధాంతం ఎందుకూ? చూసేవా నీ టేం పోతున్నాది.. ఏదో సర్దు బాటు చేసుకోవాలి కాని...

ము : ఏమిటి సర్దుబాటు చేసుకోవటం చిన్నా... ఎన్నిసార్లు నోరు పారేసుకున్నా ఇంతే...

వ్యక్తి : మనిషన్నవాడికి ఓర్పుండాలి... ఓర్చాలి జీవన్నాన్న... నువ్వు గ్లాసులు పోయేయచే ఇదయిపోయేదేనా నీకే ఇదైనా...

ము : అదేమిటి? నువ్వూ వన్నే నిందచేస్తావా చిన్నా? అందుకే వాళ్లిక ళ్లు నెత్తికొచ్చాయి..

వ్య : నువ్వు తప్పర్థం చేసుకోకు భాయి... నే చెప్పేదూ ఎవ్వరికీ కష్టమయ్యే మాట మాట్లాడన్న...అంతా నీ మంచి గురించే చెప్తుంట... చూడూ ... ఆ బాలురికా లేనా డబ్బూ అర్థో, దూపాయో ఇచ్చి బాగుచే యిస్తే ఎంత బాగుండును ?

ము : అనుగో మళ్ళీ...

వ్య : (తాగుడువల్ల తూగుతూ) చెప్పింది విను; జగులులో అన్ని కష్టాలే .... అన్నీ అటం కాలే ... వాటిని ఎదురుకొనే వస్తువనే ఏయిర్యమంటారు ... గాంధీ చెప్పినట్టు ... గాంధీ ఏం తక్కువ్వాడు కాదు సుమా... చూ గొప్పవాడు...నాకన్న మీకే ఎక్కువ సాయం చేసేడు... ఈ ప్రపంచం అంతకీ చేసేడనుకో...

ము : అదుగో వాడు తెల్సా... అప్పుడే వేదాంతం లోకి దించుతున్నావ్...

వ్యక్తి: ఛీఛీ! అది కాదు. నా ఉద్దేశం...ఆ....అయితే కష్టాలెన్నెదురొక్క వాలి ప్రతివాడూ ... మాటవరసకి నే మన్నానా... ఇంతో అంతో చదువుకున్నా నా....

ము : (స్వరం తగ్గించి) ఏం చదువుకున్నావ్ భాయ్? ఎప్పుడూ ఆ సంగతే చెప్పలేదే....

వ్యక్తి: అ... ఏదో రెండో ఫారం... మానా న్నన్న పన్నాడు చెప్పించేడు... చదువుల కేంలే కాని ముఖ్యంగా లోకజ్ఞానం ఉండాలి... అయితే ఇంతకీ నే చెప్పే దేంటంటే .... నేనూ జీవితంలో ఎన్నో కష్టా లనుభవించేను... చూసేవా .... రెండేళ్లకిందట నా పెళ్లాం పోయింది...అదంటే నా కెంత ప్రాణమో మీ అల్లాకి తెల్సు... అప్పు డప్పుడు చెయ్యి చేసుకున్నా... ఆ పాటి భాయిదాలో ఉండాల్లే ఆడదాన్ని .... అక్కళ్లు...అనుక్కు... అంతా ఎలా ఉండే దనుకున్నావ్... ఆ సినీమా స్టారైనా... అందంగా ఉంటుంది... సీతాపహరణంలో ఏదో చిన్న వేషం వేసింది...దాన్లా ఉండేది... నేనంటే తగని ప్రేమ...ఒకసారి పట్టలేక బుగ్గ కొరికేసింది ... కండక్కుండా ... పిచ్చెత్తిం దనుకున్నాను...అది ప్రేమకి చిన్నం అంది...

ము : (ఆత్రంగా) అర్రెరె కిని...ఆ! ఐతే...

వ్య : అయితేనేముంది ... పోయింది నా ప్రాణం ... నేను చచ్చిపోయేను అది పోవడంతో...ఆ తర వాత ఇదిగో నా అందాలభరిణ వచ్చింది. దిన్నుంచుకొని మరి పదినెలలయిందా ... ఒక్కనాడు ... మచ్చుకి ఒక్కనాడు ... ముద్దుగా ఉన్నపాపాన పోలేదు ... చెప్ప కుంటే సిగ్గుకాని...(గొంతు తగ్గించి) చెప్ప కుంటే సిగ్గుకాని...దాంతో నేను పడేబాధ పైనున్నవాడికి తెల్సు...కాని ఏం చెయ్యటం.. దాన్నొదల్లేను...దాన్నొవల్లేను...

ము : (మరింత ఆశ్చర్యంగా) అంత అందమయిన దంటున్నావే...ఏంకష్టం చిన్నా గా...

వ్య : ఏం చెప్పడం తమ్ముడూ. సిగ్గు. సిగ్గు. (మెల్లిగా) నన్ను చూడటంతోనే విరగబడి నవ్వు తుంది. అదేదో దానికి సరదాగా ఉంటాదట నేను...కొత్తలో రెండు రోజులు బాగానే అయిపోయింది...ఆతరవాత ప్రారంభం.... .. సిగ్గు... సిగ్గు తమ్ముడూ...... ఎక్కడ్నించి తెచ్చిందో ఆ కొరడా....దాంతో కొట్టడం ప్రారంభించింది...అవులా నడవనుంటుంది... అప్పుడు కమ్చీతో కొడుతుంది......ఒళ్ళల్లా రక్కి రక్తాలు కారుస్తుంది—...ఏం చెప్పను భాయి....ఐనా ధైర్యం ఒదల్లేదు...అందుకనే ఈ తాగుడు...ఇప్పుడు వెళ్లిపోతాను దానిం టికి...అజం చేసినా, దాన్ని చూస్తేనే చాలు నేను మైకంలో పడిపోతాను...

ము : (తల ఊపుతూ) బాగుంది...చాలాబాగుంది... గమ్మత్తుగా ఉంది..... (సెరవ్వర్లతో) పొండి వెళ్లండిరా....మరోసారి ఇలాఅయితే జాగ్రత్త.

వ్య : ఆఁ! అది...అలా ఉండాలి ఓర్పు గుణం... ఓర్చాలి...ఓర్చాలి.........బతుకుని ఓర్పుతోనే మొయ్యాలి...

ము : ఏంటో చిన్నా...వెర్రి వేదాంతం.........బతుకేమిటి...మొయ్యడమేమిటి...బతుకులో కష్టాలున్నాయంటే ఒప్పుకుంటాను కాని......దాన్ని అంత ఎక్కడీసి చెప్పడానికేమీ లేదోయి. పిచ్చిపిచ్చిగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోడం తప్పించి...

వ్య : ఎంత సుళువుగా కొట్టి పారేసేవోయి...ఎంత సుళువుగా...ఒక్క సంగతి తీసుకో......ఈ నిముషం నే చెప్పబట్టేకదా ఓర్పు ఒచ్చింది. లేకపోతే వాళ్ళని నువ్వు పనిలోంచే తప్పించి ఉంటే వాళ్ళెంత బాధపడుదురు. అయినా ఒచ్చిన ప్రతికష్టానికీ విధిని తిడతాం కాని...ఆ కష్టాలు, ఒకరి భావాలొకరు, ఒకరి పరిస్థితి ఒకరు...అర్థంచేసుకోకుండా చేసిన పొరపాట్లవల్ల వచ్చిన వని గ్రహించం...బతుకు సుళువైనది కాదు అన్న ఆలోచన లేకపోబట్టే....ఈ కష్టాలకి అంతుకనుక్కోంగనం ..సుళువుగా ఏదో తెలియని శక్తిమీద పెట్టి ఆలోచన, ఆతృత, తలనొప్పి తప్పించుకుంటాం...

ము : నువ్వు వెయ్యి చెప్పు...లక్ష చెప్పు... జీవితం అంటే బతకడమే నాకు...అంతకు మించి నాకేం అర్థంకాదు...

సెర్వరు కేక: బిల్లు రెండ్రూపాయలు...

వ్య : ఆఁ! రెండ్రూపాయలే! రెండు రూపాయలయిపోయింది! ఎంత ఒళ్లు తెలీకుండా తాగేను...

ము : పాపం...మనసు స్థిమితంగా లేదా మరి...ఈ మనస్సు బాగుండకపోడం...ఎక్కువ ఆలోచించబట్టే కామోసు...ఇలా ప్రతీవాడూ.... ఆలోచించి మనస్సు పాడుచేసుకుంటే నాకెంత లాభం...

వ్య : నీ స్వార్థం తగలడ...(నవ్వుతూ) ఏంటోయి.. ప్రపంచమంతా బుగ్గయిపోవాలని నీ ఉద్దేశమా ఏం ?

ము : ఏదో అనేశాను...మనసుకు తట్టింది...ఉద్దేశాలడుగుతూ కూర్చుంటే నా తరమా చెప్పడం...

వ్య : అహాహాహా....(కొద్దిగా గొంతు తగ్గించి) అవును కాని చిన్న సంగతి...మనస్సు పాడవడంవల్ల పర్సు తేవడం మరిచిపోయేను....రేపిచ్చేస్తాను. నీ బిల్లు...ఏమీ అనుకోకు...

ము : (ముఖం చిట్లించి నసుగుతూ) అనుకోడానికేముందిలే కాని...నువ్వేం పైవాడివా ఏం కాని...చూడు...బేరం కిందటి నెలకీ ఈ నెలకీ దిగజారిపోయింది...అహాఁ... నీ డబ్బు ఇప్పు డిచ్చేవని కాదు. ప్రతీదానికీ టాక్సు ఎక్కువైకూర్చుంది...ఎలా గడుస్తుంది చెప్పు దినం...నువ్వన్నట్టు కష్టాలగురించి నేనూ ఆలోచించవల్సి వస్తుందేమో...

వ్య : (నవ్వుతూ) అప్పుడు నీ దుకాణం అంతా నువ్వే తాగేయవచ్చు...హా...హా...హా...

ము : హా...హా...హా.. హా...

వ్య : (ముస్తాక్ భుజంమీద తడుతూ) ఒస్తా మరి... (తూలుతూ పోతాడు)

ము : (ముఖం చిట్లించి) బర్బాద్ నిధన...

[రెండవ టేబిలుదగ్గర కూర్చున్న ముగ్గురువ్యక్తులు, ఒకరిభుజాలమీద ఒకరు చేతులు వేసుకుని తాగుతూ ఉంటారు...మొదటివ్యక్తి అప్పటి వరకూ జరిగిన సంభాషణ విని ... ముఖాన్ని తిరిగి గ్లాసు వేపు తిప్పుతాడు ... రెండో వ్యక్తి మాత్రం తీక్షణంగా విను లన్న రెండీ వేపు చూస్తూ ఉంటాడు ... మూడో వ్యక్తి ఆమ్లెటు ప్లేటుతో యుద్ధం చేస్తూ ఉంటాడు ... ఒక చేత్తో గ్లాసు పట్టుకొని...]

మొ. వ్య : (గదిపైకప్పు చూస్తూ) ఏటో...ఏటో... పచ్చగా అనుపిస్తోంది..అకే టలా గాడుతోంది.. అర్రె...అర్రె...ఏటలా జేన్సాదంచేస్తోంది... ఆ ఇంగిలీసు ఫిల్ముల్లోలాగ...అన్నే...అన్నే... సడెన్ స్టాప్! బ్రేకులు బాగా పట్టేవాయి .... ఫోర్థు 61 పోనెలా? ఆఁ ... కొలిరిగించా? ఏరే ... పరే ... ఎక్కు ... * నక్కా ... పురుగా ... ఇన్ని దీంకేనా ... ఏటోయి చెప్పొచ్చినావ్ ఇచ్చింత్రం...

రెం. వ్య: (మూడో వ్యక్తివేపు తిరిగి) ఏటోయి... మనోడు ఫస్టుకెర్లో ఉన్నాడు...ఏం పేలిందేటి పైసా....

మూ. వ్య: ఏదో అలాగే ఉంది ఎవ్వారం...నా బండిని దార్లో తోసేసేడు...అదీ బండినిండా పురుగులే...

మొ. వ్య: (పైకే చూస్తూ) తాగి చూడు..తినిచూడు.. తొక్కుండా...తినకుండా నిండు... నీ బతుకులో పేమని...అన్...ఏం సెప్పినావోయి.. పోతే పోయిందికాని...ఒరే తొంకా....నూకి

---

* నక్కా — ప్రయివేటుభాషలో డబ్బు ఇవ్వకుండా ప్రయాణం చేసేవాడు....
పురుగు — లారిలో డబ్బిచ్చి ఎక్కే ప్రయాణీకుడు..

వాడ్రా ఆ సినీమా...ఏం తొక్కుపేసి పారేసి
వాడ్రా...(ముఖం చిట్లించి) ఏహోయి...
అలా చూస్తున్నావ్...ఏటుంటా ఒయిపు...
ఆఁ...ఏటేది...ఏటిది...నా కళ్లే...నా కళ్లే..

రెం. వ్య: ఒరే సింహాద్రీ...నీ కొంటిమీద తెలివి
పేడు...అట్టే పేలకు...బాగుండదు...అంతా
పెద్దమనుషు లున్నారు...

మొ. వ్య: పెద్దమనుషులా...ఓర్రా...పెద్దమడిసి నా
కన్నా...ఇలా రమ్మను..నువ్వు పెద్దమడిసివా..
ఆ రంగడు పెద్దమడిసా...

మూ. వ్య: ఏట్రోయి...రంగడెంటున్నావ్...హాఁ..
ఇవాళ ఫూ పెక్కిందని కోటికొచ్చినట్టు పేత్తే
ఊరుకుంటా వనుకున్నావేటి..బులుపు తీసేస్తా.

రెం. వ్య: ఊరుకోరా రంగీ...ఏదో ఒళ్లు తెలీకనీసి
నాడు...దాని కింత...

మొ. వ్య: ఏట్రా...నన్ను ఓడిపిస్తావుట్రా? నీ తల్లి
సిగ ... (బెంచీ మీంచి లేస్తాడు ...
ఒక్కసారిగా ఆగి) ఆఁ! అదా
సంగతి......ఇంకేం! అది చెప్పవేం...ఏదో
రంపరంపల్లా అవుపిస్తే ఏటో అనుకున్నాను.
ఇప్పుడు తెల్సింది.....(వినులున్న బెంచీవేపు
నడుస్తూ) నీ కడ్డొచ్చినాననా నీ కోపం...నీ
కెందు కుండాలా అనుమానం... నే నే...

రెం. వ్య: (లేచి...పెద్దనోరుతో) ఎళ్ళకెళ్ళకు....నే
సెప్తున్నా...పెమాదం ఒస్తుంది......ఇదుగో
ఇంకోసారి సెప్తున్నా...అమ్మాయిని కూచుంది.
...దాని కుడివేపు దాన్ని ముట్టేవా నీ ప్రాణం
నిల్దు...

మొ. వ్య: ఓపోసి...నూసా స్లైవోయి...ఇలాటి కబు
ర్లెన్నో యిన్నాం...ఆ ఏటా సినీమా...ఎవరా
అందులో హీరోయిన్....ఆడు ముద్దెట్టుకుంటాడు
...ఏం మొగం దాన్ది...ఎవర్తో అది...
(నుదుటిమీద ప్రేళ్ళతో కొట్టుకుంటాడు)

రెం. వ్య: ఒరే...యెర్రి ముదుర్తోంది...పనుం గినుం
జారగొట్టేస్తాను...

మొ. వ్య: (వినిపించుకోకుండా) అఁ...దాన్నాగుంది.
(అటువేపు నడుస్తూ) ఏం కళ్లు...ఏం కళ్లు...
నిజంగా ఆ ఇంగిలీసు స్టారే...వెరీ గుడ్......
(టేబిలుమీద గుద్ది) ఎలిపేస్తాను...దాని రక్తం
పిండి...

రెం. వ్య: (ఛటాలున లేచి) ఓరే...నా కొంకే....
దాన్ని ముట్టుకున్నావంటే ప్రాణం నిల్దు...
జాగర్త...

[మొదటి వ్యక్తి చరచరా వెళ్ళి వినుల కుడి
ప్రక్కనున్నామెను రెక్క పట్టుక లాగుతాడు.
ఆ స్త్రీ మాట్లాడకుండా బెంచీమీదనుండి
లేసుంది...అతడామెను రెండు చేతులతో నూ
పైకెత్తి చేతులలో ఆమెను మోస్తూ కద నిలి
సిద్ధంగా ఉంటాడు...ఆమె ముఖం ఎర్రబారు
తుంది...సిగ్గువల్ల]

రెం.వ్య: (వచ్చి భుజంపట్టుక ఆపి) దించీ...దాన్ని
క్కడ దించీ...లేకపోతే తల పగలేసి....

మొ. వ్య: తుక్క రౌడవా......(కాలెత్తి బలంగా
తంతాడు రెండో వ్యక్తిని)

రెం. వ్య: అమ్మా! (క్రిందపడతాడు)
[రెండో వ్యక్తి ఆమెను రెండు చేతులతో నూ
గట్టిగా పట్టుకొని బైటకు పోతూ ఉంటాడు]

ము : ఏయి...బిల్లు...బిల్లు...పైసా ఇక్కడ చెల్లించి
మరీ కదులు...(కుర్చీనుండి లేస్తూ) ఏయి...
నిన్నే...

[సెర్వరు కేక: నాలుగు రూపాయలు...]

మొ. వ్య: (ముస్తాక్ ఉన్న టేబిలు దాటుతూ)
బిల్...గిల్...నై జాంతా......నీ కేమన్నా
కావలిస్తే ఆ రంగిగాడ్నడుగు...

[ముస్తాక్ పట్టుకోబోతాడు...కాని ఆ వ్యక్తి
ఒక్క గంతులో వీధిలోకి పోతాడు]

ము : ఒరేయి...అక్బర్....హుస్సేన్... రండ్రా....
రండ్రా....వీడి తాడుతెగా...వీ డెవడో...
వేగం....వేగం...అదుగో పారిపోతున్నాడు....
పట్టుకోండి...నాలుగు రూపాయలు... ఒకటి
కాదు రెండు కాదు...పైగా దాన్నెగరేసుక
పోతున్నాడు...డబ్బిచ్చేటట్టు లేదు దానికినీ.
ఇచ్చినా ఇవ్వలేదని చెప్పేస్తుందా బాషెఖాన్.

[ముగ్గురు సెర్వర్లూ వచ్చి నిలబడతారు......
ఇంతలో క్రిందపడ్డ వ్యక్తి దులుపుకుంటూ
వస్తాడు.]

వ్య : మీ కెందుకే శ్రమ...వాడి పిలకట్టుకుని గొర
గొరా ఈడ్చుకొస్తాను...ఆడి ప్రాణం తీసేస్తా
నీయేళ...సూస్తాండండి...ఇదిగో ... (చిటిక
వేసి...వీధిలోకి ఒక్క గంతు వేస్తాడు.)

ము : (అరుస్తూ)ఓయి...వీనుహొళ్యాయి...నీ డబ్బులు
...పోయి...పోయి...

[సెర్వరు కేక: మూడున్నర...]

ము : నా కొంప తీసేసేరు.. నాలుగు...మూడున్నర..
ఏడున్నర ... (సెర్వర్లను చూస్తూ) ఇంకా
ఏమిటి చూస్తున్నార్రా...రబ్బరు బొమ్మల్లా..
వాడ్ని పట్టుకోండి... వేగం..(ఇద్దరు సెర్వర్లూ
వీధిలోకి పరుగెడతారు) నన్ను దుంపనాశనం
చేసేసేరు...పీళ్ళ సిగా...

[కుముద ప్రవేశిస్తుంది... మెల్లిగా అడుగులు వేసుకుంటూ... లేత ఆకుపచ్చరంగు చీర ... దానికి కనుగుణంగా ఆ రంగే కల జాకెట్టూ... చెదిరిన ముంగురులు కళ్ళల్లోకి పడుతూ ఉంటయ్ ...వాడిపోయిన ముఖం...ముఖంనుండి వచ్చే చెమటని దవ్వకరఖం పౌడరు ఇంకేస్తూ ఉంటుంది.... మెడలో చిన్న హారం... చేతులకు రెండు జతల గాజులు...గిల్టువి...గ్యాస్ లైట్ కాంతిలో బంగారంలా మెరుస్తూ ఉంటాయి.]

ము : (ఆమెను చూసి ధోరణి మారుస్తాడు) ఓహ్హో... కుముదా దేవిగారా ... దయచెయ్యండి...దయచెయ్యండి... తమరొక్కరే లోపమయ్యారిక్కడ ... మీరులేక చిన్నబోయిందీ స్థలం...రండి ... లోపటికి రండి.... అలా నుంచున్నారేం?

[కుముద రెండడుగులు వేసి ముస్తాక్ టేబిల్ వద్ద నిలబడుతుంది, తల క్రిందకు వంచుకుని]

మర్యాదలో ఏమన్నా లోపం జరిగిందా... కొత్త సత్కారా లేమన్నా చెయ్యాలా ... అలాంటివేవన్నా అయితే క్షమించండి...

కుముద : (ముస్తాక్ కళ్ళల్లోకి తీక్షణంగా చూసి) చాలా సంతోషించాను మీ ఆదరణకి...

ము : ధన్యుణ్ణి.

కు : ముస్తాక్...చాలీమర్యాద ... ఇంక కట్టిపెట్టు అసందర్భపు ప్రలాపం...

ము : అసందర్భపు ప్రలాపనా ... నా దసందర్భపు ప్రలాపనా? నిజమే.... నా దెప్పుడూ అలానే ఉంటుంది...నీకొక్కర్తికే కాదు ... అందరికీని... నేను స్వార్థపరుణ్ణి. కాని నా స్వార్థానికి హద్దుమాత్రం ఉంది ... నా స్వార్థంకోసం ఇంకొకరి జీవనం పాడుచెయ్యను...వీలుంటే స్వార్థంనుంచి కొంచెం త్యాగంకూడా చెయ్యగలను....కాని ఆ హద్దులలో మాత్రం మొక్కకి సూటిగా పోతాను...అందుకే తక్కిన ప్రపంచానికి నాది అసందర్భపు ప్రలాపనలా ఉంటుంది...

కు : నీ స్వార్థం గురించి నిజానిజాలు నా కనవసరం... నీధోరణి మార్చుకుని జ్ఞాపకం చేసే వంతే...

ము : చాలా సంతోషం ఈ సహాయానికి...

కు : కొమ్మల్ని నరుక్కు రావడ మెందుకు ముస్తాక్— వారంరోజులాయి ఇక్కడికి రానందుకేగా ఈ అతిమర్యాద?

ము : వారంరోజుల సొమ్ముబాకీ ఉన్నందుకు కూడా ... మరిచిపోతుంది ... మొక్కకు సూటిగా పోతాను స్వార్థంలో...

కు : వారం రోజులా?!

ము : ఎందుకుండకూడదూ ఆశ్చర్యంగా? నా సంగతి నీకసలు జ్ఞాపకం ఉంటే కదూ?

కు : ముస్తాక్.. డొంక తిరుగుడు మాట లెందుకు? నేను నీ కివ్వవలసింది నాలుగు రోజులదే... రోజుకు అర్ధ చొప్పున రెండు రూపాయలు నీకు ముడతాను...

ము : రెండ్రూపాయలా? రెండా! అల్లా! నిజమున్నదీ ప్రపంచంలో ఉందా?

కు : ఎందుకంత ఆశ్చర్యం? నీ జాగా పడలేక వారం రోజులయి రావడం మానుకున్నాను... ఇదుగో నీ రెండు రూపాయలూ...

ము : అబద్ధాలాడడం కూడా నేర్చేవ్? నువ్వెంతో నీతి ఉన్నదాని వనుకున్నాను... అయినా ఈ రకానికి నీతులుంటా యనుకోడం నాదే పొరపాటు...

కు : మాటలు సరిగ్గా రానీ...

ము : సరిగ్గానే వస్తున్నాయి......నా మాటలు. నీ ధోరణే పెడదారి పోతోంది...నాకు నాలుగు రూపాయ లొస్తాయి... వారం రోజులు నా దుకాణంమీద కూర్చున్నందుకు రోజుకి అర్ధ చొప్పున. ఆ రోజుని ఇక్కడేదో తిన్నావ్... దాని బాపతు...

కు : వందలూ వేలూకోసం అబద్ధంఆడితే అర్థముంది కాని రెండు రూపాయలకోసం ఇన్ని అబద్ధా లెందుకు ముస్తాక్—

ము : నా మాటలు అబద్ధాలా...ప్రతీదీ చిట్టా వేసి ఉంచేను...చూసుకోవచ్చు...

కు : నిజం స్వయంగా తన చేతులతో రాసిందా నీ చిట్టా...నీ చేతులేకదూ రాస్తా? ఆరోజు ఇక్కడ తిన్నబాపతు ఆయనే చెల్లించేసేడు...

ము : ఎవడూ?

కు : (ముఖం ఎర్రబారగా) నన్నారోజు తీసుకవెళ్లినాయనే...

ము : ఏం అబద్ధాలు! ప్రపంచమేం ఇలా తగలడిపోయింది.

కు : నీలాంటి నీతిమంతు లుండబట్టే...

ము : నాలాంటి నీతిమంతులా...ఎత్తిపొడుస్తున్నావ్ నన్ను ... ఓసి దిక్కులేనిదానా ... నువ్వా నన్నెత్తి పొడవడమే..రోడ్డు కుడిచేది నన్నెత్తి పొడవడమే... నీకన్నా అదే కొన్ని విధాల నీతిమంతురాలేమో...అన్నీ ఒదిలేసిన నీకు...

కు : అనవసరమైనవి మాట్లాడుతున్నావ్...ఇదిగో నీ రెండూ...

[టేబిల్ మీద పడేసి విమలున్న వేపు వెళ్ళిపోతుంది].

ము : ఎందుకీ రెంకు...ఏం నిన్నేమన్నా ముష్టి అనుకుంటున్నావా ఏం? పంతం వస్తే నాతో పంతమే...డబ్బుని కూడా లక్ష్యం చెయ్యను... కాలవలో విసిరేస్తా నీ రూపాయలు...

కు : అనుకోవడంకన్న కనాకష్టం...నా దగ్గర అబద్ధాలు చెప్పి వసూలు చెయ్యడం, రోడ్డుమీది ముష్టివాడి తలకొట్టి దోపిడి చెయ్యడం ఒకటే.. ఆ పని కొంత నయం... వాడికన్నా దరిద్రుడెవడో చెయ్యగలడా పని. కాని ఇక్కడ ఈపని చేసేది నీతులు కూసే పరమ దరిద్రుడివి..

ము : శృతి మించిపోతోంది నా ఓర్పువల్ల. మానాన్ని అభిమానాన్ని మంటగలిపి, సిగ్గూ లజ్జా వదిలి రోడ్డుమీద నాట్యం చెయ్యడానికి వదిలి... ఒంటి నమ్ముకొనే ఒక కులటని నమ్మడం...

కు : (ఆవేశంతో) ముస్తాక్!

ము : (వినిపించుకోక) నమ్మడం నాదే తప్పు...నడిరోడ్డుమీద బట్టలిప్పుకొని నాట్యం చెయ్యమంటే చేస్తావ్ ఈ క్షణం.. కాదు పట్టపగలు.. ఒక రూపాయి చూపిస్తే...

[కుముద ఆవేశం పట్టలేక ముస్తాక్ దవడమీద కొడుతుంది.]

కు : తిండికి లేక ఎందుకూ కొరగాని ఒంటిని అమ్ముకున్నాను ... (పతివాడూ చేసేదదే ... కాని మనస్సు నమ్ముకోలేదు .... ఒంటికి బానిసనై, దానికోసమని మనస్సుని పురుగులు పట్టించను...

ము : (చెంపతడుముకుంటూ) నీకు మేలు చేసినందుకు తగినకృతజ్ఞతే చూపించేవ్ ... ఇదిగో నీముష్టి రెండ్రూపాయలు...అవి నాకనవసరం .. ఇక వెళ్ళవచ్చు కొట్టువదిలి...

కు : నువ్వు నాకు చేసే మేలుకి నేను తెలిపే కృతజ్ఞత రోజూ కర్ధచొప్పున నీకు ముడుతూనే ఉంది...ఆ రెండురూపాయలూ నీవి ... కాలవలో విసిరేసుకో కావాలంటే...ఇంక కొట్టువదల్డం విషయమూ... నేనొక్కర్తెనూ వదిలి వెళ్లనని నీకు తెల్సు...నాతో కూడా తక్కినవాళ్లని తీసుకుపోతాను ... అప్పుడు నీ దుకాణానికొచ్చే బేరం సగం తగ్గిపోతుందని నీకు తెల్సు....

ము : ఆఁ...ఏమన్నావ్...

[కుముద ముస్తాక్‌ని లెఖ్ఖ చెయ్యకుండా చరచరా వెళ్ళి విమల ప్రక్కను కూర్చుంటుంది... ముస్తాక్ వెర్రిగా ఆమెవైపు చూసి తల దించుకుంటాడు...]

విమల : కన్నీళ్ళెందుకు ... ఈమాటలకేనా ... ఇంత సున్నితమైన మనసైతే ఎందుకుపనికొస్తావ్... గుండె రాయి చేసుకోవాలి...

కు : (చీర చెరుగుతో కళ్లు తుడుచుకుంటూ) నువ్వు చెప్పేంది నిజమే విమలా ... మనస్సుకీ సున్నితత్వానికి చోటులేదిక్కడ...ఇలానే బతికాలి కామోసు .... కాలపు ప్రతినిముషానికి తరిగిపోతూ .... మనస్సుని ఎంతరాయి చేసుకున్నా ఒకమూలనించి మానవత్వం తిరగబడుతూనే ఉంటుంది తనకున్న కొంచం శక్తితోనే.... పాపం మనస్సు లేదనుకున్నవాళ్ళందరి సంగతీ ఇంతేనేమో .... కాని ఎంత తొక్కిపట్టినా అది కొన్ని ఘడియల్లో మన బంధాలని తెంపుకుని పైకి పొర్లివచ్చి ప్రళయనాట్యం చేస్తుంది. ఆ ఘడియలే ఎంతో పవిత్రమయినవి...

విమ : ఇంత తెలివయినదానివి, నిన్ను చూస్తే జాలి వేస్తుంది...నీ బతుకిలా తెల్లవారుతూ ఉంటే చూసేందుకు కష్టంగానే ఉంది...

కు : తెలివి కేముంది విమలా......అనుభవం నేర్పిన పాఠాలే ఇవి. నువ్వు నామీద జాలిపడటం మరింత బాధకి తప్ప మరెందుకూ ఉపయోగం లేదు.

[అలసటతో గోడకు చేరబడుతుంది. ఆమె కళ్లు అప్రయత్నంగా మూతలు పడతాయి]

వి : ఎంత నీరసంగా ఉన్నావ్...కుముదా......కళ్లెంత లోతుకి పోయేయి...ఏమన్నా సుస్తీగా ఉందా?

కు : (కళ్లు సగం విప్పి చిరునవ్వు నవ్వుతుంది)

వి : నీ ముఖమే చెప్పేస్తోంది......వేరే ప్రశ్న ఎందుకు......వాడేదో మాటన్నాడని వారం రోజులయి రావటం మానుకుంటావా? నాతో చెప్పొంటే నేనేమన్నా సాయం చేసిఉందును ...ఈ వారమయి ఏం చేసేవ్ ...

కు : (మరోసారి నవ్వి) ఏం చేస్తాను....ఇంకేం చెయ్యగలను...వాడి మొహాన డబ్బు పారేసే వరకు తృప్తిలేకపోయింది.

వి : సరిగా తిండయినా లేకుండా...

కు : (చెయ్యి నిర్లక్ష్యంగా గాలిలోకి విసిరి)పిచ్చి....

[ఇంతలో పెద్దపెట్టున బూట్ల చప్పుడు- సతీష్ వస్తాడు సుడిగాలిలా.... కాకీ పంట్లాంలోకి

దూర్చబడ్డ తెల్ల కమీజు. అక్కడక్కడ మర కలుపడి...(క్రాఫింగు చెదిరి కళ్లలో పడుతూ ఉంటుంది......కళ్లు చింత నిప్పుల్లా మెరుస్తూ ఉంటాయి. ముఖంనిండా, చేతులనిండా చెమట కాలువలై పారుతూ ఉంటుంది...లోన ప్రవేశించాక వలయాలలా కలియజూసి ముస్తాక్ ఉన్న టేబిల్ దగ్గరకు వెళతాడు, నిర్లక్ష్యంగా జోగుతూ...]

సతీస్: (ముస్తాక్ టేబిల్ మీదనున్న గంటను గట్టిగా చాలాసార్లు వాయించి ముస్తాక్‌ని చూడకుండా కౌంటరువైపు చూస్తూ:)

ఏయి! ఎవరిక్కడ?...ఏం? పీనుగుల కొంప లాగుంది...ఏ విట్లో కల్సిపోయేరంటారూ...

(మరోసారి గంట వాయించి) ఏయి! మిస్టర్స్...అంతా ఇడియట్సులా ఉన్నారు...ఏడీ దీని ప్రొప్రయిటర్? ఏ సొరంగంలో దాగున్నాడు?

[ముస్తాక్ కుర్చీమీంచిలేచి తెల్లబోయి చూస్తూ ఉంటాడు. టేబిల్ దగ్గర తాగుతున్న వాళ్లూ కళ్లు పెద్దవిచేసి ఆశ్చర్యంగా చూస్తూ ఉంటారు.]

ఏం? అలా చూస్తారేం? చెప్తూఉంటే చెవులు కన్నాలు పడ్డాయా ఏం చెప్మా? గొంతు పగిలేటట్టు అరుస్తూ ఉంటే కూడా వినిపించదా? స్కౌండ్రెల్సులా ఉన్నారు మీరంతా...

[దబదబ నడిచివెళ్లి 'స్టాండ్ స్క్రీను' ఒక్క విసురున ప్రక్కకు లాగుతాడు...మంచంతున్న పాయ్య...దానిమీద పెద్ద పెనం...క్రిందపడి పగిలిన గ్లాసులు...మరోక చిన్న ద్వారం కూడ వస్తాయి...సెర్వర్లు విస్తుపోయి చూస్తూ ఉంటారు—విమల, ప్రక్కనున్న స్త్రీ, కుముద, లేచి నిల్చుంటారు. సతీస్ వాళ్ళని లెఖ్క చెయ్యకుండా టేబిల్ గుద్దుతాడు పిడికిలితో...]

సతీస్: (ఒక సెర్వర్ని చూసి) నువ్వేనా ప్రొప్రయిటర్వి...నాకు తెల్సు...ముఖాలబట్టి ఇట్టే చెప్పేస్తాను ఎవడెవడో..ఇలాటి దుకాణాల, ప్రొప్రయిటర్లెలా ఉంటారో నాకు తెల్సు ..

[కొంచెం ఆలోచించి, టేబిలు మరింత గట్టిగా గుద్ది] కమాన్...అఁ...బ్రాండీ...విస్కీ...జిన్....ఛా ఛా....అవేమంత మంచివి కావు...ఫారిన్ ఉందా. పోర్ట్‌వైన్ వైట్ లేబిల్ ...ఛా ఛా ... అవేవీ మంచివి కావు. సీగ్రామ్స్? అది లాభం లేదు...అదేమిటి చెప్మా దానిపేరు ... ఆ...ఆ...చాంపేన్...చాంపేన్...పన్నెండుబుడ్లు....కన్‌ఫర్మ్‌డ్...చాంపేను పన్నెండుబుడ్లు....క్విక్...క్విక్ ... ఏమలా చూస్తారు?

[ఇంతలో ముస్తాక్ ఆశ్చర్యంనుండి తేరుకొని, ముఖం చిట్లించి సతీస్‌దగ్గరకువెళ్లి, భుజం గట్టిగా తడతాడు ... సతీస్ గిరుక్కున తిరిగి వెనుకకు చూస్తాడు]

సెర్వరు : (సతీస్ చెవులో) ఇతనే ప్రొప్రయిటరు...

సతీస్ : ప్రొప్రయిటర్?..ఓ....నువ్వు కాదన్నమాట...నయమే...(సెర్వర్ చెవిలో) పశువులా ఉన్నాడు మీ ప్రొప్రయిటరు ... (ముస్తాక్ వైపుతిరిగి) మిమ్మల్ని కల్సుకున్నందుకు చాలా సంతోషం...అఁ ... నేనేమిటి ఆర్డర్ చేసేను...అఁ ... చాంపేన్ పన్నెండుబుడ్లు....

ము : తాగొచ్చేవా? మతి చలించిందా? నువ్వసలు మనిషిలా కనిపించవ్ ... వచ్చిన దగ్గర్నించీ చూస్తున్నాను నీవైఖరి .... (ఇదివరకు విరిగిన గ్లాసులు చూపిస్తూ) అ స్టాండెంత జోరుగా లాగేవు ... అ గ్లాసు లన్నీ చూసేవా ఎలా విరిగాయో? ఎవడిస్తాడా పొమ్మ .... నీఅబ్బ .... నీతాత?

[భుజమీద్దనున్న ముస్తాక్ చేతుల్ని ఒక్క విదిలింపుతో తప్పించుకుంటాడు సతీస్]

అ(రె(రే...రౌడీలా ఉన్నావ్...పోలీసుని పిలుస్తా....

[సతీస్ ముస్తాక్ భుజాలు పట్టుకొని, మెలికగా తిప్పి వీపుమీద పిడికిలితో గుద్దుతాడు]

అమ్మో!...నీసిగా...అబ్బ! ... ఒరేయి ... వెళవల్లారా...ఒరేయి హుసేన్!

స : (వికటంగా నవ్వుతూ) అహాహాహా...చాంపేనోయి...చాంపేన్ లేవోయి...డజన్ బుడ్లు.. అధిక ప్రసంగం చెయ్యకుండా...ఏమిటి చూస్తున్నావ్ మింగేసేటట్టు...ఏం? వీపుమీద తట్టేనని కోపమా? నీమీద నాకు ప్రేమ తప్ప కోపం నా కెప్పుడూ లేదు...డబ్బివ్వ ననే అనుమానమా? ఆ అనుమానం ఉంటే ఈ లోకంలో నీలాంటి పరమదరిద్రుడింకో డుండడు...

[జేబునుండి వందరూపాయల నోట్లకట్టల్ని తీస్తాడు...వాటిని గాలిలో ఊపుతూ...] ఇదిగో...ఇదిగో ... వెయ్యి....రెండు వేలు...

మూడు వేలు...పది వేలు ... ఓరి స్టుపిడ్..డబ్బు గురించేనా నీ అనుమానమంతా...

[విరగబడి నవ్వుతాడు—ముస్తాక్ విస్తుబోయి ఆశ్చర్యంగా చూస్తాడు డబ్బువేపు...ఒక్క క్షణంలో అతని ముఖానున్న కోపం మటుమాయమౌతుంది... పెదవులమీద చిరునవ్వు మెరుస్తుంది.]

ము : (చేతులు ముందుకు చాపి) ఓ! తమరా...తెలీలేదు; క్షమించాలి...జ్ఞానం లేని పసిలాన్ని.. వెధవని ... అర్రెర్రే ... ఎంత పనయిపోయింది...ముందే తమరు ఫలానా అని.... ఔను...నా బుద్ధిలేనితనం గాని ... తమరిన్ని తమరెలా చెప్పుకుంటారు... నేను తెల్సుకోవాలి కాని...స్వతహాగా మరి నే కొందుకున్న టిక్కడు...

[సతీష్ ముస్తాక్ ముఖంలోకి ఒక క్షణం చూసి మరీ విరగబడి నవ్వుతాడు.]

ము : (చేతులు నలుపుకుంటూ) హి. హి .హి.. హి! ఔనౌను...నా తెలివి తక్కువతనానికి నవ్వక ఏం చేస్తారు...ఏదో గాడిదని.. తమకి ఖుషీగా ఉంటే నవ్వండి...తిట్టండి నన్ను....తన్నండి కూడా... తెలివిలేని వెధవని...

స : (పొట్ట పగిలేటట్టు నవ్వుతూ) ఇడియట్!

ము : చిత్తం...చిత్తం...తమ ఇడియట్ నే నేను.... ఏమిటి సెలవిచ్చేరు తమరు ..? ఆఁ... చాంపేన్ (మెల్లగా చెవిలో) ఇక్కడంతా కంట్రీదే.... కాని తమలాంటివారికని ... ఎవ్వరికీ తెలీకుండా ఉంచేను చాంపేన్ ... జిన్నూ... గిన్నూ మిడిల్ క్లాస్ లేకుండా ఏకదమ్ ఫస్ట్ క్లాస్! ఏక్ దమ్!

స : (నవ్వుతూ) ఓరి రాస్కెల్......నువ్వయితే బ్లాక్ మార్కెట్ కూడా చేస్తున్నావన్న మాట. కట్టే టాక్సు ఎగవేసి...

ము : చిత్తం....చిత్తం...తిట్టండి....ఉత్త పసువుని.. అంతా కడుపు గురించే బాబూ...అంతా కడుపు గురించే... డబ్బు బాబూ......డబ్బు...... అహహహా!

స : డబ్బు!...(విరగబడి నవ్వుతూ)అహహహా... డబ్బు! (నోట్లకట్టలు గాలిలో ఎగరేసి అందుకుంటూ) డబ్బు! అహహహా!

ము : (ఎగురుతూ పడుతూ ఉండే నోట్లకట్టల్ని ఎగాదిగా చూస్తూ) చిత్తం....చిత్తం!

స : ఇంద నోట్ల కట్టల్ని...తీసుకో...ధర్మం... ముష్టి...ముష్టివాడివేనా నువ్వు...

ము : (చేతులు నలుపుకుంటూ) చిత్తం ... ముష్టివాణ్ణి... కాదు... అంతకన్నా కనిష్టుణ్ణి... రోడ్డు తుడిచే ... కాదు .... అంతకన్నా కూడా కనిష్టుణ్ణి... ఈ ముష్టివెధవమీద దయ ఉంచండి.. తమదయ! ఇహిహి...

స : (నవ్వుతూ జుత్తులోనికి (వేళ్లు పోనిచ్చి) నా దయ...అహాహా...

[నోట్లకట్టల్ని గదికి రెండువైపులా సత్తువతో విసిరి]

పరిగెత్తు ... రెండూ ఒక్కసారి తేవాలి ... క్విక్.... రెండు...ఒక్క సెకెండుటయిము..

[ముస్తాక్ జారిపోతున్న షెరాయిని ఎగదీసుకుంటూ...ఊపిరితియ్యకుండా రెండు కొసలకి కూడా పరుగెత్తి నోట్లకట్టల్ని సతీష్ దగ్గరకి తెస్తాడు.. గదిలో ఉన్నవారంతా ఆశ్చర్యంగా చూసి గొల్లుమని నవ్వుతారు...]

స : లాభం లేదు ... నువ్వు ... ఒట్టి మొద్దవతారానివి.. తే...ఆకట్టలు...

[అసంతృప్తిగా నోట్లకట్టల్ని అందిస్తాడు ముస్తాక్]

ఎందుకలా చూస్తావ్ ... పడేస్తాలే ముష్టి ... ఆఁ...చాంపేన్...క్విక్...అందరికీ...ఇక్కడున్న అందరికీ..ఎంత డబ్బయినా ఫరవాలేదు ... నువ్వూ తాగు ... నీ సెర్వర్లనీ తాగనీ .... రండి! అందరూ....ఇంకా అనుమానమా?...

ము : అబ్బబ్బబ్బ!! తనుదగ్గరా...తమ కాలిబూటు ధూళినిపోలను... నేనా తమని అనుమానించటం .... కాని.... ఈ నాయురా-పాల్లేని వెధవలకందరికీ ఎందుకుబాబూ?....అంతా ఉట్టిచెత్తవెధవలు...

స : ఓరి స్వార్థపరుడా..నీ గుండెల్నించి పచ్చి పురుగులు రాల్తాయి...అందరూ తాగాలి...లేకపోతే ఇప్పుడే...

[దుకాణంనుండి పోయేందుకు ముందు కడుగు వేస్తాడు.]

ము : (చేతులు కట్టుకుని తొట్రుపాటుతో) తమ ఖుషీ...తమ ఇష్టం... నే నెవ్వడ్ని కోన కిసాక్కుగాడ్ని తమని ప్రశ్నించేందుకు... ఒరేయ్ హుస్సేన్...అక్తార్...

[హుస్సేను...అక్తరు అప్పుడే దుకాణం ప్రవేశిస్తారు...ముఖాలు వెలవేసి.]

ము : చిత్తం...చిత్తం... బుడ్డీ ఏక్హై రూపాయలు పెట్టి కొన్నానండి. ఇహిహి...తమ కొక్క బొట్టి లాభం లేకుండా...

హు : (నసుగుతూ) దొరకలేదండి ... ఎక్కడికిపో యినా మరి పత్తాలేదు...

ము : పోనీ ముష్టివెధవలు పోలేపోయేరు ... (కన్ను గీటి) పదండి బాబుగారి కాళ్ళమీద పడండండి., అంతా బాబుగారి కటాక్షం...ఊఁ...

[ఎందుకు పడాలో అర్థంకాక ఇద్దరూ నంకో చిస్తూ ఉంటారు.]

స : అఖ్ఖర్లే దఖ్ఖర్లేదు ... ఉత్తి స్టుపిడ్‌లా ఉన్నావ్... నే చెప్పిందేమిటి నువు చేస్తున్న దేమిటి? ఊఁ....చాంపీన్...

ము : ఆఁ...ఆఁ...చాంపీన్ .... చాంపీన్... పరుగె త్తండి...అక్తార్ ....ఇంద తాళం.... ఆ గది... అందులోవున్న బుడ్లన్నీ పట్రా... వేగం.. వేగం ....ఒక్క సెకెండులో రావాలి....

[అక్తార్ తాళంచెవు లందుకొని పరుగెత్తుక వెళ్ళాడు.]

ఇహిహి .... ముద్దువెధవలు .... తమలాంటివా ళ్ళొచ్చినప్పుడు ఎలా ప్రవర్తించాలో తెలీదు.. ఐనా వాళ్ళనని ఏం పన్లెండి...తమలాంటివాళ్లు ఏ నూరేళ్ళకో ఓసారి వస్తారు.

స : (నవ్వుతూ) అయితే నేను రావడమే తప్పం టావా?

ము : అమ్మమ్మ...సరిగా అర్థం...అహాఁ హాఁ... నాదే పొరపాటు. క్షమించండి...తమని అర్థం చేసుకోడంలో నేనే పొరపాటు పడ్డప్పుడు వాళ్ళనగా ఎంత . ఉత్త తెలివితేనివాడ్ని... ఇహిహి...

స : డబ్బు గడించడంలో మాత్రం తెలివున్న వాడిలా కానొస్తున్నావ్.

ము : ఏం తెలివి... నా తెలివి గాడిద తెలివి.. అంతా ఒక్కటే.... నా తెలివిని మెచ్చుకోవాలి? ఏకో జనం గబగబమే కష్టమయిపోతున్నాది... ఇహిహి...తమలాంటివారి తెలివితేటలు...

స : (నవ్వుతూ) ఓరి దవటగాడిదా.

ము : (గుండెలమీద కొట్టుకుంటూ) ఓ తిట్టండి... తిట్టండి... ఇహిహి... తమ ఇష్టం...నా తల మీద కాల్తో తన్నండి...

[అక్తార్ గంపనిండా బుడ్లు తెస్తాడు]

స : (బుడ్లను చూసి) దట్స్ రైట్! దట్స్ రైట్! గుడ్ సైన్...

స : ఏక్హై...ఇంతేనా...బుడ్డీ ఏక్హైయేనా...

ము : ఏక్హై అన్నానా? కాదండి.. కాదండి...తమరు పరాకు చిత్తగించేరు.

స : ఛస్! నోర్ముయ్యి...ఇప్పుడే....

ము : క్షమించండి...నాదే పొరపాటు. లెక్క చెప్ప టంలో...బుడ్డీ వంద రూపాయలు పడ్డాదండి. మతిలేని వెధవని మరి...కుక్క కన్న కనాకష్టం అయినవాడ్ని...

స : (వెంటనే బెంచివైపు వెళ్తూ పెద్దగొంతుతో) అల్ రైట్! అల్ రైట్... వేగం సెర్వ్ చెయ్యి. ఒక్కడ్ని వదలకుండా...అందరూ ఉండండి. పార్టీ...మీ అందరి గౌరవానికీ పార్టీ...

ము : బాబుగారిగౌరవానికీ శ్రేయస్సుకీ ముఖ్యంగా..

స : నోర్ముయ్యి...ఇడియట్ ...

ము : చిత్తం...తిట్టండి...తమకొలె...

స : (టేబిల్ దగ్గరకువెళ్లి నిల్చొని) మీ అందరి గౌర వానికి ఈపార్టీ ... తాగండి ... తినండి ... (ముస్తాక్ వైపు తిరిగి) తినడానికేమున్నా....

ము : ఓ! తప్పకుండా ... నా దుకాణ మంతా తిసే యండి...హుస్సేన్! అక్తార్! అన్నీ వేగం సెర్వ్ చెయ్యండి...ఊఁ ... ఒక్క నిముష మున్నా ఆలశ్యంవద్దు...

స : (మారుమ్రోగే గొంతులో) తాగండి...నాట్యం చెయ్యండి ఆనందంతో...వీధులలో గెంతండి ... నడివీధుల్లో ... మీ ఇష్టం వచ్చినట్టు చెయ్యండి...పరుగెత్తండి...యుద్ధం చెయ్యండి ...కుస్తీ పట్టండి...అంతా స్వేచ్ఛ .... అంతా ఆనందం...

ము : అచ్ఛా! అచ్ఛా! (సర్వరు పానీయం, కట్ లెట్లు సర్వ్‌జేస్తూ ఉంటారు)

స : (ఒకగ్లాసు సందుకొని) మీకివే ఆనందానికి ఘడి యలు ... విలువైన నిముషాలు .... మీరంతా సామాన్యమానవులేనా? జీవని వాకు తెలుసు... ఈ హోటల్లో బెంచీలెక్కి తాగండి ... ఆ కాలువన్ని పనంమీద నుంచోని తాగండి.... రోడ్డుపక్కని కాలవల్లో పొర్లుతూతాగండి... స్నానం చెయ్యండి పానీయంలో...అహాహా.... (బల్లగుద్ది) ముస్తాక్...నువ్వోగ్లాసందుకో...

[ముస్తాక్ ఒక గ్లాసు తీసుకుంటాడు—ముస్తాక్ గ్లాసుకి తన గ్లాసు తగిలి]

డౌన్ విత్ ఏరిస్టోక్రసీ!...

డౌన్ విత్ కేపిటలిజమ్!

[గ్లాసులోని చాంపేన్ ఒక్క గుటకలో తాగేస్తాడు. అంతా పెద్ద కేకలు వేస్తూ తాగుతూ తింటూ ఉంటారు. కుముద నీరసంగా గోడకు చేరబడి జరిగేది వింతగా చూస్తూ ఉంటుంది. సతీష్ దృష్టి అకస్మాత్తుగా ఆమెమీద పడుతుంది.)

స : (గ్లాసు నేలపైకి విసిరి) మై గుడ్ గాడ్...గర్ల్స్! మార్వెలస్! ఏం ముస్తాక్...ఎంత అందంగా ఉంది ఆమె ముఖం...ముస్తాక్!

ము : కుక్కలు...చిత్తకుక్కలు బాబూ అవి.... రోడ్డుమీది బజారుకుక్కలవి ... ఇహిహి... దమ్మిడీకూడా ఆశించి ఒంటినమ్ముకొనే సెగజ్జ....

స : (కోపంతో) నోర్ముయ్యి!

ము : (సతీష్ చెయ్యిపట్టుకొని) ముఖం లేటని చూసి మోసపోతున్నావా బాబూ తమరు...తమడబ్బుకి తగనిదని...తమకి కావలిస్తే ఈ క్షణాన స్వర్గంనుంచి రంభని తెప్పించగల...ఊఁ అనండి... చాలు.

(ముస్తాక్ మాటలు వినకుండా కుముదవైపు వెళ్తాడు. సతీష్ రావడంచూసి కుముద లేచి నిలబడుతుంది. సతీష్ ఆమెను సమీపించి ఆమె ముఖాన్ని చేతులతో పైకెత్తి ఆమె కళ్లలోకి తీక్షణంగా చూస్తాడు...కుముద మాట్లాడకుండా నిల్చుంటుంది వాడిన ముఖంతో)

స . (ఆమె బుగ్గల్ని రాస్తూ) ఎంత అందమైన ముఖం...ఆ పెదవులెంత అందంగా చిత్రించబడ్డాయి ... ఆ కళ్లలోనుంచే వెలుగు పైకొస్తోంది...ఎంత దేదీప్యమానంగా ఉందా వెలుగు..(చేతులతో ముఖం కప్పుకుని) చూడలేనావెలుగు...చూడలేను..ఏం కాంతి!... కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి...

[తిరిగి ఆమె కన్నులలోకి చూసి]

ఎంత ఔదార్యం...ఆ జ్యోతికి..ఎటొస్తోంది.. నా పే పే! నా పే పే...ఒద్దు...ఒద్దు...

[ముఖం తిప్పుకుంటాడు]

ము : చిత్తకుక్కలు బాబూ అవి...చిత్తకుక్క... ఒక కుళ్ళిపోయిన ఎముక దానిముందు పడేయండి పరుగెత్తుక వస్తుంది.

స : (ముస్తాక్ వైపు తిరిగి) నీ పేరు? పూర్తిది.

ము : (చేతులు కట్టుకొని ఎక్కం వప్పచెప్పినట్టు) ముస్తాకాలీ బేగ్...కాని నన్నందరూ ముస్తాక్ అంటారు..: బేయిగ్ అంటేనే నాకు తృప్తి

స : ఐతే ముస్తాక్...ఇందాక ఏమన్నావు...డబ్బు నీకు ముష్టి వేస్తానన్నానుకదూ..ముష్టి అడుగుతావా.

ము : ఇహిహి...తమ చిత్తం...తమ చిత్తం.... ఏం చెయ్యను తమరు చెప్పినపని..ముష్టి కాదు... ఇంకా కనాకష్టమైన పనన్నా తయార్.

[సతీష్ గబగబ మండుతూంటే పొయ్యిదగ్గరకు వెడతాడు.]

స : ముస్తాక్!

[ముస్తాక్ వెనువెంటనే పరుగెడతాడు.]

చూశావా ఈ నోట్లకట్టల్ని....ఇదిగో మండుతోందే... ఈ మంటలో పడేస్తాను....ఎంతో తెల్సా....ఆ డబ్బు? పదివేలు..ఆ మంటలోంచి అవి కాలేలోగా తీసుకోవాలి... *

ము : (విస్తుపోయి తేరుకొని) పదివేలు...వడిమంట... (గుండె బాదుకుంటూ) పదివేలు....మంటలో ...ఒద్దు...ఒద్దు...పదివేలు...ఒద్దు... అబ్బ! అంతడబ్బు! మీ కాళ్ళమీద పడతాను...మీ పాదధూళి నెత్తిన జల్లుకుంటాను...మిమ్మల్ని నా భుజాలమీద పెట్టి ఊరేగిస్తాను...ఒద్దు... ఒద్దు...కాల్చవద్దు...

స : (మెల్లగా) ఆ అమ్మాయి పేరు?

ము : (వణుకుతున్న గొంతుతో) కు...ము...ద... కు...ము...ద...

స : (గట్టిగా) కుముదా!

---

* ఇక్కడ ఈ చిన్న భావం (అంటే డబ్బు మంటలో వెయ్యడం ... కాలేలోగా తీసుకోడం ... మాత్రం ... డాస్టవిస్కీ ... "ఇడియట్" నవల చదివాక తట్టింది. అందులో వేరొక సన్నివేశం అనుకోండి...కథనం అంతా నా స్వంతం.

[కుముద ఆశ్చర్యపోతుంది... కాని ఆలోచించి అతనిదగ్గరకు వెళ్తుంది—సతీష్ ఆమె కళ్లలోనికి కొన్ని సెకండ్లుచూసి ముఖం తిప్పుకొని]

పదేస్తున్నా....నిప్పులో.

ఆఁ... రెడీ.

ము : (అమాంతంగా సతీష్ కాళ్లమీదపడి బూట్లు గట్టిగా పట్టుకొని వణుకుతున్న గొంతుతో) ఒద్దు...ఒద్దు...డబ్బు! డబ్బు! మరోటీ మరోటీ కాదు...డబ్బు...నా జీవితం...నాశనం.

స : నీ జీవితం ఎందుకు నాశనం ముస్తాక్ ? ఆ మంట లోంచి తీసుకుంటే నువ్వు దాని కర్తవ వౌతావు...పైగా అది నా డబ్బు!

ము : ఔను...ఔను...మీ డబ్బే...మీ డబ్బే... కాని చూస్తూ చూస్తూ...ఒద్దు...ఒద్దుబాబోయి ఒద్దు...అది డబ్బు...మరోటీ మరోటీ కాదు.

[ఆశ్చర్యపోతున్న కుముది కళ్లలోకి సతీష్ చూస్తాడు.]

స : (ఆవేశంతో) ఆ కళ్ళల్లోని జ్యోతి, కాంతి కన్న ఎక్కువ వేగంతో పోతోంది. దాని వను సరించి పోతోంది చీకటిరేఖ...ఆ చీకటిలో కొట్టుకుంటూ ఎందరో మానవులు...ఆ వెలుగు వైపు ఆశతో చూస్తూ....ఆ..ఆ...ఆ జ్యోతి తేజస్సు ఎక్కువౌతోంది... ప్రపంచ మంతా ఆవరించింది కాంతి...చూడలేను... (కళ్ళు తిప్పుకొని) చూడలేను...కాని చూడకుండా ఉండలేను.

[గిరుక్కున తిరిగి నోట్లకట్టల్ని మండుతున్న పొయ్యిమంటలో విసిరేస్తాడు. నోట్లు అంటు కొని కాల్తూఉంటాయి.]

స : తీసుకో...అదుగో కాలిపోతోంది...డబ్బు... ఒకటి కాదు...రెండు కాదు...పది వేలు... రెండు ఆ మంటలోకి వాటితో కలిసితగలబడు...

[సతీష్ కాళ్లు వదిలి మంటదగ్గరకు పరుగెడతాడు ముస్తాక్. నోట్లప్పుడే సగం కాలిపోయేయి. చెయ్యి పెట్టడానికి ప్రయత్నించి మళ్లీ చెయ్యి వెనక్కి తీసేస్తాడు. గుండెలు బాదుకుంటూ కూలబడతాడు.]

స : (కుముది ముఖమెత్తి ఆమె కళ్ళలోకి చూస్తూ) చీకటంతా విచ్ఛిన్నమయింది. ఆ జ్యోతిలో కలిసి పోతారు. ప్రజంతా...ఎక్కడికో ఎగిరిపో తోంది జ్యోతి...

[ఆమె నవ్వుతూ చెయ్యిపోనిస్తాడు. అర్థ రహితంగా చూస్తూ ఉంటుంది కుముద]

స : చాలు...మరి చూడకొక్కిలతో.

[ముస్తాక్ వైపొకసారి చూసి ద్వారంవైపు నడు స్తాడు. సతీష్ కుముదను తనతో కూడా తీసుక పోతూ...గోల ఎక్కువగా ఉంటుంది.]

ఒక : ఎవడో కాంట్రాక్టరట ... కాంట్రాక్టరో ... గిర్మాకరో...అడు కార్లో కూచొంటే అడ్డు నూటు వేసి దోసుకున్నారే...విన్న రేతిరి... పదిలచ్చలట...ఒకటికాదు...రెండుకాదు.

ఇం : డయివేరుని కూడా పంపేసివారే!

[సతీష్ గిరుక్కున తిరిగి ఈ మాటలాడిన వ్యక్తుల ముఖాలలోకి చూసి తీక్షణంగా...అలా ఒక అర నిముషం చూసి నవ్వులో జోగిపోతాడు... వెంటనే సర్దుకొని కుముది వీపుమీద గట్టిగా పొదివిపట్టి చీకట్లోకి....పోతాడు] [తెర]

కుక్క పిల్ల

శ్రీ చిత్తరంజన్ దేవ్

అమ్మ నిద్దర పోతోంది; నాన్న గురక పెడుతున్నారు. చోరడా కేక ఎక్కడా వినిపించడం లేదు. గదంతా కటిక చీకటి; నే నెవర్నీ కనపడటం లేదు. వాళ్లూ నా కెవళ్లూ కనుపించటం లేదు. కాని నేను కళ్లు తెరుచుకుని చూస్తూ నే వున్నాను.

నెమ్మదిగా బయటికి ఉడాయించినే? అమ్మో! అమ్మవి పాము చెవులు; తలుపు తీస్తే మేలుకుని తగల నిస్తుంది. నా కేదో దయ్యం పట్టిందని గడబిడ పడుతుంది.

కుక్క పిల్లలు బయట తిరుగుతున్నయ్. అవి రాత్రి తెల్లవార్లూ బయటే తిరుగుతూ వుంటాయ్. నక్కలు వాటికోసం గోరాడుతున్నయ్. టామీ నక్కల్ని తరిమితరిమి తిరిగొచ్చి ఆయాసపడుతోంది. దాని అలుపు నాకు వినిపిస్తూ నే వుంది. పిచ్చిముండ! అది నక్కల్ని పట్టలేదు. నక్కలు బలే జిత్తుల మారివి. అవి ఎప్పుడూ ఒంటిగా రావు. ఒకటి వచ్చి ఏ గోడమూలనో దొంగతనంగా నక్కి కూర్చుంటుంది. మరొకటి టామీ ముందుకొచ్చి కవ్విస్తుంది. పిచ్చి ముండ టామీ దానివెంటబడి తరుముకుంటూపోతుంది. ఈ లోగా గోడమూల వున్న రెండో నక్క వచ్చి ఒక కుక్కపిల్లను నోట కరుచుకుని ఉడాయించేస్తుంది. ఇలా ఇప్పటికే మూడు పిల్లల్ని తినేసినై.

ఇది ఆలోచించిన కొద్దీ నాకు గాబరాగా వుంది: అమ్మను లేపాను.

'కుక్కపిల్లల్ని గదిలోకి రానిద్దామమ్మా!—'

అమ్మ కోపంగా నవ్వింది—'వెధవ జంజాటం, ఇవ్వాళో రేపో వాటిని ఆ పూరచెరువు కాడ పారేయించి పీడా విరగడ చేయిస్తాను'

మాశాం! అమ్మ యేమంటోందో. పూర చెరువంటే యేమిటనుకున్నారు? పూరవతిల పెద్ద చెరువు; చెరువంతా యెండిపోయి మధ్య నెక్కడో కాసిని నీళ్లుంటాయి. ఊళ్లో చచ్చిన వాళ్లందర్నీ తగలెయ్యడం, పాతెయ్యడం ఆ చెర్లోనే. చచ్చిన గొడ్లని కూడా అక్కడే కోస్తారు. ఆ చెరువు నానుకునే పెద్ద అడివి. వాటి దుంపతెగా ఆ అడివినిండా కావలసినన్ని నక్కలు.

అమ్మ ఇంకా ఏమంటుందంటే;

'ఆ కుక్కపిల్లలు రోజురోజుకీ పెద్దవై పోతున్నయ్. వాటికి కాస్త బొమిక ముదిరితే, ఇక నక్కలు కూడా వాటి జోలికిరావు. ఆ కుక్కల నన్నిటినీ యింటినిండా పెట్టుకు కూర్చుంటానా యేమిటి? వాటి కన్నిటికి తిండి యెక్కడనుంచి తెస్తావ్?'

నక్కలకైతే కుక్కపిల్లల్ని తింటుంటే కమ్మగానే వుంటుందనుకోండి; కాని పాపం టామీ ఎంత ఏడుస్తుంది. తను కూడా బిడ్డల్ని కన్నతల్లేగదా, అమ్మ అలా అనొచ్చా?—'

ఇంకా చాలా పొద్దుపోయింది. నాకు కంటి మీద కునుకు లేదు. ఊళ్లో గస్తీతిరుగుతున్న చౌకీదారు కేకలు గుప్పగుప్ప వినిపిస్తున్నాయి. తెల్లగా తెల్లారి పోయింది. ఉషోరేఖలు గది కిటికీలోంచి లోపలికి పడుతున్నయ్. ఇరుగు ఇళ్లల్లో నుంచి బాతులు కిచ కిచ లాడుతూ బిలబిలా బయటికి వస్తున్నయ్. సూర్య కిరణాలు పడి నావళ్లూ మనసూ కూడా వెచ్చబడుతోంది. అమ్మ కేకలు పెడుతోంది:

'ఒరే! శాంతీ! లే! వాటి నన్నిటినీ గోనెలో కుక్కాను—ఒకటే రొదచేస్తున్నయ్. పోయి, పీడా విరగడచేసి రా!—'

'అబ్బ! ఇప్పుడు వాటి కంత తొందరేవిటి?— నక్కలు ఎల్లాగూ అడివిలోకి వెళ్లిపోయాయిరి. పొద్దుగూకేదాకా అవి మళ్ళా తిరిగొస్తాయా పెడతాయా? పట్టపగలు తీసికెళ్ళి పారేస్తే యేం లాభం అవి మళ్ళా ఎలాగు నెమ్మదిగా పారాడుతూ తిరిగి వస్తయ్. టామీ వెళ్లి వెంటబెట్టుకురాదూ?—'

'వెధవ నక్కలే కావాల్ట్రా; వాటిని చెరువు గట్టున ఎవడేనా చూసి, మోజుపడి యింటికి తీసుకెళ్ళి పెంచుకోగూడదూ?'

ప్రపంచ కథానికల రెండవ పోటీకి అనుబంధంగా జరిగిన వంగభాషపోటీలో ప్రథమ బహుమతి పొందినకథ.

'పోదూ! ఇప్పుడు వాటి సంగ తెవరు చూస్తారూ! కాస్తేమన్నా చదువుకోవాలా అక్కర్లేదా. హోమ్‌వర్కు చేసుకు రాకపోతే మేస్టారు తిడతారు, తెలుసా? బళ్లోనుంచి తిరిగొచ్చిం తరవాత సాయంత్రం తీసుకెడతాలే.'

అమ్మ అంతా విన్నది. ఏది! మాట్లాడలేదు గాని బలే కోపమొచ్చినట్టుంది. స్నానం చెయ్యటానికి చెరువుకు బయలుదేరింది. వెళ్లేటప్పుడు అమ్మ కళ్ల వంక చూశాను. నా గుండె గబగబా కొట్టుకుంది. అమ్మ రేవుమెట్లమీద బిందె పెట్టినం నా గదిలోకి వినిపించింది. మట్టి కుండయితే నూరు చెక్కలై వుండును. ఎంతకోపం!

నెమ్మదిగా కుక్కపిల్లల దగ్గిరి కెళ్లాను. అక్కాయిలూ, చెల్లాయిలూ అన్నీ కలిసి ఒకదానొకటి తోసుకుంటూ వాళ్లమ్మ దగ్గర పాలు తాగుతున్నయ్. తల్లిప్రేమతో టామీ హృదయం నిండిపోయింది. మాగన్నుగా పడుకుని విశ్రాంతి తీసుకుంటోంది.

పక్క నెవ్వరో వచ్చి కూర్చున్నట్టనిపించి కన్ను విప్పి నావంక చూసింది. మా అమ్మ ఒక్కొక్కప్పుడు నావంక అలానే చూసేది.

కుక్కపిల్లలు పూర చెరువు పాలుగాలేదు. నాకు తలనొప్పి వచ్చి రెండు రోజులు అలానే ఉండిపోయింది. మూడోనాడు కడుపులో నొప్పివచ్చి పక్కమీద పడుకుని పొద్దుటి్నుంచి సాయంత్రందాకా అలా దొర్లుతూనే వున్నాను. తరువాత నరాల తీపూ అదీ పట్టుకుంది, మరో మూడు రోజులు. తరువాత ఇలాగే మరో జబ్బూ మరో బాధా!

అమ్మకు కంగారెత్తి పోయింది. ఇంట్లోవున్న దేవుళ్ళ ముందర కూర్చొని ప్రొద్దస్తమానం ప్రార్థనలు చేస్తోంది. ఓ! పూజలమీద పూజలు! ఉండుండి నా మంచం దగ్గిరికి పరుగెత్తుకొచ్చి చూసి పోతోంది.

రోజూ మూడుపొద్దుల స్నానం చేస్తోంది. మెసెకు చీర చెంగు ముడేసుకుని దేవుడి పాదాలమీద తలవేసి బాదుకుంటోంది. ఇదంతా పక్కమీద పడుకుని దొంగతనంగా చూస్తూనే వున్నాను.

అమ్మ పెదవులు మాటమాటకూ నా చెక్కిలిని స్పృశించుకున్నాయి. నాకు చికాకుగా వుంది. లేచి బయటికి వెళ్ళిపోవాలనిపిస్తోంది. అమ్మ నన్ను రెండు చేతుల్లోనూ గట్టిగా అలుముకొని లేవనీయటం లేదు. అమ్మ మాట్లాడుతోంది. ఆవిడ హృదయం వణికిపోతున్నట్టే మాటలు కూడా వణికిపోతున్నయ్.

'మా నాయన గారు—అల్లా లేవకు—మా తండ్రి గారు—నీకు చాలా జబ్బుగా వుంది.

లోలోపల నవ్వుకుంటున్నాను—నువ్వనుకుంటున్నంత అమాయకపు పసిబిడ్డను కాదమ్మా అనుకుని. కాని రోజూ తరబడి, గోధుమ జావ, బార్లీ నీళ్లూ, కొబ్బరి నీళ్లూ ఈ వగైరా పత్యపుగొట్టు తిండితో బతకటమంటే తలప్రాణం తోకకొస్తోంది. కడుపులో పేగులు దహించుకు పోతున్నయ్. ఆరోగ్యంగా వున్నవాణ్ణి అనవసరంగా ఆ మందులు మింగటమంటే ప్రాణంమీద కొచ్చినట్టుంటోంది.

కుక్కపిల్లలు నానాటికి అల్లరి నేర్చుకుంటున్నయ్. ఇరుగుపొరుగు ఇళ్లన్నీ తిరిగివస్తయ్ వంటగదుల్లోకి కూడా జొరబడుతున్నయ్. వాళ్లంతా కర్రలుచ్చుకు వెంటబడుతున్నారు. ఉండుండి గోలగా అరుస్తూ నా పక్క చుట్టూ చుట్టేస్తున్నయ్.

'వెధవ కుక్కలు! అవతలకి తరుమరాదుటా!' వాటి బాధ భరించలేక అమ్మకు కళ్లనీళ్ళ పర్యంత మౌతోంది.

అవి నానాటికి మరీ పేట్రేగిపోతున్నయ్. ప్రతి వాళ్లనీ స్వంత మనుషులుగా పరిగణించి వ్యవహరించుకున్నయ్.

ఎన్నిసార్లు తరిమినా సరే మళ్ళీ మళ్ళీ వాళ్ళ యిళ్లకే పోతూవుండటం! వాళ్లు అమాంతం చెవి పుచ్చుకుని పైకెత్తి కచ్చకొద్దీ విసిరి అవతల పారేస్తున్నారు. నా మనసులో ఎంతో బాధగా వుంది. కాని నేనేమి చెయ్యగలను?—వాళ్లు నేను వద్దంటే మానతారా?

హిందువుల యిండ్లలోకి కుక్క దూరటమంటే యేమిటో? కొంప లంటుకున్నాయన్న మాటగాని మరేమన్నానా? వంటయింట్లో వున్న కుండలన్నీ పగలగొట్టి అవతల పారవేస్తారు.

ఇంకా శ్రోత్రియకుటుంబాలైతే, పురోహితుణ్ణి పిలిపించి, పుణ్యాహవాచనాది తతంగమంతా జరిపిస్తారు.

అవి అలా పెరుగుతున్న కొద్దీ అల్లకల్లోలంగా ఉంది. టామీకి పాలెండిపోయాయి. అయినా అవి కనుపించితే చాలు మీదపడి, వట్టి తిత్తులనే పీకుతున్నాయి. టామీ తప్పించుకు తిరగడానికి రోజంతా తంటాలు పడుతోంది. ఇవి దానికోసం ఊరూవాడూ గాలిస్తున్నయ్.

టామీ కూడా అందరి వంట యిళ్ళల్లోకీ జొరబడుతోంది. ఏది దొరికిందితే అసల్లా మెక్కేసి పెదవులు నాక్కుంటూ దర్జాగా బయటికి వస్తోంది.

శిశిర ఋతువు; ప్రొద్దుగూకబోతోంది. కొంచెం చలిచలిగా వుంది. నేను వరండాలో కూర్చున్నాను. ఒంటినిండా దుప్పటి కప్పుకుని ఒక బుట్ట చేతబట్టుకుని, మా పొరుగింటివాళ్ళ అబ్బాయి, నాటాయ్ వచ్చాడు. ఎందుకొచ్చావని అడిగాను.

కుక్క పిల్ల

అమ్మ వాణ్ణి ఉత్తర పేపు దరవాజా దగ్గిరికి పిలిచింది. నేను ఆదుర్దాగా వాళ్లవంక చూస్తున్నాను.

వాడు కుక్కపిల్లల నన్నిట్నీ బుట్టలోకి ఎత్తుతున్నాడు. ఒకదాన్ని లోపలపెడితే రెండోది లోపలనుంచి తెయ్యిమంటూ బయటికి దూకుతోంది. నానా తంటాలూ పడి వాటి నన్నిటినీ గంపలో పెట్టి గోనె మూతేశాడు. టామీ ఎక్కణ్ణుంచో దూకింది. వాటాయ్ వంక తీవ్రంగా చూచింది. బుట్టలో నుంచి 'కుయ్ కుయ్' మని వినిపించుతోంది.

వంటయింటి గుమ్మంలో నుంచి అమ్మ కేక: 'టా...మీ...'

టామీ గజిబిజిపడి పోయింది. కంగారుగా బుట్ట వంక చూసింది. మళ్లా అమ్మ కేక వినిపించిన వైపు ఆదుర్దాగా చూసింది. దాని గొంతులో ఏదో కళ కళ ముగా ధ్వని. బుట్టవంక చూస్తే దాని గుండెలు దబ దబా కొట్టుకుంటున్నయ్—కేక వినిపించిన దిశచూస్తే నాలుక వెంట నీళ్లు కారుతున్నయ్.

మోసంలో పడిపోయింది. నాలుగు కాళ్ల మీద ఎగిరి అమాంతం పరుగెత్తింది. సందు దొరికిందే చాలునని వాటాయ్, బుట్ట నెత్తినెట్టుకుని కాలికొద్దీ పరుగెత్తాడు. నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

తూరుపురేఖలు పొడుస్తున్నయ్. మంచు ముసుగును చీల్చుకుని మసీదులోనుంచి కేక వినిపిస్తోంది. దూరాన సాయిబులవీధిలో కోళ్లు అరుస్తున్నయ్. బాతులు బెలబెల లాడుతున్నయ్.

దుప్పటి కప్పుకుని మెల్లిగా బయలుదేరాను. నాకు జబ్బుగావుందనే ఇంకా అమ్మ అనుకోవటం. కాని నా మనసులో వున్న మాటమాత్రం నే నెవ్వరికీ చెప్పలేదు.

మాయింటిప్రక్కనున్న మైదానానికి అడ్డంపడి మట్టిరోడ్డెక్కాను. రోడ్డు వెంటవెంబడి తూరుపుగా పోతున్నాను.

రోడ్డు చాలచోట్ల గళ్లుపడి వుంది. వాటిమీద తాటిదూలాలు పరిచారు. వాటిమీదనుంచి దాటి వెళ్లాను.

రోడ్డుకు ఎడమపక్క సులాబీ. కుడిపక్క పూరచెరువు. రోడ్డుక్రింది తూముల్లోనుంచి మురికినీరు ప్రవహిస్తోంది. తల పైకెత్తి చుట్టూతా చూశాను. ఒక్కసారి గుండె గభీలుమంది.

ఆ ప్రదేశమంతా కీచుమంటూ నిర్మానుష్యంగా వుంది. చూపుమేర దూరంలో ఎక్కడా నరసంచారం లేదు.

మసకలో జడలు విరబోసుకున్న దెయ్యంలా ఒక పెద్ద రావిచెట్టు. ఆ చెట్టుచుట్టూ గోరీదిబ్బలు. చచ్చిపోయిన అనేకమంది పసిపిల్లలు ఆ దిబ్బలక్రింద పెద్దనిద్దురపోతున్నారు. దిబ్బలమీద బిళ్లగన్నేరు మొక్కలు పూసివున్నయ్. ఆ పువ్వులమీద ఎందరు తల్లిదండ్రుల కన్నీరు ఒలికిపోయిందో.

భూమి మీద అనేకమంది మనుష్యులు—గోరీల క్రింద అనేకమంది.

కుక్కపిల్లలు మాత్రం ఏమయినా కనుపించటం లేదు

చూపుమేర దూరంలో ఎవ్వరూ కనుపించటం లేదు. నా గుండెలు మరింత వేగంగా కొట్టుకుంటున్నయ్. నా శరీరమంతా చలి గుబుల్లాంటి భయమేదో ఆవరించింది.

ఉన్నట్టుండి ఏదో ధ్వని! ఆ ధ్వని ఏమిటో ఎక్కడనుంచి వస్తోందో తెలియ లేదు. తూర్పున సూర్యుడు మాత్రం ఉదయిస్తున్నాడు.

పట్టపగలుగా తెల్లవారిపోయినా ఇంకా నాకు చీకట్లో తిరుగుతున్నట్టుగానే వుంది. నా తలమీది వెంట్రుకలు నిక్కబొడుచుకుంటున్నయ్. గుండెల్లో ఏదో గుబులుగుబులుగా వుంది. ఒళ్ళంతా ఏదో పాకుతున్నట్లనిపించింది. తిరిగి మళ్లీ అదేధ్వని! వెనకా ముందూ చూసుకున్నా ఎక్కడా ఏమీ కనిపించలేదు. గుప్పున, దెయ్యాలసంగతి జ్ఞాపకం వచ్చింది. మనం ఎవళ్లకోసం వెతుకుతున్నామో వాళ్లగొంతు పెట్టుకుని దెయ్యాలు మనల్ని పిలుస్తాయనీ మాట్లాడతాయని మోసంచేసి ఎత్తుకుపోతాయనీ అనేక కథలు విన్నాను.

నాకళ్లు బైర్లు క్రమ్మాయి; కళ్ళెదుట మనిషి నిల్చున్నా కనిపించనిస్థితి యేర్పడ్డది.

ఆ ధ్వని మరింత తీవ్రంగా వినిపించుతోంది. కాలవక్రింది తూములవేపు నడిచాను. బ్రిడ్జిక్రింద మోకాటితండా వేసి తూముని చీకటిగావున్న ఒక తూములోకి తొంగిచూస్తున్నాను. ఒక జంతువేదో ఆ తూములోనుంచి రివ్వున బయటికివచ్చి నన్ను పడదోసేసింది. గుప్పున ఏదో పాడువాసన!

లేచి నిల్చున్నాను. నా పంచా, దుప్పటికూడా బురద కొట్టుకున్నయ్. చుట్టూ చూశాను; ఎవ్వరూ కనుపించలేదు.

బురద మరకలు కడుక్కోవటానికి నీళ్ళదగ్గరకు వెళ్లాను. నీళ్లలో ఏవో చిన్ని చిన్ని తరంగాలు లేస్తున్నయ్! 'ఏమిటని? చేపలేమో. చేపలు ఈదితే మాత్రం అంతింత పెద్దపెద్దతరంగాలు కడతాయా. కొంచెం ముందుకువంగి తొంగిచూశాను.

జీవన్మరణసంధ్యలో బాధగా ఏడుస్తున్న రెండుముఖాలు! మునిగిపోకుండావుండటానికి రాత్రి తెల్లవార్లూ అట్టాగే కొట్టుకుంటూవున్నయ్ కాబోలు. అవి అలా శక్తినంతా వినియోగించటానికి ప్రయ

త్నించటంలో ఇంతింతగా ముడుచుకుపోయి కనుపించుతున్నాయి.

నీళ్ళలోకి మునిగాను — నీళ్లు జివ్వుమంటూ చలి ఇగంలా వున్నయ్. రెండు కుక్కపిల్లలనూ రెండుచేతులా బట్టుకుని బయటికి వచ్చాను. వాటిని గుండెలకు హత్తుకున్నాను.

గడ్డివున్న ప్రదేశమంతా తడితడిగా వుంది. మనుషులు నడిచి గడ్డి చచ్చిపోయిన కాలిబాటలో వాటిని తెచ్చి పెట్టాను. చలికి గజగజా వణుకుతూ కుయ్యో కుయ్యో మని యేడుస్తున్నయ్. గుడ్డలు పిండుకుని త్వరగా ఆరాలని గాలికి అడ్డుపెట్టుకున్నాను.

ఒక రాబందు రివ్వున ఎగిరివచ్చింది; కుక్కపిల్ల అరుపు గాలిలో వినిపించింది — నెమ్మదిగా ఆకాశంలో అంతరించిపోయింది. ఏమీ చేయలేక దీన ముఖం వేసుకుని చూస్తూ నిల్చున్నాను.

కన్నీరు చెక్కిళ్ళమీదుగా ప్రవహించుతోంది. మిగిలిన ఒక్క పిల్లనీ దుప్పటిక్రింద దాచుకుని ఇంటికి బయలుదేరాను.

అది యింకా యేడుస్తూనే వుంది. రాత్రి తెల్లవార్లూ నీళ్ళల్లో నానింది, ఎన్నాళ్ళో బ్రతుకుతుందో.

మా యింటి ప్రక్కనుంచే ఒక కాలవ ప్రవహిస్తూ వుంది. కాలవొడ్డునవున్న గంగరావిచెట్టు మొదటవున్న తొర్రలో కుక్కపిల్లను వుంచాను

దాని ఏడుపు విని, టామీ ఎక్కడనుంచో రయ్యిన పరుగెత్తుకొచ్చింది. సంతోషంతో తోక అల్లలాడిస్తూ నేలమీద పల్లకిలా పడుకుంది. కుక్కపిల్లని దాని పొదుగుదగ్గిర వదిలేసి అవతలికి పోయాను.

అమ్మ కేకలేస్తోందేమో నని భయమేసి చెవులు రిక్కించి విన్నాను. చిత్రమే! ఎక్కడా కేకలు వినిపించటం లేదు. అమ్మకు బాగా కోపం వచ్చి వుంటుంది. కొడుతుందేమోనన్న భయంతో చాలాసేపు ఆ చెట్టు క్రిందనే వణుకుతూ నిల్చున్నాను.

కొన్నాళ్లు గడిచింది. టామీకి, ఎనిమిది పిల్లలకు, మిగిలిందల్లా ఈ ఒక్క పిల్ల. దాని పొదుగు నిండా పాలు. చిన్నముండ అవన్నీ తాగలేకపోతోంది.

టామీ నల్లగా వుంటుంది. ఇది మాత్రం పాల నురుగులా తెల్లగావుంటుంది. చూస్తే ముద్దొస్తుంది.

కుక్కపిల్ల ఆడుకోడానికి, అమ్మ రంగురంగుల గుడ్డపీలికలతో బంతులు కుట్టింది. వాటితో సర్దాగా ఆడుతూ అది ఎప్పుడూ వంటయింటి ముందు వరండాలోనే అమ్మ కాళ్ళ చుట్టూ తిరుగుతూ వుంటోంది.

ఒకనాడు దానికి హుషారు పుట్టింది అమ్మ వరండాలో పోసి పెట్టుకున్న చిక్కుడులన్నీ చెల్లాచెదరుగా చిమ్మింది. దానికి అదో సర్దా! అమ్మకు కళ్లు మండింది. ఒక గుండెడు పుల్ల పుచ్చుకుని పిల్లమీద ఒక్కటే వేసింది. అది 'కుయ్యో!' మని అరిచిందే గాని అక్కణ్ణుంచి మాత్రం పోలేదు. అమ్మ పాదాల మీద బడి ఇటూ అటూ దొర్లింది. అమ్మ నన్ను కేకేసి 'చూడరా ఇదీ' కొట్టినా అవతలికి పోదూ!'

'అవును అస్తమానం దాని కేదో మేపుతూ వుంటావాయిరి. పొమ్మంటే పోతుందా మరి!'

ఆ నాటినుంచీ దాన్నికట్టేసి సాయంత్రంపూట మాత్రం కాసేపు వదుల్తూవున్నాం.

ఒకనాడు మధ్యాహ్నం పడుకుని నిద్రపోతున్నాను. నేను నిద్రలేచి చూసుకుంటే పక్కలో కుక్కపిల్ల లేదు. నిద్రపోయే ముందు దానితో కాసేపు ఆడుకుని పక్కలో పెట్టుకు నిద్రపోయాను. అది ఎప్పుడు లేచి పారిపోయిందో పారిపోయింది. అమ్మనడిగాను; చూళ్ళేదంది.

వెతకటానికి బయలుదేరాను. ఇల్లిల్లూ వెతికి విసుగెత్తిపోయింది. అది ఇల్లు వదలిపోవటానికి బజారు కుక్క గాదే! ఎవరో కావాలని యెత్తుకుపోయి వుండాలి. అది అందంగా వుండటం చూసి ప్రతివాళ్లూ దానిమీదే కన్ను వేశారు. ఇంతకీ ఎవరెత్తుకు పోయి వుంటారు ?

ఒక్కసారి జ్ఞాపకం వచ్చింది; పాల్లె తల్లి నిన్న గోల చేసింది — వండుకున్న చేపల కూరంతా తినేసిందని. నిన్న ఆ మాటలు మే మెవ్వరం నమ్మలేదు. ఒకవేళ నిజంగా తినేసిందేమో. నేను పాల్లె యింటివేపు బయలుదేరాను.

అది పెంటయింటికి ఒక అరుగంటూ లేదు. వాన కురవకుండా, కప్పుమీద గోనెచింపులు వగైరా కప్పివున్నయ్. బయటినుంచి చూస్తే పైనున్న వాసం నుంచి వేళ్ళాడుతున్న వుట్టిమీది మసీముంత కనుపించదు. ఉట్టి చేర్లు కూడా నల్లగా బూజేసివున్నయ్. ఆ వుట్టి కూడా చాలా ఎత్తునుంది. అది కుక్కపిల్లకెలా అందుతుంది? అంతెత్తు ఎగిరిందంటే అది ఆలోచించాలిసిన విషయం.

ఆయింటిచుట్టూ బురదబురదగా వుంది. ఎక్కడెబడితే అక్కడె చేపపొలుసులూ, బొమికెలూ, నానా గలీజా. కంపు వాసన వేస్తోంది. ముక్కుకు చెయ్యి అడ్డుపెట్టుకున్నాను. కుళ్ళిన పెంట పోగంతా అక్కడె ఎన్నియుగాలనుంచో గుట్టగా పోసివుంది. వట్టి మురికిగొడ్లు! వాళ్ల జీవితాల్లో ఎప్పుడూ ఇల్లు కడుక్కోవటం అంటూవుండదు

పాల్లెతల్లి బొబ్బపెట్టింది:

'ఓహోయ్! చోటాబాబూ! మా పెంటపోగు కుప్పలమ్మీద అక్కడేంజేస్తున్నావూ?' —

'మా కుక్కపిల్ల కనుపించిందా?' —

చోర్‌దా పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వచ్చి నా చెయ్యిపట్టుకున్నాడు. అతను పైరు తిరిగిన వస్తాదు. నన్ను అమాంతం గాలిలోకి ఎత్తి దబాల్న నేలకేసి కొట్టాడు! —'

'అలాకాదు — ఆ మెయిని తీసుకుపోయి ఆ చెర్లో ముంచెయ్యి వెధవని' — అమ్మ కేకలు. 'కుక్కపిల్లట. పోసు కుప్పల్లో వెతుకుతున్నాడు. నాకడుపు చెడబుట్టాడు. వాడిమూలాన నా బ్రతుకంతా నరకమైపోతోంది.'

చోర్‌దా మండిపోతున్నాడు: నన్ను వెక్కిరిస్తూ:

'ఏరా! బుల్లాడా? మెడకి గొలుసు తగిలిస్తే దానిమెడ కందుతుందిగా' — వెళ్ళి వెతుక్కు తెచ్చుకో — గొలుసు విప్పినందుకు ప్రాయశ్చిత్తం.'

నేను నేలను తాంబేలులా కరుచుకుని అలానే బోర్లబొక్కులుగా పడున్నాను. నన్ను చెర్లో ముంచాలంటే, బలవంతాన నేలనుంచి ఊడబీకాలిసిందే!

అమ్మ చింతబెల్లె పుచ్చుకొచ్చింది. నావీపు హూనమైపోయింది. కాళ్లూ చేతులూ పారజాపేసి చచ్చినవాడిలా పడున్నాను. అమ్మ గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది. మళ్ళీ రెండుక్షణాలకు తిరిగివచ్చి నాప్రక్కనే కూలబడి, తానుకూడా ఏడవటం మొదలుపెట్టింది. నన్ను తనఒళ్లోకి తీసుకోవటానికి ప్రయత్నించింది. నాకు పెద్దపెట్టున ఏడుపు ముంచుకొచ్చేసింది. గుబులు గుబులుగా ఏడిచేస్తున్నాను.

ఇంతలోనే నాన్న పాదాలచప్పుడు దూరాన వినిపించింది. అమ్మ కంగారుగా లేచి చెరువుకు వెళ్ళిపోయింది. నేను నోరుమూసుకుని పిల్లిలా గదిలో దూరేశాను.

స్నానంచేసివచ్చి అమ్మ నన్ను రహస్యంగా పిల్చింది. నానెత్తి నిన్ని తులిసినీళ్లు చల్లింది. ఒక తులిసాకు నానోట్లో కూరింది.

అసాయంత్రం: 'హరిహరీనారాయణా' అంటూ ఒకవైష్ణవస్త్రీ బిచ్చానికొచ్చింది. ఆమె ఎవరివస్తువు లేంపోయినా — ఆవులు పోయినా, సొమ్ములు పోయినా — ప్రశ్న చెబుతుంది. చేతిలోవున్న కర్రతో అమాంతం నేలమీద వ్రాసేస్తుంది.

'నా కుక్కపిల్లెక్కడుందో చెబుతావ్?—'

'ఓ! చెప్పేస్తా! — ఒక అయిదణాల కానీ తీసుకురా — ఇప్పుడే చెప్పేస్తా!'

'తరువాతిస్తాలే—ముందు చెప్పు'—

'నీకు తెలీదు తండ్రీ! డబ్బులు బిరిలో పెట్టి మంత్రం చదివితేగాని, తల్లి పలకదు'—

అమ్మ నిద్రపోతోంది — లేపితే గూబ కదలేస్తుంది. మెంతులుడబ్బీ లవీ వెతికాను. ఎక్కడా ఏమీ కనుపించలేదు. అమ్మ చీరకొంగున తాళం చెవుల గుత్తి వ్రేలాడుతోంది. వణుకుతున్న చేతులతో నెమ్మదిగా విప్పేశాను.

పెట్టె తాళం తీశాను. అందులో నాలుగణాలే వున్నయ్. మిగతా అయిదు కానులూ దొరకలేదు. అంతవరకే తీసుకుపోయి వైష్ణవ యోగిని కిచ్చాను. తాంబూలం కూడా కావాలి తెమ్మంది. ఇంట్లో వక్కలాకులు ఎక్కడవుంటాయో నాకు తెలుసు. తెచ్చి యిచ్చాను.

"అది యెక్కడికీ పోలేదు—ఇంట్లోనే వుంది. పోయి పూళబస్తాలగదిలోంచిక్రింద చూడు అంది.

ఆమాటలు ఇంకా పూర్తిగాకపూర్వమే, ఒక్క ఉదుటున పాకలోకి పరుగెత్తి గడమంచి క్రింద వెతికాను. ఎక్కడా ఏమీ కనుపించలేదు. భగ్నహృదయంతో తిరిగి వచ్చాను. నేను వచ్చేలోపుగానే ఆయోగిని, గాలిలోకి గాకల్ను, అదృశ్యమైపోయింది.

నేను బడి మానేసి అప్పటికి కొన్నిరోజులైంది. తిరిగి బళ్లోకెళ్లాను. పిల్లవాళ్లంతా నన్నేదో కొత్తవాళ్ళి చూసినట్టు అదోలా చూస్తున్నారు. మాస్టారు మీసంకొసను పంటితో కొరుక్కుతింటూ:

'ఏరా! అబ్బీ! ఏమిటీ మనసంగతి! రాతా కోతా నేర్చుకోవటమా — కుక్కపిల్లనో, జీవితం వెళ్లతీసుకోవటమా?'

నేను సమాధానమేమీ చెప్పకుండా తల వంచుకున్నాను.

'అయితే నీకు ఒక మహత్తరమైనగీతం బోధించవలసివుంది' అన్నారు మాస్టారు.

తేనెతుట్టెమీద బెడ్డ విసిరినట్టయింది. పిల్లలంతా ఒక్కసారి 'జాం'మని ఎత్తుకున్నారు.

'అనగా అనగా కుర్రాడు
కుక్కలపిచ్చి కుర్రాడు!
కుక్కపిల్లకై దిక్కునదూకి
మురికిగుంటలో మునిగాడు'—

'వహ్వా! అది చెప్పినా బాగుండును' — అంటూ మాస్టారు పగలబడి నవ్వుతున్నాడు. నాకు చిరాకెత్తిపోయింది. బళ్లోనుంచి బయటికి పారిపోయాను.

బహుశా నాన్నకు ఇది తెలిసిందికాబోలు. ఆయన కళ్లు చింతనిప్పుల్లా వున్నయ్. కాని ఆయన ఇదేమీ కదిలించలేదు.

ఆవేళ మాఘపూర్ణిమ సంత. ప్రొద్దుట్నుంచీ డోళ్లు వినిపిస్తూనే వున్నయ్. సంతకెళ్లటానికి నేనూ సన్నాహమవుతున్నాను. నాన్ననీ, అమ్మనీ

అక్కడ చిల్లరడబ్బులు పోగుచేశాను. ఆడావుగా, జనం తుళ్ళిక్లాడుకుంటూ రోడ్డువెంట పోతున్నారు.

ఇంతలో నాటాయ్ పరుగెత్తుకొచ్చాడు. ఆ ఆయాసంలో వాడికి సరిగా మాటే రావటంలేదు.

'శాంతీ! నీ కుక్కపిల్ల!—వాడెవడో సంతలో అమ్మెయ్యటానికి పట్టుకుపోతున్నాడు.

నా నాళాలలో వున్న రక్తం యావత్తూ ఒక్కసారి పొంగింది. ఎవడు, ఎవడా బద్మాష్!

ఆమాట చెప్పీ చెప్పటమే నాటాయ్ రివ్వున మళ్లీ ఎటో ఉడాయించేశాడు. ఎటు పోయాడో! నేను అదంతా వెతికాను. ఎవడూ కనిపించలేదు.

వాడు మళ్ళీ పరుగెత్తుకొచ్చాడు:

'రా! రా! చోర్దా వాణ్ణి పట్టుకున్నాడు. ఇద్దరూ ఒకళ్ల నొకళ్లు చావగొట్టుకుంటున్నారు!'— మళ్ళీ పరుగెట్టేశాడు.

నాకు బలే కంగారెత్తి పోయింది. అయినా బయలుదేరాను. నాటాయ్ మళ్ళీ నాకు ఎదురొచ్చాడు. వాడి చేతిలో, మెళ్ళో ఒక తాడుతో కుక్కపిల్లవుంది. అమాంతంపోయి వాడి చేతిలోవున్న తాడు లాక్కున్నాను. వెంటనే తీసుకుపోయి వంటయింటి వరండాలో వున్న గుంజకు కట్టేసి బయటికి వచ్చాను.

చోర్దా ఆ దొంగవెధవను మా యింటిముందుకు పట్టి లాక్కొచ్చాడు. వాడికి ఇంత పెద్ద జీబు తల— చేతిలో ఒక వేణువు కూడా వుంది. వస్తాదుల మల్లే ఇంతింత బుర్రమీసాలు. చోర్దా కంటే చాలా బలంగా వున్నాడు. చోర్దాకు చాలా దెబ్బలు తగిలాయి. తల్లోనుంచి రక్తం కారుతోంది.

అమ్మ లోపల్నుంచి బయటికి వచ్చింది. చోర్దా తల్లోనుంచి నెత్తురు కారటం చూసి హంగామాగా వారా ఫేరా అని అరవటం మొదలు పెట్టింది. పిచ్చెత్తిన దానిలా ఇంట్లోనుంచి బయటికీ, బయటి నుంచి యింట్లోకీ కంగారుగా తిరుగుతోంది.

నేను ఇంత పత్తీ వైశల్యకరణి (ఒక ఓషధి) తెచ్చాను. చోర్దా గర్జించాడు: 'దద్దమ్మా! ఆ ఆకులు నూరుకురా!'—కట్టుకట్టడం పూర్తిఅయిందో లేదో: 'మంటలు, మంటలు' అని నాలుగు మూలల నుంచీ జనం ఒక్కసారి గగ్గోలుగా అరిచారు.

ఎక్కడ ఎక్కడంటూ, అందరూ చకితులై నలుదిక్కులా కలయజూచారు మాయింటి వసికొప్పమీద బ్రహ్మాండంగా పొగా మంటలూ కనుపించాయి. ఇల్లు నాలుగు ముఖాలా అంటుకుపోతోంది.

జనం మూగారు. కడవలతోనూ, బానలతోనూ ఎడా తెరిపీ లేకుండా నీళ్లు జారపోసుకొచ్చి మంటలతో పోరాడారు. ఒక ఝామునకు ఎల్లాగయితేనేం మంటలను అదుపులోకి తెచ్చారు గాని బూడిదైన తప్ప మిగిలిందేమీ లేదు

అమ్మ యేడుస్తున్నది. నాన్న కళ్లల్లో నీళ్లు తిరిగాయి. జనం వచ్చి అమ్మనీ నాన్ననీ ఓదార్చి పోతున్నారు.

'దొంగలు పడ్డయిల్లు కోలుకోదు గాని, అగ్నిదేవునికి ఆహుతైన యిల్లు అంతకు మూడురెట్లు వృద్ధి పొందుతుంది. మరేం బెంగ పెట్టుకోకండి. ఈ యిల్లే యింటి లెక్క, అన్నీ వాసాలూ, తడికలూ. బిడ్డలున్నారు మీకేం — వాళ్లే బంగారం. ఈ పాకవున్నచోటే మళ్ళా రేపీపాటికి రాజభవనం కడతారు'—

ఏదో కవురువాసన ఆ ప్రదేశమంతా వ్యాపించుతోంది. టామీ బెంగగా అక్కడికి వచ్చింది. మొదట నాన్నగారిదగ్గిరికి వెళ్ళింది. ఆయన మౌనంగా కూర్చుని మాట్లాడలేదు. తరువాత అమ్మ దగ్గిరికొచ్చింది. అవిష దానిముఖంలోకి చూసింది. దాని కళ్లల్లో ఏదో అవాచ్యమైనభావం; అమ్మకి ఏదో చెప్పటానికి ప్రయత్నించుతోంది. అమ్మ దాన్నడిగింది:

'కాళ్లీ ఏమైందో చూశావా?—అది బ్రతికి వున్నట్టేనా?'—'కాళ్లీ' మాఆవు; దూడతో వుంది. మంటలు ఆరపటానికివచ్చినవాళ్లల్లో ఎవరో దాన్ని మెడ విప్పి బయటికి తోలేశారు.

'ఇంతకీ కుక్కపిల్ల ఏదిరా అబ్బీ!' అమ్మ గుప్పున అడిగింది.

నిలువునా కంపించిపోయాను. వంటగది వరండాలో కట్టేశానన్న సంగతి ఎలెక్ట్రిక్ షాక్ లా జ్ఞాపకం వచ్చింది.

నోటమాట రాక అలానే స్తంభించి పోయాను. వంటయింటిముందు వరండా ఒక పెద్ద బూడిదదిబ్బలా కనుపించుతోంది.

'బెల్లంకొట్టినరాయల్లే అట్లా నిల్చుంటావేంరా? నువ్వు చూపెడీయకపోతే యింకెవరు చూపెడిస్తారు! అసలు కుక్కపిల్ల దొరికిందని ఇంకెవరికి తెలుసురా!'—అన్నది అమ్మ.

లేచి చిన్న తవగాల ఒకటి తీసుకుని వంటగది వరండామీదవున్న బూడిదగుట్ట దగ్గిరికి వెళ్లింది. నెమ్మదిగా పరీక్ష చేస్తూ ఆ గుట్టంతా తవ్వి యివతల పోస్తోంది.

'అరి భగవంతుడా! ఎంత పని జరిగిందీ'— ఒక్క కేక పెట్టింది.

'ఏమిటి! కాలు విరిగేసుకున్నావా?' నాన్న కంగారుగా అమ్మ వేపు పరుగెత్తాడు.

ఏమి జరిగిందో నాహృదయానికి తెలిసిపోయింది. నా తల ఒక్కసారి దిమ్మెక్కిపోయింది. కళ్లు తిరిగి

పోయినై. నా రెండు కళ్ళమీదికీ చీకటి తెరలు దిగి పోయాయి. చెవులు రెండూ ఘుడీయాలుపడి యేమీ వినిపించకుండా పోయింది.

ఒక కలగని నిద్ర మేల్కొన్నాను. ఆవరణ యావత్తూ సూర్యకాంతులు పడి ఆనందంగా వుంది. ఆ మసిబొగ్గుల గుడిసెలన్నిటినీ యెవరు ఎత్తివేసి వుంటారు? మెరుగులు తీర్చిన పాలరాతి పలకలు పరిచినట్టుంది ఆవరణ యావత్తూ. నేను అంతసేపు నిద్ర పోయినట్టనిపించలేదు.

ఇంట్లో వున్న సామానంతా కాలి పోయింది. కాని నే నిప్పుడు పడుకున్నది ఒక దక్కని మంచం; ఎవరి దిది? నా మంచం చుట్టూ ఈ టీపాయ్, ఈ బల్లలూ ఇవన్నీ ఎక్కడివి.

నేను మంచం దిగబోతున్నాను. ఇంతలో అమ్మ పరుగెత్తుకొచ్చి నన్ను ఆపివేసింది. 'దిగొద్దు నాయనా నీకు వళ్లు కులాసాగా వుంటే అంతేచాలు'—

'ఏమిటి నా కేమైంది?'—

'అదంతా తరువాత చెబుతాలే—మందీ మందు తాగు'—

ఒక చిన్న గ్లాసు నా నోటి కందించింది. నేను తల అవతలకి లాక్కున్నా.

'ఏమిటి వెర్రి!—పిచ్చివాడివా యేమిటి?—విధవ దిక్కుమాలిన కుక్కపిల్లకోసం ఇంత వెర్రేమిటి. భగవంతుడి దయవల్ల ఆవు బ్రతికింది. అక్కడికి ఎంతో సంతోషించాలి. ఆవు కాలిపోతే ఏమయేదో తెలుసా? మెడను పలుపు కట్టుకుని 'అంభా అంభా' అని ఆవులా అరుస్తూ వూరంతా తిరిగి ఇంటింటికాడా బిచ్చమెత్తి ఆ డబ్బులో ప్రాయశ్చిత్తం చేసుకోవలసి వచ్చేది. బుర్ర గొరిగించుకుని గోమయం తిని ఆవు పంచితం త్రాగవలసి వచ్చేది—కాస్త మందు తాగరా అంటే గింజుకుంటున్నావు!'

'మరి, నేను తగలబడిపోలేనో?'—

'అదేం అవాచకపుమాటల్రా తండ్రీ?'—

'అమ్మా! కుక్కపిల్లని ఎక్కడ పారేశావు?'—

'ఏమిట్రా నీ వెర్రి! కుక్కపిల్ల కూడా పెద్ద హంగామాగా భూస్థాపన కాండంతా జరపాలా ఏమిటి?—ఆ కాలవగట్టుమీద మర్రిచెట్టుక్రింద పారేసినట్టున్నారు.'

'ఒకసారి వెళ్లి చూసొస్తానమ్మా—ఏం? వెళ్ళి రానా?'

అమ్మ ముఖం ఒక్కసారి పాలిపోయింది. మొండిగా 'అలా వల్ల కాదు — డాక్టరువల్లగాదన్నాడు' అని సమాధానం చెప్పింది.

'నా మనస్సేమవుతుందో ఆ డాక్టరు కేమన్నా తెలుసునా లేదా?'—

'అవునవును—తెలుసు—నాకు తెలుసు నేను నీతల్లిని'—

'ఏమిటి నీకు తెలిసింది?'—

'నీకు ఆకలేస్తోంది. నువ్వు నిన్నట్నుంచీ అన్నం తిన్లేదు'—

'అవును నిజమే—బలేగా తెలుసుకున్నావు'—

'సరే వుండు—భోజనం పట్టుకొస్తా?'—

'సరే త్వరగా తీసుకురా!'

అమ్మ వెళ్లిపోయింది. నేను పక్కమీది నుంచి దిగి, బయలుదేరాను. సరాసరి మర్రిచెట్టుదగ్గిరి కెళ్ళి నాలుగువైపులా చూశాను. ప్రక్కనున్న బంజర్లో ఒకచోట రాబందులు గుంపుగా వాలివున్నయ్. వాటిమధ్యగా టామీ పడుకునుంది. ముందు కాళ్లు చాచుకుని తల ఆ కాళ్ళమధ్యను దోపుకుని పడుకుని వుంది. పిచ్చిముండ! దిగులుగా ఏ మూలో చూస్తోందో పాపం! ఆలోచించటంగాదు. బిడ్డ శవాన్ని రాబందుల ముక్కులతో చీరకుండా హృదయంలోకి పొదువుకుని రక్షించుతోంది. తల్లిహృదయం!

నాకు చాలా ఆశ్చర్యమేసింది—మనకు మల్లే టామీకి కూడా మనస్సు వుంది.

కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ టామీదగ్గిరికి వెళ్ళాను. రెక్కలు రెపరెపలాడించుకుంటూ, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ, రాబందులు కొంచెం అవతలకు జరిగినై.

పాపం పిచ్చిముండ! బిడ్డను రెండుకాళ్ళ మధ్యనూ పొదువుకుని వుంది దానికి మాట్లాడటానికి నోరువుంటే ఎంత ఏడిచేదో. బిడ్డా! అని అరిచి ఎంత అల్లాడేదో!

నేను ఇంకా కొంచెం దగ్గరకు వెళ్లాను. టామీ నన్ను చూళ్లేదు. సర్దాగా ఏదో నములుతోంది.

నాకు అనుమానం వేసింది — ముందుకువంగి ఇంకా జాగ్రత్తగా పరిశీలనగా చూశాను.

ఆఁ....ఏమిటి చేస్తోంది! ... ఆ కుక్కపిల్ల కాలు అప్పటికే ఒకటితినేసింది. రెండో కాలు నములుతోంది!

వెనక్కు తిరిగి వచ్చేస్తున్నాను. మధ్యదోవలోనే అమ్మ నా కెదురైంది. అమ్మ ఎంతో కోపంగా వస్తోంది. ఏదో కేక లెయ్యబోతోంది. ఇంతలో నేనే ఏదో మాట్లాడేశాను.

'వెధవటామీ — తరిమేసెయ్ — వెళ్లగొట్టేసెయ్. అది ఇక నాయింట్లో ఒక క్షణం వుండటానికి వీల్లేదు'—

నేను మాట్లాడే ప్రతిమాటా అమ్మ అతిజాగ్రత్తగా వింటోంది. జగత్తులోవున్న భ్రాంతి యావత్తూ, ఆవిడ ముఖంమీదనే తాండవించుతోంది.

'ఏమిటి నాయనా నువ్వంటున్నది!'—

రాజ్యాంగమునందలి నిర్దేశిక సూత్రములు

శ్రీ వి. లక్ష్మణరావు

మన రాజ్యాంగమునకు ప్రధానాశయము శ్రేయోరాజ్యసంస్థాపనము. ఈ మహదాశయము మనకు రాజ్యాంగచట్టములో వివరింపబడిన ప్రధాన ప్రాతిపదికలలో నే విశద మవుతుంది. ఇవి ప్రారంభంలో నే వివరింపబడినాయి. మన సర్వతంత్ర ప్రజాస్వామ్య రిపబ్లిక్కు ఆశయాలు:

పౌరు లందరికీ—

1. సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయమును సమకూర్చుట,

2. భావస్వాతంత్ర్యము, భావప్రకటనా మత విశ్వాసాదులలో స్వేచ్ఛ,

3. సమానత్వమును, సమానావకాశములను రూపొందించి, వ్యక్తి ఔన్నత్యమును, సోదరత్వమును, జాతి ఐక్యతను పెంపొందించుట."

ఈ ఉన్నతాశయముల కనుగుణంగా, వానికి దోహదంచేస్తూ, రాజ్యాంగచట్టములోని 4 వ అధ్యాయములో ఆర్టికిల్ 37 నుంచి 51 వరకూ కొన్ని 'నిర్దేశిక సూత్రములు' (*Directive principles of state policy*) చేర్చబడినాయి. ఈ సూత్రములు ప్రాతిపదికలో వివరింపబడిన ఆదర్శముల వివరణ, విపులీకరణ అని చెప్పవచ్చు. శ్రేయోరాజ్య మనునది కేవల మొక స్వాప్నికజగత్తున్నూ, ఊహాగానమును కాక, అది ఒక సజీవమైన ఆశయసాధన, ఒక నిర్దుష్టమైన వ్యవస్థా సంస్థాపన అయినపక్షంలో, దాని వివిధ లక్షణములు, స్వరూప స్వభావములు వివరింపబడాలి. ఈ సూత్రములలో అట్టి వివరణే మనకు ద్యోతక మవుతుంది.

అంతేకాక ప్రభుత్వ కార్యకలాపాలలో శాసనాధికారము ముఖ్యమైనది కాబట్టి, అట్టి శాసనాధికారము ప్రజాక్షేమసాధనకు సద్వినియోగము కావలెనంటే, కొన్ని ప్రధానలక్ష్యములు ఆదర్శప్రాయమైన రాజనీతి అవసరము. ఈ సూత్రములలో అట్టి లక్షణముల వివరణ, రాజనీతి ప్రతిపాదన చేయబడినది. కనుకనే 37 వ ఆర్టికిల్ లో యీ సూత్రము లన్నీ రాజ్యపరిపాలనకు "ప్రాథమికము"లనీ, ప్రభుత్వము చేయు వివిధ శాసనములకివి మార్గదర్శకము లనీ యీ సూత్రానుసరణ ప్రభుత్వపు బాధ్యతనీ ఆదేశింపబడినది.

రాజ్యాంగ న్యాయశాస్త్రరీత్యా, యీ సూత్రముల ప్రాముఖ్యతను దర్శించుటకు ముందు, యిందలి వివిధ తరగతులు, వాని సారాంశమును, క్లుప్తముగా యిచ్చట పొందుపరుస్తున్నాను.

ఈ సూత్రములు రాజ్యపరిపాలనలోని అన్ని సాంశములకూ సంబంధించియున్నవి. స్థూలముగా చెప్పవలెనంటే యివి 3 తరగతులకు చెందియున్నవి.

1. దేశీయ పరిపాలనా విధానము—ప్రధాన లక్ష్య వివరణ, ఆర్థిక సాంఘిక సాంస్కృతిక అభ్యున్నతిని సాధించుట.

2 కొన్ని ముఖ్యమైన సాంఘిక, న్యాయశాస్త్ర, పరిపాలనా విధానములకు చెందిన సంస్కరణలు, వాని వివరణ

పైన పేర్కొనిన రెండూ ప్రభుత్వము సామాన్యముగా ప్రజలపట్ల వహింపవలసిన బాధ్యతలకు, సక్రమ పరిపాలనావిధానమునకు చెందిన వని చెప్పవచ్చు.

3. పైవి కాక విదేశీయవిధానము, సామాన్యముగా అంతర్జాతీయ రంగంలో ప్రభుత్వపు ప్రధానాదర్శములు కూడా వివరింపబడినాయి.

విదేశీయ విధానము

ప్రభుత్వము ప్రపంచశాంతి రక్షణలను పెంపొందించి, వివిధదేశములమధ్య, న్యాయమైన గౌరవదాయకమైన సంబంధములను నెలకొల్పవలెను. అంతర్జాతీయ న్యాయసూత్రములకు, ఒడంబడిక బాధ్యతలకూ గౌరవమును చేకూర్చవలెను. అంతర్జాతీయ వివాదములను సంప్రదింపులవల్లను, మధ్యవర్తిత్వము

వల్లను, పరిష్కారమును ప్రోత్సహించవలెను. (ఆ॥ 51.)

దేశీయ పరిపాలన

జాతి శ్రేయస్సు, సమస్త జనులకు ఆర్థికసాంఘిక రాజకీయన్యాయము లభించు సాంఘిక వ్యవస్థా సంస్థాపనమే ప్రధాన లక్ష్యములు. (ఆ॥ 38.)

మిగిలిన ఆర్టికిల్సులో యీ వ్యవస్థలోని వివిధాంశములు వర్ణింపబడినవి. దేశ. మండలి పౌరు లందరికీ స్త్రీ పురుష భేదము లేకుండా, సమానముగా జీవన భృతికి హక్కును కల్పించుట, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా దేశ మండలి వస్తుసముదాయమును పంపిణీచేయుట, దేశ మండలి ఐశ్వర్యము, ఉత్పత్తి సాధనములు కేంద్రీకరింపబడి, తత్ఫలితముగా ప్రజల కపకారము జరుగకుండా, ఆర్థిక విధానమును రూపొందించుట, శ్రమకు తగిన ప్రతిఫలము ప్రజలకు లభింపచేయుట, శ్రామికుల ఆరోగ్య శక్తులను కాపాడి, బాలుర లేతవయస్సుల దుర్వినియోగము నరికట్టి, ఆర్థికావసరముల ఒత్తిడివలన, వయస్సుకు శక్తికి మించిన వృత్తుల అవలంబనను మాన్పించుట, దోపిడీనుంచి, ఆర్థిక నైతిక పతనమునుంచీ, బాలురను యువకులను రక్షించుట, 39 వ ఆ॥ ప్రభుత్వముపై నుంచిన బాధ్యతలు.

ప్రభుత్వ సహాయములు: ఆ॥ 41. నిరుద్యోగులకు, రోగపీడితులకు, వృద్ధులకు నిస్సహాయులకు ప్రభుత్వము తోడ్పడా లని చెప్తూ, తన ఆర్థికశక్తి, అభివృద్ధి పరిమితులలో, ప్రజ లందరకూ పనికి హక్కు లభింపజేయా లని విధిస్తున్నది. ఆ॥ 43. శ్రామికు లందరి, యొక్క సాంఘిక సాంస్కృతిక పురోభివృద్ధికి ప్రభుత్వము తోడ్పడవలెను. కుటీర పరిశ్రమలను ప్రోత్సహించవలెను. 44 వ ఆ॥ ప్రకారం రాజ్యాంగ మములులోనికి వచ్చిన 10 సంవత్సరములలోగా 14 సంవత్సరములలోపు వయస్సు గల పిల్లలకు నిర్బంధ ఉచితవిద్యను ప్రభుత్వము ప్రసాదించవలెను.

ఆ॥ 49 జాతీయ ప్రాముఖ్యత కల్గినటువంటి చారిత్రాత్మకస్మృత్యములను, స్థాపములను, ప్రదేశములను కళాఖండములను సంరక్షించుట ప్రభుత్వ బాధ్యతగా విధిస్తున్నది.

పైన పేర్కొన్నవికాక, కొన్ని ముఖ్యమయిన సంస్కరణలవిషయంలోను, కొన్ని జాతులవిషయంలోను ప్రభుత్వము శ్రద్ధవహించవలసినదిగా నిర్దేశింపబడినది.

40 వ ఆ॥ గ్రామపంచాయితీల నిర్మాణమును సంస్థాపనను పేర్కొంటున్నది. 44 వ ఆ॥ ప్రకారం దేశమండలి ప్రజ లందరికీ వర్తించు ఒక సివిల్ కోడు నిర్మాణమును ప్రభుత్వబాధ్యతగా చెప్తున్నది. ఇవి కాక ఆ॥ 46, 47 50 లలో 3 ముఖ్య మయిన సంస్కరణలు బాధ్యతలు వివరింపబడినవి.

ఆ॥ 46 ప్రజలలో దుర్బలులైనవారి విద్యా ఆర్థికవిషయములలో ప్రభుత్వము తగు జాగ్రత్తతో తోడ్పడుతూ వెనుకబడిన జాతులను ట్రైబులను సమస్తవిధము లగు దోపిడీ, సాంఘిక అన్యాయములనుంచి రక్షించుటలో ప్రత్యేకశ్రద్ధ వహించవలెను.

ఆ॥ 47 ప్రజారోగ్యవిషయములో ప్రభుత్వము ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ, వైద్యోపయోగములకు తప్ప మత్తుపదార్థములు, హానికరము లగు ఔషధముల వాడుకను నిషేధించాలి.

ఆ॥ 50 ప్రభుత్వమందలి నిర్వాహక న్యాయ నిర్ణయశాఖలు, విభజింపబడవలెను. (*Separation of Executive from Judiciary*)

అయితే యీ నిర్దేశకసూత్రములతత్వం ఏమిటి? న్యాయశాస్త్రరీత్యా వీని ప్రాముఖ్యత ఏమి? 3 వ అధ్యాయమునందలి 'ప్రాథమిక హక్కు'లకూ వీనికి గల భేదం ఏమిటి? అన్న ప్రశ్నలు తర్వాత పరిశీలింపబడాలి.

ఈ సూత్రములను రాజ్యాంగమందు చేర్చుటలో ఐరిష్ ఫ్రీస్టేటు (1932) రాజ్యాంగ మనుసరింపబడినట్లు తోస్తుంది. ఐర్లండులో కూడా యిట్టిసూత్రము వివరణ చేయబడినది. ఇవి ఒక "నైతిక నిబంధనావళి" లేక మన విధిఆశయముల ప్రకటన అని చెప్పవచ్చు. డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్ణయసభలో మాట్లాడుతూ వీనిని బ్రిటిష్ ప్రభుత్వం గవర్నర్ జనరల్ నాదేశిస్తూ జారీచేసిన పరిపాలనా సూత్రముల (*Instrument of Instuctions*) లాంటివని పేర్కొన్నారు.

ఇక ప్రజల కివి ఏమైన హక్కుల నిస్తున్నవా అన్నా ప్రశ్నకు ఆ॥ 37 లో సమాధానం చెప్పబడినది. "ఈ సూత్రములు ఏ న్యాయస్థానంలోనూ అమలు జరుపబడజాలవు—" (ఆ॥ 37) (*Non-justicia*

ble rights). 3 వ అధ్యాయములో ఆ॥ 12 నుంచి 35 వరకూ వర్ణించబడిన ప్రాథమిక హక్కులకూ, యీ సూత్రములకు ముఖ్యమయిన వ్యత్యాస మిదే. ఆ॥ 13 ప్రకారం దేశంలో అమలులో నున్న ఏ చట్టం గాని, ప్రకటనలు గాని, రూల్సుగాని, ఆచారములు గాని, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకముగా నున్న పక్షములో, అట్టి వైరుధ్య మున్నంత వరకూ అవి రద్దు చేయబడినవి. అంతేకాకుండా, యూనియన్ ప్రభుత్వం గాని, రాష్ట్రీయ ప్రభుత్వములు గాని, మరి ఏ యితర స్థానిక అధికారులు గాని, సంస్థలు గాని, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకముగా, లేక ఆ హక్కులను సంక్షిప్తము చేస్తూ గాని శాసనములను చేసే అధికారం నిషేధింపబడినది. అనగా 3 వ అధ్యాయము నందలి ప్రాథమిక హక్కులు నిర్దుష్టములు, స్పష్టములు, న్యాయస్థానములద్వారా అమలుజరుప వీలైన హక్కులు (*Justiciable rights*). ఏ పౌరుడైనా తన 'ప్రాథమిక హక్కులకు ఏ విధమైన భంగం కలిగిందని అనుమానం వున్నా, ఆ హక్కులతో జోక్యం కలిగించుకొనే ఏ శాసనం, అధికారి, లేక సంస్థనుగాని న్యాయస్థానములో సవాలు చేయవచ్చును. కాని, నిర్దేశక సూత్రముల విషయంలో, అట్టి హక్కు ప్రజలకు లేదు. ఏ శాసనమందైనా, వాస్తవముగా యీ సూత్రోల్లంఘన జరిగినప్పటికీ న్యాయస్థానమందు రక్షణకోరే అవకాశం లేదు. కాని ఏ బాధ్యతాయుత ప్రజాస్వామ్య ప్రభుత్వమూ అట్టి ఉల్లంఘనకు, తీవ్రమైన కారణం ప్రేరేపణ లేనిదే పూనుకోదని మనం ఆశించవచ్చు.

ఇంకొక ముఖ్యమయిన విషయం ఏమంటే ప్రాథమిక హక్కులకూ, నిర్దేశక సూత్రాలకు వైరుధ్య మున్నపక్షంలో పరిస్థితినిగురించి:

మద్రాసు కమ్యూనల్ జి. ఒ. కేసు†:— శ్రీమతి చంపకం బ్రాహ్మణ కుటుంబమునకు చెందినది. ఆ కారణంచేత తనకు మెడికల్ కాలేజీలో ప్రవేశము దొరకదని తెలియగానే ప్రభుత్వాన్ని సవాలు చేస్తూ మద్రాసు హైకోర్టులో దావా వేసింది. (హైకోర్టులోను, అప్పీల్లో సుప్రీం కోర్టులోను కూడ ప్రభుత్వవాదన తిరస్కరించబడినది.)

శ్రీమతి చంపకం వాదనలోని ముఖ్యాంశములు:

1 ఆ॥ 15 (1) ప్రకారం, కుల మత లింగభేదములను, జన్మస్థలమును, ఆధారం చేసికొని ప్రభుత్వం ఏ పౌరునిపట్లా పాక్షికముగా వ్యవహరింపకూడదు.

2. ఆ॥ 29 (2) ప్రకారం, ప్రభుత్వముచే నడుపబడుచున్న, లేక ప్రభుత్వ సహాయము పొందుచున్న ఏ విద్యాసంస్థలోనికీ కుల మత జాతి భాషాదుల కారణంగా ఏ పౌరునికీ ప్రవేశము నిరాకరింపబడరాదు.

3. వ అధ్యాయములోని, యీ రెండు ప్రాథమిక హక్కులకు భంగము వాటిల్లినదని ఆమె తరఫున వాదింపబడినది.

మద్రాసు ప్రభుత్వంవారి వాదన:

1. నిర్దేశక సూత్రములలోని ఆ॥ 46 ప్రకారం వెనుకబడిన జాతుల పురోభివృద్ధిపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపవలసిన బాధ్యత ప్రభుత్వంపై నున్నది.

2. ప్రాథమిక హక్కుల అధ్యాయములోని, ఆ॥ 15, 29, నిర్దేశక సూత్రములలోని ఆ॥ 46 కు లోబడియున్నట్లు, గ్రహించి వ్యాఖ్యానించవలెను.

3. కనుక వెనుకబడిన జాతుల రక్షణకు, పురోభివృద్ధికి పాటుపడుటలో యితర జాతులకు నష్టము కొంత కలిగినను, ప్రభుత్వచర్య న్యాయబద్ధమైనదేనని వాదన.

పై ప్రభుత్వ వాదనను తిరస్కరిస్తూ సుప్రీం కోర్టువారిచ్చిన తీర్పులోని ముఖ్యాంశములు:—

1. ప్రాథమిక హక్కుల నేవిధంగానూ సంక్షిప్తము చేసే అధికారము, శాసనసభలకు గాని ప్రభుత్వమందలి నిర్వాహకశాఖకు గాని లేదు.

2. అట్టి అధికారమేమైన వున్న పక్షములో ప్రాథమిక హక్కులను వివరించిన 3 వ అధ్యాయమందలి మినహాయింపుల క్రిందనే అది వాడబడవలెను. ఆ మినహాయింపుల కతీతముగా ఎవరునూ తమ అధికారము వినియోగింపజాలరు.

3. ప్రాథమిక హక్కులు నిర్దేశక సూత్రములకు లోబడి యుండజాలవు. అంతేకాక నిర్దేశక సూత్రములే

---

† *State of Madras V. Champakam Dorai Rajan. 1951 S.C.J. 316.*

ప్రాథమిక హక్కులకు లోబడి, వాని కనుగుణంగా నుండవలెను.

4. ప్రాథమిక హక్కులకు భంగము వాటిల్లనంతవరకు, ప్రభుత్వము నిర్దేశిక సూత్రముల ననుసరిస్తూ, రాజ్యాంగమందలి వివిధ సూత్రాలకు కట్టుబడి మాత్రము పరిపాలన కొనసాగించవచ్చును.

వెనుకబడిన జాతుల విషయం :

5 అ॥ 16 (1) క్లాజు ప్రకారం ప్రభుత్వోద్యోగముల విషయంలో అందరికీ సమానావకాశము ముండవలెనని యున్నది. కాని అదే ఆర్టికల్ 4 వ క్లాజులో కొన్ని వెనుకబడినజాతులకు అట్టి ఉద్యోగములలో చాలినంత ప్రాతినిధ్యము లేదని ప్రభుత్వమునకు తోచినపుడు వారి విషయములో ప్రత్యేక ఏర్పాట్లను చేసే అధికారం ప్రభుత్వమునకీయబడినది. మద్రాసు ప్రభుత్వమువారివాదనే సరియైనదని నిర్ణయించే పక్షములో 16 వ ఆర్టికల్ లోని 4 వ క్లాజు అనవసరమున్నూ పునరుక్తిన్నీ అవవలసివస్తుంది. అంతేకాక 16 వ ఆర్టికల్ 4 వ క్లాజుద్వారా ఒక ప్రత్యేక మినహాయింపు చేయబడుట (వెనుకబడిన జాతుల విషయంలో) అ॥ 29 లో (విద్యాసంస్థల ప్రవేశవిషయంలో) అట్టి మినహాయింపు లేకుండుట గమనించదగిన విషయము.

కనుక సుప్రీంకోర్టువారి తీర్పువలన తేలినవిషయమేమనగా ప్రాథమిక హక్కులను సంక్షిప్తము చేసే అధికారము నిర్దేశికసూత్రములకు లేదు. అట్టి అధికారము ప్రాథమిక హక్కులను నిర్వచించి వివరించిన 3 వ అధ్యాయమునందలి మినహాయింపుల పరిమితులలోనేగాని వాని కతీతముగా వినియోగింపబడకూడదు. ఉదాహరణకు; అ 19 క్లాజు *F* ప్రకారం ప్రతి పౌరునికీ ఆస్తి సంపాదన, అనుభవం క్రయాదుల విషయంలో ప్రాథమికహక్కు యివ్వబడినది. కాని 5 వ క్లాజులో, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, లేక వెనుకబడిన తెగల (*Tribes*) క్షేమదృష్ట్యా, ఆస్తి హక్కుపైన 'సబబైన' (*Reasonable restrictions*) నిరోధములను, నియమాలను విధించే అధికారం ప్రభుత్వానికివ్వబడింది. అయితే 'సబబు' అంటే ఏమిటి? ఒక నియమం సబబా బేసబబా అని నిర్ణయించడమెలాగ? దీనికేమైన ఆధారములు గాని, సూచనలు గాని రాజ్యాంగమందున్నవా? అన్న ప్రశ్నలు రావచ్చు. అట్టి సమయాలలో కోర్టువారికి నిర్దేశిక సూత్రములు కొంత మార్గదర్శకములుగా నుండునని చెప్పవచ్చు. ఐరిష్ రాజ్యాంగమందు కూడా ప్రభుత్వ శాసనముల వైఖరి (*Tendency*) ని గమనించుటలో యీసూత్రము లుపయోగపడునని కోహన్ (*Kohan*) అనేరచయిత పేర్కొన్నారు. మన సుప్రీంకోర్టువారు కూడా యీ క్రింద నుదహరింపబడిన కేసులో అట్టి సూచన చేశారు.

బొంబాయి ప్రొహిబిషన్ కేసు *

బొంబాయి మద్యపాన నిషేధచట్టం మత్తుపదార్థములను ఒక వ్యక్తి తనవద్ద నుంచుకొనుట, ఉపయోగించుట, అమ్ముటను, నిషేధించింది. మత్తుపదార్థములు కూడ ఒక విధమైన ఆస్తే. అయితే, యీ చట్టము విధించిన నిషేధము, అ॥ 19 ప్రకారం ప్రతి పౌరునికీ ఆస్తి విషయంలోవున్న ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నదా అన్న ప్రశ్నను పరిశీలిస్తూ, సుప్రీం కోర్టువారు రెండు అంశములను సూచించారు.
1. అ॥ 19. 6. లోని ఆస్తిహక్కు 19. (5) లోని మినహాయింపులకు లోబడియున్నది—అనగా వెనుకబడిన తెగలయొక్కయు, ప్రజలయొక్కయు శ్రేయస్సు దృష్ట్యాను, ప్రభుత్వం ఆస్తి హక్కులపై సబబైన నియమాలను, పరిమితులను విధించవచ్చు.
2. ఒక నియమం సబబా కాదా అన్న ప్రశ్న నిర్దేశిక సూత్రాలలో, మద్యపాన నిషేధాన్ని పేర్కొంటున్న అ॥ 46 ప్రకారం తేలవలసి యున్నది. మద్యపానమును నిషేధించుబాధ్యత ప్రభుత్వముపై నున్నది కాబట్టి, ఆస్తి హక్కులకు భంగము వాటిల్లుతున్నను, మద్యపాన నిషేధ చట్టము సబబైన నిరోధము క్రిందనే వస్తుందని సుప్రీం కోర్టువారు సూచించారు.

ఈ తీర్పులవలన న్యాయశాస్త్రరీత్యా, కోర్టు ప్రజలకిచ్చే రక్షణదృష్ట్యా నిర్దేశిక సూత్రముల కేమీ ప్రాముఖ్యత లేదనే చెప్పాలి. రాజ్యాంగ చట్టములో వీనిని చేర్చడంవల్ల సాధించిన ప్రయోజనము కేవలము

---

* *State of Bombay V. Balsara. 1951 S. C. J. 495.*

నైతికమే. ఎందు కపలిని చేర్చబడాలి అనే చర్చ అప్రస్తుతము. చేర్చబడిన తర్వాత యీ సూత్రములు వహించే పాత్ర ఏమి టన్నది ప్రస్తుతము. దేశీయ పరిపాలనకూ, శాసనములకూ, వివిధ రంగాలలో ప్రభుత్వము చేసే కృషికీ, నిర్దేశక సూత్రములకు ఒక సజీవమైన సంబంధ ముండాలని, రాజ్యాంగ నిర్మాతల ముఖ్యోద్దేశము. అట్టి సంబంధ మేర్పరుచుటకే యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ ప్రయత్నములు ప్రణాళికలు. అవన్నీ యిచ్చట ఏకరువుపెట్టటము, అసాధ్యము, అనవసరము కూడా.

కాని, యివి నైతిక సూత్రాలు మాత్రమే కదా అని వీనిని అగౌరవం చేయడం తగదు. పైగా భారత ప్రభుత్వం యీమధ్యనే లా కమిషన్ను నియమించింది. లా కమిషన్ ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటి—దేశమందలి వివిధ శాసనములను, రాజ్యాంగమందలి ప్రాథమికహక్కుల, నిర్దేశకసూత్రముల దృష్ట్యా పరిశీలించి, శాసనములను రాజ్యాంగమున కనుగుణముగా రూపొందించుటకు తగిన మార్గములను సూచించుట. రాజ్యాంగ సూత్రములే కాదు, ప్రభుత్వము కూడా, సామ్యవాదమార్గము ననుసరించు వ్యవస్థా (*Socialistic pattern of society*) సంస్థాపనమే తమ ప్రధానలక్ష్య మని ప్రకటించారు కనుక, మన భావి సాంఘిక ఆర్థికవ్యవస్థ కనుగుణంగా న్యాయ వ్యవస్థా నిర్మాణమునకు కూడ మార్గములను సూచించే బాధ్యత కూడా లా కమిషనుపై నున్నది.

'నొసటన్ వ్రాసిన వ్రాత'

శ్రీ బుచ్చిబాబు

గడియారంకేసి అదప్పుడే పదోమారు చూడటం. ఆరైంది. రైలు రావటం ఎనిమిదింటికి. రాజమ్మ రాత్రి బండిలో రావటం మెరుగైంది. తిన్నగా యింటికే తీసుకురావడానికి నిశ్చయించుకున్నాడు. మళ్లా గడియారంకేసి చూశాడు మాధవరావు. భార్యతో చెప్పడానికి ధైర్యం చాలటంలేదు. మేనరికం; చిన్నప్పటినుండీ బాగా ఎరుగున్న మనిషే. అందుకే వొకవిధంగా ఆమెను నిజంగా ఎరగనట్లనిపించింది.

నిజంగా సీతారత్నంగురించి అతని కేం తెలుసు? ఆమె నుదుటిమీద అరంగుళంపొడుగు గీత వుంది. చిన్నప్పుడు తగిలిన దెబ్బ. మేనరికం గనక ఆమె చక్కదనం ప్రశంస ఎవరికీ రాలేదు. అతనికీ రాలేదు. రాజమ్మతో స్నేహం ఏర్పడింతర్వాత 'ఆమె చక్కనిదేనా?' అన్న ప్రశ్న వొచ్చింది. ప్రశ్న వేసుకోవటం పూర్తి కాకుండానే సమాధానం వొచ్చింది.

ఆరు దాటి అప్పుడే మూడు నిముషాలైంది. రాజమ్మ? వూహ సాగినకొద్దీ ఆమె మూర్తి అస్పష్టమవుతోంది. వింతగా పెరిగిపోయి మిన్నంతా వ్యాపించి, మెరిసి మరుగుపరిచి, శూన్యంలో చలనం కలగజేసే జడ—నుదుటిమీదపడ్డ గోధుమ నీడలు—మెత్తటి, పల్చటి, సున్నితంగా మెరిసే, సాఫీ నునురు, చుట్టూ నల్లటి మేఘాలు—మధ్య సీతాకాలపు సూర్య కిరణం వెలిగించిన ఆకాశంలా మరుపురానిది. యవ్వనం ఎప్పుడు గతించిందో మాధవరావుకి తెలీదు. అతని జుట్టులో అక్కడక్కడ తెల్లవెంట్రుకలు, నడివయస్సు చిహ్నాలు, రాజమ్మ జడతో అతని యవ్వనానికి ముడిపెట్టుకుంటున్నాడు. ఆమె జడని తన జుట్టుపైరాస్తే, తెల్లవెంట్రుకలు నల్లగా అవుతాయి. అంత నల్లని, పెద్దజడ. లావు కాదు, సన్నమూ కాదు; వరదనీటి రంగు. రెండో ప్రపంచ సంగ్రామం చివరి రోజులవి. యుద్ధం పేరిట ఉద్యోగం తెచ్చుకోలేకపోయాడు తను. యుద్ధం పేరిట, చదువు సంస్కారం లేనివాళ్లు వేలకి వేలు గడించుకున్నారు. మధ్యతరగతి చితికింది. ఉన్న కొద్దిపాటి ఆస్తీ అక్కల పెండ్లిండ్లకైపోయింది. అప్పు చేస్తేగాని చదువు పూర్తి కాలేదు. తన కిక వుద్యోగం రాదు. నాలుగేళ్లుగా ట్యూషన్లు చెప్పుకుంటూ పట్నంలో కాపరం గడవక యీవూరు చేరాడు. రాజమ్మ యిక్కడి కొస్తుంది. ఆమె నుదిటికి అంత ప్రభావం వుందా!

గడియారంలో ఆరు యిరవై. కదలకుండా పత్రిక దానిమీద కప్పాడు. తను బీదవాడు; రాజమ్మ భాగ్యవంతురాలు. ఆమె చెవులకి రవ్వల దుద్దులున్నాయి. అసలు వాటివల్లే యింతపని జరిగింది. సినిమాలో ఇంటర్వెల్—పక్కన రాజమ్మ, ధగధగ మెరిసిపోయే దుద్దులు—మెత్తటి, పల్చటి నునుపైన నుదురు. ఆ నుదుటిని తాకితే అతని తలనొప్పి తగ్గుతుందనిపించింది.

మళ్ళా మరోకసారి ఆమెని బాంక్‌లో చూశాడు. తల్లి అప్పుచేసి పంపిన ఐదువందలు జనవరిలో బాంక్‌లో వేశాడు. ఫిబ్రవరి మధ్యలో నే నూటయాభైకి వొచ్చింది. వొక ముప్ఫై తీద్దామని వెళ్లాడు. కవుంటర్ దగ్గర రాజమ్మ. తన బాంక్ పుస్తకం చూసి నవ్వింది. చెక్కు చూపించాడు. నోట్లు యిచ్చింది. తీసుకొని బల్లమీద కూర్చుని లెక్క పెట్టాడు. ఐదు రూపాయల నోట్లు ఏడున్నాయి. ఇంత అశ్రద్ధగా వుంటే ఆమెకు ఆ వుద్యోగం వుంటుందా?

"ఇదుగో నోటు. అదనంగా యిచ్చారు"

"పొరబాటు."

"మధ్యాహ్నం ఎంతవరకూ పని చేస్తారు?"

"నాలుగు."

"మూడు నలభై టైమ్."

"అబ్బా."

మెల్లగా అన్నాడు.

"లైట్ చెయ్యనా?"

"ఎందుకు?" నవ్వింది. జడ వెనక్కి తోసింది. తల వొంచినప్పుడు అందంగా ప్రశాంతంగా కనిపించింది నుదురు. అమాయకత్వానికర్థం అడిగితే, ఆ నుదురు చూపుతాను, అనుకుని బెంచిమీద కూర్చున్నాడు.

నాలుగవగానే యిద్దరూ కలిసి పయనం సాగించారు.

"ఆకలేస్తోంది—హోటల్ కెళదామా?" అంది. వెళ్ళారు. ఏం కావాలో అడిగాడు. చెప్పింది.

"మీరో?"

"నాకేమీ వొద్దు."

"ఫరవాలేదు తీసుకోండి."

"నాకాకలిగా లేదు."

"ఫరవాలేదంటినిగా, బిల్లు నేనిస్తాను."

అతని మనస్సు చివుక్కుమంది. అమాయకంగా అన్న మాటేమో. అతని జీవిత చరిత్ర ఆ బాంక్ బుక్ లో వుంది. ఆ చరిత్ర ఆమెకు తెలుసు. డబ్బు తీసుకున్న అంకెల వివరణ, వొక విషాదఘట్టం. తానెందుకు బాధపడాలి?

రాజమ్మ తింటూంటే అతను చూస్తూ కూర్చున్నాడు. యవ్వనానికి అంత ఆకలా—! కాఫీ తర్వాత తెచ్చారు. ఆమె బాగ్ తీసింది. రెండునోట్ల కట్టలు చూశాడు. నెలమొదట్లో జీతం డబ్బు కాబోలు. బిల్లు యిచ్చింది. బైటకొచ్చి నడుస్తున్నారు. ఎవరికీ మాటలు దొరకటం లేదు. చుట్టూ జనం, కార్లు, బండ్లు.

"ఇంటికెళతా."

"బాగ్ లో బోలెడు డబ్బుంది. నే దిగబెట్టనా?"

"నాకేం భయం. మావది, డబ్బు. లారీ కంట్రాక్ట్లు. తెగొస్తుంది. పోయినా దిగుల్లేదులెండీ." అంటూ నవ్వి, బాగ్ వూపుకుంటూ రాజమ్మ వెళ్ళింది. లారీ కంట్రాక్ట్లంటే ఏమిటో!

బల్లమీది గడియారంకేసి చూశాడు మాధవరావు. అద్దం పెట్టిన పత్రిక గాలికి తొలిగింది. పావు తక్కువ ఏడైంది. కనబడకుండా గడియారం వెనక్కి తిప్పాడు.

భార్యను లేపి చెప్పాలి. ఎలా ప్రారంభించాలి? రాజమ్మనిగురించి ఏ వివరాలు చెప్పాలి? మరో వారానికి మరో యిరవై తియ్యడానికి వెళ్ళినప్పుడు ఆమెని చూశాడు. నాలుగవగానే, యిద్దరూ బీచివైపు వెళ్ళారు. ఇసకలో కూర్చున్నారు. రెండు కుప్పిట్లలో యిసక దారంలా వొదులుతోంది. గాలికి వెంట్రుకలు మెడ, నుదురు కప్పుతున్నాయి. వెనక్కి తోస్తే, పాపిడ దగ్గర నుదుటిని గట్టిగా, వొత్తుగా, బిగించి వుంగరాలుగా చిక్కుపడి, కెరటం తుంపరలలాగ కదులుతున్నాయి. కళ్ళు తుడుచుకుంది. కళ్ళు కాటుక మగ్గి, పెద్దవై, అనిశ్చలంగా మెరుస్తున్నాయి. నేత్రాల వెనక నల్లటి, దట్టమైన ఆకాశం, ఉప్పుగాలికి ఫేస్ పౌడరంతా కరిగి చర్మం నల్లబడింది. శరీరచ్ఛాయ అసలు నలుపే—సునిశితంగా మెరిసే నలుపు.

"మరింకా యెందుకు నువ్వు పెండ్లిచేసుకోలేదు?" అని అడిగాడు. కంఠస్వరం గద్గదమై అసహజంగా ధ్వనించింది, ప్రతిధ్వనిలా.

"ఊరికే నే."

ఇసక పోస్తోంది. గాలికి అతనిమీద పడుతోంది.

"అమ్మో—కంట్లో పడిందా?"

తుడుచుకుంటున్నాడు.

"పోలేదా?"

"ఎవర్నైనా... ప్రేమించావా?"

ఇసక వొదిలేసి, కుప్పిట పమిట్లో దాచి, కొంగుతో జెడ కప్పి, దిగులుగా కెరటాలకేసి చూసింది. కొంగు జారి అతనిమీద పడింది. తీసి, దులిపి, లాగి నుదిటిమీద వేలు పడేటట్లు కప్పాడు.

"అమ్మో" అన్నది.

"ఏం చెప్పకూడనా?"

"ఏముంది చెప్పటానికి."

"ఏమీ లేదా."

"మీకేదన్నా చెప్పండి."

తన విషయాలు,—చదువు, పెండ్లి, ట్యూషన్లు—చెప్పాడు.

"ఇక్కడ కష్టంగా వుంది. మా వూరు వెళ్ళిపోతున్నాను." అని ముగించాడు.

"డబ్బు ఇచ్చేదా?"

"నీదగ్గ రెక్కడిది."

"మావది. జోలెకుంది. అనగడు"

"నామీదెందుకు అంత...యిది?"

"తప్పా?"

"ఏమో"

"కోపమా ?"

"ఏమో"

నవ్వింది; తనూ నవ్వాడు.

గడియారంకేసి చూశాడు. తనవైపు తిప్పివుంది. సీత తిప్పిందేమో. ఐదునిమిషాల తక్కువ ఏడైంది. మరో ఐదునిమిషాల్లో భార్యతో విషయంచెప్పి స్టేషన్ కెళ్ళాలి.

ఇంకా అతనికి రాజమ్మనిగురించి ఏం తెలుసు? స్కూల్ ఫైనల్ పరీక్షదాకా పట్నంలో మేనమామయ్య దగ్గరుండి చదివిందట. తర్వాత బద్ధకించి మానివేసింది. బాంక్ మేనేజరు మోజుపడి, మామయ్యని వొప్పించి, ఆమెను పనిలో జేర్పించాడు. తండ్రిలేడు. తల్లి పల్లెటూళ్ళోవుంది. వివరాలు తెలియవు.

మరోసారి సాయంత్రం ఆరింటికి పార్కులో కలుసుకున్నారు.

"ఆదివారం వెళ్ళిపోతున్నాను." అన్నాడు.

"మళ్ళా రారా?"

"ఇం కెందుకొస్తాను?"

"నన్ను మానేరా?"

"ఓ—అదా......"

"చెప్పలేం. ఆమె ఒప్పుకుంటారా?"

"ఏంచెప్పను?"

"పోనీ— నేను రానా—?"

"ఓ"

"అట్టే పెట్టుకుంటారా?"

"ఓ"

"ఎప్పుడూ?"

"......"

"ఆమె వూరుకుంటారా?"

"హిందూ స్త్రీ ఏం చెయ్యగలదు?"

"ఊరికే అన్నా" అన్నది రాజమ్మ నవ్వుతూ. దీపం నీడపడి ఆమె మొహం కనపడటంలేదు. ఊడవడానికి వొకమ్మాయి వొచ్చింది.

"చీర బాగుందికాదు.?"

"చాలా బాగుంది"

"నాదికాదు. ఆ వూడ్చే పిల్లది."

"అదా" అని చూశాడు. "సినిమాలు చూసిం తర్వాత, పనివాళ్ళకి కూడా ఫేషన్లు ఎక్కువైనాయి."

"వాళ్ళుమట్టుకు మనుషులు కారా ఏం?"

"అవుననుకో—రాబడికి మించిన పోకళ్ళు."

"బస్తీగా."

"పల్లెల్లోనూ యిల్లాగే వున్నారు."

"మీ కిష్టంలేదా?"

"ఎవళ్ళుండవల్సినచోట వాళ్ళుండాలి."

"మీకు చాలా కోపాలున్నాయే, మరి మా కులం తక్కువగా, ఎట్లాసరిపడ్తుంది?"

"ఇది వేరు."

రాజమ్మ నవ్వింది. లేచి చీర సర్దుకుంది.

బైటకి నడవడం సాగించారు. సందు మొదలు కొచ్చారు.

"మరి నే వెడ్తాను."

"నేనూను."

"మళ్ళావొస్తారుగా"

"నువ్వొస్తానన్నావుగా."

"అమ్మో!"

"ఏం, భయమనుకున్నావా?"

"చూస్తాగా."

గడియారంకేసి చూశాడు. ఐదునిమిషాలతక్కువ ఏడే చూపుతోంది. ఇదేమిటి, యిందాకే అయిందిగా. గడియారాన్ని ఊపాడు. అది నిలిచిపోయింది. సీతని కేకేశాడు.

"టైమెంతయింది?"

"అదుగో గడియారం." అని, రెండుకవర్లు చేతి కిచ్చింది. "ఇందాక వొచ్చాయి."

వాటిని దూరంగా పారేశాడు.

"నీతో వో విషయం చెప్పాలి సీతా."

ఆమె వంటింటి గుమ్మంలో నిలబడివుంది.

"రాత్రికి నా స్నేహితురాలు వొకామె వొస్తోంది."

"వొంటేనా..."

వొంటసరే — అదిసరే —ఆమె, యిక్కడ, యిక్కడే వుండి, వుండిపోతుంది."

"ఏం?"

"అంటే—నీతో బాటే."

"అంటే?"

"నన్ను ప్రేమించింది. యిక్కడే వుంటుంది."

"ఉండనివ్వండి".

"నీకేం అభ్యంతరం లేదుగా."

సీతా రత్నం, పెదవులమీద నవ్వు వింతగా కరిగింది. అస్తిపంజరం కదిలినట్లుగా—వొణికి గదిలో కెళ్ళిపోయింది.

మాధవరావు, నిట్టూర్చాడు. కవ్వించిన కెరటం వెనక్కి దిగజారింతర్వాత మిగిలిన యిసుకలో లేఖలాగైంది అతనిమనస్సు. మాట, భావం, ధ్వని, వ్యక్తిత్వం వెదజల్లినశక్తి—ఏదైనాసరే, నీడలా, ప్రతిబింబంలా మనస్సులో మెదుల్తాయి. ఆ అనగానే, లేఖ యిసుకలో లాగా, దిగబడతాయి. అతని శరీరం లేచింది. కాళ్లు లోపలికెళ్ళాయి. ఎడంకాలిజోడుని కుడికాలు స్పృశిస్తోంది. చేతులు దేనికోసమో తడుముతున్నాయి. అవయవాలని దగ్గరకు లాక్కుని శరీరం బైటచీకట్లో కెళ్ళింది.

2

మరుసటిదినం.

రాజమ్మ ఎనిమిదింటికి లేచి కాఫీ త్రాగి, స్నానాని కెళ్లింది. మాధవరావు ట్యూషన్లు చెప్పే ముందువా గదిలో ఆమె మకాం. పనిమనిషి చిట్టెమ్మ గదివూడ్చింది. అందులో కాంప్ కాట్ — దానిమీద ఆమె హోల్డాల్ ప్రక్కన చిన్నబల్లమీద ఫ్లవర్ వాజ్, అమర్చారు. సీతారత్నం బ్రెడ్ రెండు ప్లేట్లల్లో తెచ్చి బల్లమీద పెట్టింది.

"మాట కొంచం యాసకదూ!" అంది. భర్త నుద్దేశించి; అతనేమీ మాట్లాడలేదు.

"కాపులా?"

"జాతి మత కుల వ్యత్యాసా లన్నీ వెనకటి రోజుల్లో"

"నేనేమన్నాను? తెలుసుకుందామని అడిగాను."

"అదంత ముఖ్యమైన ప్రశ్న కాదు."

చిట్టెమ్మ, సీతా కలిసి, పెద్దట్రంకు మోసి గదిలోకి తెచ్చారు. నేలమీద మోపకుండా నే చిట్టెమ్మ ట్రంకు పట్టు వొదిలేసింది. శబ్దంతో పడింది.

"జాగ్రత్త" అన్నాడు.

"వొదిలేసి కాలు చితక్కొట్టుకోడం దానికి మనసా."

"తగల్లేదు లెండి." అని పనిమనిషి ట్రంకు తాకిడికి వూడినగోడ పెల్లుని వూడ్చివెళ్లింది.

"ఆవిడేవూరుట?" అని అడిగింది సీత.

"ఏమో."

"తండ్రికేంపనో?"

"ఏమో."

"ఉన్నవాళ్లకి మల్లే నే వుంది."

"ఊ."

"మరింకా ఎందుకు పెళ్లి కాలేదూ."

"నన్నేమీ అడక్కు. నాకు నిజంగా ఏం తెలీదు. ఉస్. వొస్తోంది."

మాధవరావు, భార్య, లోపలికెళ్లారు. వంటింటి గుమ్మంలో ముందు పీటమీద కూర్చున్నారు.

"ఆ గదిలో పెట్టాగా. మీకిక్కడా".

అతను లేచాడు. మీరు పదండి నే కాఫీ పట్టుకొస్తా."

ఇంతలోకే రెండు ప్లేట్లూ తీసుకుని రాజమ్మ చక్కా వొచ్చింది తనో పీటవాల్చుకు కూర్చుంది.

"మీరు బ్రెడ్ తినరా?"

"తినకూడని దేం లేదు."

"తింటుంది" అన్నాడు మాధవరావు.

"పట్నంలో రోజూ పొద్దుటే ఆమ్లెట్ తింటాను. మీ కిష్టం లేదా?"

సీత తల పంకించింది.

"ఇష్టం వున్నట్లా, లేనట్లా?"

"తింటేగదా చెప్పడం." అన్నాడు మాధవరావు.

"మీరో?"

"నాకేం అభ్యంతరం లేదు. రేపట్నించి చెప్పిస్తాను."

"చెప్పించడం దేనికి— నేను చేసి పెడతాగా."

"ఇంట్లో బాగుండదు." అంది సీతారత్నం.

"ఇది పట్నం కాదు." అన్నాడు మాధవరావు, ఆమె కేసి చూస్తూ, లావెండర్ కలర్ జాకెట్టు, తెల్ల సిల్కు పూల చీరా, పోగులుగా జారిన జెడా, కాటుక మధ్య కన్ను, పుష్పం వికసించినట్లుగా, లేతగా వుంది, పీటమీద రాజమ్మ.

"ఏం వండుతున్నారు?"

"బీరకాయ. నీ కిష్టమేనా?"

"మాస్టట్టు కెడతారా—ఇంటికే పోస్తయ్యా?"

"అదీ వుంటుంది, యిదీ వుంటుంది." అన్నాడు మాధవరావు.

"బీరకాయ దొడ్లోదే." అంది సీత.

"నే కూడా వొండేదా?"

"నువ్వొండకులే."

"టూ మెనీ కుక్స్ స్పాయిల్ ది...... పూర్తి చెయ్యి వాక్యం" అన్నాడు మాధవరావు.

ఇద్దరూ నవ్వారు. ఇదేదో అర్థమైనట్లు, కళాయిలోంచి 'చుయ్'మని, విప్పు నవ్వినట్లుగా ధ్వని బైలుదేరింది. సీతారత్నం కొంగుతో ముక్కు తుడుచుకుంటోంది. రాపిడికి ఎర్రబడింది. మాధవరావు, హాచ్ మని పెద్దగా తుమ్మాడు. తుమ్ముకి రాజమ్మ నుదుటి మీదికి జారిన వుంగరాలు, కుంపానుకి అదిరిన చిటారు కొమ్మల్లా, వొణికాయి. రాజమ్మ జుట్టు వెనక్కి తోసింది; కొమ్మని మిగిలిన వొంటి ఆకులా, వొక వుంగరం కనుబొమ్మని కవ్విస్తోంది. లేచి గదిలోకి వెళ్ళింది. చదువుకోడానికి పత్రిక యిచ్చాడు మాధవరావు.

"ఆమె అండీ అంటూంటే, నువ్వు 'నువ్వు' అంటా వేం?"

"నాకంటె చిన్నదేగా."

ఇంతట్లోకే ట్యూషన్ల పిల్లలొచ్చారు. హాల్లో చాపలు పరిచి కూర్చున్నారు.

3

రెండో నాడు.

మధ్యాహ్నం భోజనాలైన తర్వాత, రాజమ్మ తన గదిలో నిద్రపోతోంది. పత్రికకోసం మాధవరావు గదిలో కెళ్ళాడు. మొహాన్ని కష్టంగా చెయ్యి ఆనించి నిద్రపోతోంది. పెదవుల మధ్య వొకటి రెండు పళ్ళు మెరుస్తున్నాయి. జాకెట్టు అక్కడక్కడ చెమటకి తడిసింది. ఎడమకన్ను కొద్దిగా తెరిచివుంది తామరకొలనులో చంద్రబింబంలాగు. కొలనులో నక్షత్రాలకి మల్లె ముత్యాలచెమట నుదిటిని ఆక్రమించింది. కుంకుమ— మధ్య నల్లబొట్టుకి ప్రమాదం జరక్కుండా, వేళ్ళతో చెమట తుడిచేశాడు.

"మెలుకువనే వున్నాను."

"తెలుసు"

"భలేవారు. నిజంగా నిద్రపట్టేసింది."

"మెలుకువనే నిద్రపోయినట్లుగా వుండటం అది నాకు తెలవడం, నాకు తెల్సునని నీకు తెలవడం—తప్పా?"

"అమ్మో, మీలో చాలా తికమకలున్నయ్యే" అంటూ దీర్ఘంగా ఆవులించి, అతని వేళ్ళని తన చీరతో తుడిచింది.

"అన్ని తికమకలున్నాయని గ్రహించగలిగిన నువ్వు ఎంత అమాయకురాలవో" అని మంచంమీద కూర్చోబోయాడు.

ఆమె లేచి కుర్చీమీద కూర్చుంది.

"కొత్తమంచమూ—భలే రెపరెపలాడుతుంది."

"నీ కక్కడ బాగుందా?"

పెదవులు ఎడంగావుంచి, కళ్ళు సగంమూసి, మెడ వెనక్కి వేసి, జడ ముందుకు లాగింది. ఓ అన్నట్లు తల గుండ్రంగా తిప్పింది. మాధవరావు మనస్సు వూహాలో యిరుక్కుంది. ఇది మధురక్షణం. జీవితం అంతా—యీ తృప్తి, చిక్కటి, తీక్షణమైన యింద్రియాలస్పందన, స్పృశించే వుద్రేకం అల్లాగే వుండిపోవాలి. ఈ ఆనందం తన రెండు గుప్పిట్లలో బిగించి, కాలాన్ని కట్టెయ్యాలి. కాలం కూసినట్లు హాల్లో అలారం మోగింది.

"సీతగారు లేచారు." అంది రాజమ్మ.

మాధవరావు హాల్లో కెళ్ళాడు.

"అదేమిటే కీ యిమ్మంటే, అలారం మోగించావ్ — తెలివి తక్కువ మొద్దు," అని సీతారత్నం పనిమనిషి చిట్టెమ్మని కసిరింది.

"ఇది గామోసు అనుకున్నానండి." అన్నది అలారంపెట్టె 'కీ'ని చూపించి.

"ఏడిశావులే నడు" అన్నాడు మాధవరావు.

"ఇంతమాత్రానికే మొద్దయిపోయిందా?" అంటూ రాజమ్మ గుమ్మంలో కొచ్చింది.

"నీ కెందుకు—నువ్వెళ్ళు." అన్నాడు మాధవరావు.

రాజమ్మ కోపంతో వెళ్ళిపోయింది. రాజమ్మలో కోపం యిదివరలో అతను చూడలేదు.

"కోపమా"

"నా కోపం ఎవరికి లెక్క?" అంటూ వొస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, తలదిండులో మొహం దాచుకుని మంచంమీద వాలిపోయింది.

భుజంమీద చెయ్యివేశాడు. తోసివేసింది. మెడమీద జెడకింద చెయ్యిపెట్టి నిమురుతున్నాడు. మరో దిండు మెడమీదికి లాక్కుంది. పక్కింటివాళ్ళిచ్చాయి, పత్రిక కావాలంటూ తలుపు తోశాడు. మాధవరావు బైటికెళ్ళాడు.

4

మూడోనాడు సాయంత్రం ఐదింటికే మాధవరావు వూళ్ళో పని చూసుకుని యింటికొచ్చాడు. చిట్టెమ్మ చెప్పింది, అమ్మగారు, రంగమ్మగారితో కలిసి షికెళ్ళారని. మండువాగదిలో రాజమ్మ జడేసుకుంటోంది. మంచం కింద పొట్లం కాగితాలు, దారాలు కనిపించాయి. చిట్టెమ్మ వాటిని తీసేసింది.

"పూరీలు తెప్పించా, ఆమ్లెట్లు కావాలెండి. సీతగారు అక్కర్లేవన్నారు. మీరు తింటారా?"

"ఊ"

లోపలికెళ్ళి పళ్ళాలు తెచ్చింది. తినడం సాగించారు.

"ఇక్కడ నీ కెట్లా వుంది?"

"ఏం చెప్పను?"

"సీత మంచిదేనా?"

"చాలా మంచివారు."

"కాలక్షేపం అవడంలేదా?"

"మీ పిల్లలతో పాటు నాకూ ట్యూషన్ చెప్తారా?"

"వాళ్ళు పిల్లలు కారు; పెద్దవాళ్ళే."

"నేను మట్టుకు?"

"నిన్నేమని పిలవను?"

"ఎట్లా పిలవాలనుంటే అట్లా పిలవండి"

"రాజీ—అననా?"

"ఆమెను సీతా అంటారు. సీతీ అనరుగా."

రాజా—అంటే మొగాళ్ళ పేరులాగుంటుంది."

"ఇప్పుడసలు నన్ను పిలవడం దేనికి?".

"నిన్నొక టడిగాలి రాజీ—"

"అడగండి."

మాధవరావు దగ్గరగా వొచ్చాడు; గోడవెనక సూర్యుడు దిగిపోతున్నాడు. చివరి కిరణం గోడని రక్తం చిమ్మి కిటికీలోంచి కొత్త పొట్లంకట్టి పారేశినట్లు రాజమ్మ మొహం ఎర్రబడింది. బుగ్గల నీడలు ఊదాగా వున్నాయి. సంధ్యవేసిన ముసుగులా, నుదురు ఎర్రగా, ప్రశాంతంగా వుంది. ఆమె నుదుటి మీద చెయ్యిపెట్టాడు; ఆ చేతిమీద తన నుదురు పెట్టాడు; వేడి గురుసుగా అతన్ని ఆవరించింది. వేళ్ళు జుట్టులో యిరుక్కున్నాయి. వొంకీలస్పర్శ, మంచు శిఖరం నుండి లోయలోకి జారి పోతున్నట్లు అతిశయోక్తిగా కదులుతున్నాయి చేతికింద.

"ఇదేనా అడగడం?"

అరిచేతికింద కంఠస్వరం జిలజిలా కొట్టుకుంటోంది. ఏదో వింతవాసన—జారిన రెండు గులాబి రేకులు, చర్మం తేమలో కలిసిన పౌడర్, కెరటంలేని కొలనులో కదిలిన చేపలు. చీకటి వేడినిట్టూర్పు, మేఘాల జోలపాటకి నిద్రపోతూ ఆవులించిన ఆకాశంలాగా, ఏదో వింతవాసన, క్షణంలో గతం గుప్పవిప్పి గంతులేసినట్లు, బాల్యంలో వికృత దృశ్యాలు—సందులో గుడిసిలోంచి వొచ్చిన చేపల వాసన, ఎవరిదో కాలువిరిగి రోడ్డుమీద కారిన రక్తం, తెలకుతున్న గడ్డివాము మధ్యనుండి బైటపడిన తెల్లపంది పిల్ల, తుపానుకి కూలిన చూరుకింద నలిగిపోతున్న తులసి మొక్క—స్మరణ కొచ్చాయి. కిటికీ పూదల చుట్టూ, రాజమ్మ ముంగురుల నలుపుని, చీకటి అల్లుతోంది.

"భలే ప్రశ్న!"

"నే అడగకుండా నీకు తెలవదూ." అతని చేతిని తొలగించింది.

"తెలుసు."

"అవుతే చెప్పు."

"డబ్బు కావాలా?"

మంచు శిఖరం కూలింది. రాపిడికి నిప్పు విశ్వం కాలిపోతోంది. అందులో కాలం కూడా మండిపోతోంది.

తలుపు తోసిన చప్పుడు—అతని హృదయ ద్వారాలని తెరిచినట్లు.

"ఏరా? అప్పుడే వొచ్చారే."

సీత కంఠం దూరంగా అయింది. తలుపులు దగ్గరగా మూసివున్నాయి.

రాజమ్మ తలుపు తీసింది. బుజాలమీదికి జాకెట్టు లాక్కుంది.

"నేనూ వొద్దునుగా తల కూనికి." అంది సీతారత్నంతో.

"వొస్తా వనుకోలేదు." అని సీత, భర్తకి రెండు కవర్లు తెచ్చియిచ్చింది.

"నాలుగు రోజులైంది యివొచ్చి, యిప్పుడేనా చూసింది" అంది.

కవరు చింపబోతుంటే, చిట్టెమ్మ వొడిలోంచి రూపాయలు కిందపడ్డాయి.

"ఎక్కడివే?"

"ఆ యమ్మగారిచ్చింది."

"పనివాళ్ళకి అట్లా గివ్వకూడదు" అంది సీత.

"ఏం తప్పా? పని చెప్పాను, చేసింది—సంతోషంగా యిచ్చాను."

"తప్పే. మేమల్లా యిచ్చుగోలేం. మా మాటకేం గౌరవం వుంటుంది?"

"మా, నీ కెందుకులే" అన్నాడు మాధవరావు.

"మనందరికీ కలిసే పనిచేస్తుందిగా. నే నిచ్చింది డబ్బు కాదా?"

"రోజూ అల్లా యివ్వగలవా?"

"దాని చేతిని బట్టి వుంటుంది."

"మా యింట్లో యివ్వటానికి వీల్లేదు."

"అదే వొద్దన్నాను" అని మాధవరావు.

"ఎందుకు వీల్లేదు. నా డబ్బు నే నిచ్చుకుంటే మీకేం కష్టం?"

"తను మాత్రం, నా, నీ అనొచ్చా?" అని భర్త నడిగింది.

"చిట్టెమ్మా, ఇదంతా నీమూలంగా, వొచ్చింది. అవతలకి పో."

"మధ్య నామీద పడతా రేటండోయ్. పొమ్మంటే పోకుంటానా" అంది చిట్టెమ్మ.

దీపం వేసింది సీతారత్నం. రాజమ్మ అక్కడ లేదు. గదిలో మంచం చప్పుడైంది. మాధవరావు వీధిలో కెళ్లాడు. చిట్టెమ్మ పెరట్లోకెళ్ళింది. చెట్టు వెనక దండమూను.

5

నాలుగో నాడు—

రాత్రి పదిగంటలకి ముగ్గురూ వెళ్ళి సినిమా చూసొచ్చారు. వరండాలో వరసగా ముగ్గురి పక్కలు వేసుకున్నారు. పది నిముషాల్లోనే రాజమ్మకి నిద్ర పట్టేసింది. పట్టినా పట్టకపోయినా మొహం అటు తిప్పి పడుకుంది. సీతారత్నం తనపక్క కొంచెం అవతలగా లాక్కుంది, భర్తకి దగ్గరగా. చీకటిమందాన్ని మాపగలిగే వెన్నెలుంది. ఆకుల పల్చటి నీడలు, కదలక, నిద్రపోతున్నాయి. కీటకం కూత, వెన్నెల పారాహుషార్ చెప్పినట్లుగా వుంది. కాలం నీడల నడుమనుంచి మెల్లగా ముందుకు పాకుతోంది.

మాధవరావు లేచి హాల్లోకి వెళ్లాడు. చించి చదవని కవరులో ఉత్తరం తీశాడు. దీపం వేశాడు. మేనమామదగ్గరనుంచి.

"......'నీ కీవిషయాలు పూర్తిగా తెలియవని మీఅమ్మ చెప్పింది. మీచదువులకీ, పెళ్లికీ చాలా అప్పులు చేసివున్నాముకదా. మనింట్లో చాలా రోజులుగా పనిచేసిన మాణిక్యం అనేకపర్యాయములు అడుగుతుంది. అది యీ నాలుగైదు నెలలుగా వొత్తిడి చేస్తోంది. ఎక్కువ అవసరంగా వుందట—ప్రస్తుతం, వెయ్యికాకపోయినా వో ఐదువందలేనా సర్దుబాటు చేస్తేగాని మర్యాద దక్కేటట్లు లేదు. కూలి జనం, నోటికి హద్దుండదుగదా. మాణిక్యం వీధిని పడిందంటే వేరె చెప్పనక్కర్లేదు. భూమి అమ్మకం వెంటనే పరిష్కారం అవదు. మనం చెప్పిన ధరకి ముందుకొచ్చిన ఆసామీ లేడు. ఎల్లాగో తక్షణం సర్దుబాటుచేసే ఏర్పాటు ఆలోచించడానికి మీ అమ్మ నిన్ను రమ్మని వ్రాయమంది. రత్నాన్ని పుట్టింటికి పంపక, యిక్కడికే తీసుకురమ్మంది..."

చదువుకు నేరోజుల్లో సెలవల కొచ్చినప్పుడు పనిమనిషి మాణిక్యాన్ని ఎరుగున్న జ్ఞాపకం వుంది. దాని మొగుడు మొదటి ప్రపంచయుద్ధంలో సైనికుడుగా పని చేసి, పది సంవత్సరాల క్రితం చనిపోయాడు. పాలు వ్యాపారం, కూరల వ్యాపారం చేస్తుంది. డబ్బు నిల్వ చేసి, అవసరానికి అప్పులిచ్చేది. తన చదువు కొంతవరకూ మాణిక్యం డబ్బుతో జరిగింది.

అలజడైంది. వెనక సీత.

"డబ్బు విషయమేనా?"

"నీ కెట్లా తెలుసు?"

"దస్తూరినిబట్టి—మనదగ్గరనుంచి ఎవరికేం కావాలి!" సీతారత్నం కళ్లల్లో ఎరుపు స్ఫుటంగా లేదు. కనురెప్పలు బరువుతో చటుక్కున మూత పడటం లేదు. నుదుటిమీద అరచేతిని ఆనించికూర్చుంది. చెయ్యి తియ్యగానే, దబ్బతెలాకు గీత, పక్కన దీపం వూదానీసె, ఎక్కువగా మాట్లాడడానికి అలవాటుపడని నోరు, ప్రతిదాన్ని చూడడానికి సిద్ధపడని గంభీరమైన చూపు—సీతారత్నం, పరాయి వ్యక్తిగా కనబడుతోంది. తీవ్రంగా చూస్తున్నాడు. తనతో కాపరంలో ప్రతి అనుభవమూ ఆమె శరీరంలో కనిపిస్తోంది. కొత్తలో కష్టాలు, రహస్యంగా రెండోమారు కాఫీ యివ్వడం, వేరే కొత్త తీసి మంగళాది గిల గొట్టడం, బొత్తాములు కుట్టడం, చాకలి మారు చేసిన బనీను అరా తియ్యడం, ఫుట్‌బాలాటలో కాలు బెణికినప్పటి కాపడాలు, కట్లు, వానలో తడిసినప్పుడు, తువ్వాలుతో తల తుడవడం, కళ్ళల్లో సిద్ధపడిన కన్నీటిని పెదవులతో అనకట్టలా నిలిపివెయ్యడం—అతని కన్నీరు ఆమె నేత్రాలగుండా రాలి తన చిటికెన వ్రేలితుంగరంపైనపడడం—విషాదాలు ఆమెలో వొంపులు, ఆనందాలు ఆమెలో ఎత్తులు—తన అనుభవంతో పెరిగిన శరీరం—ఆమె నడుం గట్టిగా పట్టుకుని వక్షంలో మొహం దాచాడు మాధవరావు.

రాజమ్మ ఆవులింత వినబడింది. సీతారత్నం అతన్ని నిలబెట్టి వరండాలో కెళ్లింది.

"తెల్లారిందా?"

"లేదు. నా రవతలికని లేస్తే, నీళ్ళిచ్చాను."

దిండ్లు, కొంగు, జడ, దగ్గరగా లాక్కుంది రాజమ్మ. సముద్రంలో కొట్టుకుపోతున్న చీరలా పడుకుంది.

6

తర్వాత, తర్వాత—

రాజమ్మకి జ్వర మొచ్చింది. ఒక్క మంచం బల్లావుంచి గదంతా ఖాళీచేసి శుభ్రం చేశారు. మధ్యాహ్నం రాత్రి సీతారత్నం రంగమ్మగారింట్లో చిన్నమంచం తెప్పించి పక్కనే వేసుకుని కనుక్కుంటూ సాయంగా వుంది. ఉదయం డాక్టరు చూసి వెళ్లేవాడు. సాయంత్రం వైకుంఠపాళి ఆట రాత్రి మాధవరావుతో క్లేరమ్స్.

శనివారంరాత్రి ఎనిమిదైంది. రంగమ్మగారింట్లో ఎవరో తాంబూలాలు పుచ్చుకోవడానికొచ్చారు. రమ్మంటే వెళ్ళింది సీతారత్నం. మాధవరావు, రాజమ్మమంచం పక్కనే చిన్నబల్లమీద కూర్చున్నాడు. దీపం వొద్దంటే, మూసేసి, బెడ్‌రూమ్ లాంప్ పెట్టాడు. పేపర్ చదవడానికి, ఆవెలుగు చాలక మడిచిపెట్టేశాడు.

"యుద్ధం అయిందటగా."

"అయినట్లే."

"అవులే. యింక మావకి లాభాలుండవన్నమాట."

"లారీకంట్రాక్టులా" నవ్వాపలేను.

"ఇంకా వో ఏడాది దాకా, యుద్ధం అలజడి వుండొచ్చు. మీ మామకి రమ్మని వ్రాయనా?"

"ఒద్దు, పనివిడిచిరాడు. డాక్టరేమంటాడు?"

"మరేం పెద్దవిశేషం లేదు. ఓ వారం పదిరోజుల పాటు రెస్టు కావాలన్నాడు."

"రెస్టుకాక నే నేంపని చేసి కష్టపడుతున్నాను?"

"రెస్టు శరీరానికే కాదు. మనసుకి కూడా వుండాలన్నమాట."

"నామనస్సుకేం?"

"ఇక్కడ నీకు బాగుందా?"

"నామూలంగా మీకే రెస్టులేదు. మీ రెందుకు నిద్రపోరు. కళ్లు మూసుకోండి. ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి."

"ఏమిటో వొకొక్కసారంతే, ఓ రెండు రోజులపాటు, యింటికెళ్ళరాదా?"

ఎందుకో చెప్పమంది. డబ్బువిషయం చెప్పక తప్పిందికాదు. మంచంమీద లేచి కూర్చుంది. రండి అని హాల్లోకి తీసుకెళ్లింది. పెట్టె తీసింది. అందు

లోంచి బాగ్ తీసుకుని మళ్లీ గదిలో కొచ్చింది. "ఇదీ, యీ తాళం చెవి మీదగ్గర పెట్టుకోండి." అంది రాజమ్మ.

"దాస్తాను"

"తాళం చెవి దాచండి డబ్బు వాడండి."

"నీ డబ్బు...."

"నీ, నా, తేడా లెందుకు?" నవ్వింది. ఊడిన జెడని మెలితిప్పి పైకిలాగి బిగించి ముడేసింది. నుదుటిపై చిరుచంద్రుకలు విడిగా మిగిలినవి వీణతీగల మాదిరి వెనక్కి పాగారాయి. దగ్గరగా జరిగి నుదుటి మీద చెయ్యివేసి కళ్లల్లోకి చూశాడు. దిండులోకి దిగజారి మొహం చిన్నదైంది. కళ్లు మూతలు పడు తున్నాయి. అర్థంలేని నవ్వుకోసం పెదవులు కదులు తున్నాయి. కణతలకింది నరాలు నానపాముల్లా గుండ్రంగా మెదులుతున్నాయి.

"చాలా?" అన్నది.

"తనంతాన్ని చాలు అని ఎవరంటారు?"

"అదికాదు. డబ్బు. మళ్లీ వెయ్యిపంపమని నిన్న నే మావకి వ్రాశాను" అంది.

"డబ్బుకోసం నీతో స్నేహం అనుకుంటు న్నావా?"

నేనట్లా అనుకుంటానని మీ రెందు కను కోవాలి?"

"నీలోనూ తికమకలున్నాయి.

"మీ సాహాసం"

చిట్టెమ్మ రంగమ్మగారింటికి అయ్యగార్ని కూడా వోపాలి రమన్నారని చెప్పింది. దీపం కొంచెం పెద్దది చేసి వెళ్లాడు.

మర్నాడు వెయ్యి యింటికి పంపాడు. రాజమ్మ జ్వరం తగ్గింది. ఎంత వొద్దన్నా వినక, చిట్టెమ్మచేత తలంటు పోయించుకుంది రాజమ్మ. దానితో జ్వరం తిరగబెట్టింది. సంగ తేమిటంటే, డాక్టరు హిస్టీరియా అన్నాడు. ఆవిషయం రాజమ్మతో చెప్పలేదు మాధవరావు. ముందు బిల్లిచ్చి కాని ఆ డాక్టర్ని తప్పించి మరొకర్ని రప్పించే వీల్లేదు. వంటింటి గుమ్మంలో కూర్చుని ఆలోచిస్తున్నాడు మాధవరావు.

"కుర్రాళ్ళ నడగండి. ఎంతేమిటికి?"

"ఓ పాతికైనా యివ్వాలి. జోగారావు ఏడు రూపాయలిచ్చాడు. అది జట్కా వాడికి సరిపోతుంది. మిగతవాళ్లు వొకట్లో లేదికి కా నివ్వలేమంటున్నారు. నలుగురైదుగురు రావడమే మానుకున్నారు, ఎందు చేతనో."

"ఊళ్లో చెప్పుకుంటున్నారు. రంగమ్మగారంది. మా వాళ్ళ తాలూకే చదువు చెప్పించుకోడాని కొచ్చిందన్నాను. అబద్ధం మన కులంపిల్ల కాదంది."

"ఆమె కెట్లా తెలుసు?"

"ఏమో. ఈ వూళ్లో వాళ్ల సాధ్యులు. పోనీ నా గాజు లివ్వనా. ముందు డాక్టర్ కివ్వండి."

సీతారత్నం ధోరణి అతనికి ఆశ్చర్యం కలగ చేసింది. మొదట్లో వొకటి రెండుసార్లు, వాళ్ల వూరు వెళ్ళిపోతానంది. ఇప్పు డనడం లేదు. వరుసగా, రాత్రి పగలు చాకిరీ చేస్తోంది. సరిగ్గా నిద్రాహారాలు లేవు. కొంచెం చిక్కింది. ఆమె చేతినున్న గాజులు చూశాడు. వొదులై వెనక్కి కదులుతున్నాయి. కంఠంకింద ఎముకమీద హారం ఎత్తుగా పడింది. గాజులు మార్చి డాక్టర్ బిల్లిచ్చి, మరో డాక్టర్ని రప్పించాడు. ఆయన పరీక్ష చేసి 'ఆల్‌బ్యుమిన్' వుందన్నాడు—అందుకనే, నడుం నొప్పి, ఇన్‌జెక్షన్ ఇచ్చాడు. రాత్రి నిద్రపట్టేటందుకు 'స్లీపింగ్ డ్రాట్' యిచ్చాడు. రెస్టిమ్మన్నాడు. శనివారం రాత్రి సీతారత్నం భోజనం చెయ్యదు. అలమండ్నించి తెచ్చిన కొబ్బరికాయనీళ్లు త్రాగి, అరటిపండ్లు తింది. రాజమ్మ జావ తాగి నిద్రపోయింది. చిట్టెమ్మ వరండా గది ముందు పడుకుంది. మాధవరావు హాల్లో కూర్చొని కాగితంమీద లెక్కలు కడుతున్నాడు. పదకొండు దాటింది. కిటికీ అవతల వెన్నెల గాలిపటంలా కదులు తోంది, నీడల మధ్య అతను కుర్చీమీద తల వెనక్కి వేసి కళ్ళు మూశాడు.

"కాసిని తాగండి, చలవ" అని సీతారత్నం కొబ్బరికాయ నీళ్లు తెచ్చింది. అదరిపడి లేచి కూర్చు న్నాడు. కళ్లు తుడుచుకున్నాడు.

"ఇంకా మేలుకునే వున్నావా?"

"అప్పుడప్పుడు వో కునుకు తీస్తూంటాను. మీ రదీ లేదుగా." అని నీరసంగా నవ్వింది. చిక్కిన మొహంలో కళ్లు పెద్దవిగా కనిపించాయి. తల కుడి

భుజం వేపు తిప్పి మాట్లాడుతున్నప్పుడు, చెక్కిడి, ముక్కు, వొంకర తిరిగిన గడ్డం, సగం కనపడే చెవి, సరిగ్గా చూస్తే ఆకర్షణీయమైన భంగిమం. నుదుటిమీది గీత—విశాలంగా విస్తృతంగా వున్నా, ఆ అమరికలో కలిసి, అలవాటైన ఆత్మీయుడిలా, వేరుగా కనబడదు. అందంగా లేని, అలవాటైన ఆ గీతని చూడటం అతనికానందంగా వుంది. మనస్సుని పెంచి సంతుష్టిపరచే అనుభూతి.—కంకడుకాయ పులుసు, నువ్వుగింజ, అంట్లతో మినచోటు, ప్రొద్దు పోకేసిన గది మూల, కాళ్లు ముడిచినపీట, ఎడంచేతిపై తగటు—తిలకించడంలో సంతుష్టినిచ్చే గతానుభవాలు.

"పక్క వేశాను. నిద్రపొండి."

"నువ్వు పడుకో."

"ఇల్లా ఎంతకాలం?"

సమాధానం లేదు.

"ఏమిటంటారు జబ్బు?"

"ఈ డాక్టర్ కూడా హిస్టీరియా అంటాడు. వాళ్లివాళ్లకి రోస్తావంటే వొద్దంటుంది."

"దానికేకేవా అయితే, నేనేదో చేశానను కుంటారు వూళ్లో జనం."

భార్య ఏమన్నా చేసిందేమో నన్న ఆలోచన వొకసారి మాధవరావుకి తట్టి, మెఱుపల్లే మాయమైంది.

"వూళ్లో ఏమనుకుంటే ఎవరికి. నీ మనస్సు నాకు తెలుసు.

అతని మోకాళ్లమీద తల ఆనించి కూర్చుంది సీతారత్నం.

నీకు చాల కష్టం కలిగిస్తున్నాకదూ?"

"మీ కష్టంమాటో."

"నాకీబాధలో ఏమిటో ఆనందం. ఇవాళే ఇంగ్లీషుపద్యం చెప్పడం మొదలెట్టాను. ఎక్కువ ఆనందం బాధవల్ల కలుగుతుందట."

నవ్వురానిక విషాదం పెక్కురింపుట.

"మీరు సంతోషంగా వుంటే, నాకదే చాలు."

"నామీద కోపం లేదు?"

"మీమీద మీకు కోపంలేదని తప్ప వేరే కోపం లేదు."

"నేను చెడ్డవాడిని కాదూ?"

"అది తెలుసుకొన్న వాడు జ్ఞానే అనుకుంటాను."

"రాణీ అంటే నీకు ద్వేషం లేదు?"

"ఇప్పుడు లేదు."

"ఏందు చేత?"

"మీమీద ఎందుకు లేదో, అందుకే."

"అంటే?"

"నాకు మీరుతప్ప ఏముంది? మీలో వొక భాగం అది." మాధవరావు కళ్ళంట నీళ్లు. చిమ్ముతున్నాయి. పుస్తకాలలో మాదిరి మనుషులు జీవితంలో వుంటారన్న చైతన్యం, అతన్ని అల్పుణ్ణి చేసింది. కన్నీరు రాలడంలేదు. రెప్పలు కదిలిస్తూ. గాలికి పొగ చెదిరినట్లుగా, నేలపడ్డాయి కళ్లు ఆమె చెంపకింద తలవేత్తు కన్నీటితో తడుస్తున్నాయి. ఒకరిబాధకి, మరివొకరి కన్నీరు. ఎవరిదీ జీవితం? ఎవరికోసం?

'అయ్యో దెబ్బను' అన్న చిట్టెమ్మకేక వినబడింది తటాలున సీతారత్నం లేచి వరండాలోకొచ్చింది. అతనూ వెనకాలే వెళ్లాడు. రాజమ్మ కుమ్ముంలో వుంది. "నేనే,—మంచినీళ్లు లేకపోతే, తీసుకుందా మని హాల్లో కొస్తుంటే, కాలు దానిమీద పడిందిగావును.—అంత కేకేయాల్సిటే పుట్టినట్టు నట్టు?" అంది రాజమ్మ. "హాల్లో కిందం బాగా నే ఎల్లారు. మెలకువగానే వుండా. పయనం తెల్సింద ఫర లేదుగందా అనుకుని కన్నుమూశా — వొచ్చి మళ్ళా ఎల్లారా?—సరిగ్గా పొట్టమీదే స్తిరి..."

"ఏడిశావు పాడుముండా. కొస్తుంటె ఏంకంత చేస్తావు" అని రాజమ్మ కసిరింది.

"జ్వరం వొళ్లు—సొలా వేమా—" అన్నాడు మాధవరావు. "కూతంతదూరంగా ఏసుకుంటా లెండి" అని చిట్టెమ్మ కొత్త పక్కగా లక్కింది చాప.

మిన్నాడు నడుంనొప్పి తగ్గింది కాని బాగా నడుంగా లేదు. ఆకలేస్తుంది. డాక్టర్ డయట్ మీదే వుంచమన్నాడు. రాజమ్మ మరో స్లీపింగ్ పిల్ వేసుకుంది. నిద్రపట్టడం లేదు తలనొప్పి ఒళ్లంతా చెమట్లు పోస్తున్నాయి. సీతారత్నం వుడుకులాంటి నీళ్ళల్లో గుడ్డతడిపి వొళ్లు తుడుస్తోంది.

"వొళ్లంతా వాసనగావుంది కాదు — స్నానం లేక."

"తుడుస్తున్నాగా. మరోచీర తెస్తాను." అని తలకి నూనె రాసింది; కొటు కట్టింది; బొట్టెట్టింది.

విసనకర్రతో చిక్కెమ్మని విసరమంది. భోజనం చేసి వొస్తానని అది వెళ్లింది. తనే విసురుతోంది.

"మీకు శ్రమ నామూలంగా."

"ఫరవాలేదులే."

"అది ఎట్లా తగిలింది?"

"చిన్నప్పుడు ఆట్లాడుకుంటూ కత్తిపీటమీద పడ్డాను."

"వారింకా టూర్లవన్నీ చెప్తూనే వున్నారే..." బైట పిల్లలు, భర్త చెప్పుకుంటున్న మాటలు వినబడుతున్నాయి. సీతారత్నం బైటకెళ్ళి 'ఉస్, మెల్లగా! నిద్రపోతోంది' అని చెప్పి వొచ్చింది.

"భోజనానికి పొద్దుపోతోంది, మీరు వెళ్లండి" అంది రాజమ్మ

"నువ్వు నిద్రపోయాక."

"ఇప్పుడే పోతా." అని కళ్లుమూసి, పక్కకి తిరిగి పడుకుంది.

భోజనా లయ్యాక, వంటిల్లు బాగుచేసుకుని, సీతారత్నం హాలు పక్కగదిలో కొచ్చింది. తమలపాకులకి సున్నం రాస్తోంది.

"రాజమ్మకోసం స్టేషన్ కెళ్ళిన రోజు వొచ్చింది ఆ కవరు. ఎవరిదగ్గరనుంచి—?"

"రఘువయ్యని నా స్నేహితుడు. పూనా మిలిటెరి ఎకవుంట్స్‌లో పని చేస్తున్నాడు."

"ఏమంటాడు—ఉద్యోగం ఏదన్నా...?"

"కాదు. మాణిక్యం అన్న కొడుకు — ఆరసయ్యని—యుద్ధంలో చేరాడు. రెండేళ్లుగా వాడి దగ్గరనుంచి జవాబు లేదుట, వాణ్ణిగురించి వార్తలేవీ. వాడిఫోటో యిచ్చి, ఎక్కడుండేదీ కాస్త వాకబు చేసి పెట్టమంటే, రఘువయ్యకి ఫోటో పంపి, తెలుస్తే వ్రాయమన్నాను. నేవీలో చేరాడుట. రెండేళ్లుగా ఓడప్రయాణం సాగించి, దేశాలు చూసి, బొంబాయి నుండి, పూనా వొచ్చాడుట. ఇదివరకు '...మా అరసున్న వోపట్టాన లొంగలేదు. వాడిమీద ఫిర్యాదనుకున్నాడో ఏమో, పేరుమాత్రం 'అసురు' అని మార్చుకొన్నాడు. వాడే. అంబాలాలో ట్రైనింగ్ కూడా పూర్తయింది.

పెర్మనెంట్ కమిషనిచ్చి, మద్రాస్ హార్బర్‌కి పో చేస్తున్నారు. అక్కడ బంధువులు కూడా వున్నారుట. అక్కడికి వెళ్ళేవుంటాడు."

ఉత్తరం చదివి నిట్టూర్చాడు మాధవరావు. "మాణిక్యం గొడవలు రెండూ తీరినట్లే."

"ఇంకా నాలుగైదొందలివ్వాలిటగా!"

"ఇప్పటికి నిల్చింది. మెల్లి మెల్లిగా తీర్చలేక పోతామా?"

సీతారత్నం పక్క సర్ది కాసేపు నిద్రపొమ్మంది. ఉత్తరాలు వ్రాసి మంచంమీద పడుకున్నాడు.

"మరి నువ్వో?"

"నే యిల్లా వేసుకుంటాలెండి."

"వొట్టి కిందా—నేను కిందే వేసుకుంటా, చల్లగా వుంటుంది" అని తువ్వాలుతో గచ్చు దులిపి, దిండు లాగి ఆమె తలకింద పెట్టాడు. తామలపాకులకి ఎర్రబడిన పెదవుల వెనక పళ్లవరస తళుక్కుమంది. జుట్టు లేగి నుదుటిమీది గీతమీదకి జారింది. ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"కళ్లకింద గీతలు చూసుకున్నావా?"

"మీవి చూసుకున్నారా?"

"ఏం? మనవేం అద్దం—" అని తల చేతిమీద ఆనించి వోరగిల్లాడు.

బైట పోస్ట్‌జవాన్ పిలుపు వినిపించింది. మరో నాలుగైదు క్షణాలలో 'అయ్యో' అన్న రాజమ్మ కేక దగ్గరగా వినిపించింది. ఇద్దరూ చివాలున లేచి హాల్లోకి వెళ్ళారు.

రాజమ్మ నుదుటిమీద రెండు చేతులూ నొక్కుకుంటూ, గుమ్మంమీద వాలిపోయింది. వేళ్ళ మధ్య నుంచి, చెవిమీదుగా రక్తం బొటబొట కారుతోంది. మంచం హాల్లోకి లాగి, దానిమీద ఆమెను కూర్చోపెట్టారు. తడిగుడ్డ కట్టారు. అరంగుళం పొడుగు గాయం పడింది నుదుటిమీద. మాధవరావు సైకిల్ మీద వెళ్లి డాక్టర్ని తీసుకొచ్చాడు. ఆయన ఆయింట్‌మెంట్ రాసి బాండేజ్ వేశాడు. రక్తం మరకల బట్టలు మార్చి, కొత్త బట్టలు ధరించి, వరండా గదిలోకి మంచం పెట్టించి, రాజమ్మ దిండ్లని వెనకాల వేసుకుని, గోడని జార్లపడి కూర్చుంది.

టీ తెచ్చింది సీతారత్నం.

"పెద్ద దెబ్బే. ఇదంతా చిట్టెమ్మ పనే." అన్నది.

"అసలేం జరిగింది?" అంటూ మాధవరావు గదిలోకొచ్చాడు.

"నాకు సరిగా జ్ఞాపకం లేదు. పోస్ట్‌వాడి కేక విని వీధిలోకొద్దామని హాల్లో గదిముందు కొచ్చాను. తలుపుమీద చెయ్యి పడిందేమో. తలుపుమీద వున్న గొళ్ళానికున్న తాళంకప్ప, చెవీ, నుదుటిమీద పడ్డాయి." అంది రాజమ్మ. సీతారత్నం ఆమె తల దువ్వి జడ వేస్తోంది.

"అమ్మయ్య మనం కొన్న పెద్దతాళంకప్ప, అక్కడ పెట్టుకుంటారా ఎవరేనా?" అన్నాడు మాధవరావు.

"అది చిట్టెమ్మ పనే" అంది సీతారత్నం.

"దాన్నేం ప్రయోజనం. ఆ తలుపుమీద చెయ్యేస్తానని కలగందా?"

"తాళం నొక్కకుండా గొళ్ళానికి బిగించడం తెలివితక్కువ కాదూ?" అన్నాడు మాధవరావు. పాఠాలకుర్రాళ్లు హాల్లో కొచ్చారు. ఆతను బైట కొచ్చేశాడు.

మర్నాడు సాయంత్రం నాలుగైంది. మాధవరావు హోల్డాల్ సర్దడం పూర్తిచేసి, వరండాగదిలో కొచ్చాడు. రాజమ్మ కుర్చీమీద అద్దం పెట్టి, చూసుకుంటోంది.

"ఇప్పుడెట్లావుంది — నొప్పి తగ్గిందా?"

"ఇంక యీమధ్య పోదుగా."

అద్దంతీసి కూర్చోమంది. ఆతను కుర్చీయివతలకి లాగడంలో వో చెయ్యి తలుపుకి తగిలి, మూసుకుంది. గోడకానిచ్చిన దిండ్లమీద వొరిగింది రాజమ్మ. తల దువ్వుకోలేదు. పాపిడ కదిలిపోయింది. ఊడిన జుట్టును పైకిలాగి బిగించి ముడేసింది. మెడలో నగలు లేవు. చెవులకి దుద్దులు లేవు. చేతులలో గాజులు లేవు. మొహాన బొట్టు చెరిగింది — ఎర్రగా పాపిడికేసి. నుదుటిమీద పూలరేకులు నలిగి వాడి పడున్నాయి. ముందుకి వొరిగి నుదిటిమీద చెయ్యి ఆనించాడు మాధవరావు

"హిస్టీరియా అంటే ఏమిటండి?"

"స్త్రీలకు మామూలుగా వుండేవ్యాధి — అన్నీ సక్రమంగా జరగక మానసికంగా కలత గాని ఆందోళన గాని వుంటే, — యివన్నీ కలిసి కలుగజేసే అస్వస్థత హిస్టీరియా. ఫలానా అని తెలీనప్పుడు డాక్టర్లు యీ పేరు చెపుతూంటారు."

"నాకదేట—"

"నాకట్లా కనిపించడం లేదు."

"మీకేం తెలుసు. మీరు డాక్టర్ కారుగా."

దెబ్బ తగిలినచోట, వేలుకి కరుకుగా తగిలింది. చుట్టూ చర్మం నలిగింది — కొలనులో నిశ్చలంగావున్న నీటిని కామంలో కదిలిన చేప కదిపినట్లు. అద్దంలో పగులు, — ఆకాశంలో మెఱుపు, సముద్రప్రదేశంలో భూకంపం. వేలు వెనక్కి మళ్ళింది. కళ్లకింద కాకిపాదాలమాదిరి చిన్ని ముడతలు, శ్వాసలో, గులాబీ కాలినట్లు చేపలు విడిచినట్లు అఖాతంలోంచి ప్రజ్వరిల్లినట్లు వాసన ఆవరించి అప్రయత్నంగా అతన్ని వెనక్కి నెట్టాయి.

"ఎట్లాగో వున్నానుకాదూ — తలంటుపోసుకుందా మని అన్నీ సిద్ధంచేసి వెళ్లబోతున్నా మీరొచ్చారు."

"మరోవారంలో అన్నీ తగ్గుతాయి బాగుంటావు."

"ఇప్పుడు బాగలేనా?"

ఆమె రెండుచేతులు అతని మెడచుట్టూ వేసింది.

"స్నానాని కెళ్లనా?"

"నేను వూరెళుతున్నా. అమ్మకి వొంట్లో బాగాలేదుట. నిన్న ఉత్తరం అదే. మళ్ళా రేపొచ్చేస్తాను. ఏం?"

"డబ్బు కావాలా? మనియార్డరొచ్చిందిగా."

"వొద్దు, అడగడానికి వొచ్చాననుకున్నావా?"

"అల్లా గనుకుంటానని ఎందుకనుకున్నారు?"

"ఇదివరకన్నదే..."

"అబద్ధం అంటారా?"

"నిజం రోజు రోజుకీ మారదుగా"

రాజమ్మ లేచింది. బుజంమీద్నించి చేతిని తొలగించింది — 'అబ్బ, చెమట' అంటూ.

తలుపులు తీసింది.

"వెళ్లనా?"

"అమ్మగార్ని అడిగానని చెప్పండి."

మాధవరావు నవ్వుతూ బైటకొచ్చాడు. ముందు కుర్రాడు హోల్డాల్‌తో నడుస్తున్నాడు. బైటికెళ్లి రాజమ్మ గదికేసి చూశాడు మాధవరావు. లోపలంతా

నల్లగా కనబడింది. ఊచల మధ్య రాజమ్మ ముఖం— దానిమీద గీత. అది జైల్లో దృశ్యం; తను స్వేచ్ఛా జీవి.

7

కుడి ఘట్టం — రెండు రోజులు తర్వాత

మాధవరావు యింటికొచ్చేటప్పటికి మధ్యాహ్నం మూడైంది. వీధిలో రాజమ్మ గదికేసి చూశాడు. కిటికీ మూసివుంది. హాల్లోకి రాగానే సీతారత్నం వో కవరిచ్చింది. గబగబ గదిలో కెళ్లాడు.

"రాజమ్మేది?"

"వెళ్లిపోయింది"

"అదేమిటి? ఎప్పుడు—?"

"రాత్రి"

...ప్రశ్నార్థకంగా చూశాడు.

"వాళ్లి కృష్ణమూర్తినీ, చిట్టెమ్మని సాయం వుంచి హరికథ విందామని వెళ్లా. ఇంటికొచ్చేటప్పటికి పదైంది. కృష్ణమూర్తి వొక్కడూ వున్నాడు. చిట్టెమ్మ బండితెచ్చిందిట. కూడా స్టేషన్ కెళ్లిందిట. అన్నం పెట్టుకుని తిని వెళ్లిం..."

"సీతో ఏమీ చెప్పలేదు?" అంటూ కవరు చూశాడు. చిరునామా టైపు కొట్టబడివుంది. చించాడు. అందులోనుంచి రెండు కాగితాలు పడ్డాయి; వొకటి ఇంగ్లీషులో టైపు కొట్టబడిన వుత్తరం. రెండోది తెలుగులో—

ఇంగ్లీషుది మొదట చూశాడు. రాజమ్మకి జబ్బు చేసినప్పుడు తాము దగ్గరుండుకుని ఎంతో ఆదరణగా కనుక్కుని చికిత్స చేసి నయం చేసి పంపినదంపతులకు కృతజ్ఞత. కులభేదాలు గణించక యిట్లా సమానత్వం అందరూ కనబరిస్తే సంఘం పురోగమించగలదన్న ఆశ, పట్నంవొస్తే వారి అతిథులుగా వుండాలని ఆహ్వానం— దాని సారాంశం — అసురు సంతకం.

"...మాణిక్యం మాఅమ్మ. నన్ను మావదగ్గఱ అట్టేవుంచి చదువు చెప్పించింది. అరసయ్య బావిగా. చేసుకుంటావని మావ సరదా పడేవాడు. ఇంకెవరైనా మనస్సులో వున్నారా అని వోసారి మీ రడిగారు జ్ఞాపకం వుందా. చెప్పానుగాను. నావిషయం తెలవక ముందే వెళ్లడం మంచిదనిపించింది. సీతగారికి మీరంటే వున్న అపేక్ష, మీకు ఆమె అంటే వున్న గౌరవం, కళ్లారా చూశాను. నా విషయం మీకు తెలియదని నాకు తెలిసినప్పటినుంచీ, నాకు వొచ్చెయ్యాలని వుండేది. తాళం దెబ్బ—తాళం చెవితో తలుపు తీసినట్లు—నేను రావడానికి కారణం. ఇంతకీ నా మొహాన అట్లా రాసిపెట్టివుంది..."

మాధవరావు కిటికీ తలుపులు తెరిచాడు.

"బాగ్ మరిచిపోయింది."

"ఖాళీ బాగ్గే లెండి" అన్నది సీతారత్నం, టీకప్పు చేతి కిచ్చి.

అభినవుని నాట్యశాస్త్రము

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

1

నాట్యశాస్త్రము రెండు భిన్నపాఠములతో లభించుచున్నది. కాశీముద్రితపాఠము దాక్షిణాత్యసంప్రదాయసిద్ధమైన పాఠము. కావ్యమాలాముద్రితపాఠము ఔత్తరాహసంప్రదాయసిద్ధమగు పాఠము. లొల్లట, ఉద్భట ప్రభృతులు ప్రాచీనపాఠమును వ్యాఖ్యానించిరి. తోత, ఉత్పల, శంకుక, భట్టేందురాజ ప్రభృతులు నవ్యపాఠము నంగీకరించిరి. అభినవగుప్తుడు నవ్యపాఠమును తీసికొనినాడు. ధనంజయుడు నవ్యపాఠమునుండి, అదే నగరమందలి భోజుడు ప్రాచీనపాఠమునుండి శ్లోకముల నిచ్చియుండిరి. కేరళదేశమున కొన్ని నవ్యపాఠప్రతులు, నేపాలమున దాక్షిణాత్య పాఠప్రతులు లభించినవి.

ఐదవ అధ్యాయాంతమున దాక్షిణాత్య పాఠమున నలుబది శ్లోకము లధికముగా గలవు. నవ్యపాఠములోని తొమ్మిదవ అధ్యాయము ప్రాచీన పాఠమున రెండు అధ్యాయములుగా కనబడుచున్నది. ఛందోఽధ్యాయములయందు గణవిభేదము నాశ్రయించిన లక్షణము లొకపాఠమున, లఘుగురు వివేకముతో గూడిన లక్షణము లింకొక పాఠమున కన్పించుచున్నవి. లక్షణాధ్యాయమున నవ్యపాఠములో ముప్పదియారులక్షణములు ఉపజాతి వృత్తమున నిర్వచించబడినవి. వ్యత్యస్తక్రమమున నీ నిర్వచనము లనుష్టుప్ రూపమున ప్రాచీన పాఠములో గలవు. నవ్యపాఠములోని ఇరువదియారవ అధ్యాయవిషయము ప్రాచీన పాఠమున ముప్పదిరెండవ అధ్యాయమున కన్పించుచున్నది. ప్రాచీన పాఠములోని చివరిఅధ్యాయము రెండు అధ్యాయములుగా నవ్యపాఠమున గలదు. ఇట్లు విశేషభేదము కన్పించుచున్నను నీ రెండు పాఠములును ప్రచారములో గలవు. వ్యాఖ్యాతృభేదము నాశ్రయించుకొని వచ్చిన ఈ పాఠభేదములు దేశమంతట వ్యాపించియున్నను విషయభేదమును తీసివేయుట కనేక యత్నములు జరిగియున్నవి. పూనా, బికనీర్ వ్రాతప్రతులలో కొన్ని ఈ రెండు పాఠములను సమన్వయపరచునట్లు దిద్దబడినవి. ఫ్రెంచిదేశపు ముద్రాపకు లీ ప్రణాళిక నవలంబించి, పదునాల్గవ అధ్యాయముతో నీ క్రమమును వదలి పెట్టిరి. వ్రాతప్రతులలో నొకదాని కింకొకటి సరిపోవుట లేదు. ఇట్టి పరిస్థితులలో అభినవగుప్తుని వ్యాఖ్య కనుగుణమైన పాఠమును సాధ్యమైనంతవరకు గ్రహించుట యుక్తమని తోచును. అభినవుడు ప్రతీకలుగా పదముల నుదహరించుటయే గాక, మధ్యమధ్య పూర్వాపర శ్లోకములను గూడ పఠించుట గలదు. దీనివలన శ్లోకక్రమమును, పాఠమును సంస్కరించుటకు కొంత ఆధారము లభించును.

రసపరమైన దీశాస్త్ర మని భావించి పాఠమును తోతభట్టు, అభినవగుప్తుడు సంస్కరించినట్లున్నారు. నంది కోహలప్రభృతులు ఈ సిద్ధాంత ప్రతిపాదనయే పరమావధిగా ఎంచకపోవుటచే గీతనృత్యములలోని విషయములను గూడ ఇచట పఠించినారు. ఇట్లు విషయభేదవశమున వచ్చిన పాఠభేదములు నాలుగు తెరగుల గలవు. ప్రాచీనపాఠమున స్వల్ప సంఖ్యాక శ్లోకములతో నున్న గ్రంథమును ఉద్భటుడు చదివినట్లున్నాడు. ఇదే పాఠమున పెద్దగ్రంథమును చదివినవాడు లొల్లటుడు. నవ్యపాఠమున స్వల్పగ్రంథమును శంకుకుడు, పెద్దగ్రంథమును కీర్తిధరుడు పఠించినారు. భవిష్యన్నాట్యాభివృద్ధిని అరికట్టనిరీతిగా జూపు నవ్యపాఠమును అభినవగుప్తుడు పఠించియున్నాడు. ఈ పాఠము అతిస్వల్పము గాదు, అతిదీర్ఘము గాదు కూడ. ఇట్లు పాఠమును అభినవుడే సంస్కరించినాడని ఆధునికులు కొందరు భ్రమజెందినారు. నాట్యశాస్త్రము రసపర మని యెంచి సంస్కరించినవారిలో భట్టనాయకుడు, తోతభట్టు ప్రధానులని సిద్ధాంతీకరింపవీలున్నది. కావున అభినవుని పాఠ మితరపాఠములకంటె ఎచ్చట భిన్నముగా కన్పించుచున్నదో వివేచింపవలెను.

2

తొమ్మిదవ అధ్యాయమును ఉపరికర్మవిధి నుండి ప్రత్యేక అధ్యాయముగా వివరులు పఠించినారు. కాని అభినవుని పాఠమున ఈ విభాగము కన్పించదు. గతి ప్రచారమున కొన్ని శ్లోకముల నభినవుడు పరిత్యజించి నాడు. వృత్తలక్షణమున గురు లఘు వివేకముతో చెప్పిన లక్షణములనే అంగీకరించుచు "అత్ర త్వేహాధ్యాయే భరతమునికృత మితి త్రికైర్మకారాదిభిః కైశ్చిత్కించిల్లక్షణం స్వీకృత మితి కేచిత్ పుస్తకపాఠో దృశ్యతే, మధ్యే చ చింతితాయపుస్తకే పూర్వధియా మపి పఠ్యతే" అనినాడు. మగణాదిగణములతో వృత్తలక్షణములను భరతుడు ప్రవచించినట్లు కొందరు భావించినారని తదనుగుణము లగు లక్షణశ్లోకములను గూడ పఠించినారని చెప్పినాడు. కాని ఈ పాఠాంతర మితనికి సమ్మతము కాదు. ఇట్లే లక్షణాధ్యాయమున గూడ పాఠభేదములు కలవని "తథా చ మతాంతరేణ భరతమునికే వాన్యథా పుష్టదేశలక్షణేన నామాంతరైరపి చ వ్యవహారం కరోతి; తత ఏవ పుస్తకేషు భేదో దృశ్యతే. తం చ దర్శయిష్యామః పఠితోద్దేశక్రమ ష్వవ్యాఖ్యానుపాధ్యాయపరంపరాగతః" అనినాడు. ఈ పాఠభేదముల నిచట చక్కగా సంస్కరించినవాడు తోతభట్టు. ఇతనిపాఠము నే అభినవుడు స్వీకరించినాడు. ఈ పాఠమున గన్పించని ఇతరశ్లోకముల నాతడు స్థలముల స్పృశించినాడు.

భాషావిధానము, సంబుద్ధివిధానము, కాకువిధానము పదునేడవఅధ్యాయమున పఠింపబడినవి. కాని ఇతరప్రతులలో భాషావిధానముతో నీయధ్యాయము సమాప్తమగుచున్నది. పదునెనిమిదవ అధ్యాయమున వీథ్యంగములు వీథిక్రింద పఠింపబడినవి. లాస్యాంగములను సంధ్యంగాధ్యాయమున పఠించినాడు. ఇరువదినాల్గవ అధ్యాయమును స్త్రీపుంసోపచారముగా అభినవుడు పఠించుచు ఇతరప్రాచీనప్రతులలో నిచట కన్పించు చివరిశ్లోకములను ముప్పదిరెండవ అధ్యాయమున చదివినాడు. ఇతరప్రతులలో కన్పించు ముప్పదినాల్గవ అధ్యాయము ప్రకృతివికల్పనము కొన్ని మార్పులతో అభినవుని ఇరువదియారవ అధ్యాయమైనది. ఇరువదిరెండవ అధ్యాయమున జాతిలక్షణములను గద్యరూపమున అభినవుడు పఠించినాడు. కాని ఈ లక్షణముల వివరణము ఆర్యావృత్తిమున చదివినారు. ధ్రువాగానమునందలి జాతి వినియోగములు ఇరువదితొమ్మిదవ అధ్యాయమున కీర్తిధరుని చేతనే పఠింపబడినవి. ఇరువదితొమ్మిదవ అధ్యాయమున పాఠభేదము లనేకములు గలవు. అభినవుని పాఠమున ఆరోహి, అవరోహి అలంకారములు నిర్వచింపబడలేదు. పైగా "సా నానుపయోగాత్ కావ్యాలంకారవ త్తేషాం ఇయత్తా. నియమేనాభిధాతు మశక్యత్వా ద్వ్యక్త్యైకత్వేన చ తేషాం పరమార్థతో వ్యాపనా న్మయా యథాపి సర్వే న లక్షితాః, తథాపి శాస్త్రాంతర లక్ష్యమాణ నిరుక్తపరస్పర సోపాయే నైతా జ్ఞానీయే తేత్యర్థః" అనినాడు. ఇతర శాస్త్రములలో నిలక్షణములు చెప్పబడినవని, అక్కడక్కడ కొన్ని లక్షణములనే స్పృశించుచున్నానని చెప్పుచున్నాడు. కాని ఈ సందర్భమున భరతునినుండి మతంగుడుదహరించిన విషయము అభినవుని పాఠమున లేకున్నను, ఇతర ప్రతులలో కన్పించుచున్నది.

ముప్పదవ అధ్యాయమున కీర్తిధరకృతముగా కన్పించు

"వర వంశాస్తు విజ్ఞేయా స్త్రీస్థానస్వరగోచరాః
తేషాం నైవ హి వర్ణానాం స్థానే స్థానే త్రికత్రయమ్"

అను శ్లోకము నభినవుడు పఠించలేదు. మనువంశే, షడాననం, ముని, వసు, నాథేంద్ర, మహానంద, రుద్ర, ఆదిత్య, విశ్వమూర్తి అను తొమ్మిదివంశరీతులే ఈశ్లోకమున గ్రహింపబడుచున్నవి. నాన్యదేవుడు సహితము:

"ఏవం నవైవ వంశాః స్యుర్ద్వా బ్రూతే త్రివక్రమే నేహ భరతాచార్య వంశాః 'స్థానే స్థానే త్రికత్రయ' మితి"

అని చెప్పుచు పైశ్లోకము భరతకృతముని భావించినాడు. కాని ఇట్లు సంఖ్యానిర్ణయము గావించి శాస్త్రవృద్ధిని అరికట్టుట అభినవునకు సమ్మతము కాదు. గనుక ఈశ్లోకమును నిరాకరించినాడు. సాధ్యమైనంతవరకు నాట్యశాస్త్రమును సర్వానుగ్రాహకముగా జెప్పుట అభినవుని లక్ష్యములలో నొకటి యని గుర్తించుకొనవలెను.

ఐదవ అధ్యాయాంతమున చిత్రపూర్వరంగము గను నొకదానిని అభినవగుప్తుడు వ్యాఖ్యానించలేదు. "యత్కీర్తిధరేణ నందికేశ్వరమత సూత్రాగమ త్వేన దర్శితం, తదస్మాభిః సాక్షా న్నదృష్టం, తత్ప్రతిత్య

యాత్తు లిఖ్యతే సంక్షేపతః......ఏవం నందికేశ్వర మతానుసారేణాయం చిత్రపూర్వరంగవిధి రితి నిబద్ధః" అని ఇరువదితొమ్మిదవ అధ్యాయమున పలికినాడు. నందికేశ్వరుని అభినయగ్రంథమునుండి ఈ యంగమును కీర్తిధరుడు గ్రహించినాడని, ఇది భరతశాస్త్రమున లేకపోయినను కీర్తిధరుని అనుసరించి దాని సంక్షేపరూపము నభినవగుప్తుడు చెప్పినాడు.

ఇరువదియైదవఅధ్యాయమున "లోకప్రమాణంహి విజ్ఞేయం" అని భరతు డనగా "ఏతేనేదం విధీ నితి సామాన్యాభినయాధ్యాయా త్ప్రభృత్యేతదధ్యాయ పర్యంతం యే కర్తవ్యతారూపాభినయానాం విధయ ఉక్తాస్తాన్ సమ్యగ్విజ్ఞాయేతి వదన్ కోహలాది శాస్త్ర లక్ష్య ప్రవాహసిద్ధ మపి చిత్రాభినయం సూచయతి" అని అభినవుడు వ్యాఖ్యానించెను. భరతునిచే అనుక్తములగు హస్తవిశేషములను వివరించిన నందికేశ్వరుని అనుసరించి కోహలాదులు విశేష హస్తములను చెప్పినారు. వాటిని కూడ ప్రామాణికములుగా నంగీకరించవచ్చునని ఇచట గలదు. ఇంతటితో నాగక కోహల కృతులగు శ్లోకములను కొన్నింటిని ఆ సందర్భమున సంక్షేపించి ఇచ్చినారు.

ఇరువది యెనిమిదవఅధ్యాయాంతమున "యేన మధ్వదనమేవాత్ర న కేవలం ప్రమాణం, సూతకాశ్యప మునిప్రభృతిభి రపి యన్నిరూపితం తదపీతి శివమ్" అని అభినవు డనినాడు. వివిధరాగములకు కశ్యపాదులు చెప్పిన వినియోగముల నిచట అంగీకరించినాడు. భరతుని గ్రంథమును సూత్రప్రాయముగా నంగీకరించి తర్వాతి వ్యాకర్తలు, శాస్త్రజ్ఞులు ప్రపంచించిన విషయసమూహము నంతను సమన్వయ పరచగల్గుట క్రీరీతిగా మార్గము నొకదానిని అభినవగుప్తుడు చూపియున్నాడు.

ముప్పదియొకటవ అధ్యాయమున అనేక పాఠభేదములు గలవు. ఒకప్రతికి మరియొకప్రతికి సంబంధము కన్పించదు. లక్షణశ్లోకములే భిన్నములుగా కన్పించుచున్నవి. కావ్యమాలాప్రతిలోని 293వ శ్లోకము తర్వాత తొంబదిరెండుశ్లోకము లధికముగా గలవు. కాని ఇందులో దాదాపు ఏబదిమాత్రమే అభినవునిచే వ్యాఖ్యానింపబడినవి. అభినవుడు కొన్నిటిని వ్యాఖ్యానించలేదని త్రోసివేయుటకు వీలుపడదు. సులభగ్రాహ్యములు, అనధిగతార్థరహితములు నగు శ్లోకముల ననేకముల నభినవు డితరభాగములలో సహితము వ్యాఖ్యానించలేదు. కాగా నాయా శ్లోకములలోని విషయమును గ్రహించి ఇవి ప్రక్షిప్తములా, కాదా యని వివేచింపవలెను.

ముప్పదిరెండవ అధ్యాయమున అభినవుడు పఠించని పన్నెండు ధ్రువాలక్షణోదాహరణము లితర ప్రతులలో కన్పించుచున్నవి. ప్రభావతీ, మాలా, సాచికా, మాలతీ, మృగీ, సురభిముఖీ, లలితగతి, రతి, భుజగముఖీ, ద్రుతగతి, నవమాలా, విభ్రమ అని వీటి పేర్లు. ఇవి గాథావృత్త విశేషరూపములేగాని వేరు గాదు. మాత్రావృత్తము లగు గాథావృత్తములు లయభంగాశ్రితములు. ఈలయభంగములు దేశీతాలమునకు జెందినవి. ధ్రువాగానమున మాత్రావృత్తముల ప్రసక్తిని భరతు డంగీకరించలేదు గనుక అభినవునిపాఠము భిన్నముగా కన్పించుచున్నది.

ముప్పదిరెండవ అధ్యాయమునుండి కొద్దిభాగమును అభినవుడు వేరుజేసి తర్వాతి అధ్యాయముగా పఠించినాడు. ముప్పదినాల్గులోని జాతిలక్షణములలో గూడ పాఠభేదము లున్నవి. అభినవుని పాఠమున నివి విస్తృతముగా కన్పించవు. తర్వాతి రెండధ్యాయములలో అభినవుని పాఠమునకు ఇతరుల పాఠమునకు విషయభేదము గలదు. అభినవుని గ్రంథము ముప్పదియేడవ అధ్యాయముతో సమాప్తమగుచున్నది. కాని కొన్నిచోట్ల నాట్యశాస్త్రమున ముప్పదియారు అధ్యాయములే గలవని చెప్పియుండుటచే నీ సమస్య చాలా క్లిష్టమగుచున్నది. కాని ప్రతి అధ్యాయవ్యాఖ్యను ఒక ధ్యానశ్లోకముతో నారంభించుచు, శివాద్వయసిద్ధాంతమునగల ముప్పదియారు తత్త్వములను అభినవగుప్తుడు స్పృశించియున్నాడు. శివాద్వయ వేదాంతమున కన్పించు అనుత్తరప్రతిభతో ముప్పదియేడవ అధ్యాయము నారంభించినట్లు కన్పించుచున్నది. ఈ ముప్పదియేడవ అధ్యాయములో చివరభాగము కొంత భరతునిచే చెప్పబడలేదని, వార్తికకారులగు రాహుల, శకలీ, శ్రీహర్షులలో నొకరిచే నిర్మింపబడినదని చెప్ప వీలగుచున్నది. ఈ యధ్యాయమున కోహల, వత్స, శాండిల్య ప్రభృతుల నామములు పేర్కొనబడినవి. గ్రంథావసానమున "నంది భరత సంగీత పుస్తకమ్" అని కొన్ని ప్రతులలో కన్పించుచున్నది. ఏది యెట్లున్నను నాట్యశాస్త్ర

మతివిచిత్ర పరివర్తనల వంటివ దని స్పష్టము. అభినవగుప్తుడు నేడు తిరిగివచ్చిన గూడ తాను వ్యాఖ్యానించిన ప్రతిని కనుగొనజాలడనుటలో నతిశయోక్తి లేదు. ఇట్టిచో భరతుని సంగతి వేరుగా చెప్పనక్కర లేదు.

3

భరతుని నాట్యశాస్త్రము రసపరమైన గ్రంథమని, రసమును కావ్యాత్మగా ప్రపంచించినవాడు భరతుడని సాహిత్యసంప్రదాయము. వివిధవిషయములను రసపరముగా సమన్వయించిన భరతుని గ్రంథమును చక్కగా సంస్కరించినవాడు అభినవగుప్తుడు. ఇతరవ్యాఖ్యాకర్త లీవిషయమును గుర్తించినట్లు కన్పించదు. కావుననే వారిపాఠము లభినవుని పాఠముతో చాలచోట్ల ఏకీభవించకున్నవి. అభినవుని పాఠమున నిషధహస్తము:

"ముకులం తు యదా హస్తం కపిత్థః పరివేష్టయేత్
సమున్నతస్తదా హస్తో నిషధో నామ నామతః."

అని గలదు. కాని:

"గృహీత్వా వామహస్తేన కూర్పరాభ్యంతరే భుజమ్
దక్షిణం చాపి వామస్య కూర్పరాభ్యంతరే న్యసేత్
స చాపి దక్షిణో హస్తః సముద్యన్ముష్టిః కృతో భవేత్
ఇ త్యేష నిషధో హస్తః"

అను లక్షణము ప్రాచీనపాఠముగా కన్పించుచున్నది. ఇచట పాఠాంతరముగా:

"జ్ఞేయో వై నిషధో నామ హంసపక్షః పరాఙ్ముఖః
జాలవాతాయనాదీనాం ప్రయోక్తవ్యోఽభిఘట్టనే"

అను లక్షణము గలదు. ఐనను

"శిఖర స్తు యదా హస్తో మృగశీర్షేణ పీడితః
నిషధో నామ విజ్ఞేయః స భరతార్తైరధీయతే"

అని కీర్తిధరుని పాఠమున్నది. ఆగమములలోని ముద్రల నాశ్రయించుకొనినది అభినవుడు చదివిన లక్షణము. ఇదే లక్షణము విష్ణుధర్మోత్తరమున గూడ గలదు. అభినవుని నిషధహస్తలక్షణమును వర్తమానహస్తలక్షణముగా కీర్తిధరు డిచ్చినాడు. అవయవ సన్నివేశ సౌందర్యము నభివ్యక్తము చేయునది అభినవుని పాఠము. అభినవుడా కొద్ది హస్త వర్తనముల నే గ్రహించి భరతుని హస్తలక్షణములలో పఠించినాడు. కాని కీర్తిధరుని పాఠమున హస్తములు, వర్తనములు వేరువేరుగా కన్పించుటచే లక్షణములు భేదించుచున్నవి. కోహలుడు వర్తనలను, చాలకములను తన సంగీతమేరువున వివరించినా డని చెప్పుచు అందలి శ్లోకములను కల్లినాథు డుదహరించియున్నాడు. కోహలశార్దూల సంవాదరూప మగు సంగీతమేరువున ఇతరవిషయములు గూడ ననేకములు గలవు. అభినవునకు కోహలుని గ్రంథము సుపరిచితమే. కాని కోహలుని వలె వర్తనచాలకములను వేర్వేరుగా పఠించక, ఏకత్ర సమన్వయపరచుటయే అభినవుని వ్యాఖ్యాన విశిష్టముగా కన్పించును. నాట్యశాస్త్ర మభినయపరమని కోహలాదులు ఎంచిరని, రసపరమని అభినవగుప్తుడు భావించినాడని ఇంతటితో స్పష్టమగుచున్నది. కావుననే "శాంతరసోపక్షేపోఽయం భవిష్యతి" అని భట్టనాయకుడు వచించిన గ్రంథప్రయోజనము నభినవగుప్తు డంగీకరించియున్నాడు.

వృత్తులను నిర్వచించు సందర్భమున గూడ పాఠభేదములు, మతభేదములు గలవు. ఇవి గూడ రసాభినయభేదము నాశ్రయించుకొని వచ్చినవే యని చెప్పుటకీశ్లోకములను గమనింపవలెను. రసపరత్వరహితములుగా వృత్తులను చెప్పుసందర్భమున

"శృంగారహాస్యకరుణై ర్వృత్తిః స్యాత్ కైశికీ రసైః
సాత్త్వతీ చాపి విజ్ఞేయా వీరాద్భుతసమాశ్రయా"

అని కోహల పాఠముగలదు.

"శృంగారే చైవ హాస్యే చ వృత్తిః స్యాత్ కైశికీతి సా
సాత్త్వతీ నామ సా జ్ఞేయా వీరరౌద్రాద్భుతాశ్రయా
భయానకే చ బీభత్సే రౌద్రే చారభటీ భవేత్
భారతీ చాపి విజ్ఞేయా కరుణాద్భుతరూపయోః"

అని లొల్లటమతానుసారమైనపాఠమున్నది.

"హాస్యశృంగారకరుణైర్వృత్తిః స్యాత్ కైశికీ రసైః
సాత్త్వతీ చాపి విజ్ఞేయా వీరరౌద్రాద్భుతాశ్రయా
భయానకే సబీభత్సే రౌద్రే చారభటీ భవేత్
భారతీ చాపి విజ్ఞేయా వీరహాస్యాద్భుతాశ్రయా"

అని ఘంటకమతానుసారమగు పాఠము కన్పించుచున్నది. కాని

"వాక్ప్రధానా తు భారతీ
తథా వీరరసప్రాయా విజ్ఞేయా సాత్త్వతీ నృప
తథా రౌద్రప్రచండా భవత్యారభటీ సదా
శృంగారహాస్యబహులా తథా భవతి కైశికీ"

అని విష్ణుధర్మోత్తరపాఠము గలదు. ఈ పాఠము నకు సన్నిహితముగా

"హాస్యశృంగార బహులా కైశికీ పరిచక్షితా
సాత్త్వతీ చాపి విజ్ఞేయా వీరాద్భుత సమాశ్రయా
రౌద్రే భయానకే చైవ విజ్ఞేయారభటీబుధైః
బీభత్సకరుణే చైవ భారతీ సంప్రకీర్తితా"

అని అభినవుని పాఠ మున్నది. కోహలపాఠమును విద్యానాథు డంగీకరించినాడు. కాని అభినవుని పాఠము భరతమునిసమ్మతముగా కన్పించుచున్నది. ఇచ్చట కన్పించు పాఠభేదము ఉత్సృష్టికాంకమున నే వృత్తిని యోజించవలె నను విషయమున భిన్నవాదములకు దోహద మొసగినది. ఉత్సృష్టికాంకమున న్యాయవృత్తి, అన్యాయవృత్తి, ఫలవృత్తి గలవని ఉద్భటునివాదము. ఈ న్యాయవృత్తియే కోహలుని కైశికీవృత్తి. లొల్లటుడు ఫలవృత్తి నంగీకరించలేదు. ఉత్సృష్టికాంకమున సాత్త్వతీవృత్తియే ఉండవలె నని శంకుకుని మతము. సాత్త్వతీ నిర్వచనమున 'శమాశ్రయా' అనుపాఠము నంగీకరించిన కోహలుడు ఈ వృత్తి సందర్భమున శాంతరసమును ప్రస్తుతింపవలసివచ్చినది. ఉత్సృష్టికాంకమున భారతీవృత్తి నే అభినవు డంగీకరించినాడు. ఉద్భటుని పంచమవృత్తిని శంకుకుడు సహితము నిరాకరించియున్నాడు. అభినవుడు మాత్రము భరతుని భావములకు వ్యతిరేకముగా శాస్త్రమును ప్రవచించలేదు. ప్రాచీన మతములలో నెన్నింటిని సులభముగా నంగీకరించ వీలున్నదో, వాటి నన్నింటిని వివేచించినాడు. తాను స్వీకరింపజాలని పాఠమును, భావమును సోపపత్తికముగా వివరించినాడు.

సమవకార లక్షణమున :

"ఉష్ణిగ్గాయత్రీ వా యాని తథాన్యాని బంధకుటిలాని
వృత్తాని సమవకారే కవిభి ర్నైవ ప్రయోజ్యాని".

అని ఉద్భటుని పాఠముగలదు. కాగా ధర్మ కామశృంగారములకు గతి కల్పించబడినది. కాని

"ఉష్ణిగ్గాయత్ర్యాద్యా న్యన్యాని చ యాని బంధకుటి లాని
వృత్తాని సమవకారే కవిభి స్తాని ప్రయోజ్యాని."

అని అభినవునిపాఠ మున్నది. సమవకారమున సంధ్యంగములకు విద్రోహ కపటముల కిచట గతి కలుగుచున్నది. అల్పేతర వృత్తులను గాక ప్రస్తారాది వృత్తులనే యోజించవలె నని ఉద్భటుడు వ్యాఖ్యానించుట అభినవునకు సమ్మతము కాదు.

హస్తాభినయమున వాచికప్రాధాన్యమును తెలుపు సందర్భమున

"ఉత్తానః పార్శ్వగ శ్చైవ తథాధోముఖ ఏవ చ
ప్రచార స్త్రివిధో౽గ్రాణాం నాట్యనృత్తసమాశ్రయః'

అని అభినవుని పాఠమున్నది. కాని "ఉత్తానో౽థ స్థల స్త్ర్యశ్రో౽గ్రగో౽ధోముఖ ఏవచ పఞ్చప్రచారో హస్తస్య నాట్యనృత్త సమాశ్రయః" అని ఉద్భటుడు పఠించుచు పంచప్రచారములను చెప్పినాడు. కాని హస్తప్రచార త్రైవిధ్యమే అభినయమునకు లాలిత్యమును, సౌష్ఠవమును తీసికొని రాగలవు గనుక ఉద్భటుని పాఠమును త్రోసివేయవలసి వచ్చుచున్నది.

అభినవుని పాఠము ననుసరించి ఇరువది తొమ్మిదవ అధ్యాయమున మొదటి శ్లోకము :

"షడ్జోదీచ్యవతీ చైవ షడ్జమధ్యాతథైవ చ
మధ్యమపంచమ బాహుల్యా త్కార్యా శృంగార హాస్యయోః

అని గలదు. కాని ప్రాచీన పాఠమున "షడ్జ పంచమ" అని కన్పించుచున్నది. ఐనను [మా'

'హాస్యశృంగారయోః కార్యౌ స్వరౌ మధ్యమపంచమౌ'
'మధ్యమపంచమ భూయిష్ఠం గానం శృంగార హాస్యయోః'

అను భరతుని వాక్యములవలన అభినవుని పాఠమే భరత సమ్మతమైన దని వ్యక్తమగుచున్నది. "షడ్జ పంచమ" మను పాఠమును నాన్యదేవుడు గూడ గ్రహించినాడు.

ఈ రీతిగా పాఠభేదములు, విషయభేదములు చాల కన్పించుచున్నవి. నాట్యశాస్త్రము రససిద్ధాంతము నే ప్రధానముగా ప్రపంచించుచున్నదని సంప్రదాయవచనము గలదు. అందుచే ఏతన్మార్గావలంబియగు అభినవుడు పఠించిన నాట్యశాస్త్రమే మనకు ప్రామాణికము కావలెను.

విషాదాంతం

నాగభూషణ్

* గతసంచిక తరువాయి

రెండవ రంగం

* * సూర్యం, చంద్రం అలా కూర్చునే వుంటారు. కుసుమ వస్తుంది. మనిషి అతినవీనమైన నాగరిక యువతి... మాటా, చేతా కూడా అందుకు అనుగుణంగానే వుంటయ్. భాగ్యవంతులపిల్ల, చదువుకున్నది, కాస్త అందమయినది కూడాను. ఆమెలో లేని లోపం—సాధారణంగా అలాంటి పిల్లలకుండే గర్వం లేకపోవడం.

కుసుమ : హల్లో! సూర్యం...గూర్నింగ్ చంద్రం... (ఎవ్వరూ మాట్లాడరు) అరె! ఏమిటిది?... ఓ సూర్యచంద్రులారా! మీ దయా సముద్ర తరంగములను మాపైపు తరలించకున్న, మే మందరమును బీడుపట్టిన భూములవలె, నీరు లేని లతలవలె, ప్రేమలేని హృదయములవలె ప్రమోదైపోమా? అందుకే, మామీద అనుగ్రహించకుండా, తమ అనుగ్రహాన్ని ప్రసాదించండి—

సూర్యం: సూర్యచంద్రులు నీ ప్రార్థనను అంగీకరించారు.

చంద్రం: నీ తపస్సుకు మెచ్చారు. ఏం కావాలో కోరుకో—

కుసుమ : మీరు నా ప్రశ్నలకు సమాధానం చెప్పడమే నాకు కావలసిన వరం.

చం : మేము సిద్ధముగా నుంటిమి. నీ ప్రశ్న లేవి?

కుసుమ : అవధరింపుడు దేవరలారా! మీ యీ మౌన విషాదవదనములకు కతంబెద్ది?

చం : ఆ ప్రశ్నకు సమాధానము చెప్పబడదు.

కుసుమ : ఏమిటి సూర్యం? ఎందుకలా వున్నారు? నిజం చెప్పండి.

సూ : ఏం చెప్ప మంటావు కుసుం? మన నాటకానికి మధ్యలోనే భరతవాక్యం పలికారు.

కుసుమ : ఏం?

చం : ఏం ఏమిటి? కథానాయకుడే కాదంటున్నాడు.

కుసుమ : ఎందుకని?

సూ : పైనున్న ఆ భగవంతుడికి తప్ప వాడికి కూడా తెలియదు. నాన్న నాటకాలంటేనే చెడిపోతున్నావని కేకలు వేశాడు. అందువల్ల నాన్న ప్రసన్నుడిగా వుండి నెయ్యలోనే నాటకంలో తను వెయ్యకుండా నాన్న నిరాదరణ తీర్చుకుందా మనుకుంటున్నాడు అన్నయ్య.

కుసుమ : నువ్వనుకోనే ప్రవాదాలన్నిటికీ, ప్రచారాన్ని కల్పించి ప్రమాదాన్ని తీసుకురాకు. మీ అన్నయ్య ఎందుకు వద్దన్నాడో సరిగ్గా తెలియకుండా—

చం : అసలు వాడు చెబుతున్న కారణం, వాడి ప్రక్కన వేసే నాయిక లేదని.

సూ : ఓ! గొప్ప ఐడియా! అవాడు ఇజాక్ న్యూటన్‌కు వచ్చింది. ఇవ్వాళ మనకు వచ్చింది.. కుసుం! నువ్వే వేస్తేనో ఆ వేషం?

కుసుమ : నేనా!

సూ : అవును, నువ్వే!

కుసుమ : నాకు చేతకాదు బాబూ!

సూ : ఇన్సల్ట్... ఇంతమందిమి హేమా హేమీలం ఇక్కడ వున్నాం. ఇంకా చేతకాదంటావా? నువ్వు 'ఊ' అను, నీకు తయారీ తినిపిస్తాం. ఒక అయిదు, ఆరు నెలల్లో. శ్రీమతి—తప్పు తప్పు—కుమారి కుసుమా దేవి ఆంధ్రదేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి నటీమణి కాబోతున్న దనడంలో ఆశ్చర్యం అణుమాత్రంకూడా లేదు.

కుసుమ : నేను చెయ్యను సూర్యం. అమ్మా, నాన్నా వింటే ఇంకేమైనా వుందా?

సూ : చాలా సంతోషిస్తారు... నీకు యిష్టం వున్న దను. మిగిలిన అడ్డంకు లన్నింటినీ ఆంజనేయుడు సముద్రం దాటినట్టు, అవలీలగా దాటేస్తాను.

చం : ఇంతకూ కుసుమ సందేహానికి సమాధానం?

సూ : విను మరి—కుసుమాదేవిగారు ఏ నెపంతోనైతే మన యింటికి పంపబడుతున్నదో, ఆ నెపమే దీనికీ సమాధానం చెబుతుంది.

కుసుమ : అంటే?

సూ : అంటే, ఎవరికోసమైతే వీరు ఈ యింటికి వస్తున్నారో—వారే స్వయంగా ఆహ్వానించారనుకోండి—

చం : అంటే?

సూ : ఇంకా అంటే ఏమిట్రా, అంటే?—అంతే! మట్టి బుర్ర!

చం : మట్టిబుర్ర ఏమిట్రా? ఎప్పుడో పట్టేస్తే—

సూ : ఏశాబాష్... ఏమంటావు కుసుం?

కుసుమ : ఏమిటది?

సూ : వేషం వెయ్యడానికి—అభ్యంతరం లేదు కదా!

కుసుమ : మరి మీ అన్నయ్య—?

సూ : అవన్నీ నాకు వదలమంటిని గదా!

కుసుమ : సరే!

సూ : థాంక్స్... ఇవ్వాళ ఇంత గొప్ప సమస్యను పరిష్కరించినందుకు నన్ను నేను అభినందించుకోకుండా వుండలేకపోతున్నాను.

చం : నేను?

సూ : ఇంకా నేను అంటావేరా? అమాంతం నన్ను అభినందించక!

చం : (నీరసంగా) అంతేనా?

సూ : ఏడవకురా... ఏడ్చినా మొగుడ్ని కొట్టిన ఆడవాళ్ళమాదిరిగా పబ్లిక్ గా ఏడవకూడదురా—సరే! ఇంతవరకూ ప్రతివిషయంలోనూ మనం భాగస్వాములం కాబట్టి, దీని బాపతు క్రెడిట్ నీకూ సగం యిచ్చాను. తీసుకో—

కుసుమ : ఇక వెడతాను—

చం : ఇంటికా?

సూ : ఆహాఁ!—ఇంట్లోకి—

కుసుమ : ఏయ్ సూర్యం! ఏమిటి ఇందాకటినుంచీ చూస్తున్నాను, మరీ అంత మిడిసిపడుతున్నావ్?

సూ : ఓహోహో! ఎంత సున్నితమైన కోపం? ఈ ఆకారంలో నిన్ను చూచి నీ మాటలు విన్నవాడు ఓ నటకుడైపోయాడు. కాని, అదే ఒక కవి అయితే, నీమీద అనువుగా అమాంతం ఓ లక్ష పద్యాలు చెప్పి, వాటిని నీకే అంకితం చేసేవాడు. నీకు జీవితాంతం దాసోహం చేసేవాడు... కాని ఈ నిర్భాగ్యుడేం చెయ్యగలడు?

కుసుమ : తొందరపడకు. నువ్వూ కవిత్వం చెప్పే రోజులు రావూ? రాధ నీచేత ఎప్పుడు కవిత్వం చెప్పిద్దామా అని చూస్తోంది—

చం : ఏ రాధ? కొంపదీసి—

కుసుమ : ఆఁ! మీ క్లాసుమేటు రాధే! అక్కడికే వెడుతున్నాలే... చెప్తాను...

చం : ఏమనో?

కుసుమ : ఆ కోతిని పెళ్ళిచేసుకొని చెవులు పట్టుకు సాగదియ్యమని.

సూ : ఇంతపనికట్టుకునీ అక్కడకు వెడుతున్నావు గనక, ఆ అమ్మాయితో చెప్పు... కోతులు మరీ పెద్దకోతికి గాని లొంగవని—

కుసుమ : అదే చెబుతాను. ఆ అమ్మాయి నిన్ను గురించి అడగని క్షణం లేదు.

సూ : వెళ్ళు, వెళ్లు... తుమ్మెదకోసం పువ్వు విచ్చుతుందో, పువ్వుకోసం తుమ్మెద వస్తుందో చూస్తాం.

చం : విష్ యు గుడ్ లక్...

కుసుమ : అదుగో!—(అంటూ త్వరగా వెళ్లిపోతుంది. ఇద్దరూ దీర్ఘనిశ్వాసాలు విడిచి, కరచాలనం చేసుకుంటారు.)

[రామం వస్తాడు. దేనికోసమో ఆతృతతో ఎదురుచూస్తూ వుంటాడు. మనిషిలోనూ, మాటలోనూ తొందర.]

సూ : కంగ్రాట్యులేట్ చెయ్యరా బ్రదర్!

చం : షేక్—(ఇద్దరూ చేతులు చాస్తారు.)

రామం : ఎందుకురా?

సూ : నువ్వు ఇంతవరకు నాటకం వెయ్యడానికి చూపిన అభ్యంతరాలన్నింటినీ అధిగమించి విజయం సాధించాం కనుక—

రామం : సరిగ్గా చెప్పండిరా—

చం : కుమారి కుసుమాదేవిగారు మన నాటకంలో కథానాయికగా వెయ్యడానికి ఒప్పుకుంది.

రామం : (నిస్పృహతో, నిట్టూర్చి) ఆc..(కుర్చీలో కూర్చుంటాడు.)

సూ : దీన్లో అంత మూర్ఛ నటించవలసిన దేముందిరా?...నువ్వు ఆనందంతో ఆకాశం అంత ఎత్తున ఎగురుతావని నే ననుకుంటే, అమాంతం క్రిందపడ్డావ్!

రామం : ఆవిడ వేషంవేస్తే మనం నాటకాలు వెయ్యడం ఎందుకురా? చెప్పులషాపు పెట్టుకోవచ్చు.

సూ : బ్రదర్! నీ అభ్యంతరాలు నా కర్థంకావడం లేదు. నాటకాలు వెయ్యడానికి సంస్కారవతులైన 'ఫామిలీలేడీస్' రావాలని ప్రపంచమంతా ఘోషిస్తావుంది. నాటకకళారాధనలో నటరాజును మనం మరో వినూత్నమైన పువ్వుతో పూజిస్తున్నామని గర్వపడక, ఊసూరుమంటావ్?

రామం : నీ వుపన్యాసం కట్టిపెట్టి, కాసేపు అవతలకు పో—

చం : (సూర్యంతో) రామానికి ఈ రంగంలో పనివుంది కాబోలు రా!—

రామం : ఆc! వుంది—

చం : ఆ పని యేమిటో ఈ భృత్యులకు కూడా చెప్పి పుణ్యం కట్టుకుందురూ!

రామం : నాకు పుణ్యం అక్కర్లేదు నడవండి.

సూ : మరి నాటకం వేస్తానని వాగ్దానం చెయ్యి.

రామం : అట్లాగేరా నాయనా! ఇకనైనా వెధవ వేషాలు వెయ్యక బయటకు నడవండి.

చం : మనం వేసేవి మంచి వేషాలయినట్లు!

సూ : వాడికేరా? జానపద నాటకాల్లోనూ, పౌరాణిక నాటకాల్లోనూ వాడు యువరాజు; సాంఘికాల్లో అయితే ఓ భాగ్యవంతుడి ముద్దుబిడ్డ....ఎక్కడకు వెళ్లినా ఆదరసత్కారాలు, ఏ పనిచేసినా పొగడ్తలు.—తనను ప్రేమించి తనకోసం ప్రాణాన్ని సయితం యివ్వగల ప్రియురాండ్రు—

చం : అబ్బ! గ్రాంధికంతో చంపకురా—ప్రియురాళ్లు అను.

సూ : ఏ రాళ్లయితేనేం వీడి పళ్లు వూడడానికి?.. చిట్టితండ్రి వీడికేరా, మహారాజా బిడ్డ.

[రామం ఎవరికోసమో చూస్తూ, చిరాకుపడతాడు.]

చం : ఎవరికోసమో ఈ నిరీక్షణ?

సూ : ఎవరికోసమో ఎందుకురా? ఏ రాజకుమార్తె కోసమో!—ఎన్ని కోటగోడలు ఎగబ్రాకాలో, ఎన్ని అంతస్థులు ఎక్కాలో, ఎందరితో యుద్ధాలు చెయ్యాలో—(రామానికి కోపం వచ్చిందని తెలుసుకొని) నిజం చెబితే నిష్ఠూరంలేరా బ్రదర్! అయినా మాకెందుకు? వస్తాం....

చం : (వెడుతూ) గుడ్ లక్......[వెడతారు]

[ఓ క్షణం నిశ్శబ్దం...నిశ్శబ్దాన్ని భరించలేనివాడిలా కొంచెంసేపు చిరాకుగా అటూ ఇటూ తిరిగి, చివరకు లోపలకు చూచి, చాలా రహస్యంగా పిలుస్తాడు.]

రామం : విజయా! విజయా!!

[విజయ వస్తుంది. మానసికంగానూ, శారీరకంగానూ కూడా శ్రమించిన మనిషిలా వుంది.]

రామం : చివరకు ఆడవాళ్ళనుంచి సానుభూతి కూడా కరువైంది మాకు.

విజయ : కరువైంది సానుభూతి కాదు. ఆ సానుభూతిని అర్థం చేసుకొనే హృదయాలు లేకపోవడం.

రామం : అర్థం చేసుకున్న హృదయాల ఆరాటం మీరు తగ్గించారు కాబోలు! చరిత్రలో ఎంతవుంది—

విజయ : చరిత్ర సంగతి చెప్పకండి...గతంలో మన గొప్పల్ని చూసి మాత్రమే బ్రతకటం నాకు చేతకాదు.

రామం : పోనీ ఈ రోజుల్లో చూడు...నీకోసం నేను ఎంతగా బాధపడుతున్నానో నీకు తెలుసు. తెలిసి కూడా ఈ సంగతి నాన్నతో చెప్పడానికి నువ్వు ఎందుకు సుముఖంగా లేవో చెప్పు.

విజయ : నాకుమాత్రం ఇలా వుంటే సుఖంగా వుందా చెప్పండి...కాని పరిస్థితులు అనుకూలంగా వుండవద్దా? మీ నాన్నగారు చెప్పే మాటలనుబట్టి మనజీవితాలమనుగడ వుంటుందని మనం జ్ఞాపకం వుంచుకోవాలి.

రామం : ఏమిటి విజ్జీ, నువ్వనేది? ఆయన ఇష్టపడనంత మాత్రాన నా అభిప్రాయాన్ని మార్చుకుంటానంటావ్?

విజయ : నేననన్నానా? కాని ముందే పోట్లాటలతో బయలుదేరడ మెందుకు?

రామం : పోట్లాటలతో బయలుదేరడం నాకూ యిష్టం లేదు విజ్జీ. కాని నా అభిప్రాయాలతో ఆయన ఏకీభవించలేకపోతే అందుకు నేను కాదు బాధ్యుణ్ణి.

విజయ : మీరు మాత్రం తొందరపడకండి.

రామం : తొందరా! ఇంత దగ్గరగా వుంటున్నా, ఈ ఇంట్లోనే, దూరంగా నిన్ను చూచి, నీ దగ్గరకు రాకుండా, నన్ను నేను నిగ్రహించుకోమంటావ్? ఇన్నాళ్ళు చూపించిన ఓర్పు చాలు...ఇక—

విజయ : (నోటికి కష్టంగా చెయివుంచి, వారిస్తూ) అదే! మీ యీ తొందర మనకు ఎప్పుడే ప్రమాదం తీసుకువస్తుందోనని నాభయం.

రామం : భయం ఏమీ అక్కర్లేదు ... (విజయను దగ్గరకు తీసుకొని) నాన్నగారిని ఇంటికి రానీ, ఈపూట తప్పకుండా చెబుతాను.

[ఇంతలో ప్రసాదరావు వస్తాడు. రామం చివరిమాట ఆయన విన్నాడు. వాళ్లిద్దర్నీ అలా చూడగానే ఆయనకు కోపం వచ్చిన మాట నిజమే కాని, చాలా నిగ్రహించుకుంటాడు. ఆయనను చూసి ఇద్దరూ భయపడి, దూరంగా జరుగుతారు. విజయ పాలిపోయింది. ఆమె మొహంలో నెత్తురు చుక్క లేదు. రామమోహన్ కూడా ముందు జంకినా, తరువాత ఓ నిశ్చయానికి వస్తాడు].

ప్రసా : నువ్వు వెళ్ళమ్మా—(విజయ వెళ్ళడానికి సంకోచిస్తుంది.) వెళ్లు విజయా, మేం కొంచెం మాట్లాడుకోవాలి. (వెడుతుంది.) (ఓ క్షణం ఆగి) ఏమిటిదంతా? (రామం మాట్లాడడు.)

ప్రసా : నిన్నే ఏమిటిది?

రామం : నేను విజయను ప్రేమిస్తున్నాను.

ప్రసా : ప్రేమించు. దానికేం?

రామం : పెళ్ళి చేసుకుంటాను.

ప్రసా : అబ్బా! అంతవరకు వచ్చిందా? ఎన్నాళ్ళనుంచీ ఆడుతున్నారీ నాటకం?...మొన్న వేసంకాలం సెలవులకు నువ్వు దీనికోసమన్నమాట పల్లెకువెళ్ళింది ... స్టేజీమీదనే కాక జీవితంలో కూడా నాటకాలు ఆడుతున్నావన్నమాట!

రామం : ఎగతాళికాదు నాన్నా...నిజంగా చెబుతున్నాను.

ప్రసా : అంటే, విజయను నేను పెళ్ళిచేసుకుంటాను, నమ్మమంటావ్?

రామం : ఏం? నమ్మకుండా వుండవలసిన అగత్యం దానిలో ఏమీలేదే!

ప్రసా : చాలావుంది.

రామం : ఏమిటది?

ప్రసా : నేను ఒప్పుకోను కనుక—

రామం : దీనికి అభ్యంతరం ఏమిటో చెప్పండి... నేను విజయను పూర్తిగా అర్థంచేసుకున్నాను. ఆమె కూడా అంతే—

ప్రసా : ప్రేమించుకొని పెళ్ళిచేసుకుంటున్నామనుకొనే యువతీయువకు లందరూ అదే సమాధానం చెబుతారు. కాని వాళ్ళ జీవితం తప్పులతో మొదలైకాని, మామూలు మార్గాన పడదు.

రామం : పోనీ, నన్ను ఆ మార్గాన్నే నడవనివ్వండి.

ప్రసా : అది ముళ్లున్న మార్గం.... నాకు తెలిసివుండి కూడా నిన్నెలా పోనిస్తాను?

రామం : అంటే, మీరు ఈ పెళ్లికి ఒప్పుకోనంటారు!

ప్రసా : పెళ్ళంటే దబాయింపు కాదోయ్. నువ్వు ఇప్పుడీ పెళ్ళిచేసుకోడానికి నీకున్న అర్హత ఏమిటి? నువ్వు మగవాడివి, విజయ ఆడది కావడమేనా? కానీ సంపాదించడం చేత కాదు, పైగా ఇంటినుంచి వందలకు వందలు తీసుకువెళ్ళి, నాటకాల పేరుతో నాశనం చేస్తావ్! ఇదేనా నీ ఘనత?

రామం : ఇవ్వాళ వుంది కాబట్టి ఖర్చు పెడుతున్నాం. రేపు లేకపోయినా ఇలాగే ఖర్చు పెట్టాలనుకున్నవాడు మూర్ఖుడై వుండాలి.

ప్రసా : వాడెవడైతేనేం? నువ్వు మాత్రం అది కాకుండా చూసుకో!

రామం : అభయం మీ కక్కర్లేదు. నన్ను నేను పోషించుకోగల స్తోమతు, పోషించుకోగల నన్న ధైర్యం నాకున్నాయ్.

ప్రసా : నిన్ను గురించి నువ్వు అంతగా భ్రమపడకు. చాలామంది తమనుగురించి గొప్పగా వూహించుకోనే, తమ జీవితాన్ని నాశనం చేసుకుంటారు...సరే! అవన్నీ ఎందుకు? నువ్వు విజయనే పెళ్ళిచేసుకోవడానికి స్థిరపరుచుకున్నానంటావ్! (రామం తల తిప్పుతాడు.) నాకు యిష్టం లేకపోయినా?

రామం : ఎందువల్ల చెప్పండి....విజయ చిన్నప్పటి నుంచీ ఇక్కడే పెరిగింది. నాతోపాటు చదివింది. అమాటకువస్తే నాకంటె ఎక్కువ చదివింది. ... చదువూ, చక్కదనం; సంస్కారం, — ఇన్నీవున్న మనిషిలో లోటేమిటో నాకర్థం కావడంలేదు.

ప్రసా : నీకు తెలిసింది అంతవరకే— కాని అంతకు మించినవి అనేకం యీ వివాహానికి అభ్యంతరాలు కాగలవని నీకు తెలియదు. .. ఇన్నీ ఆలోచించావుకాని, మీ యిద్దరిమధ్య నున్న అంతస్థులసంగతి ఆలోచించావా?

రామం : అదే అభ్యంతరమైతే, దాన్ని నేను నిరభ్యంతరంగా అధిగమిస్తాను.

ప్రసా : అంటే, అది నీకు స్వల్పమైన అభ్యంతరంగా కనిపిస్తున్నదన్నమాట!

రామం : అసలు నాకది అభ్యంతరంగానే కనిపించటం లేదు. ఊహాలతో గోడలను నిర్మించుకొని అవతల వున్న మనిషి ఇవతల లేడన్న నెపంతో అమనిషి మనిషి కాదనడం వివేకం కాదు

ప్రసా : తరతరాలనుంచి శ్రమించి నిర్మించిన ఈ అంతస్థులను ఇవ్వాళ నీ ఒక్కమాటవల్ల నాశనం చెయ్యదలచుకుంటే, నువ్వు బికారిగా మాత్రమే మిగుల్తావు.

రామం : నాకాభయం ఎప్పుడూ లేదు.

ప్రసా : అదుగో! ప్రతిదానికీ అడ్డుచెబుతావు, నీ సంగతే నీది కాని ఎదుటివాళ్ల సంగతి పట్టదేం! ఆ జడ్జీగారు వాళ్ల అమ్మాయిని చేసుకోమంటున్నారు. మన కంతకన్న మంచిసంబంధాలు రావు. ... నామాటకాదనక, ఆ అమ్మాయిని చేసుకో!—

రామం : ఆ అమ్మాయినా? ఆ నడక, ఆమాట— దేవలోకంనుంచి దిగివచ్చిన అప్సరస ఏమీ కాదావిడ—

ప్రసా : కాకపోవచ్చు. కాని అయినంతస్థుల మేడమీదనుంచి దిగివస్తుంది.

రామం : అంతస్థులు నిర్మించడం, వాటినిగురించి గొప్పలు చెప్పుకోవడమే పనిగా పెట్టుకున్న వాళ్లు నాతో ప్రయాణం చెయ్యలేరు. నేల మీద, నాతోపాటు నడవగలిగిన వాళ్లెవరైనా నాకు చాలు.

ప్రసా : ఈ ఇంట్లో ఇంత చనువు ఇచ్చాను. కన్న కూతురుగా చూసుకున్నందుకు ఆ అమ్మాయి చేసేపని యిదేనా?

రామం : ఇందులో ఆ అమ్మాయి చేసిం దేముంది నాన్నా? అయినా ఆమెను మనిషిని చేద్దామని తీసుకువచ్చి, తీరా మనిషిగా తయారైనతర్వాత ఆనందించవలసిందిపోయి, కోపగిస్తారా?

ప్రసా : ఇంకా నయం. నేను కాబట్టి ఇంత జరిగిన తర్వాత మాట్లాడకుండా వూరుకుంటున్నాను. అయినా ఇన్నాళ్లు పెంచి పెద్ద చేసినతండ్రికి నువ్విచ్చే ప్రతిఫలం ఇదన్నమాట!

రామం : అందుకు నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. కాని నేను ఆమెకు వాగ్దానంచేశాను.

ప్రసా : ఈ వాగ్దానాల కేముంది? మనం చేశామనుకుంటె వుంటయ్, లేకపోతే లేదు.

రామం : అలా అనకండి నాన్నా! నేను మాట యిచ్చి మాత్రం మనసు మార్చుకోలేను.

ప్రసా : నేనుపట్టిన కుందేటికి మూడే కాళ్ళని పోట్లాడ్డం మూర్ఖులు చెయ్యవలసినపని. నేనూ జడ్జీగారికి వాగ్దానం చేశాను. కొడుకుగా నా వాగ్దానాన్ని బలపరుస్తావో, ప్రియుడుగా ఆమె వాగ్దానాన్ని మన్నిస్తావో ఆలోచించుకో—

రామం : నేను వెళ్లి జడ్జీగారిని క్షమాపణ వేడుకుంటాను...కుసుమనూ ఒప్పిస్తాను.

ప్రసా : నాకోసం ఒకళ్లదగ్గరకు వెళ్లి వేడుకోవలసిన అగత్యంలేదు. నీ వాగ్దానంకోసం మంకుపట్టు పట్టి నువ్వు వినకపోతే, నా వాగ్దానం చెల్లించుకోవడానికి నేనూ అంతే పట్టుపట్టవలసి వస్తుంది.

రామం : అంటే, నేను విజయను పెళ్లిచేసుకోకుండా చేస్తానంటారు. అంతేనా?

ప్రసా : నా మాటలకు లేని అర్థాలను ఆపాదించకు. వాటికి ఎంతవరకు అర్థంవుందో అంతవరకే తీసుకో!—అయినా కుసుమకు ఏం తక్కువ? చదువు లేదా? సంస్కారం లేదా? అందం లేదా? అంతస్థు లేదా?

రామం : అవన్నీ విజయలోమాత్రం లేవా? మీరు పై అంతస్థున వుంటూ, 'ఆ ఎత్తున వున్న వాళ్లను మాత్రమే చూస్తాను, క్రిందవున్న వాళ్లను చూడను' అంటే మీ అభిప్రాయాలతో నేను ఏకీభవించలేను.

ప్రసా : అంటే, కుసుమను పెళ్లిచేసుకోవడం నీ కిష్టం లేదన్నమాట!

రామం : అవును.

ప్రసా : సరే! నా ఆస్థిలో ఒక్క చిల్లిగవ్వ కూడా నీకు దక్కడం నాకు యిష్టంలేదు...నీ యిష్టం వచ్చినట్లు వూరేగు. (వెళ్ళిపోతాడు.)

[రామం బాధతో కుర్చీలో కూర్చుంటాడు. ఒక నిమిషం ఆలోచించి, ఏదో నిశ్చయానికి వచ్చినట్లు తలపంకించి, విజయను పిలవడానికి లేస్తాడు—ఇంతలో కుసుమ వస్తుంది. మనసులో మండుకు పోదా మన్న ఊహ తిరుముకు వస్తు వుంటుంది]

కుసుమ : హల్లో, రామం! గుడ్ మార్నింగ్.

రామం : (డీలాపడిపోతాడు నీరసంగా) మార్నింగ్.. కులాసానా?

కుసుమ : ఏదో—ఉన్నాం...నువ్వు మద్రాసునుంచి వచ్చిన తర్వాత ప్రతిపూట నీకోసం ఎదురు చూడడమే! మొన్న సాయంకాలం వస్తానని డాడీతో చెప్పావట. ఎంత 'డిజపాయింట్' చేశావ్? నిన్ను నేను కాబట్టి క్షమించాను. మరొకరైతేనా—?

రామం : థాంక్స్...ఆమాత్రం దయ నామీద వుంచి. అంతే చాలు!

కుసుమ : అది దయ అనకు రామం...నా కది చాలా సరదా!

రామం : ఏమి టది? నేను తప్పులు చెయ్యడమా!

కుసుమ : అవును. మగవాళ్లు తప్పులుచేసి తప్పించుకోవడానికిచూస్తే ఎంత తమాషాగా వుంటారని! వాళ్లంటే నాకు సరదా.

రామం : ఇదేదో కొత్తరకం సరదా...సరే! నాన్నగారు కులాసానా?

కుసుమ : ఆఁ! నువ్వొస్తావని ప్రతిపూటా ఎదురు చూస్తున్నారు.

రామం : అరెరె! ఎంతమాట! కాకితో కబురంపితే, రెక్కలు కట్టుకొని వాలేవాణ్ణి—

కుసుమ : అలా అనడం బాగులేదు రామం. నీకున్న గౌరవం, డిగ్నిటీ నీది. డాడీకివుంది డాడీది—

రామం : నువ్వు చెప్పే డిగ్నిటీ మనుష్యుల్లో వుంది కాని, మనసుల్లో లేదు. మాటల్లో వుంది కాని చేతల్లో లేదు. అటువంటి డిగ్నిటీ పేరు చెబితేనే నాకు జ్వరం వస్తుంది.

కుసుమ : వస్తే, నేను నయంచేస్తాను.

రామం : నీవంటివాళ్లు డాక్టర్లు కాలేరు. కుసుమా! అయినా, వస్తే నయంచేద్దామనుకొనేకన్న అసలు రాకుండా చెయ్యడం మంచిది కాదూ?

కుసుమ : ఏం చెయ్యాలంటావ్?

రామం : అదుగో, ఆ నీతివచనాలు పలకకపోవడమే!

కుసుమ : ఆల్ రైట్ ... నువ్వేం చెయ్యమంటే అదే చేస్తాను. (ముళ్లమీదవున్నట్లుగా వుంటాను) థాంక్స్ ... అన్నట్లు, నువ్వు పనివుండి వచ్చినట్లున్నావ్. విజయ యింట్లో లేదా?

కుసుమ : ఏమో—కాని, ఇవ్వాళ నీకో గొప్ప సంగతి చెబుతాను.

రామం : (నీరసంగా) ఊఁ...

కుసుమ : నువ్వు విని ఎంతఆశ్చర్యపడతావో తెలుసా?

రామం : నువ్వు చెప్పిన ఏ విషయం ఆశ్చర్యంగా లేదు?... చెప్పు.

కుసుమ : నేను ఇందాక ఇక్కడకు రాగానే సూర్యం అడిగాడు—నువ్వు రామంప్రక్కన నాటకంలో వేస్తావా అని ... నేను వెంటనే ఒప్పేసుకున్నాను ... నేను వెయ్యగలనా?

రామం : ఆఁ!

కుసుమ : నిజంగా!

రామం : ఏమిటది?

కుసుమ : అదే! నేను బాగా వెయ్యగలనా?

రామం : ఏమిటి?

కుసుమ : శ్రీరామచంద్రా! ఇందాకటినుంచీ చెప్పిందంతా పోయింది నీ ధ్యాస యిక్కడేమీ వున్నట్లు లేదు—నేను నీతోపాటు నాటకంలో వేద్దాం అనుకుంటున్నాను... వెయ్యగలనా?

రామం : అదా!...ఏమో, నేనేం చెప్పగలను? జీవిత నాటకాల్లో బాగా నటించగలవారు స్టేజి మీద అంతగా రాణించలేరని అంటారు.

కుసుమ : నువ్వు డైరెక్టు చేసినా—

రామం : దర్శకుడిదేముంది? మెరుగులు దిద్దగలడు కాని సృష్టించలేడుకదా! ఆర్టిస్టు పుట్టాలి కాని, తయారుకాలేడన్నారు—

కుసుమ : అయినా నేను వేస్తాను రాం. నాకు చాలా సరదాగా వుంది.

రామం : మనిషి ప్రాథమిక హక్కులను నిలబెట్టుకొనే అధికారం లేదు. ఇక సరదాలు తీర్చుకుంటాననటావ్!

కుసుమ : నీకు యిష్టం లేదనుకుంటాను—అయినా చెప్పు—నువ్వు వద్దంటే మానేస్తాను.

రామం : వద్దని చెప్పడానికి నేనెవర్ని కుసుమా! నీ యిష్టం—

కుసుమ : థాంక్స్.

రామం : సరే!.. నేను కొంచెంసేపు రాసుకుంటాను.

కుసుమ : మేం చూడకూడదు కాబోలు! ప్రేమలేఖలా ఏం?

రామం : కాకూడదా?

కుసుమ : అబ్బే తమాషా కడిగాను—సరే, రాసుకో—ఇంట్లోకి నడతాను.

రామం : గుడ్ బై—

కుసుమ : అప్పుడే గుడ్ బై కొట్టకండి సార్ ...వెళ్లేటప్పుడు మీ దర్శనం చేసుకోకుండా పోతానా?

[వయ్యారంగా వెళ్లిపోతుంది. రామం దీర్ఘమైన నిశ్వాసం వదిలి చుట్టూ చూస్తాడు. మధ్యగదిలోనుంచి విజయ వస్తుంది.]

రామం : (సంతోషంతో, దగ్గరగావచ్చి) విజ్జీ! ఇప్పుడా రావడం! (అవునని తల వూపు

తుంది.) గంటనేపట్నుంచీ నీకోసం వెతుకుతున్నాను. ఇంతలో పావకంలో పుడకలా ఆ కుసుమకేశిగారు దాపురించింది.

విజయ : ఆవిడనేమీ అనకండి ... ఎంతైనా మీకు కాబోయే యిల్లాలు!

రామం : ఇల్లాలా! ఛీఛీ!....విజ్జీ! నువ్వు రామాన్ని అర్థం చేసుకున్నది అంతవరకే నన్నమాట! నేను నా జీవితాన్ని ఎంత నిర్లక్ష్యంగా చూసుకున్నా, మరొకళ్ళ కిచ్చినమాటను మాత్రం నిర్లక్ష్యంగా చూడలేను.

విజయ : అలా అని, పరిస్థితుల నెంతకాలం ఎదిరించగలరు, చెప్పండి.

రామం : అవి స్వాధీన మయేటంతవరకు—మధ్యలో నే జారిపోయేటంత బలహీనుణ్ని కాదు.

విజయ : పరిస్థితు లంటే ఏమనుకుంటున్నారు? తల్లిదండ్రుల్నీ, ఆస్తిపాస్తుల్నీ — అన్నింటినీ వదిలాలి—వద్దు. అంతదూరం రానివ్వకండి.

రామం : ఏమిటి విజ్జీ నువ్వంటున్నది? అర్థంలేకుండా వాళ్లు అడ్డుపుల్లలు వేస్తుంటే, మన జీవితాల్ని నాశనం చేసుకుందామంటావ్! ... విజ్జీ! నిన్ను వదిలి నేను వుండగలనా, చెప్పు.

విజయ : పోనివ్వండి. అనామకురాలిని ... నా కేముంది?...నాకోసం మీ రింత బాధ పడుతున్నారు!—

రామం : అసలే నాకు మన సేమీ బాగు లేదు...నన్ను ఇంకా బాధ పెట్టదలుచుకుంటే అవన్నీ చెప్పు—

విజయ : క్షమించండి—ఇప్పుడేం చెయ్యగలం?

రామం : ఇంకా ప్రశ్నలదగ్గరేవుంటే ఎలా? నువ్వు సిద్ధంగా వుండు. మరోగంటలో ఇక్కడి నుంచి మన ప్రయాణం—

విజయ : ఎక్కడికి?

రామం : ముందు మనవూరు...ఆ తరువాత ఎక్కడో ఒకచోట వుద్యోగం చూసుకోవడం—

విజయ : అంత త్యాగం చేస్తున్నారు...నాకోసం—

రామం : అదుగో! నీకోసమనే ఎందుకనుకోవాలి? నాకోసం మాత్రం కాదా? నువ్వు లేకుండా నేనూ లేను. ఇప్పటికే ఈ నావ, దారీ డొంకా లేకుండా అస్తవ్యస్తంగా నడుస్తోంది. నువ్వు చుక్కాని పట్టకపోతే అది వెళ్ళి పర్వతానికో కొట్టుకోవడం, ఏ ముక్క కాముక్క విరిగిపోవడం తప్పదు.

విజయ : (దుఃఖాన్ని ఆపుకోలేక తన చేతులతో ముఖాన్ని దాచుకుంటుంది) రామం! (రామం ఓదార్పుగా ఆమె భుజంమీద చెయ్యి వేస్తాడు.)

రామం : భయపడకు విజయా! నేను ఎప్పుడూ నీ వాణ్ణే!

[ఇంతలో ప్రసాదరావుగారు వస్తాడు.]

ప్రసా : నే నెప్పుడూ రాకూడని సమయాల్లో నే వస్తున్నాను. క్షమించండి .. విజయా! నీతో మాట్లాడాలి. (ఎవ్వరూ మాట్లాడరు.) రామం! నేను విజయతో మాట్లాడాలి

రామం : నేనూ వుంటాను.

ప్రసా : విజయతో నే మాట్లాడాలంటే నువ్వు వుండాలన్న అర్థంరాదు.

[తండ్రివంక తీక్ష్ణంగా చూసి రామం వెళ్లిపోతాడు.]

ప్రసా : కూర్చో. (విజయ కూర్చోదు.) కూర్చో అమ్మా, ఫరవా లేదు. (కూర్చుంటుంది.) పుత్రభిక్షకోసం నీదగ్గరకు వచ్చాను.

విజయ : (బాధపడి) బాబుగారూ!

ప్రసా : అవునమ్మా! నిన్ను చిన్నప్పటినుంచీ కూతురులా పెంచాను. ఆ మాత్రం అడిగే హక్కు నాకు వున్నది కదూ! (మాట్లాడదు.) నాకు కూతురే వుంటే నామాట కాదనదు. నువ్వు నా కూతురికంటె ఎక్కువైనదానివి... ఏమంటావ్?

విజయ : నన్నేం చెయ్యమంటారు?

ప్రసా : అదుగో! నువ్వు అంత బాధతో అడిగితే నాకు బావుండదు. చూడమ్మా! నా ఆశలన్నీ వాడిమీద వున్నయ్. వాడు ఎంత ఎదురుతిరిగినా, చివరకైనా నామాట కాదనడని నా నమ్మకం. ఆ ఆశతోనే నేను బ్రతుకుతున్నాను. ఇప్పుడు నీవల్ల వాడి

భవిష్యత్తుకు అణుమాత్రం అంతరాయం వచ్చినా నువ్వు సహించగలవా?...నీ కది సంతోషదాయకమా! (మాట్లాడదు.)...... నేను జడ్జీగారికి మాట యిచ్చాను...ఎందు కిచ్చావని రామం అడిగాడు. అదీ నిజమే! ...కాని నిన్ను ఈ యింటికి తీసుకువచ్చే టప్పుడు కూతురుగా తెచ్చుకున్నాను కాని, కోడలుగా తీసుకురాలేదు. అలాగే జరిగి వుంటే, ఇప్పుడు ఎవ్వరికీ మాట ఇవ్వవల సిన అవసరం వుండేది కాదు—

విజయ : ఇప్పుడు మాత్రం—

ప్రసా : ఆమాట నువ్వు అనవలసింది కాదమ్మా! మాటకంటె మనిషే ఎక్కువ అని నాకు తెలుసు. ఆమాటకు వస్తే, కుసుమకంటె నువ్వే నాకు ఎన్నోరెట్లు ఎక్కువ ఆమాత్రం నన్ను అర్థం చేసుకోలేవా?

విజయ : అదికాదు బాబూ!.. ఆయన మరీ త్వరపడు తున్నారు.

ప్రసా : ఏమంటాడు? (విజయ జవాబు చెప్పదు) చెప్పమ్మా! నాకు తెలియకూడదా?

విజయ : మరోగంటలో ఇక్కడినుంచి వెళ్ళిపోవా లన్నారు.

ప్రసా : నాకు తెలుసునమ్మా వాడిపంతం. అది నెగ్గే వరకూ వాడికి నిద్రపట్టదు. .... కాని ఇది నావిషయం కాదమ్మా! కేవలం వాడికి సంబంధించినది. వాడి అభ్యుదయాన్ని కాంక్షిస్తే, నేను చెప్పినట్లు చెయ్. లేక పోతే, వాడు జీవితంలో ఎదుర్కొనే ప్రతి ఆటంకమూ నువ్వు కల్పించినదే నని జ్ఞాపకం వుంచుకో—

విజయ : నన్ను పెళ్లి చేసుకోవడమే వారి జీవితానికి ఆటంక మంటారా?

ప్రసా : ఆలోచించమ్మా! కుసుమను పెళ్లి చేసు కోవడంవల్ల వాడికి సంఘంలో పెరిగే అంతస్థు, దానివల్ల వాడికి జీవితంలో కలిగే లాభం—

విజయ : (గాద్గదికంగా) బాబూ! నేను ఆయనను వదిలి ఒక్కక్షణం వుండలేను.

ప్రసా : (తన్ను తాను సంబాళించుకొని) నాకు మాత్రం తెలియదా అమ్మా! వాడిపరిస్థితి కూడా అలాగే వుంది. కాని నేనేం చెయ్య గలనో చెప్పు...వాడి బాగుకు పరిస్థితుల నైతే కల్పించగలను కాని, ఆటంకాలను నెట్టుకొని ముందుకు రాలేను కదా! జడ్జీ గారికి నే నిచ్చినమాటంటావా! మాటతప్పటం వల్ల అవమానం ఏదైనా వస్తే నాకు!— కాని వాడి కేమీ లేదు. ఇది ఒక్కటే అర్థం కాదు. . ఈ పెళ్లివల్ల వాడు అడుగడుగునా పొందవలసిన అవమానాలు, ఎదుర్కో వలసిన పరిస్థితులు తక్కువగామాత్రం వుండవు. వీటన్నింటినీ ఎదుర్కో గల సాహసం, సహించ గల మనోబలం వాడికి వున్నదమ్మా?

విజయ : క్షమించండి బాబూ!... నేను లేకపోతే ఆయనపడే బాధ నాకుతెలుసు. తనలో తాను పొందగల బాధకన్న ఇతరులు పెట్ట గలబాధ ఎక్కువంటారా?

ప్రసా : నీ కర్థం అయ్యేటట్లుగా చెప్పలేకపోతున్నా ననుకుంటాను. ... వాడు కళా జీవి ... వాడిలోవున్న కళ ఉజ్వలంగా ప్రకా శించాలంటే ప్రేమ కావాలి ... వాడిని నీకంటె ఎవ్వరూ ఎక్కువగా ప్రేమించ లేరు—నాకు తెలుసు—ఆ ప్రేమ లేనందు వల్ల వాడికి మానసికమైన దౌర్బల్యం రావచ్చు. కాని అది పరిస్థితుల నెదిరించ లేనిదై, ప్రమాదాలను ఆదుకో లేనప్పుడు వాడి జీవితం నిష్ప్రయోజనకరంగా తయారు కాదనడానికి హామీ ఏమిటి?

విజయ : బాబూ! ఆయనను విడిచివుండడం నాకు చేతకాదు. అయినా అంతే! నేను లేకపో వడంవల్ల ఆయన ఏ కొంచెం బాధపడ్డా నేను భరించలేను. నా మాట వినండి బాబూ!... నేను చిన్నప్పటినుంచీ మీదగ్గర పెరిగాను. ఇంట్లో అందరికన్న నేనంటే అపేక్ష చూపించారు మీరు. ఆ చనువుతో అడుగుతున్నాను ... మమ్మల్ని విడదీయ కండి... నేను ఆ తరువాత ఒక్కక్షణం జీవించలేను.

ప్రసా : (ఆమె ప్రార్థనకు విచలితుడైనా, ఆయన మనో నిశ్చయమే గెలుస్తుంది.) ఉద్వేగం కలిగినప్పుడు మనుషులు మామూలుగా ఆలోచించలేరు. ఇంత చెప్పినా నామాట వినక వాడి జీవితానికి నువ్వే గుదిబండవు కాదలచుకుంటే, నాకేమీ అభ్యంతరం లేదు... అయినా మీమీద నాకేమీ కోపం లేదు. మీ వయసులో వున్న ప్రతివాళ్లు చేసేదీ అదే! ఇహ నే నంటావా?....వాడు నాకు పెద్దకొడుకు. వాడిమీద నేను ఆశలు పెట్టుకున్నాను...ఇప్పుడు!—వాడి జీవితమంతా మీ రిద్దరూ వేస్తున్న తప్పటడుగులవల్ల నాశనం అయిందని జీవితాంతం కుమిలిపోతాను...అందరికన్నా మీ యిద్దరినే ఎక్కువగా ప్రేమించటంవల్ల, మీరు నాకు ప్రత్యామ్నాయంగా యిచ్చిన ఫలిత మనుకుంటాను...వస్తానమ్మా—

విజయ : (పొంగివస్తున్న దుఃఖాన్ని అతి ప్రయత్నం మీద అపుకొని) బాబూ! (వెడుతున్న ప్రసాదరావుగారు వెనుకకు తిరుగుతాడు.) మీ యిష్టం వచ్చినట్లు కానివ్వండి. నాకు అభ్యంతరం లేదు.

ప్రసా : చూడమ్మా! ఇది నాకోసం నువ్వు చేస్తున్న త్యాగం కాకూడదు. నేను చెప్పింది వాడి కోసం. ఇందులో నా స్వార్థం ఏమీ లేదు. నువ్వు పొరపాటుగా తొందరపాటున ఏం చెప్పినా అది మీ బాధకు యింకా ఎక్కువ కారణం కావచ్చు.

విజయ : లేదు బాబూ! బాగా ఆలోచించే చెబుతున్నాను. నాకు కావలసిందీ ఆయన సుఖమే కదా! నన్ను పెళ్ళిచేసుకోవడంవల్ల ఆయనకు ఏ ఒక్క బాధ కలిగినా, నేను భరించలేను.

ప్రసా : బాగా ఆలోచించమ్మా! నేను చెప్పానని నీ వుద్దేశ్యాలను మార్చుకోకు.

విజయ : అక్కర్లేదు బాబూ. అదే నా నిశ్చయం... ఆయన నన్ను పెళ్లి చేసుకోరు...ఇహ నే నంటారా? నేను బ్రతికి చెయ్యవలసింది ఏమీ లేదు. ఉన్న సర్వస్వం త్యాగం చేసిన మనిషి ఆశించే దేముంటుంది?

ప్రసా : అంత నిస్పృహ పనికూడదమ్మా! ఎందరు నిన్ను వదిలినా, ఎందరు నన్ను వదిలినా, నువ్వు నాతో వుండక తప్పదు.

విజయ : ఆపనిమాత్రం నన్ను చెయ్యమనకండి బాబూ! ఇక్కడ ప్రతివస్తువూ వారిని జ్ఞాపకం చేసేదే వాటిని చూస్తూ, నేను బ్రతకటం కల్ల—మరొకచోట నంటారా, ప్రాణాలు పోవడం కష్టమైన పనికాదు. ఇక్కడ క్రుంగి కృశించిపోతాను; మరొకచోట చావటం తేలిక—

ప్రసా : అలా అనడంవల్ల నాకూ బాధే కలగాలనుకుంటే నువ్వే గెలిచావు.. నేనూ మనిషినే! ప్రక్క మనిషిమీద కనీస సానుభూతి చూపించలేనివాడి నని ఎందుకనుకోవాలో నాకు తెలియదు.

విజయ : పొరపాటు బాబుగారూ! ఆవేశంలో ఏదో అన్నాను ... మిమ్మల్ని నాకంటె బాగా ఎవ్వరూ అర్థం చేసుకోలేరు.

ప్రసా : నాకు తెలుసునమ్మా! ఇప్పుడు నా కోరికల్లా నువ్వు బాధపడకుండా వుండడమే!... నువ్వు ఏమాత్రం బాధపడ్డా, నేను భరించలేను.

విజయ : (విషాదకరమైన నవ్వుతో) బాధ ఎందుకు బాబూ! నాకేమీ బాధ లేదు.

ప్రసా : (ఒక్క క్షణం ఆగి) వస్తానమ్మా! నీ ప్రేమనూ, నువ్వు నాకు చూపిన గౌరవాన్నీ ఎన్నడూ మరిచిపోలేను. (వెళ్ళిపోతాడు.)

[విజయ పొంగివస్తున్న దుఃఖాన్ని అపుకోవడానికి అనవసరమైన ప్రయత్నం చేస్తుంది. చివరకు ఆ ప్రయత్నంవల్లనే అది కట్లు తెగుతుంది.

ఓ క్షణం తరువాత కుసుమ వస్తుంది. ముఖం మీద ఏదో ఒక క్రొత్తరకం సిగ్గు, ఏదో సాహసకార్యం చెయ్యడానికి ప్రయత్నించడంవల్ల మాటిమాటికి క్రింది పెదవిని

పళ్ళతో నొక్కిపట్టడం వంటివి చేస్తూ వుంటుంది.]

కుసుమ : హల్లో విజయా! ఇక్కడా వున్నావ్! నీకోసం ఎంతసేపటినుంచీ వెదుకుతున్నానో తెలుసా? (విజయ ప్రక్కకు తిరిగి కళ్లు తుడుచుకుంటుంది.) ఏమిటది విజయా?

విజయ : ఏమీ లేదు.

కుసుమ : నా దగ్గర దాయకు విజయా! చెప్పవూ?

విజయ : లాభం లేదు కుసుం... నా బాధలు మరొకళ్ళతో చెప్పి, వాళ్ళనూ సంతోషించనివ్వడం న్యాయం కాదు.

కుసుమ : ఇంతేనా నన్నర్థం చేసుకున్నది? ఎవరు ఏం చేశారు నిన్ను? ఎందుకలా వున్నావ్?... చెప్పు విజయా, నీకోసం ఏమైనా చేస్తాను నేను.

విజయ : థాంక్స్...వద్దు కుసుం.. ఆ బాధలు నన్నే పడనీ—

[త్వరగా వెళ్లిపోతుంది. ఇంట్లోనుంచి త్వరగా రామం వస్తాడు. కుసుమ నివ్వెరపోయి విజయ వెళ్లిన వైపుగానే చూస్తూ వుంటుంది.]

రామం : విజ్జీ!—

కుసుమ : రామం!—

రామం : ఓ! నువ్వా కుసుమా! నేను విజయ అనుకున్నాను.

కుసుమ : ఎందుకో కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నది. తీరా నేను వచ్చేసరికి కారణం చెప్పకుండానే వెళ్ళిపోయింది.

రామం : అలాగా వస్తాను...

కుసుమ : ఎక్కడకు సార్......ఈ ఇంట్లో తమరు మాట్లాడవలసింది ఒక్క విజయతోనేనా?

రామం : కాదు కుసుం. పనివుంది...

కుసుమ : నేనూ పనివుండే వచ్చానుసార్....(రామం నిస్పృహతో కూర్చుండిపోతాడు.) కోపం వచ్చిందా?

రామం : అబ్బే!

కుసుమ : (దగ్గరకువచ్చి) ఇవ్వాళ నీకు ఎన్ని విషయాలు చెబుదామని వచ్చాననుకున్నావ్?

రామం : చెప్పు—

కుసుమ : అబ్బ...అంత తేలికగా చెబుతానా? నువ్వు చెప్పుకో—

రామం : అంత మరీ చిన్నపిల్లవు కావు కుసుం. సంగతేమిటో చెప్పు....

కుసుమ : అట్లా అని తప్పించుకోవడానికి చూడకండి ...మీకు తెలుసు, చెప్పండి.

రామం : (రామం, కసిగా) ఆ, ఏముంటుంది? మీ నాన్నగారు ఢిల్లీ ఆలిండియా రేడియోలో మాట్లాడారనో, మీ మామయ్య పారిస్ నుంచి బ్రహ్మాండమయిన చీరలు తెచ్చాడనో, ఇంకా—

కుసుమ : పప్పులో కాలువేశారు సార్ ... అవ్వేమీ కాదు.

రామం : కుసుమా! నాకు అవతల చాలా పనివుంది. చంపక చప్పున చెప్పు, అంతటి గొప్ప విషయం ఏమిటో?

కుసుమ : ఈ మగవాళ్ళందరూ ఇంతే! ఆడవాళ్లు ఎంత ఆప్యాయంగా దగ్గరకువచ్చినా ముఖం మాడ్చుకుంటారు.

రామం : ఆడవాళ్లు మాత్రం తక్కువతిన్నారా? అయినప్పుడూ కానప్పుడూ కూడా మామీద స్వారీ చెయ్యడంలా ... మళ్ళీ ఒక్కమాటంటే మీ అబలా సమాజమంతా కత్తి కట్టి మా ఇళ్లమీదకు యుద్ధానికివస్తుందే!... సరే! నేను బుద్ధిమంతుడిలా కూర్చుంటాను. త్వరగా చెప్పు...

కుసుమ : అట్లా అన్నారు, బావుంది...చెప్పనా? మా నాన్నగారు మీ నాన్నగారిదగ్గరకు వస్తున్నారు...

రామం : రానీ! దానిలో గొప్ప ఏముంది?

కుసుమ : తర్వాత ఎందుకో తెలుసా? మా నాన్నగారు మీ నాన్నగారిదగ్గరకు వచ్చి "మీ అబ్బాయికి మా అమ్మాయిని ఇస్తాం........చేసుకోండి." అంటారు—

రామం : (ప్రాణంలేని నవ్వుతో) అలాగా!

కుసుమ : ఏమంటావు రామం?

రామం : (కుర్చీలోనుంచి లేచి) కుసుమా! ఈ సంగతి నాకు చూచాయగా తెలియకపోలేదు. ఒక్క మాట చెబుతాను; నామీద కోపగించకు కుసుం.... నేను విజయను పెళ్ళి చేసుకోబోతున్నాను—

కుసుమ : (నూతిలో గొంతుకలా) విజయనా!

రామం : అవును కుసుం... నాన్నగారు ఒప్పుకోలేదు. అందువల్ల మరోగంటలోనే యిక్కడినుంచి వెళ్ళిపోతున్నాం. ఇప్పుడు నీకు ఆశ కలిగించి వెళ్ళడం నాకు సుతరామూ యిష్టం లేదు... నువ్వు నన్ను ప్రేమించావని నాకు తెలుసు. కాని నేనేం చెయ్యగలను, చెప్పు? ఎన్ని అడ్డంకులు వచ్చినా, నేను విజయను పెళ్ళి చేసుకోదలిచాను.

కుసుమ : (తన చేతుల్లో ముఖాన్ని దాచుకొని) రామం!

రామం : కుసుం! నువ్వు బాధపడతావని నాకు తెలుసు. కాని ఏం చెయ్యను?

కుసుమ : (తేరుకొని) పోనీ రామం! నువ్వేం చెయ్యగలవు?...ఇంతకూ నా అదృష్టం.. అయినా గాలిలో మేడలు కట్టబోయేముందు వాటికి పునాదులుంటేకాని పడకుండా వుండవన్న జ్ఞానం నాకు లేకపోయింది. ఇప్పుడనుకొని ఏం లాభం?...సరే! మీరైనా సుఖంగా వుండండి...నీకు ఏం అవసరం వచ్చినా నాకు చెప్పకుండా వుండవుకదూ! నేను ఎప్పుడూ నీ పక్షమే!

రామం : (ఆమెకు తనమీద వున్న ప్రేమకు ఆశ్చర్యపడతాడు, చలిస్తాడు) కుసుం!

కుసుమ : వస్తాను, రామం...

[మెల్లగా వెళ్ళిపోతుంది. ఒక క్షణంతర్వాత సూర్యం 'కుసుం, కుసుం' అని పిలుస్తూ వస్తాడు.]

సూ : కుసుమ ఏదిరా?

రామం : వెళ్ళిపోయింది.

సూ : ఏం?

రామం : ఈ ఇంట్లో తనకు స్థానం లేదని—

సూ : ఈ నాటకం ఇంత ఎక్కువ కాలం జరగడం బాగులేదురా. నాన్నను రానీ, ఎందుకు ఒప్పుకోడో చూస్తాను.

రామం : నాన్నను ఒప్పించడం బ్రహ్మతరం కాదు.

సూ : మనం ఆయన తలలోనుంచి వెళ్లకు వచ్చాంరా—చూస్తావుగా!

[ఇంతలో ప్రసాదరావుగారు కుసుమను పిలుస్తూ వస్తారు.]

ప్రసా : కుసుమ ఏదిరా?

సూ : (రామంవైపు తిరిగి) ఏదిరా?

రామం : వెళ్ళిపోయింది.

ప్రసా : ఏం?

సూ : బహుశః తనకీ యింట్లో స్థానం లేదని తెలుసుకొని వుంటుంది.

ప్రసా : సూర్యం!—

సూ : ఈ నాటకాన్ని ఇంతసేపు సాగనివ్వడం ఏమీ బాగాలేదు.

ప్రసా : ఏమంటావ్?

సూ : నిజాన్ని గ్రహించి, నీతితో జవాబు చెప్పమంటాను.

ప్రసా : ఇందులో నా కేముంది? వాళ్ల యిష్టం—

సూ : వాళ్ల యిష్టాయిష్టాలతో సాగితే నాటకం ఎప్పుడో సుఖాంతం అయ్యేది. ఈ 'సస్పెన్స్' దేనికి?

ప్రసా : నీకీ గొడవలు తెలియవుగాని, నీ నాటకాలు ఏమిటో నువ్వు చూసుకో—

సూ : జీవితంలో నాటకాల తర్వాత కదా, స్టేజిమీద నాటకాలు!

ప్రసా : అయితే, ఈ నాటకంలో నీపాత్ర ఏమిటి?

సూ : అదే అర్థం కావడం లేదు.....నేనే కథానాయకుడ్నయితే ఇంత రాద్ధాంతం వుండేదా? అన్నయ్య మెత్తటివాడు కాబట్టి మొడుతున్నారు.

ప్రసా : నీ కెందుకురా యివన్నీ? ఎవరి సంగతి వాళ్లు చూసుకోలేరా యేం?

సూ : తమ సంగతి తాము చూచుకోక, ప్రక్కవాళ్ల సంగతుల్లో తలలు దూర్చేవాళ్లు వున్నారు కాబట్టే, నేను వచ్చాను.

ప్రసా : అంత అవసరం ఎవరికి?

సూ : అదేమిటి నాన్నా! అంతస్థుల పేరు చెప్పి అన్నయ్యను బెదిరించటం, వాడి భవిష్యత్తు పేరుతో విజయను భయ పెట్టడం — ఇవన్నీ యేమిటి?

ప్రసా : నేను మంచి దనుకున్నది వాళ్లకు చెప్పాను. వాళ్లు దాన్ని పాటించకపోతే — వాళ్ళ ఖర్మ — పోతారు. నే నేం వద్దనలేను!

సూ : మీరే కేసులు వేస్తుంటే, వాళ్లుమాత్రం ఎలా బ్రతకాలండి.

ప్రసా : నీ ధర్మపన్నాలు ఎవ్వరికీ అక్కరలేదు.

సూ : అక్కరలేనివాళ్లకోసం ధర్మపన్నాలు ఎవ్వరూ చెప్పరు నాన్నా! అయినా ఈ పెళ్ళి ఆగడానికి వీలులేదు... ఎలా జరగదో నేనూ చూస్తాను. (విజయ వస్తుంది.) చెప్పు విజయా! నీకు రామాన్ని పెళ్లి చేసుకోవడం యిష్టమా, కాదా? ఆమాట ఆయనముఖాన చెప్పు — సంవత్సరంనుంచీ మీ హృదయాలు కలుసుకోవడానికి నిరంతరం ఆరాటపడ్డావని చెప్పు.. మీజీవితాలు కలుసుకున్న తర్వాత, ఎంతటి అవాంతరాలనైనా, చిరునవ్వులతో ఎదిరించగలమని చెప్పు. మీ ఆనందానికి అవధి లేదని, మీ సుఖానికి పరిధి లేదని చెప్పు — చెప్పు, విజయా! (విజయ మాట్లాడదు.)

ప్రసా : చెప్పడం చెప్పుకున్నంత తేలిక కాదోయ్!

సూ : హృదయంలో వున్నప్పుడు. చెప్పడం, చెప్పమనడంకన్న తేలిక —

[ఇంతలో రంగయ్య వస్తాడు.]

రంగయ్య : నమస్కారం బాబూ! ఏమిటిదంతా? నాటకంగాని వెయ్యడంలేదు కదా!

ప్రసా : అలాంటిదే రంగయ్యా! చూస్తావుండు.

రామం : రంగయ్యా! నేను విజయను పెళ్లి చేసుకోబోతున్నాను.

రంగ : (ఆశ్చర్యంతో) ఏమిటి బాబూ!

సూ : అవును రంగయ్యా! నిజమే! అన్నయ్య విజయను పెళ్లి చేసుకోబోతున్నాడు.

రంగ : బావుంది బాబూ! గోపాలంకూడా సీతను చేసుకోడానికి ఒప్పుకున్నాడు. బాబూ! ఇదంతా మీ మాటలదలవే బాబూ! వాడు ఇంటికి వచ్చి, రాత్రంతా ఆలోచించి "బాబుగారు చాలా నిజం చెప్పారు నాన్నా!" అన్నాడు "నా కెప్పుడూ అలాగే చెబుతారు" అన్నాను. అంతే — చేసుకోవడానికి ఒప్పుకున్నాడు... బావుంది కదూ!

ప్రసా : కాని, నాకు వీళ్ల పెళ్ళి జరగడం ఏమీ యిష్టం లేదు రంగయ్యా!

రంగ : బాబూ!

ప్రసా : అవునయ్యా! ఈ పెళ్ళి జరగడం నాకేమీ యిష్టం లేదు.

సూ : ఎందుకు వుంటుంది రంగయ్యా! అంతస్థుం పేరు చెప్పి, అవకాశాలను అవరోధించడం రాజకీయ నాయకులకు తప్ప మరొకరికి చేత కాదు.

రంగ : అదేమిటి బాబూ! విజయ చిన్నప్పటినుంచీ మీదగ్గర పెరిగింది. దాన్ని నా పిల్ల అని ఎప్పుడూ అనుకోలేదు... అటువంటివాళ్లను మీరు విడదీస్తారా? అంతస్థుల భేదం పాటించకూడదని మొన్న నేగా మీరు చెప్పారు. మీరు చెప్పినట్లు చెయ్యకపోతే గోపాలానికి వుద్యోగం యివ్వమని బెదిరించారు. ఇదేనా మీరు చేస్తున్న న్యాయం?

సూ : ఏమిటి రంగయ్యా, పాతకాలంనాటి మాటలు మాట్లాడుతావ్! ఈ రోజుల్లో న్యాయం చెయ్యడం పాపం.

రంగ : బాబూ! నా మాట వినండి. వాళ్ళ ఆనందానికి అడ్డు రాకండి.

ప్రసా : అదేమిటయ్యా, రంగయ్యా! నీ పిచ్చి కాని, వాళ్లు సుఖపడతా మంటే నేను వద్దంటానా? నాకు మాత్రం వాళ్లు ఏమీ కారా?

సూ : అందుకేనా నాన్నా, ఈ పెళ్లి నాకిష్టం లేదంటున్నారు! అంతస్థులు జీవితాల వినాశనానికి కారణం అవుతాయని మీ నమ్మకమే అయితే, ఈ మాటే గోపాలానికి కూడా చెప్పివుండవలసింది.

విజయ : సూర్యం!... నాన్నగారి నేమీ అనకు... ఈ పెళ్ళి నాకే యిష్టం లేదు.

సూను, రామం, రంగ : విజయా!

విజయ : (తనను తాను నిగ్రహించుకుంటూ) అవును .... నాకు ఇష్టం లేదు.

సూ : విజయా! పరిస్థితులకు లొంగిపోయి నువ్వు ఇప్పుడేం చెప్పినా, జీవితాంతం విచారించ వలసివస్తుంది.

రామం : విజయా! నువ్వేనా ఆ మాట అనగలిగింది!

సూ : భయపడకు విజయా! ధైర్యంగా నిజాన్ని చెప్పగలిగినవాళ్ళే, నిజంగా బ్రతకడానికి అర్హులు.

విజయ : (గాద్గదికంగా) నేను నిజమే చెబుతున్నాను సూర్యం...... నేనీ పెళ్ళి చేసుకోలేను.

రామం : ఏం ?

విజయ : ఆ సంగతి నన్ను అడగకు చినబాబూ! మీ సుఖంకోసం నేను ఈ పెళ్ళిని మానివేస్తున్నాను.

రామం : (మాటలు రాక) ఓ!

సూ : (పెదవి విరిచి) ఇక జీవితం నాటకం కాగలదని ఎవ రనగలరు?

విజయ : (ఒక క్షణం ఆగి).. వెళదాం, పద నాన్నా!

రంగ : వస్తాం బాబూ! నే నన్నవన్నీ మనసులో వుంచుకోకండి.

ప్రసా : విజయా! మరోసారి అడుగుతున్నాను. నువ్వు ఇక్కడ వుండలేవా?

విజయ : క్షమించండి బాబూ! నన్ను ఆమాట మాత్రం అడగకండి.

ప్రసా : కాని విజయా! నామీద కోపంతో మాత్రం వెళ్ళడంలేదని, మీ కష్టాలకు నేను కారణం కాదని చెప్పి వెళ్లు. అదే నాకు వూరట నిస్తుంది.

విజయ : మీమీద కోప మెందుకు - బాబూ?...మీ దయాఋణాన్ని ఎన్నడైనా తీర్చుకోగలమా?...వస్తాను. (రామానికి దగ్గరగా వస్తుంది.)

రామం : (దుఃఖాన్ని ఆపుకోలేక) విజయా!

విజయ : చినబాబూ! నన్ను మరచిపోవడానికి ప్రయత్నించండి. నేనేం చేసినా, మీకోసమే నని నమ్మండి...

సూర్యం! నీవైపు చూడడమే నాకు భయంగా వుంది. నన్ను క్షమిస్తావు కదూ!...పద, నాన్నా!

రంగ : వస్తాం, బాబూ! (రంగయ్య, విజయ, వాళ్ల వెనక ప్రసాదరావుగారు వెళతారు)

సూ : కథంతా అడ్డం తిరిగింది కదా!

[రామం పిచ్చివాడిలా వుంటాడు. ఇంతలో చంద్రం వస్తాడు.]

చం : సారీ బ్రదర్! కొంచెం లేటయింది. ఏ సీను వేస్తున్నారు?

సూ : సీనేమిట్రా నీ తలకాయ! నాటకమే అయిపోతే!

చం : అంటే—

సూ : అంటే ఏమిటి? రిహార్సల్సు లేకుండా నే నాటకం ఆడబడ్డది.

చం : మరి కుసుమ యేది?

సూ : వెళ్ళిపోయింది.

చం : విజయ—?

సూ : ఆమెనూ వెళ్లకొట్టాం...

[ఈమాటలతో రామం పిచ్చివాడిలా నవ్వుతూ, 'అవును, వెళ్లకొట్టాం' అంటూ వాకిట్లోకి వెళ్లిపోతాడు.']

చం : మరి కథానాయిక ఎవ్రా?

సూ : కథానాయిక ఎవరో వుంటే ఇంకా నాటకం విషాదాంతం ఎందుకు అవుతుందిరా?

చం : అసలేం జరిగింది?

సూ : ఏముంది? కొందరు మేడమీదనుంచి దిగి రానూలేరు, మరెవ్వరినీ పైకి రానివ్వనూ రానివ్వరు. వాళ్లవల్ల అందరూ బాధపడతారు.

చం : మరి ఇది సుఖాంతం కావటం ఎప్పటికి?

సూ : ఈ అడ్డుగోడలను అధిగమించడానికి ధైర్యం వున్న యువతీయువకులు ముందుకు వచ్చిన నాడు. ఇది దానంతట అదే సుఖాంతం అవుతుంది.

చం : అంతవరకూ ఎదురుచూద్దాం—

సూ : అవును మరి. కళోపాసకులు, భవిష్యత్తుమీద ఆశవున్నవాళ్లు నాటకంలో పాత్రధారులైనప్పటికీ, ఈనాటకం ఎప్పుడూ సుఖాంతమే! ఆరోజు తప్పక వస్తుంది. ...

చం : ప్రస్తుతం ఇది విషాదాంతమే కదా!

సూ : తప్పదుమరి!...తప్పకుండా విషాదాంతమే!!

[మొదట ఎలావుంటారో ఇప్పుడూ అలాగే ఆలోచిస్తూ వుంటారు. ... ఇద్దరూ పెదవులు విరిచి 'అవును, విషాదాంతం' అనుకుంటారు.]

సూ : (హఠాత్తుగా లేచి ప్రేక్షకులతో) చూశారుగా, ఇదీ నాటకం—ఇది విషాదాంతమని వేరే చెప్పక్కర్లేదుకదూ!—

చం : అవును...విషాదాంతం— [తెర]

సెకండరీ విద్యావిధానము

శ్రీ వెంపటి పురుషోత్తము

విద్య జాతిరక్షణకు పెట్టనికోట అన్నాడు ఎడ్మండ్ బర్క్. (*Education is the chief defence of nations*). ఇది అన్ని కోటలవంటిది కాదు దీనికై ఎక్కువ ద్రవ్యం వెచ్చింప నక్కరలేదు కూడా.

ప్రభుత్వం అమలుపఱచే యే ప్రణాళికలకైనా, కార్యక్రమాలకైనా, ద్రవ్యం అవసరమే కాని సామాన్యంగా ఏ దేశంలో చూచినా విద్య పేరు చెప్పగానే చాలినంత ద్రవ్యం లేదంటారు. కొంచెం విశాలదృష్టితో పరికించితే దీన్ని అధిగమించటానికి మార్గం లేకపోలేదు. సైనికదళాలను పెంచి, మారణాస్త్రాలను సృష్టించి, యుద్ధనౌకలను, విమానాలను నిర్మించి—ఈరీతిగా యుద్ధపరికరాలమీద వెచ్చించే ధనంలో దాదాపు సాబాలు కూడబెట్టుకోవచ్చు. ఆ ద్రవ్యాన్ని అంతా జాతీయవికాసానికి ముఖ్యంగా ఉపకరించే విద్యను దేశంలో అందరికీ అందుబాటులో ఉంచే ప్రణాళికల క్రింద వెచ్చిస్తే, కొలదికాలంలో దేశమంతా ఒక గొప్ప వైజ్ఞానికదశపై మన యూహకందని విధంగా జాతి సంపూర్ణ రక్షణకు, దేశ సంపదకు, సౌభాగ్యానికి, సభ్యతకు, ఔన్నత్యానికి, తద్వారా విశ్వశాంతికి, విశ్వమంతా కలిసి యొకటే కుటుంబమనే భావం వర్ధిల్లడానికి తోడ్పడుతుంది. ఈ తీయని కల సఫలమైతే, అంతర్జాతీయ విజ్ఞానం సక్రమమార్గాల వెల్లివిరిస్తే—యుద్ధపు ఖర్చులకే తావుండక పోగలదేమో!

దేశకాలపరిస్థితుల ననుసరించి విద్య ప్రధానలక్ష్యం మార్పు చెందుతుంది. ఏది యెట్లావున్నా, ఏ విద్యకై అయినా ఆకటి చిచ్చును శాంతింపచేసి కడుపునిండా అన్నము సమకూర్చగలిగితే, అది చక్కని విద్య. 'కోటివిద్యలు కూటికొఱకే.' ఇది ప్రస్తుత విద్యావిధానలక్ష్యం. ఇందులో తప్పేమీ లేదు. మానవుని మనుగడకు విద్య నుపయోగించుకోవచ్చు. కాని దాని ముఖ్యలక్ష్యం అంతమాత్రమేనా? అంతకంటె ఉన్నతాశయాలు సాధించుకోలేమా?

మానవుడు సంఘజీవి. సంఘాన్ని విడిచి ఒంటరిగా బ్రతుకలేడు. సంఘానికి మానవునికి త్రెంపరాని సంబంధ మున్నది. సంఘాభ్యున్నతిమీదనే మానవాభ్యున్నతి ఆధారపడి ఉంటుంది. మానవుడు సక్రమమార్గాల నడిచిననాడే సంఘం కళకళలాడుతూ వర్ధిల్లుతుంది. ఎట్టి పరిస్థితులలోనైనా నేర్పుతో, న్యాయదృష్టితో, ఔదార్యంతో తన విధ్యుక్తధర్మాలను నిర్వహించుకొనే విధంగా మానవుని—అతని చిత్తవృత్తిని—తీర్చిదిద్దగల్గింది విద్య. ఈ లక్ష్యం సిద్ధింపచేయలేని విద్య విద్యకాదు.

ఇట్టివిద్య దేశమంతటా వ్యాప్తిచెందటానికి తగిన వాతావరణాన్ని మనం ప్రతికుటుంబంలో సృష్టించుకోగలగాలి. మానవునికి తల్లిదండ్రులు మొదటిగురువులు. వారు విద్యావంతులైతే కుటుంబములోనివారంతా ఆదర్శప్రాయమైన జీవితము గడుపగల్గుతారు. తరువాత సంఘ వాతావరణం కూడా విద్యావ్యాప్తికి అనుకూలంగా వుండాలి. వయోజనులలో కూడా విద్యావ్యాప్తి జరగాలి. ఇటు పెద్దలకు మాత్రమే కాక, పిల్లల లేతహృదయాల నాకర్షించే పుస్తకాలతో నిండి, పిల్లలకు గూడా ఉపయోగించే పుస్తకాలయాలు నెలకొల్పితే అవి కూడా విద్యావ్యాప్తికి చాలవఱకు తోడ్పడగలవు. ఇట్లా చక్కని వాతావరణం కుదిరిననాడే పాఠశాలలలోని విద్యావిధానం కూడా వర్ధిల్లుతుంది. లేనినాడు సాంఘిక, రాజకీయ కల్లోలాలు పాఠశాలల ఆవరణలో కూడా ప్రవేశించి అచటి శాంతిని, వాటి పవిత్రతను రూపుమాపి విద్యాలయాన్ని కల్గించుతాయి.

2

రెండుశతాబ్దాలకు మునుపు పాశ్చాత్యదేశాలలో అమలులో ఉండే విద్యావిధానాన్ని పరిశీలించి చూస్తేనాటి విద్యాలయాలు దాదాపు కారాగృహాలే

అనవచ్చు. ఉపాధ్యాయుడంటే విద్యార్థికి భయంకర స్వప్నం. తరువాతి శతాబ్దంలో ఈ విధానంలో కొంతమార్పు వచ్చింది. రూసో, పెస్టాలోజి అనే వారు నూతన మార్గాన్ని విద్యావిధానంలో కనిపెట్టారు. పిల్లలకు ఆటలంటే ప్రాణం లేచివస్తుంది. ఆటలాడే సమయంలో వారు పూర్తిగా మైమఱచిపోతారు. వారిలోఉండే పట్టుదల, ఉత్సాహం, త్యాగం, కష్టసహనం — మొదలైన గుణాలన్నీ ఆ సమయంలో వారిలో మూర్తీభవించుతాయి. అందుచేత ఆడుతూ పాడుతూనే కావలసిన విద్య వారికి గఱపే సూత్రం అమలులోనికి తెచ్చారు. 1921 లో కొంతమంది పాశ్చాత్య విద్యావేత్తలు కలిసి ఒక నూతన విద్యాసంఘం, (*New Education Federation*) స్థాపించి విద్యావిధానంలో విద్యార్థికి ముఖ్యస్థానం యిచ్చి, విద్యార్థులే క్రమశిక్షణ పద్ధతులను అమలు జరిపేవిధంగా, వ్యక్తిగత, సాంఘిక బాధ్యతలను వారు గమనించేవిధంగా వాతావరణంలో మార్పు తీసుకురాగలిగారు.

ఒక శతాబ్దంపైగా వెనుకకు తిరిగిచూస్తే మన దేశంలో వీధి అరుగులమీద పాఠశాలలు, విద్యార్థులకు క్రమశిక్షణ గఱిపే నిమిత్తం బెత్తాలు, బండకొయ్యలు, కోదండాలు ఉండేవని చెప్పుతూవుంటారు. ఒక శతాబ్దంక్రింద మన రాష్ట్రంలో బ్రిటిష్ పాలకులు 'ఆంగ్లో వర్నాక్యులర్' పాఠశాలలు నెలకొల్పారు. తమ రాజ్యాంగవిధానం సుస్థిరంగా వుండే రీతిని విద్యా ప్రణాళికలను ప్రవేశపెట్టారు. నాటినుండీ ఆంగ్ల భాషాబోధన ప్రారంభమయింది. క్రమంగా అదే 'మెట్రిక్యులేషన్' విధానంగా రూపొందింది. దాని ప్రకారం అందులో బోధింపబడే అన్ని పాఠశాలల్లోనూ నిర్ణీతములైన మార్కులు వచ్చి విద్యార్థులు పరీక్షలలో గెలుపొందాలి. అట్లు ఉత్తీర్ణులైన వారికే వుద్యోగాలిచ్చారు. అనగా ఆ పాఠశాలలు ఆ ప్రభుత్వానికి అవసరమైన, అట్టి దృక్పథంగల గుమాస్తాలను, చిన్న చిన్న ప్రభుత్వోద్యోగులనూ తయారుచేయటానికి చాలవఱకు ఉపయోగించినారు. ఉదరపోషణకు కొంతవరకు ఆ విద్య వుపయోగించినట్లు కనబడటంచేత అది కొంతవఱకు ప్రజాదరణ పొందింది కూడా. ఆంగ్లభాష రాజభాషకాబట్టి దానిముందు, మన దేశభాషలన్నీ తలలు వంచవలసివచ్చింది. అంతేకాదు. మన సంస్కృతి, సంప్రదాయాలు కూడా విదేశీయ సంస్కృతి, సంప్రదాయాలతో చేతులు కలిపి క్రొత్తరూపాన్ని దాల్చాయి. ఈ విధానంలో విద్యార్థుల అభిరుచులతోనూ, యోగ్యతలతోనూ నిమిత్తం లేదు. నిర్ణీత పాఠ్యప్రణాళిక ననుసరించి మార్కులు సంపాదించుకొని పరీక్షలో విజయం సాధింపగలిగియుండుటా, మూసంగా ఈ విధానాన్ని శిరసావహించి ఈ దారిన నడుచుటా ఇవే విద్యార్థుల కర్తవ్యంగా పరిగణింపబడినవి. ఈ రీతిగా ఆంగ్లభాషాప్రభావం మన జాతిమీద బాగా ప్రబలమయింది. కాని దేశకాలపరిస్థితులు, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు మారిన కొలదీ విద్యావిధానంలో కూడా మార్పులు వస్తూఉంటాయి. ఒకప్పుడు ఏ మహా విద్యావేత్తయో, యుగపురుషుడో అవతరిస్తాడు. తన అమేయ మేధాసంపత్తిచేత, తాను దర్శించిన నూతనదృక్పథాన్ని, నూతనవిద్యావిధానాన్ని ప్రబోధం చేస్తాడు. ప్రాతక్రొత్తల సంఘర్షణ క్రమంగా మనస్సులలో చెలరేగుతుంది. దేశాభ్యున్నతికీ జాతివికాసానికీ వకజాతి పతనానికీ విద్యావిధానం ప్రధానకారణమని మన విద్యావేత్తలు గ్రహించి యీ విధానంలో మార్పునకై ప్రయత్నాలు చేశారు. ఆ కృషిఫలితంగా మెట్రిక్యులేషన్ విధానంలో కొంత మార్పుకలిగి 1911 లో యస్. యస్. యల్. సి విధానం వచ్చింది. ఇందులో రెండు 'సబ్జక్ట్సు' విద్యార్థు లైచ్ఛికంగా చదువుకోవచ్చు. దానివల్ల కొంత సౌకర్యం కలిగింది. తెలుగులో విద్యాబోధ ప్రారంభమయింది. కాని కళాశాలలో పాఠాలన్నీ ఆంగ్లంలో బోధింపబడటంచేత ఆ విద్య యే కొద్దిమందికో తప్ప మిగిలినవారికి అందని మ్రానిపండయింది.

ఇంతలో 1921లో భారతజాతి కంతకూ నూతన రాజకీయచైతన్యం గలిగించిన మహాత్ముడు పెద్దయెత్తున సహాయనిరాకరణోద్యమం ప్రారంభించాడు. అదియొక మహా విప్లవం. అది నలువైపులా విజృంభించింది. విదేశీయ ప్రభుత్వ నిరసనతోబాటు, విదేశీయ వస్తు బహిష్కరణంతోబాటు, విదేశీయ విద్యావిధానంమీద కూడ నిరసన ప్రారంభమయింది. పాఠశాలలు, కళాశాలలు బహిష్కరింపబడ్డాయి. అంతటా సమ్మెలు ప్రబలినాయి. ఆనాటి విషబీజాలే నేటికిగూడా అక్కడక్కడ మొలకలెత్తుతూ ఉన్నాయి. అప్పటిలో ఆ పొంగు చల్లారింది. కాని

పాఠశాలల గౌరవం, ఉపాధ్యాయుల ప్రతిపత్తి క్రమంగా క్షీణించుటకు ప్రారంభించాయి. పాఠశాలల లెక్కువైనకొద్దీ నిరుద్యోగసమస్య యెక్కువైంది. విద్యావిధానంలో మార్పు తీసుకురావాలని విశేష ప్రయత్నాలు జరుగసాగినాయి. నాటినుండి నేటి వఱకు సుమారు 40 సంవత్సరాలు విద్యావిధానంలో నిలకడచెందిన మార్పేమీ రాలేదు. ఉన్న విద్యావిధానంమీద విశ్వాసం పోయింది. క్రొత్త నిర్ణయాలకు ప్రభుత్వం చాల ఔదాసీన్యం చూపింది. అయినా వృత్తివిద్యలయందభిరుచి కల్పించటానికి పాఠశాలలలో వడ్రంగం, చేనేత, నవారు నేయుట మొదలగువానికి కొద్ది స్థానం యిచ్చారు. వ్యాయామ విద్యకు కొంత ప్రాధాన్యం సృష్టించారు.

ఇప్పుడే గాంధీమహాత్ముని బేసిక్ విద్యావిధానం పొడసూపింది. ప్రాథమికవిద్యతో బాటు దీని నమలు పఱచాలనీ, దీనిలో చాలవఱకు మన సమస్యలు తీరగలవనీ ఆయన వాదనచేశారు. సామాన్య విద్యతో బాటు ప్రతి విద్యార్థికీ వృత్తివిద్య అవసరమన్నారు. దీనికి తగిన శిక్షణ నిచ్చుటకొఱకై కొన్ని సంస్థలు నెలకొల్పబడ్డాయి. కాని స్వరాజ్యసాధనకై అహింసా సమరమూ, విద్యావిధానంమీద నిరసనా ప్రబలుతూనే ఉన్నాయి.

1947 లో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. దాస్యశృంఖలాలు విడిపోయినాయి. దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధికి తీసుకురావలసిన బాధ్యత ప్రజలపైబడింది. పురోగమించిన యితరదేశాలతో బాటు వర్ధిల్లటానికి తగిన ప్రణాళిక ఆవశ్యకత ప్రభుత్వం గుర్తించింది. తత్ఫలితమే మొదటి పంచవర్షప్రణాళిక. ఇందులో దేశస్వరూపాన్ని మార్చివేసే పథకాలెన్నో వున్నాయి. బేసిక్ విద్యాశిక్షణ కేంద్రాలు కొన్ని నెలకొల్పారు. పాఠశాలలు క్రొత్తగా స్థాపించారు. కాని ప్రాథమిక విద్య ఉద్దేశించినంతగా అభివృద్ధి కాలేదు. ఫలితం ప్రోత్సాహకరంగా లేదు.

3

విద్యావిధానం అంటే, ప్రాథమిక, సెకండరీ, కళాశాల విద్యావిధానాలన్నిటినీ సమగ్రంగా సమీక్ష చేసి మార్పులు చేయాలి. ఈ మూటిలోనూ సెకండరీ విద్యావిధానం ఆయువుపట్టువంటిది. ఇటు ప్రాథమిక విద్యను బోధించే ఉపాధ్యాయులను తయారు చేయుటకూ, అటు కళాశాలలకు తగినవిద్యార్థులను కూర్చుటకూ ఉపయోగింపవలసిన వి సెకండరీపాఠశాలలు. అందుచేత వీటిలో విద్యావిధానం తృప్తికరంగా వుంటేనే మిగిలిన విద్యావిధానంకూడా చక్కగా వర్ధిల్లుతుంది. అయితే దీని భవిష్యత్తు ఎలా వుండాలి? ఇప్పుడేమి నిర్ణయించాలి?

దీనివిషయమై ప్రభుత్వం తగినంతగా పట్టించుకోలేదు. పాఠశాలల పరిస్థితి నానాటికి నిరుత్సాహకరంగావుంది. దేశంలోని రాజకీయ, సాంఘిక, ఆర్థిక తీవ్రశక్తుల స్వరూపం పాఠశాలల ఆవరణలలో కూడా ప్రవేశించి దాని స్వరూపాన్ని మార్చివేసినాయి. విద్యార్థుల దృక్పథం వేరు. వారి లౌకిక విజ్ఞానం మామూలుస్థాయిని మించింది. పాఠ్యభాగముల మీదకంటె, సంగీతము, నాటకాలు, నృత్యం, మొదలగువానిమీద అభిరుచి పెరిగింది. చదువుపట్ల నిర్లక్ష్యభావంతో బాటు వారిలో కష్టసహనశక్తి సన్నగిలింది. వివేచనాశక్తి కొఱవడింది. అనాలోచిత వ్యర్థసంభాషణలు, మాటలు ఎక్కువైనాయి. నియమబద్ధ జీవితం అలవాటు తప్పింది. హక్కులకు వత్తిడి, అధికారుల యెడ నిర్లక్ష్యభావం ప్రబలినాయి. కట్నాలకొఱకు చదువులు, పరీక్షావిధానమునందు రోత — అంతా అవగాహన చేసుకోటానికి వీలులేనంత గందరగోళ పరిస్థితి అవతరించింది. ఈ విధంగా విద్యార్థుల దృక్పథం వేరుగా పరిణమించింది. ఉపాధ్యాయుల దృక్పథం వేరయింది. రెంటికీ సమన్వయము కుదుర లేదనీ—కుదురుట లేదనీ చెప్పవచ్చు. విద్యావిధానం మార్పు చేయుటలో ఉపాధ్యాయులకు స్థానం లేక పోవుట కూడా ఈ అనర్థానికి కొంతకారణం.

ఇట్టి పరిస్థితులలో సెకండరీ విద్యావిధానంలో మార్పులు రాకపోలేదు. ఈవిషయాన్ని సమగ్రంగా పరిశీలించే కమిటీలు వాటిరిపోర్టులు, సార్జెంటువిధానం, యూనివర్సిటీ కమిషన్‌రిపోర్టు, సెకండరీ యెడ్యుకేషన్‌కమిటీ రిపోర్టులు వచ్చినాయి. వీటిలోని సూచనలన్నీ గమనించి చివరకు సెకండరీ యెడ్యుకేషన్‌కమిటీ రిపోర్టును కేంద్రప్రభుత్వం ఆమోదించింది. సంతృప్తికరంగా మార్పులు జరుగలేదు. కాని 1947లో పాఠశాలావాతావరణంలో కొంత మార్పు వచ్చింది. నాలుగవ ఫారమునుండి విభాజ్యవిద్యావిధానం (బైఫర్‌కేటెడ్ కోర్సస్) ప్రారంభించబడ్డాయి. 1948 నుండీ

పాఠశాలలు కూడా ప్రజాస్వామిక పద్ధతులమీద నడిచే పద్ధతులు అమలులోనికి వచ్చాయి. పౌరశిక్షణను (*Citizenship training*) ప్రారంభించారు. దీని వల్ల పూర్తిగా కాకపోయినా పాఠశాలా క్రమశిక్షణలో కొంత అభివృద్ధి కనుపించింది.

బేసిక్ విద్యావిధానం ప్రాతిపదికగా ప్రాథమిక విద్యావిధానాన్ని మార్చుటకు నిశ్చయం అయిన తర్వాత సెకండరీ విద్యావిధానంలో కూడా మార్పు చేయుట ఆవశ్యకమయింది. దీన్ని అనుసరించే కళాశాలలలో కూడా మార్పు రావాలి. అందుచేత కేంద్ర ప్రభుత్వము, రాష్ట్రప్రభుత్వాలు, యూనివర్సిటీ అధికారులూ, సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డువారు—కలిసి సమావేశాలు జరిపారు. ఇంకా జరుపుతున్నారు. 1953లో అధ్యాపకులను కూడా సలహాసంఘాలలోనికి తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయులను కూడా సమావేశపరచి అచటి నిర్ణయాలను ప్రాతిపదికగా తీసికొని, విశ్వవిద్యాలయాధికారులుకూడా సమావేశమై క్రిందటి జనవరిలో తుది నిర్ణయానికివచ్చారు. వీటిని కేంద్ర సెకండరీ విద్యాసంఘం, ఇంటర్ యూనివర్సిటీ బోర్డు వారును ఆమోదించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళిక పనులు పఱచటాని కుపక్రమించినాయి.

(1) 8 సంవత్సరాలపాటు (ప్రాథమిక మాధ్యమిక తరగతులను కలిపి) సమగ్రమైన ప్రాథమిక (బేసిక్) విద్య. సాధారణముగా 6 సంవత్సరముల ప్రాయం నుంచీ 14 సంవత్సరాల వరకూ విద్యార్థి ఈ ప్రాథమిక శిక్షణ పొందుతాడు. కాని చివరి సంవత్సరం అంటే 8 వ సంవత్సరం విద్యార్థియొక్క అభిరుచులనూ జీవితాశయాలనూ పరిశీలన చేయటానికి ఉపయోగించుతారు.

(2) ఆటుపైన సెకండరీ విద్య మూడు సంవత్సరాలు—అంటే సుమారు 14 సం॥ నుంచి 17 సం॥ ల వయసు వరకూ. ఈ దశలో విద్యార్థులు వారివారి అభిరుచులను బట్టి వివిధ పాఠ్యాంశాలను అభ్యసించేపద్ధతి వుంటుంది.

(3) అనంతరం తొలి 'డిగ్రీ' పుచ్చుకు వెందుకు అనువుగా 3 సంవత్సరాల విశ్వవిద్యాలయ శిక్షణ.

ప్రణాళిక వివరాలు

అంతా ఒక్కమారుగా మార్పుతీసుక వచ్చుట అసాధ్యం కాబట్టి మొదటి పంచవర్షప్రణాళిక ననుసరించి, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో కేంద్రప్రభుత్వం (1) దేశంలో ముందు 500 బహుళార్థసాధక పాఠశాలలు (*Multipurpose schools*) స్థాపించుతున్నారు. ఖర్చు 16 కోట్లు.

(2) ఒక్కొక్క పాఠశాలకు రు 50,000 ల చొప్పున సైన్సును బోధించే పాఠశాలలు 300 స్థాపించబోతున్నారు.

(3) మొక్కలకు రు 15,000 చొప్పున, సామాన్యశాస్త్రము (*General Science*) సాంఘిక విజ్ఞానశాస్త్రము (*Social studies*), వృత్తులు (*Crafts*) బోధించే ఉన్నత పాఠశాలలు 1500 నెలకొల్పుతారు.

(4) ఒక 500 బహుళార్థసాధక పాఠశాలల్లో, విద్యార్థుల సాహిత్యాభిరుచిని పెంపొందింపచేయటానికి తగిన కార్యక్రమాలను నడుపుతారు. ఇందు క్రింద పాఠశాల ఒక్కింటికి రు 5000/- ఖర్చుచేస్తారు. ఇదే కార్యక్రమాన్ని మరొక 1500 మామూలు పాఠశాలల్లో కూడా ప్రవేశపెడతారు — పాఠశాల ఒక్కింటికి రు. 1500 చొప్పున ఖర్చుపెడతారు.

(5) ఇప్పుడు నడుస్తున్న 2000 మాధ్యమిక పాఠశాలల్లో వృత్తివిద్యలు నేర్పటానికి యేర్పాటు చేస్తారు. ఇందు క్రింద పాఠశాల ఒక్కింటికి తొలి పెట్టుబడి రు 4000/- చొప్పునా, వార్షికంగా రు 3500/- చొప్పునా ఖర్చు పెడతారు.

(6) వృత్తి విద్యలు నేర్పే ఉపాధ్యాయులకు తర్ఫీదు నివ్వటానికి ఎనిమిది కేంద్రాలను నడుపుతారు. ఈ కేంద్రాలకు ఒక్కొక్కదానికి తొలిపెట్టుబడి రు 60,000, వార్షిక వ్యయం రు 20,000. ఇదిగాక యిప్పుడు నడుస్తున్న అట్టి కేంద్రాలలో ఎనిమిదింటిని అభివృద్ధిచేసి నవీన పద్ధతులలో నడపటానికి, కేంద్రం ఒక్కింటికి ప్రాథమిక వ్యయం రు 60,000 చొప్పున వార్షికవ్యయం రు 16,000 చొప్పున ఖర్చు చేస్తారు.

(7) ఇన్‌స్పెక్టర్లు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు — మొదలైనవారికి, 'రిఫ్రెషర్ కోర్సులు', గోష్ఠులు నడపటానికీ, ఇంకా యితర చిల్లరమల్లర కార్యక్రమాలకూ మరొక 15 లక్షలు కేటాయించారు.

ఈ కార్యక్రమానికంతకూ పాఠ్యప్రణాళికలు తయారుచేసున్నారు. మనరాష్ట్రంలో ప్రస్తుత ప్రణా

ళిక ననుసరించి 18 ఉన్నతపాఠశాలల్లో విభాజ్యవిద్యా విధానము (*Bifurcated Courses*) ప్రారంభించారు. ఇందుకై ఈ పాఠశాలలకు ఒక్కొక్క దానికి రు 15,000/- స్పెషల్ గ్రాంటు ఇస్తారు. కాకినాడలోను చిత్తూరులోను రెండు 'సెమినార్స్' జరుపుటకు నిర్ణయించారు.

1955 జనవరి, ఫిబ్రవరి నెలల్లో తూర్పు, పడమటి గోదావరిజిల్లాలలోను చిత్తూరుజిల్లాలోను అయిదు, కార్మిక సాంఘిక సేవాశిక్షణ శిబిరాలు నడిపారు.

దాదాపు 50 లక్షల రూపాయల ఖర్చుతో, 80 క్రొత్తకోర్సులతో 15 బహుళార్థసాధక పాఠశాలలనూ, సైన్సు బోధనాపద్ధతులను 30 పాఠశాలల్లో అభివృద్ధి పరచుటకునూ అంచనాలు వేయబడ్డాయి.

మొత్తంమీద ఈ స్కీములకన్నిటికీ దాదాపు రు 96 లక్షల ఖర్చు అంచనా వేయబడ్డది.

మరియు నీ పంచవర్షప్రణాళికలో ఆర్థికస్తోమతు ననుసరించి 1961 నాటికి సెకండరీ పాఠశాలల నన్నిటినీ హైయ్యర్ సెకండరీ పాఠశాలలుగా మార్చుట — ఇంకా బహుళార్థసాధకపాఠశాలలను ఎక్కువగా స్థాపించుట — వానిలో బోధించుటకు తగినట్లుగా ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చుట — ఇవీ చెప్పుకో దగిన అంశాలు. అందరికీ సమానావకాశాలు కల్పించుట — ఉన్నతవిద్య అందరికీ అందుబాటులోనుండే విధముగ అన్నికులాలవారికీ న్యాయం కల్గించుట ఈ ప్రణాళిక ముఖ్యలక్ష్యం. ఆయా విద్యలను బోధించే సాంకేతిక నిపుణులను తగినంతమందిని తయారు చేయుట కూడా దీని లక్ష్యం. పాఠశాలలలో సర్వత్రా విద్యాభివృద్ధి ప్రోత్సాహకరంగా లేదు కాబట్టి ఉన్నత పాఠశాలలో 11వ తరగతిని కలిపి యింకొక సంవత్సరం విద్యార్థులకు శిక్షణ నివ్వాలని యొక ప్రణాళిక — లేక — కళాశాలలలోని 'ప్రీ ఇంటర్ క్లాసు' ఏర్పాటుచేసి శిక్షణ నివ్వాలని మరియొక పద్ధతి — ఆలోచనలో ఉన్నది. పాశ్చాత్యదేశాలలో కూడా విద్యాప్రమాణం (*Standard*) ఇట్లే మార్పు చెందినట్లు కూడా తెలుస్తోంది. ఇదంతా యుద్ధానంతర లక్షణంగా స్ఫురిస్తుంది. ఏది యెట్లావున్నా నిర్ణయం చేసినవిధానాన్ని సర్వవిధముల పరీక్షచేస్తూ అమలు పరచడంలో తోడ్పాటు యివ్వడానికి పెక్కువర్గాల ప్రతినిధులతో కూడిన సంఘం ఏర్పడుట శుభసూచకము.

4

ఏది యెట్లావున్నా సంఘంలో ప్రస్తుతం కలిగే పరిణామం ఒక సుస్థిరరూపం తాల్చనంతవరకూ కొంతకాలంవరకు విద్యావిధానం కూడా నిలకడలేక సుస్థిరరూపం తాల్చలేదు. అంతా అస్థిరంగానే వుంటూ ఉంటుంది.

దేశమంతా పారిశ్రామికంగా వృద్ధిచెంది ముందడుగు వేయాలనేది అందరూ అభిలషించేదే. ఆ పరిస్థితిలో పరిశ్రమలలోను, వ్యవసాయపద్ధతులలోను చక్కని మార్పులు వచ్చి నీటివనరులు మున్నగువానికి కావలసిన ప్రాజెక్టులు విద్యుదుత్పత్తికేంద్రాలు మొదలైనవి చాలినన్ని నిర్మించుకుంటేనేగాని దేశం సర్వతోముఖంగా అభివృద్ధి చెందదు. వానిని నిర్వహించేందుకు సాంకేతిక విద్యానిపుణులెందరో కావాలి. వారిని తయారుచేసే సాంకేతిక విద్యాశిక్షణ కేంద్రాలు ఎక్కువగా స్థాపింప నవసరముంది. అయితే సాంకేతిక విద్యాపాఠశాలలు, ఈ వృత్తి విద్యాపాఠశాలలు, సాధారణ పాఠశాలలు రీతిగా పాఠశాలలను వేర్వేరుగా స్థాపించాలి. ఇది చాలాముఖ్యం. వేర్వేరుగా స్థాపించినట్లయితే విద్యార్థులు తమతమ అభిరుచులను పురస్కరించుకొని ఆయా పాఠశాలలలో చేరి విద్య నేర్చుకుంటారు. దీనిమూలంగా పాఠశాలల్లో రద్దీకూడా తగ్గుతుంది. ప్రశాంత వాతావరణంకూడా లభిస్తుంది. అట్లాకాక మామూలు పాఠశాలల్లోనే క్రొత్తక్రొత్త కోర్సులు, క్రాఫ్టులు ఎన్ని ప్రవేశపెట్టినా ఇష్టమున్నా, లేకపోయినా అందరూ తప్పక వానిని చదువవలసి వస్తుంది. పాఠశాలల్లో బాలుర సంఖ్య కూడా పెరిగిపోయి క్రమశిక్షణ వారిలో తగ్గుతుంది. అందేగాక ఈ పాఠశాలలు స్వతంత్రములుగా ఉండాలి. ఆయా సాంకేతికవిద్యకు కావలసిన సాధారణ విద్య (*General Education*) కూడా పరిమితంగా ఆయా పాఠశాలలలోనే బోధించాలి. అప్పుడు అవి స్వతంత్రంగా ఉంటాయి.

స్త్రీల పాఠశాలలు సాధ్యమయినంతవరకు ప్రత్యేకంగానే ఉండాలి. వారి విద్యావిధానానికీ బాలుర విద్యావిధానానికీ తేడా సహజంగా కొంత

ఉంటుంది. కుటుంబవ్యవస్థకు స్త్రీ పురుషు లిరువురు బాధ్యులు కాబట్టి స్త్రీ కూడ విద్యావతియై కుటుంబమును సక్రమమార్గమున నైతికమార్గమున నడుపగల విద్యావిధానము నమలులోనికి తీసుకురావాలి. ఉన్నత విద్య - లేక - సాంకేతిక విద్యను బోధించే స్త్రీ కళాశాలల స్థాపించి తగు విధంగా స్త్రీ విద్యను కూడా ప్రోత్సహించాలి.

పాఠశాలలలో కొన్నిటిలో నేడు సుమారు రెండు వేలమంది వఱకూ బాలురు ఉన్నారు. అందువలన అట్టి సంస్థలలో క్రమశిక్షణ తృప్తికరంగా వుండదంటే ఆశ్చర్యం లేదు. అందుచేత ప్రతిపాఠశాలలోను తరగతులలో బాలురసంఖ్య కనీసం ముప్పదిమందికి మించకుండా, మొత్తం పాఠశాల బాలురసంఖ్య 600 లకు మించకుండా ఉండాలి. విద్యార్థి సంఖ్య తగ్గితే పాఠశాల ఆదాయం తగ్గిపోవచ్చు. కాని బాలురకు చక్కనివిద్య, క్రమశిక్షణ అవశ్యకమని తలచిన వాడా నష్టాన్ని ఆ పాఠశాలలను నడిపే మేనేజిమెంటువారు కానీ, ప్రభుత్వమువారుగానీ భరింపసిద్ధపడాలి. అదీ కాక పాఠశాలలన్నీ సాధ్యమయినంతవఱకు "రెసిడెన్షియల్ స్కూల్సుగా మార్చుకోగల్గితేనే కాని విద్యార్థులలో మనమాశించే విద్యకానీ, నైతిక ప్రవర్తనకానీ, క్రమశిక్షణకానీ లభ్యం కావు. ఇది సఫలం కావటానికి ఎక్కువ కాలం కూడా పట్టవచ్చు. అయినప్పటికీ మనలక్ష్యం మాత్రం అట్టి పాఠశాలలను సాధ్యమయినంతవఱకు పెంపొందించుకొనుట యని మాత్రం మఱచిపోరాదు.

ప్రస్తుతం విద్యావిధానంలో భాషాసమస్య వొకటి అందఱినీ బాధిస్తున్నది. రాజకీయంగానే కాక అంతర్జాతీయంగా కూడా ప్రఖ్యాతి వహించిన, వహిస్తున్న ఆంగ్లభాషను త్రోసిరాజనటం అవివేకమే అవుతుందేమో! సాంకేతికంగా, వైజ్ఞానికంగా, పారిశ్రామికంగా అంతర్జాతీయంగా కూడా మనదేశం ప్రఖ్యాతివహించాలని కోరుకున్నాం కాబట్టే యీ భాషతో మన మెన్నటికీ తెగతెంపులు చేసుకోలేము. అయితే దీనిని సాధారణ పాఠశాలల్లో తగ్గించి సాంకేతికాది పాఠశాలల్లో ప్రవేశపెట్టితే బాగుంటుందేమో!

ఇక దేశభాషల యావశ్యకతను గూర్చి చెప్పనక్కఱలేదు. అవి వర్ధిల్లాలంటే వాటితోబాటు వాటిని బాదివలె ప్రచ్ఛన్నంగా వుండి పోషించే సంస్కృతాన్ని కూడా ఈ సాధారణ పాఠశాలల్లో ప్రోత్సహిస్తే తప్పేమీ లేదు. సంస్కృత గర్భంలో ఇమిడివున్న విజ్ఞాన రహస్యాన్ని విద్యార్థులు త్రవ్వి యెత్తటానికి మనం విధిగా ప్రోత్సాహ మివ్వాలి కూడా! ఇక హిందీని గబ్బిలంలాగా ఉంచితే అది వర్ధిల్లటానికి మారుగా అపహాస్యంపాలవుతోంది. దాన్ని కూడా నిర్బంధ భాషగా తప్పక చేయాలి.

ఇక శారీరశిక్షణవిషయం. ఇది పాఠశాలల్లో ప్రవేశపెట్టబడిందేకాని నామమాత్రావశేషంగావుంది. నైతికంగా దాని ఆవశ్యకత అందఱూ గ్రహించారు. కాని దానిని చక్కగా అమలుపరిచే విషయంలో పాఠశాలాధికారులు, ప్రభుత్వంవారు కూడా ఉదాసీనంగా ఉన్నారు. ఆ ఔదాసీన్యాన్ని విడిచి అందఱూ దానిపై దృష్టిని కేంద్రీకరింపగల్గితే పాఠశాల ఒక ఆదర్శప్రాయమైన కుటుంబంగా, చక్కని ప్రజాస్వామిక సంస్థగా గుర్తింపజేయగల్గుతారు. ఆ ప్రజాస్వామ్య నిర్వహణంలో విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ లేక సంరక్షకులూ, పాలకవర్గమువారూ సమాన భాగస్వాములే. ఇందొకరెక్కువ, ఒకరు తక్కువ అనే భావం లేదు. కుటుంబంలో అందఱు తమతమ విధ్యుక్త ధర్మాలను గుర్తించుకొని యుంటేనే కుటుంబం వర్ధిల్లుతుంది. అట్లే పాఠశాల కూడా. కుటుంబంలో మిగిలినవారికన్నా కుటుంబయజమానికి బాధ్యత యెక్కువ. అట్లే పాఠశాలా కుటుంబంలో కూడా ఉపాధ్యాయుల కెక్కువ బాధ్యత ఉంది. దీనిని విస్మరించకుండా అందఱూ పనిచేస్తే వారి ఆత్మగౌరవంతోబాటు పాఠశాలా గౌరవంకూడా పెంపొందుతుంది.

ఇట్టి ఉత్తమపౌరులను తయారుచేసే బాధ్యత పాఠశాలలమీద ఉన్నదికాబట్టి విద్యార్థుల చిత్తవికాసానికి తోడ్పడే పాఠ్యప్రణాళికకు సంబంధించని ఇతర కార్యక్రమాలు కూడా విద్యతోపాటు తగిన స్థానంవహించాలి. పాఠశాలాచిహ్నము, పాఠశాలా పతాకం యేర్పాటుచేసికోవాలి. వైజ్ఞానిక సంఘాలు, సారస్వతసంఘాలు, విహారయాత్రలు, దృశ్యశ్రవ్యకు సంబంధించిన సినిమా ప్రదర్శనాలూ, మాజిక్ లాన్టరన్ ప్రదర్శనాలూ, మిలిటరీ (N. C. C. or A. C. C.) శిక్షణ, నాటకసంఘాలు, సంగీతము మొదలైన వన్నీ తగినరీతిగా, ప్రతిపాఠశాలలోను ప్రోత్స

హించాలి. ఏమైనా విద్యఅంటే 'డిగ్రీ' లేక సర్టిఫికేట్టును ఎట్లైనా సంపాదించుకొనుట అనే భావం విద్యార్థులలో తగ్గిపోవాలి.

ఇక ఉపాధ్యాయుల విషయం. ఇది చాలా ముఖ్యమయినవిషయం. దేశ సౌభాగ్యానికి రైతు పునాది అయినట్లే అటు ధనవంతులూ, ఇటు కేవలం నిరుపేదలు కాని మధ్యతరగతి ప్రజలు కూడా దేశానికి వెన్నెముకవంటివారే. దేశంలో ఇట్టివారె ప్రధాన పాత్రవహించు చున్నారని చెప్పవచ్చు. కాని యీ సంఘం తగిన కట్టుబాట్లు లేక క్రమబద్ధంగా లేదు. అందుచేత దానికి తగిన రక్షణ లేదుకూడా. ఉపాధ్యాయులు దాదాపు అందరూ ఈ తరగతికి చెందినవారే. ఈసంఘాన్ని ఉపేక్షిస్తే దేశం అన్ని రంగాలలోను ఎట్లా ముందంజ వేస్తుంది? అన్ని రంగాలలోను ముందంజ వేయవలసిన వారూ, వేస్తున్నవారూ ఎక్కువగా వీరే. అందుచేత వీరి నుపేక్షించకుండా ఉపాధ్యాయులకు పాఠశాలలో తగిన ప్రతిపత్తి కల్పించాలి. ఆర్థికంగా కూడా తగిన అభివృద్ధి చూపించాలి. విద్యావిధానం మార్పు చేయుటలోనూ, పాఠ్యప్రణాళికలను తయారుచేయుటలోనూ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు తగిన స్థానం యివ్వాలి. ఇతరుల కర్తవ్యతలే దని కాదు కాని ఎప్పుడూ విద్యాప్రపంచంలో జీవితాన్ని గడిపే అనుభవమే దేశాన్ని విద్యావిషయకంగా ఎక్కువగా పురోగమింపచేస్తుందని నా నమ్మకం. అప్పుడే జాతివికాసానికీ, ఉత్తమపౌర నిర్మాణానికీ, దేశాన్నత్యానికీ మనం ప్రథమసోపానం నిర్మించినట్లు అవుతుంది.

ఇట్టి వాతావరణాన్ని కలిగించిగేనే ఆదర్శప్రాయులగు ఉపాధ్యాయులు లభ్యమౌతారు. అట్టివారే విద్యాలయానికి తోడ్పడకుండా విద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతారు. తాను కోల్పోయిన ఉత్తమస్థానాన్ని ఎన్నటికైనా ఉపాధ్యాయుడు తిరిగి సంపాదించుకోగలగాలి. ఎవరు ఏ విధముగా సహాయం చేసినా, ఆదరణ చూపినా, పాఠశాలకు జీవగర్ర ఉపాధ్యాయుడే. అతని కృషి, ఉత్సాహము, పట్టుదలయే పాఠశాలకు తిరిగి ప్రాణం పోయగలదు.

పైన సూచించిన విధంగా పాఠశాలలను పరిష్కరించి విద్యార్థులూ, ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులూ, అధికారులూ పరస్పరం సహకరించి సమైక్యభావంతో పనిచేసిననాడే తమ దేశాన్ని తమ జాతినీ చక్కగా దిద్దితీర్చుకోగల విద్యార్థులు తయారౌతారు. ఈ మధురభావాలను పెంపొందింపజేసే విద్యావిధానాన్ని యెన్నటికైనా మనం సమకూర్చుకోవాలనీ, సమకూర్చుకోగలమనీ నా విశ్వాసం.

దశాంశపద్ధతి నాణెములు

శ్రీ బి. ప్రసాద్—శ్రీ కె. వి. రమణ

దశాంశపద్ధతిలో నాణెములను దేశంలో ప్రవేశపెట్టాలని నిర్దేశించే బిల్లును లోక్‌సభ జూలై 30వ తేదీని ఆమోదించింది. ఇది భారతీయ ద్రవ్యమాన పద్ధతిలో ఒక విప్లవాత్మకమైన మార్పు కాగలదు. శాస్త్రీయవిజ్ఞానంతో అమిత వేగంగా పురోగమిస్తున్న ఆధునిక ప్రపంచానికి భారతదేశం దూరంగా వుండక, ఆర్థిక వైజ్ఞానిక రంగాలలో ఇతర దేశాలతో సమంగా ముందుకు వెళ్లుతోందనడానికి ఇదో నిదర్శనం. కేవలం అహేతుకమైన కొన్ని మానసిక అభ్యంతరాలకు లోనుగాకుండా ఇట్టి శ్రేయోదాయకమైన చర్య తీసికొన్న పార్లమెంటు సభ్యులు అభినందనీయులు.

ద్రవ్యమానంలో దశాంశ పద్ధతివలెనే, కాలము, దూరము, బరువు మరే యితర పదార్థములనైనను కొలచుట కొక ప్రమాణం అత్యవసరం. ఈ ప్రమాణాలు అన్ని దేశాలలోను అన్ని సమయాలలోను ఒకేవిధంగా వుండి నిర్దిష్ట అనుక్రమంలో అమర్చటానికి వీలుగాను ఆదరణలో సౌలభ్యం కలగజేసేవిగా వుండాలి. చరిత్రలో మొదటినుండి ఏ దేశమున కాదేశము వారి అభిరుచులకు ఆలోచనలకు అనుగుణంగా వారివారి కొలతలు, తూకాలు, ద్రవ్యమానాలు నిర్ణయించుకున్నారు. అప్పటి పాలకులు కూడ పై సూత్రాలను గమనించక పోలేదు.

రానురాను వాణిజ్య సంబంధములవల్లనూ విదేశీయ దండయాత్రలవల్లనూ ఒకదేశపు కొలతలూ ప్రమాణాలు మరో దేశానికి వ్యాపించడం జరిగింది. కాని అప్పుడు ఒక్కొక్క దేశంలో ఒకే ప్రమాణ పరిమాణానికి వివిధమైన యూనిట్లు వుండేవి. యూరపు ఖండంలో 18వ శతాబ్దాంతమందు "పౌనుకు" 391 యూనిట్లు వుండేవి. అలాగే "అడుగు"నకు 282 యూనిట్లు వుండేవి. ఇలా విభిన్నమైన పరిమాణాలు కొలతలు వుండటంవల్ల వర్తక వాణిజ్యములకు అంతరాయం కలిగేది. ఇట్టి అంతరాయములను పోగొట్టటానికే 1795లో "టాలిరాండ్" అను నతను ఫ్రాంసు నేషనల్ అసెంబ్లీని కొలతలు తూకాలలో మెట్రిక్ పద్ధతిని అమలు జరుపవలసిందిగా కోరాడు. ఫ్రెంచి విప్లవఫలితాలలో ఒకటి ఈ మెట్రిక్ పద్ధతి. ఈపద్ధతి ప్రకారం 'మీటర్' (మీటర్ అనగా భూపరిధిలో నలభై మిలియన్లవంతు) కొలతకు ప్రమాణంగాను, 'ఫ్రాంకు' ద్రవ్యమానంలో ప్రమాణంగాను స్వీకరించబడినాయి. 1875 నాటికే మెట్రిక్ పద్ధతి జర్మన్ సామ్రాజ్యమునందంతటను నెలకొల్ప బడింది. తదుపరి 1879 లో ప్యారిస్ మహానగరంలో తూకాలు కొలతలను గురించి చర్చించుట కొక సమావేశము జరిగింది. దాంట్లో 18 రాజ్యాల ప్రతినిధులు పాల్గొని అన్ని దేశాలలోనూ సామాన్యంగా వుపయోగించుటకై తగిన కొలతల యూనిట్ల గురించి చర్చించారు. మెట్రిక్ పద్ధతియొక్క సౌలభ్యాన్ని అందరు గుర్తించారు. కాని అమెరికా ఇంగ్లాండు దేశాలు మాత్రం దీన్ని అనుకరించలేదు. దీనికి కారణం లేకపోలేదు. ఒకటి: అంతకు పూర్వం వున్న పద్ధతిని వదలి నూతన పద్ధతిని ప్రవేశపెట్టుటకు మానసికంగా వారు బాధపడటం; రెండవది: అంతకు ముందున్న 'ద్వాదశాంక పద్ధతి' (*Du-o-decimal System*) — ఇందు 2, 3 అంకెలు గుణిజములుగా వుంటాయి) కంటె, మెట్రిక్ పద్ధతి నిర్మాణ వాణిజ్యములందు తక్కువ ఉపయోగకారి అనే అభిప్రాయం ఉండుట. కాని అంతర్జాతీయ వ్యాపార వాణిజ్య రంగములలో ప్రముఖపాత్ర వహించిన అమెరికా బ్రిటన్ దేశాల ప్రమాణములకు గల వ్యత్యాసం అనేక యిబ్బందులకు కారణభూతమైంది. అనవసరమైన చిక్కులను అతిక్రమించి విదేశీయ వాణిజ్యమును సులభతరం చేయటమే ఈ మెట్రిక్ పద్ధతి ముఖ్యలక్షణం.

మనదేశంలో కూడ ఈ పద్ధతిని అమలు జరుపటానికి 1945 లో నే చర్చలు బయలుదేరాయి. మొదటి నుండీ భారతీయ తూకములకు గాని, నాణెములకు గాని

శాస్త్రీయమైన భూమిక లేదు. దేశమంతటా ఒకే ప్రమాణం ఆదరణలో లేదు. సంస్థాపితమైన బ్రిటిషు పరిపాలన కూడా భారతీయ తూకముల కొలమానములపై ఎట్టి మార్పును చేయలేకపోయింది. ఇప్పటికీ దేశంలో ప్రతి రాష్ట్రానికీ, ప్రతి జిల్లాలోనూ, ప్రతి ప్రాంతంలోనూ విభిన్న తూకములు కొలమానములు అమలులో వున్నాయి! అందుకనే నేడు మరింత శాస్త్రీయమైన పద్ధతిని అమలు జరుపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఇట్టి ఆవశ్యకత ఇప్పుడే కాదు—1946 లోనే గుర్తింపబడి పార్లమెంటులో ఒక బిల్లు ప్రవేశపెట్టబడింది. ప్రస్తుత సమస్య కేవలం ద్రవ్యమానంలో దశాంశ పద్ధతిని ప్రవేశపెట్టుటకు మాత్రమే ఆమోదింపబడింది. ఇందుమూలంగా లెక్కలు కట్టడం — ముఖ్యంగా "స్టాటిస్టిక్స్ శాస్త్రానికి" సంబంధించిన లెక్కలు — సులభం కాగలదు. ద్రవ్యమానాన్ని దశాంశములలో సులభంగా గ్రహించగలము. అన్నిటికన్న ముఖ్యముగా వ్యవసాయ పారిశ్రామికరంగాలలో శీఘ్రగతిని పురోగమిస్తున్న ఆధునిక ప్రపంచంలో భారతదేశం కూడా తన స్థానాన్ని నిలబెట్టుకొని అభివృద్ధి చెందుటకు దశాంశ పద్ధతి ఆవశ్యకత ఎంతైనా వుంది.

1946 లో ఈ బిల్లు తయారయినప్పుడు దేశంలో చాలా మంది—అందులో ముఖ్యంగా గాంధీజీ—అడ్డు చెప్పారు. వారు చెప్పిన కారణం: ఇంతవరకు ఒక పద్ధతికి అలవాటుపడ్డ ప్రజలు నూతన విధానాన్ని వెంటనే అర్థం చేసుకొని అలవర్చుకోలేరు. అట్టి అశక్తతను ఆధారంగా తీసికొని వ్యాపారస్థులు, ధనికులు సామాన్యప్రజలని దోచుకొనవచ్చు అని వీరందరు భావించారు. గాంధీజీ అభ్యంతరానికి ముఖ్యంగా పై కారణమే. కాని క్రమేణా ఈ విధానాన్ని అవలంబించాలని అప్పుడు కూడా సూచించారు. జాతీయ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విధానంలోని సాధక బాధకాలను ఆలోచించి ప్రజాభిప్రాయాన్ని సేకరించి సావధానంగా అమలుజరుప వచ్చునని కూడా గాంధీజీ అప్పుడే సూచించారు.

ఈ దశాంశ విధానానికి వ్యతిరేకముగా అభిప్రాయపడిన వారు వెలబుచ్చిన అభ్యంతరాలు అంత సహేతుకంగా కనపడవు — యుగయుగాలుగా అలవాటు పడిన జీవనంలో లేశమాత్రం సంస్కరణ కూడా కొన్ని చిక్కులను తెచ్చిపెట్టవచ్చును. కాని కేవలం అట్టి స్వల్ప కారణములతో పరిగ్రాహ్యమైన పద్ధతిని వదలుకొనుట వివేకం కాదు. జాగ్రత్తగా ఆలోచించి తగు కాలవ్యవధిలో సంస్కరణలు తీసికొని వచ్చిన ఊహించిన ఆ కొన్ని యిబ్బందులు కూడా కలగకపోవచ్చును. అయినా భారత ప్రజలు ఇట్టి చిన్న విషయాలలో మోసపోవునంతటి అజ్ఞానులు మాత్రం కారు. ఇది హైదరాబాదు రాష్ట్రం ఉదాహరణగా తీసికొన్న నిరూపించవచ్చును. హైదరాబాదు రాష్ట్రంలో ప్రాంతీయ 'హాలీ' నాణెములు, భారతప్రభుత్వ నాణెములు రెండునూ మొన్న మొన్నటివరకూ వాడుకలో వున్నందువలన ఏ ఇబ్బందులు కలుగలేదు. ఇచ్చిపుచ్చుకోవడాలు వర్తక వ్యాపారాలు ఏ యిబ్బందులు లేకుండా సులువుగా జరిగిపోయేవి. కాగా నేటికి భారతదేశంలో అక్షరాస్యత పెరుగుతోంది. సామాన్య ప్రజలు ఏమంత తెలివితక్కువను కనబరచటం లేదు. అప్పటి ప్రజల నిరక్షరాస్యత దృష్ట్యా గాంధీజీ అడ్డు చెప్పినా, నేడు ఆ అభ్యంతరము అకారణంగా కనుపిస్తుంది. ఇంక ఈ పద్ధతిని మరింత తొందరలో కాలహరణం లేకుండా దేశంలో అమలు జరుపవలసిన అవసరం ఎంతైనా వుంది. దేశంలో యింకా కొంత భాగంలో వర్తక వ్యాపారాలు యింకా "వస్తుమారక" (*Barter*) రూపంలోనే జరుగుతున్నాయి. అనగా ఆ ప్రాంతాలలో రూపాయలు వ్యాపార రంగంలో లేవన్నమాట. అట్టి ప్రదేశాలలో ప్రస్తుత రూపాయలైనా, దశాంశనాణాలైనా క్రొత్తవిగానే వుంటాయి రెండింటి సౌలభ్యం వారికి ఒకటిగానే వుంటుంది. ఆర్థికంగా మన దేశం అభివృద్ధి చెందేకొలదీ వస్తువులలోనే మారకాలు జరుగుతున్న ఆ ప్రాంతాలు కూడ క్రమంగా ద్రవ్యమారకంలోకి (*Monetary economy*) తీసికొని రాబడతాయి. ఈ ప్రాంతాలలో రూపాయలను ప్రవేశపెట్టుటకు మారుగా ముందుగానే దశాంశ నాణెములను ప్రవేశపెట్టిన మన యత్నం కొంతసులభతరం కాగలదు.

తిరిగి ఈ మధ్య ఈ సమస్య ప్లానింగు కమిషన్ వారిచే ప్రభుత్వదృష్టికి తీసికొనిరాబడింది. ఈ సంస్కరణకు ప్లానింగు కమిషన్ వారు తమ అంగీకారాన్ని నిర్దిష్టంగా ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ సలహా ననుసరించి వాణిజ్య శాఖామంత్రి కృష్ణమాచారిగారు ఒక ప్రకటన చేస్తూ దశాంశపద్ధతిలో ద్రవ్యమానాన్నే కాకుండా తూకములు కొలమానాల్లో మెట్రిక్ పద్ధతిని

కూడ దాని వెనువెంటనే సముచిత వ్యవధానంతో అమలు జరుపుటకు ప్రభుత్వనిర్ణయాన్ని తెలియ జేసారు.

దశాంశ పద్ధతి వస్తే, భారతీయులకు అలవాటు పడ్డ అణా, రెండణాలు, పైసలు వ్యవహారంలోనుంచి అదృశ్య మవుతాయి. కనుక, ఈ నూతన విధానంలో వీటిని యథోచితంగానే వుంచాలని కొందరు సూచించారు. కాని వ్యవహారం సౌలభ్యం కోసం ప్రవేశపెట్టబడుతున్న ఈ నూతన విధానంలో పాతనాణెములు వుంటే మరికొన్ని కొత్త చిక్కులు కలుగుతాయి. అందుకని వీటిని పూర్తిగా తీసివేయుటే మంచిది. ఇంక పైసలు నేడు చెలామణీలోనే కనబడవు. అవి పోయినా బాధపడే వెవరూ లేరు. అధునిక విజ్ఞాన వాణిజ్య రంగాల్లో ఈ దశాంశ మెట్రిక్ పద్ధతులవలన కలిగే లాభాలను గమనించే నెదర్లాండ్సు, మలయా ఈస్ట్ యిండీస్ ఇరాక్ తాయిలాండు దేశాలు ఈ విధానమును అమలు జరిపిన విషయం మనకు తెలుసు.

ఈ నూతనవిధానంవల్ల వచ్చు కొన్ని తాత్కాలిక యిబ్బందులను నేటి ప్రభుత్వం గుర్తించకపోలేదు. ఇంతకు పూర్వం వున్న వస్తువుల ధరలూ రైల్వేటికెట్ల రేట్లనూ, క్రొత్త విలువల్లో నిర్ణయించటం కొంత శ్రమ నివ్వవచ్చును. పోస్టలు స్టాంపులు అమ్మకంలోనూ తదితర విషయాలలోను కొన్ని యిబ్బందులు కలుగుతాయి. వీటిని భరించాలి. మొదట కొంతకాలంవరకూ పాత కొత్త నాణెములు రెండునూ వాడుకలో వుంటాయి. కాని రెండురకముల నాణెముల పరస్పర విలువలు ప్రకటిస్తూ కొన్ని ప్రకటనలను (*Slips*) ప్రభుత్వం ప్రజల కందుబాటులో వుంచిన, పైన పేర్కొన్న కొన్ని యిబ్బందులు తగ్గుతాయి. ఏ విషయంలోనైనా సౌలభ్యసాధనకు సంస్కరణ క్రియలు ఇట్టి తాత్కాలికమైన యిబ్బందులను ఎదుర్కొనవలసినదే.

తూకములు కొలతలు మెట్రిక్ పద్ధతిలో కనువదించుట మరింత కష్టమైన పని. మెట్రిక్ కొలత విధానాన్ని అమలుజరుపవలసిందని మొట్టమొదట 1870లో స్ట్రాచీ అను నతను సూచించారు. 1949 లో శ్రీ జె. సి. ఘోష్ గారి అధ్యక్షత క్రింద "ఇండియన్ స్టాండర్డ్సు ఇన్స్టిట్యూషన్" వారు ఓ సబ్ కమిటీని నియమించారు. వారు ఈ నూతన విధానాన్ని 10, 15 సంవత్సరముల వ్యవధిలో క్రమేణా అమలు జరిపిన బాగుంటునని సూచించారు. ప్లానింగు కమీషన్ కూడ ఈ విధమైన మార్పు యొక్క ఆవశ్యకతను గుర్తించారు. దీని నాధారంగా తీసికొనే శ్రీ టి. టి. కృష్ణమాచారి కొంతమంది నిపుణులతో కానంగో కమిటీని నియమించారు. ఈ సమస్యను వారు పరిశీలించారు. ఈ తూనికల మార్పును గురించిన బిల్లును కామర్స్ - ఇండస్ట్రీస్ మంత్రివర్గం త్వరలో లోక్ సభలో పెట్టనున్నారు. దశాంశ నాణెముల ప్రవేశపెట్టుటకంటె తూనికలలో మెట్రిక్ విధానమును అమలు జరుపుట కష్టతరమైనది. అసలు దేశంలో ప్రతిప్రాంతానికి తలొకవిధమైన తూనికలు వున్నాయి. వీటన్నిటికీ మారుగా ఒకే రకమైన నూతన పద్ధతిని ప్రవేశపెట్టుట ఒక విధముగా సులువైనా, మరొక విధంగా కష్టమవుతుంది. ముఖ్యంగా ఈ విధమైనమార్పు వ్యాప్తిచెందుతున్న ఇంజనీరింగు పరిశ్రమ నంతటినీ తట్టుతుంది. ప్రస్తుతం మన ఇంజనీరింగు వస్తువు లన్నీ "పౌన్లు" 'అంగుళములు' కొలతల్లో తయారవుతున్నాయి. దీనికి కారణం ఆదినుండీ మనకు బ్రిటన్‌తో వున్న వాణిజ్య సంబంధాలే. అయినప్పటికీ ఎప్పుడైతే దశాంశ పద్ధతి మంచిదని నిర్ణయించి ప్రథమంగా నాణెములలో మార్పు చేయటానికి సంసిద్ధుల మయ్యామో, అప్పుడే తూనికలలో మెట్రిక్ విధానము ప్రవేశపెట్టటానికి సిద్ధపడి వుండాలి. అయితే ముందుగా దశాంశ విధానమును ప్రవేశపెట్టి, తర్వాత క్రమేపీ మెట్రిక్ తూనిక విధానాన్ని అమలుజరుప వచ్చును. మార్పు మంచిదని తోచినప్పుడు, సగంలో ఆగిపోవుట మార్పును అంగీకరింపక పోవుటకంటె అరిష్టదాయక మవుతుంది.

ప్రస్తుతం ఆమోదించబడిన బిల్లు ప్రకారం చలామణీలోనికి రాగల కొత్త నాణెములపై ఇప్పటి వలె "గవర్నమెంటు ఆఫ్ ఇండియా" అనిగాక హిందీలో 'భారత్' అని ముద్రించబడుతుంది. నాణెమునకు ముందువైపున యిప్పటిలాగునే అశోక స్తంభం సింహాలు వుంటాయి. వెనుకవైపున అశోక స్తంభముపై నందిగాని అశ్వంగాని వుండవచ్చు. అందుకు స్థలం లేకపోయిన కేవలం నాణెపు విలువ, తేదీ ముద్రింపబడివుంటాయి.

ఈ నూతన విధానంలో రూపాయి నూరు భాగాలుగా విభజింపబడుతుంది. అప్పుడు అర్థ రూపాయికి 50 నాణెములు పావలాకి 25 నాణెములు వుంటాయి.

రూపాయి, అర్ధ రూపాయి పావలా విలువల్లో మార్పు ఏమీ వుండదు. అంతకన్న తక్కువ నాణెముల విలువల్లోనే మార్పు వుంటుంది. క్రొత్త నాణెములను జారీ చేయగానే యిప్పటి నాణెములను ఉపసంహరించటం జరగదు. క్రొత్త నాణెములతోపాటు ఇవికూడ కొంత కాలం చెలామణీలో వుంటాయి. క్రమేణా పాతవి ఉపసంహరింపబడతాయి. రూపాయలోని వందవ భాగమునకు పెట్టవలసిన పేరును సభ నిర్ణయించలేదు. 'చక్రము'ని 'సెంటు' అని వివిధ నామములను సభ్యులు పేర్కొన్నారు. కాని దేశంలో అన్నిమూలలా అందరికీ అలవాటయిన పేరు "పైస". దీన్నే దశాంశ నాణెమునకు పెట్టిన ప్రజలకు కొంత ఉపయోగకారిగా వుంటుంది.

దశాంశపద్ధతిలోని బహుళ ప్రయోజనాలను గుర్తించినట్లయితే ఈ మార్పును సర్వతోముఖ సత్వరాభివృద్ధి పొందుతున్న భారతదేశము స్వీకరించుట తప్పనిసరి. విజాతీయమైనంత మాత్రాన ఏ శాఖలోనైనా ఉత్తమ పద్ధతిని అవలంబించటానికి ఆక్షేపణ వుండరాదు. అయినా ఈ దశాంశ పద్ధతికి మూలమైన "సున్న"ను గణిత శాస్త్రంలో రూపొందించినది భారతీయ శాస్త్రజ్ఞులే. తర్వాత బాగ్దాదువుండా పాశ్చాత్యులు దాన్ని గ్రహించి అభివృద్ధి పరిచారు. దాన్నే తిరిగి మనం స్వీకరించటంలో తప్పేమీ లేదు.

ముఖ్యంగా ఈ మార్పు ఏ ఒక్క రాజకీయ పక్షంయొక్క ఆశయాలు సిద్ధాంతాల ననుసరించి ప్రవేశపెట్టేది కాదు. విజ్ఞాన శాస్త్రాభివృద్ధిని వర్ధమాన సమాజంలో త్వరలో సులువుగా వ్యాప్తి చెందునట్లు ఉపకరించటానికి ప్రవేశ పెట్టబోయే సంస్కరణ. శాస్త్రాభివృద్ధి మానవసంఘాలలో, ప్రభుత్వాలు పార్టీలకంటె శాశ్వతమైనది. దానికై మనం సుస్థిరమైన పునాదులను నిర్మించుకోవాలి. వలసినంత సామగ్రిని సమకూర్చుకోవాలి. ఈ దశాంశ మెట్రిక్ విధానములు ఇట్టివే. దేశంలో కొంతకాలంగా వాడుక పడిన ఒక పద్ధతిని మార్చి నూతన విధానాన్ని ప్రవేశ పెట్టవలసి వచ్చినప్పుడు తాత్కాలికమైన కొన్ని అసౌకర్యాలకు ప్రజలు సిద్ధపడక తప్పదు. అంత మాత్రాన వీటికి వెరచి ఎంత వాంఛనీయమైనా సంస్కరణే కూడదనడం అభివృద్ధి కాముకుల లక్షణం కాదు. ఈ నూతన పద్ధతికి ప్రజలు ఎక్కువగా అలవాటుపడు నంతవరకూ ప్రభుత్వం సాధ్యమయినంత ప్రచారం యిచ్చి, సామాన్య ప్రజలు ఏ విధంగానూ కూడ నష్ట పోకుండా చూడాలి. నెహ్రూగారు అన్నట్లు 'రెలిటివిటీ' సిద్ధాంతాన్ని గాని మరే శాస్త్రీయ విధానాన్ని గాని ప్రజలందరినీ సంప్రతించి అవలంబించ నక్కరలేదు. (ఈ పద్ధతిని అవలంబించుటవలన దేశీయ విదేశీయ వాణిజ్య వ్యాపారములలో ఏవిధమైన ఆర్థికకష్టనష్టాలు కలుగవు) విజ్ఞానరంగానికి అభివృద్ధి కార్యక్రమాలకు అనువుగా వున్న ఈ విధానాన్ని త్వరలోనే మన మందరము అలవర్చుకోవాలి.

కొనేవాడు

హితశ్రీ

బి. ఏ. పరీక్ష ఆఖరి పేపరు కూడా బాగా రాసిన తరవాత నెత్తిమీద కొన్ని టన్నుల బరువు తీసేసినట్టయి, కులాసాగా ఆ సాయంత్రం షికారుకి బయలుదేరిన రంగారావుకి బజారంతా కొత్తకొత్తగా కనిపించసాగింది. అనామం రోజూ కోసారైనా బజారు మీదిగా పోవటం అతని కలవాటే. కాని బజారువైపు పరకాయించి సావధానంగా, సావకాశంగా చూసేట మనేది అతని జీవితంలో అదే మొదటిసారి. అంతకి ముందు సర్వకాల సర్వావస్థల్లో నీడలా వెంటనంటి భయపెట్టే పరీక్షా పెనుభూతం అతనిని ఏ ఇతరవిషయాన్ని గురించీ సరిగా ఆలోచించ నివ్వలేదు. ఆ తీరికా, ఓపికా కూడా అతనికి ముందెప్పుడూ కలగలేదు. ఆరోజు రంగారావు కొత్తమనిషి. హుషారుగా నడుస్తూ కనిపించే ప్రతిదుకాణంలోగ్గునీ, ఎదురయ్యే ప్రతిమనిషినీ సావకాశంగా పరిశీలించసాగాడు. రోడ్డుకి రెండువైపులా బారులుతీర్చిన అంగళ్లూ, వొచ్చేపోయే జనం, బళ్లహడావుడీ— ఇవన్నీ ఏవేవో ఆలోచనలు కలిగిస్తుంటే రంగారావుకి అంతా ఏమిటో తమాషాగా కనిపిస్తోంది.

వెల్కం - ఫౌంటెన్.

సుస్వాగతం.

రంగురంగుల అద్దాల మీద ఆకర్షణీయంగా రాశారు. పనిలే! - టరమ్స్ క్యాష్.

నేడు రొక్కం! రేపు అరువు!

ఇదేమిటి? ఊరికే కాదూ? నవ్వుకున్నాడు రంగారావు. మరి స్వాగతం ఎందుకు? బుర్ర తడుముకుని ముందుకి నడిచాడు.

'బహుదూరపు బాటసారీ, ఇటు రావో ఒక్కసారీ' అని శ్రావ్యంగా ఎవరో పిలుస్తున్నారు— ఏదో హోటల్లోంచి. ఎందుకో? పోనీ, ఓసారి వెళ్ళి కనుక్కుంటే!

హోటల్ గడపదాకా వెళ్లాడు.

"పదార్థములు నెయ్యి కాచిన నేతితో తయారు. కాదని రుజువుచేసినచో రు 116 లు బహుమానం."

మంచిదే!

తగ్గింపు ధరలు.

ఇడ్లీ 0-1 6.

కాఫీ 0-1-6 ఇత్యాది. హోటల్ గడపలో నే బోర్డు. ఛేష్! ఇవి మాపటానికే కాబోలు. 'థాంక్స్' అనుకుని ముందుకి నడిచాడు రంగారావు. ఆహ్వానం వినిపిస్తూనే ఉంది. 'షబ్బుంటే' అని సవరణ ప్రతిపాదించాడు రంగారావు తన మనసులో.

మరెవరో దయచేయమంటున్నారు.

"నో, థాంక్స్!"

నవ్వుకుని నడక సాగించాడు రంగారావు.

ఓ రెండంతస్తుల మేడ. పిట్టగోడ మూడువైపులా రంగురంగుల అక్షరాలు రోడ్డుమీద పోయే జనం వైపు కళ్లు ఉరిమి చూస్తూ వాళ్ల చూపుల్ని నిర్బంధించి బలవంతాన పైకి లాగి 'సారీ' అన్నట్టుగా చూస్తూ,

'మరేం లేదు, ఇచ్చట మీ కేరకమైన పుస్తకములు కావలసినను దొరకును.' అని సమాచారం అందచేస్తున్నాయి.

సిటిజన్స్‌ది కాబోలు! ఇదేదో బాగానే ఉంటేట్టుంది. ఎవరికి నచ్చింది వారు తీసుకోవచ్చునా? సిటిజన్స్ కిలాంటి సదుపాయం ఉండాలిసిందే!

"సై నాలెడ్జ్!"

విజ్ఞానం కొనండి.

కొనాలి? సిటిజన్స్ సొంతం కాదూ?

నవ్వాపుకోలేక బయటికి నవ్వేశాడు రంగారావు. దగ్గిరగా ఉన్న ఇద్దరు ముగ్గురు అతనివైపు వింతగా చూశారు. అతను గబగబ ముందుకి నడిచాడు.

మళ్ళీ ఏదో హోటల్. పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు.

"మీ తృప్తే మా ఆశయం."

సంతోషం! అనుకున్నాడు రంగారావు.

"వెల స్వల్పం, ఫల మధికం"

ఫలితి మంటే బాగుండును. ఓసారి తను ఇక్కడ తిన్న పెసరట్టు తన చేత డాక్టర్ కి పది రూపాయలు ఫీజు ఇప్పించింది. చరచర ముందుకి సాగాడు రంగారావు.

"చెప్పు లేకుండా పోతున్నారా? అయ్యో" అని పరామర్శించి "ప్రమాదం సుమా!" అని హెచ్చరిస్తోంది ఓ బోర్డ్. నిజమే. ఓసారి ఓ రోడు తన పాదాల్ని తెగకరిచి రెండు రోజులు ఇంట్లో మూల పడేసింది తనని. నవ్వొచ్చింది రంగారావుకి. ఎక్కడ చూసినా, ఎటు చూసినా ఈ ఆధునికఫలకాలు ఇంతింత అక్షరాలతో వికృతంగా కనిపిస్తున్నాయి. తను ఐదో క్లాసు చదివేరోజులు జ్ఞాపకం వొచ్చాయి రంగారావుకి. టీచర్ ఇచ్చిన లెక్కల్ని తాటికాయల్లాంటి అక్షరాలతో, అంకెలతో గబగబా రాసుకుని, విడిపాలమీద ఇష్టం వచ్చినట్టు చేసేసి, టీచర్ దగ్గిరికి పరిగెత్తి ఆయన టేబిల్ మీద ఒకరి పుస్తకంమీద మరొకరు పోటీపెట్టి ఆయనకి ఊపిరాడకుండా "ముందు నా లెక్క చూడండి సార్" అని కుర్రాళ్లు గొడవ చెయ్యటం రంగారావుకి బాగా జ్ఞాపకం. ఈ బోర్డులన్నీ చిన్నపిల్లల పలకల్లా కనిపించాయి అతనికి. నవ్వుకున్నాడు. యథాలాపంగా పక్కకి చూశాడు.

ఐడియల్ బుక్ స్టోర్స్—పక్కనే ఉంది.

బ్యూటిఫుల్ బుక్ షాప్ ఎదురుగా ఉంది.

ఈ అక్షరాలన్నీ—పచ్చవీ, ఎర్రవీ, తెల్లవీ—పరస్పరం ఎల్లప్పుడూ అనుమానంగా, ఈర్ష్యగా, కోపంగా చూసుకుంటూనే ఉంటాయి కాబోలు అనుకున్నాడు రంగారావు. ఆ షాపు యజమాని తనవైపు చూస్తున్నట్టు అనుమానం కలిగి అవైపు చూశాడతను. తనవైపే చూస్తున్నాడు. ఓసారి లోపలికి పోవాలనిపించింది అతనికి. కొంచెం తటపటాయించి పక్కకి చూశాడు. ఐడియల్ బుక్ స్టోర్స్‌లో కుర్చీలో బల్ల ముందు కూచుని తనవైపు కొంచెం ముఖం చిట్లించినట్టుగా చూస్తున్నాడు—బహుశా ఆ షాపు యజమాని. రంగారావుకి ఎటు పోవటానికీ తోచక ముందుకి సాగిపోయాడు. ఓసారి వెనక్కి తిరిగి ఆ ఇద్దర్నీ చూడాలనిపించింది. కాని చూడలేదు.

ఎంపోరియంలూ, షాప్‌లూ, హౌస్‌లూ, కంపెనీలూ దాటిపోతున్నాయి.

వెరైటీ క్లాత్!

న్యూ వెరైటీ క్లాత్!

నియో మోడెర్న్ టెక్స్‌టైల్స్!

బ్యూటిఫుల్ పీస్‌గుడ్స్!

స్వదేశీ!

సిల్క్!

రకరకాల్లో ప్రత్యేకత.

ప్రత్యేకతలన్నీ ప్రత్యేకంగా చూస్తున్నాడు రంగారావు, రోడ్డుమీదనించే. అతనికో విషయం హఠాత్తుగా తట్టింది. తనకిమల్లేనే ఇంకా ఎందరో అలాగే చూస్తున్నారు. పోతున్నారు. వాళ్ళేమనుకుంటున్నారో! కొందరి కళ్ళలో ఆశలు ప్రతిఫలిస్తున్నాయి. కొందరి కళ్ళలో నిస్పృహా! ఖరీదైన వస్తువులుండే కొట్లవైపు చూసీ చూడగానే పొరపాటుగా తప్పుపని చేసినట్టు కొందరు వెంటనే కళ్లు పక్కకి తిప్పేసుకోటం చూసి రంగారావుకి ముల్లు గుచ్చుకున్నట్టయి వాళ్లవైపు జాలిగా చూశాడు. మరో విషయం రంగారావుకి వెంటనే తట్టింది. అంగళ్ల యజమానులు రోడ్డుమీద పోయే జనంవైపు అర్థంకాని చూపులతో ఏమిటో వెతుక్కుంటున్నట్టుగా చూస్తున్నారు. చాలామంది జనం మాత్రం ఎవరి దారిన వాళ్లు పోతున్నారు. ఇది అంత మర్యాదకరంగా తనకే కనిపించటం లేదు. ఇహ కొట్లయజమానులసంగతి చెప్పాలా? పిలిచిన పేరంటానికి పోకుండా ఉండకూడదు! ఆ భావ రంగారావు కర్థమౌతోంది. స్వాగతమండీ, స్వాగతం!! వినిపించుకోరేం, మర్యాదగా పిలుస్తుంటే! మీ తృప్తే మా ఆశయం. ఒకసారి దయచేసిన మీకే తెలియగలదు.

ఇదే దారి...అది కాదు.

ఇటు—ఇటు.

అట్టు కాదని వేరే చెప్పక్కర్లేదు. క్వాలిటీ అక్కర్లేదూ? రండి! రండి! ఓహోహో! రాజాధిరాజా, మార్తాండతేజా!

రంగారావుకి నవ్వొస్తోంది.

రాజాధిరాజా! మార్తాండతేజా!

'కుడి ఎడమున డాల్ కత్తులు మెరయగ
రాజా వెడలె రవితేజము లలరగ.'

రాజా వెడలె! ఎవరు రాజా!

నవ్వొచ్చింది రంగారావుకి. కాని వెంటనే అతని మనసులో చదువుల సరస్వతి ప్రత్యక్షమై జవాబిచ్చేసింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో కొనేవాడే రాజు.

'Under Capitalism consumer is the king.'

రాజా! ఈ బజార్లో నడుస్తున్న జను లందరూ రాజులే. తనూ!

బలే నినాదం! బావుంది! అద్భుతం.

తను దుకాణం పెడితే ఇదే తన నినాదం. కాని వొద్దు...వొద్దు. చూస్తూ చూస్తూ రాజ్యం త్యజించటం సామాన్యమైన విషయం కాదు!

స్వేచ్ఛగా ఇష్టం వచ్చినట్టు సంచరిస్తున్న మనసుని అరికట్టి నడుస్తున్నాడు రంగారావు.

బ్యూటిఫుల్ టెక్స్టయిల్స్ గల తన మిత్రుడున్నాడు. తనకోసం — అంటే రంగారావుకోసం కాదు, కొనేవాడు రంగారావుకోసం — నిరీక్షిస్తుంటాడు. ఓసారి విజిట్ చెయ్యటం ధర్మం. ఆ షాపు పెద్దబిల్డింగులో ఓమూల ఉంది. అరడజను కొట్లు దాటి పోవాలి. నెమ్మదిగా ప్రతికొట్టూ పరిశీలిస్తూ నడుస్తున్నాడు రంగారావు.

"ఏం కావాలండీ?"

అందరూ ఆత్రుతగా అడుగుతున్నారు.

"ఏమీ వొద్దు."

ఒద్దనిపించుకోటంతో కొంచెం చిన్నతనం వేసి ముఖం పక్కకి తిప్పుకుంటున్నారు — షాపుల్లోవాళ్లు. తన మిత్రుడు ఖాళీగా కూర్చున్నాడు. "ఏం గుప్తా" అన్నాడు. అతను కొంచెం ఉలిక్కిపడ్డట్టుచూసి "ఏరోయ్" అన్నాడు. నిజానికి నిన్న కాక మొన్న ఏవో షర్టింగులూ, కోటింగులూ తీసుకున్నాడు. మళ్ళీ ఇవాళ తన కేం అవసరం వొచ్చిందబ్బా అని ఆశ్చర్యపడుతున్నట్టున్నాడు అనుకున్నాడు రంగారావు.

"ఏం కావాలి?"

ఈ ప్రశ్న వినగానే రంగారావుకి వొళ్లు మండింది. అదేం ప్రశ్న? స్కూల్ ఫైనల్ దాకా కలిసి చదువుకున్నారు గదా! "ఏమిటి సంగతులు?" అని అడగకూడదూ? ఏం కావాలిసొస్తుంది తనకి ప్రతిరోజూ! మళ్లీ అడిగాడు గుప్త మర్యాదగా "ఏం కావాలి?" అని. వెంటనే రంగారావుకి తన రాజరికం జ్ఞాపకం వొచ్చింది. కాని ఏం అడగాలో తెలియటలేదు. ఏమీ తోచక "చీరలున్నాయా?" అన్నాడు. "ఉన్నాయా?" అని అడగటమేమిటి, ఎదురుగా బీరువాల్లోంచి దండలకి దండలు కనిపిస్తుంటే! చీరలు అనేమాట వినేసరికి గుప్తకి కొంచెం ముఖం వికసించింది. ఫరవాలేదు — కొత్త గిరాకీ అన్నమాటే అతనికా సంతోషం కలిగించినందుకు రంగారావుకీ సంతోషంగానే ఉంది. కాని...

"ఏం చీరలు కావాలి? బాంబేప్రింటెడ్, ఫారిన్ ప్రింటెడ్ వాయిల్స్, జార్జెట్, షిఫాన్, బెనారస్ సిల్కు, బెంగుళూరుసిల్కు, ఆర్గండీ, ఇమిటేషన్ ఆర్గండీ, క్రేప్" ఏమేమిటో చెప్పుకుపోతున్నాడు. రంగారావుకి పచ్చివెలక్కాయ నోట్లో పడ్డట్టయింది. తనీ పేర్లుకూడా సరిగా వినలేదింతవరకూ. ఏం చెప్పాలి? గుప్త చెప్పిన మొదటి పేరు జ్ఞాపకం పెట్టుకొని "బాంబే ప్రింటెడ్ చూపించు" అన్నాడు. అనటమే తడవుగా షాపులోని కుర్రాళ్లూ, గుప్తా కలిసి గబగబ బీరువా తలుపులు లాగేసి చీరలు పరిచెయ్యటం మొదలుపెట్టారు. రంగారావుకి అయోమయంగా ఉంది. ఊరుకున్నవాడు ఊరుకోక అనవసరంగా కావాలని చిక్కు తెచ్చుకున్నాడు. పాపం, వాళ్లు శ్రమపడి అవన్నీ చూపిస్తుంటే, బెల్లంకొట్టినరాయిలా అలా చూస్తూ నించోటం ఘోరం అనిపించి "అవన్నీ ఒద్దులే" అన్నాడు. కాని గుప్త ఆ మాట లేమాత్రం సరుకుచేయక, "ఫరవాలేదు లే చూడు," అన్నాడు. యంత్రంలా రంగారావు పరీక్షిస్తున్నట్టుగా ప్రతిచీరా స్పృశించి చూస్తున్నాడు. అతనికి ముచ్చెమటలు పడుతున్నాయి. చీరలు కుప్పలుకుప్పలుగా బల్లమీద పడుతున్నాయి. తను ఏదీ కొనబోవటంలేదు. "ఈ గుప్తకి తనకి

చీరలు కొనే అవసరం ఇంకా రాలేదనే విషయం తెలియదేం ? వెధవ వ్యాపారం, పీడా" అని విసుక్కున్నాడు. కొంపతీసి తనని బాగా ఎరిగినవాళ్లెవరైనా చూస్తే అదో తంటా ! "పెళ్లి కాకుండానే నీకి చీరల గొడవేమిటి గోయ్?" అని నక్కీసుని ఆవేళారం చే పరువుకాస్తా పోతుంది. గుప్త తనని ఎన్నిశాపనార్థాలు పెడతాడో, ఏదీ కొనకుండా పోతే.

"అంతగా నచ్చలేదు. వొస్తా" అని లేవబోయాడు రంగారావు. కాని గుప్త వదల్లేదు. ఇంకా ఏవేవో చూపిస్తున్నాడు. ఈసారి కాస్త వొళ్లుమండి, "ఎందుకురా ? ఇవన్నీ చూపించక్కర్లేదు. వొచ్చిన ప్రతివాడికీ ఇంత శ్రమపడి నువ్వు చచ్చినట్టు మడతలు పెట్టుకొంటావా ఏం ?" అన్నాడు. గుప్త ఏమీ విసుక్కోక "మరి లేకపోతే అమ్మకం ఎలా జరుగుతుంది ?" అన్నాడు. రంగారావు కొంచెం ఆశ్చర్యపడి "ఇలా రోజూ కెన్నిసార్లు ఈ ప్రదర్శన జరుగుతుంది?" అన్నాడు.

"నీలాంటివాళ్లు ఎంతమంది వొస్తే అన్నిసార్లు"

"ఏమైనా దెబ్బకొట్టాడా?" అనుకున్నాడు రంగారావు.

"సరే ఇహ వొస్తా."

"కొనకపోతే మానేసే. అన్నీ చూసి పో" బలవంతం చేశాడు గుప్త. గుడ్లప్పగించి చూశాడు రంగారావు. ప్రదర్శనానంతరం "సారీ" అని మాత్రం అనేసి వెనక్కి తిరిగాడు.

"థాంక్యూ."

ఎదురుగా బోర్డు ఉంది.

రంగారావు ముఖం జేవురించింది.

ఓసారి వెనక్కి తిరిగి గుప్తముఖం చూస్తే— రంగారావుకి సాహసం కలగలేదు. ఎన్ని తిట్టుకొంటున్నాడో! "థాంక్యూ!" అని గుప్త ఎచ్చెట్టుగా అన్నట్టుగానే ఉంది అతనికి. కొట్టు దాటీరాగానే పక్కకొట్లవాళ్లు రంగారావు ప్రవర్తనని సి. ఐ. డీ. ల్లా కనిపెట్టి సమయంకోసం కాచుకు కూచున్నట్టుగా ఒకరి తరవాత ఒకరు "మంచి మంచి కొత్త వెరైటీ చీరలున్నాయి. చూస్తారా?" అని ఆశగా అడగసాగారు. రంగారావుకి కాళ్ళు వొణికాయి. ఇంకా కాసేపు అలా నిలబడితే బలవంతాన తనని లాక్కుపోయి తమ తమ నమూనాలు ప్రదర్శించి బాధించగలరని భయం వేసి గబగబ ముందుకి నడిచి బయటపడ్డాడు. తను వ్యాపారం పెడితే వస్త్రాలయం మాత్రం జన్మలో ప్రారంభించటం జరగదు.

మిల్లీ బోర్డులు—రకరకాలు.

జనరల్ స్టోర్స్!

ఫ్యాన్సీ స్టోర్స్!

రంగారావుకి ఏదో వెలితిగా కనిపించింది. ఆలోచించగా జ్ఞాపకం వొచ్చింది. అక్కడో ఫేమస్ ఫాన్సీ షాప్ ఉండాలి. ఏమయింది? కనిపించదేం? నిన్న కాక మొన్న చూశాడే! జేరా మేకు పీకేశా దన్నమాట. అసలే చిన్న షాపు. ఎవరూ కొనటం లేదు కాబోలు. రంగారావు వెంటనే ఇంకో విషయం కనిపెట్టాడు. మై ఫాన్సీ—విస్తరించింది. మొదట ఈ రెండు షాపులకీ మధ్య ఇంకేవో చిన్న చిన్నవి రెండు మూడు షాపు లుండేవి. వాటన్నిటెని క్రమంగా మైఫాన్సీ—కబళించివేసింది. ఇప్పుడు ఫేమస్ షాప్ కూడా అదృశ్యం. 'ఇంతింతై వటుడింతై...' అన్న పద్యపాదం స్ఫురణకి వచ్చింది రంగారావుకి. ఎవరో బాగుపడ్డందుకు సంతోషం. మూడు పువ్వులూ ఆరు కాయలూ, నిత్యకళ్యాణం పచ్చతోరణం. అదే కావలసింది. కాని ఎవరో బాగుపడలేకపోవటం దురదృష్టం. శోచనీయం. ఏమిటో ఆలోచిస్తూ ఆశ్చర్యంగా చూస్తూ కొట్టుముందు నుంచున్నాడతను.

రంగారావు వైఖరి చూసి కొట్టుయజమాని బిగ్గరగా ఓ కేక పెట్టాడు.

"ఏం కావాలండీ?"

రంగారావు పరిస్థితి గ్రహించి మాట్లాడకుండా ముందుకి నడిచే జనం తనవైపు ఆశ్చర్యంగా చూస్తారనీ, కొట్టుయజమాని నిరాశగా చూస్తాడనీ అనుమానించి కొట్లోకి వెళ్లాడు.

"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి దర్శనభాగ్యం!" అన్నట్టు కొట్టు యజమాని చిరునవ్వులో "ఏం కావాలండీ?" అని అతిమర్యాదగా అడిగాడు. రంగారావుకి తన రాజరికం వెంటనే స్ఫురించగా కొంచెం దర్జాగా కొట్టు వాలకమూలలూ చూసి "షాపు పెద్దది చేశార!" అని మెచ్చుకుంటున్నట్టుగా అన్నాడు

ఆయన నవ్వి "తక్కువ లాభం, ఎక్కువ అమ్మకం. అదే మా లక్ష్యం, మా పాలసీ. అందుకే మీలాంటి వాళ్లు మా కొట్టుకి రావటం." అన్నాడు. రంగారావు మనసులో "మా తృప్తే మీ ఆశయం" అనుకున్నాడు.

"మీకేం కావాలి?"

ఏం అనాలో రంగారావుకి తోచలేదు. తన కేమీ అక్కర్లేదు.

"ప్రస్తుతం ఏమీ వొద్దులెండి. ఊరికే చూసి పోదామని వొచ్చాను." అనాలనుకున్నాడు, గాని అలా అంటే మున్ముందు తనని లక్ష్యపెట్టడేమో నని "టాయ్‌లెట్ సామగ్రి ధర లెలా ఉన్నాయి?" అన్నాడు.

ఆ షాపు యజమాని వెనువెంటనే తడుముకోకుండా అనర్గళంగా టకటక చెప్పేస్తున్నాడు. ఒక్కొక్క వస్తువూ, ఆ వస్తువు తను ఎంత ధరకమ్ముతున్నదీ, ఇతరు లెలా అమ్ముతున్నదీ, కావాలంటే కనుక్కోవచ్చు నని అభయం కూడా ఇస్తున్నాడు.

రంగారావు మాత్రం ఆశ్చర్యంగా అతనివైపు చూడసాగాడు. అతని అద్భుతధారణశక్తి అతనికి దిగ్భ్రమ గొల్పుతోంది. తనకొట్లో అమ్మేవరకే కాక ఇతరులవి కూడా అద్భుతంగా జ్ఞాపకం ఉంచుకుని లిస్టుల సహాయం ఏమాత్రం లేకనే టకటక వరస క్రమంగా చెప్పేయటం చూస్తే, ఈ మానవుడు కాలేజీచదువు కొనసాగిస్తే యూనివర్సిటీ ఫస్టు మాత్రమే కాక రికార్డులు పగలకొట్టించేవాడని కూడా నిస్సందేహంగా చెప్పొచ్చు అనిపించింది రంగారావుకి. కాని ఆ ఆశ్చర్యం క్రమంగా భయంలోకి దిగింది. ఇంతా విని తుస్సున వెళ్ళిపోతే అనర్గళంగా శాపనార్థాలు ఒక్కుమ్మడిగా రావొచ్చు. అయితే అదృష్టవశాత్తూ, ఆ యజమాని ఓ చిన్న పొరపాటు చేశాడు. కావాలిస్తే ఇతరచోట్ల ధరలు విచారించి తన ధరలు తక్కువగా ఉంటేనే కొనొచ్చుఅన్నాడు. ఈ అవకాశం వెంటనే సద్వినియోగం చేసుకుని "విచారించి వొస్తాలెండి" అనేసి అప్పటి అవస్థనించి తప్పించుకున్నాడు. ఎదురుగా ఉన్న ఫాన్సీకొట్ల యజమానుల కళ్లన్నీ రంగారావుని వెంబడించాయి. రంగారావుకి కొద్దిగా భయం వేసి గబగబ నడిచాడు.

మందులు! మెడికల్ లైన్!

ఇంగ్లీషుమందులు, ఆయుర్వేద ఔషధాలు హోమియోపతిమందులు వరసగా బీరువాల్లోంచి సీసాలు తొంగి చూస్తున్నాయి.

రంగారావు భయంగా ఆ తెల్లటి అక్షరాల -వైపూ, సీసాలవైపూ, ఆ కొట్లయజమానులవైపూ చూశాడు. మెడికల్ షాపుల్ని చూస్తే వాసనా ఆరోగ్యకమైన అనోభయం అతనికి చిన్నప్పటినించీ. మందుల వాళ్లు కంపెనీల యజమాన్లు. జనంవైపు చూస్తూ ఖాళీగా కూచోటం ఎల్లప్పుడూ వాంఛనీయం అనుకున్నాడు రంగారావు, భయగ్రస్తుడై. తనవైపు ఎవరో దుకాణదారుడు చూస్తున్నాడు. తన చేతిలో చీటీ ఏమీ లేదు అదృష్టవశాత్తూ. గాడ్ ఫర్ బిడ్! మందు లెక్కువైతే మనిషి లెక్కువ అని ఓమిత్రుడు చమత్కరించాడు ఆమధ్య. 'కాదు ఆస్పత్రు లెక్కువైతే' అని తను సవరించాడు చమత్కారంగా. ఎవరికో కీడు జరిగి మందుల అమ్మకం — కావాలని వాంఛించకపోయినా - వృద్ధికావటం ఘోరం అనిపించిందతనికి. ముందు కీడు జరిగితేనే తరవాత మందులు కొనటం జరుగుతుందని రంగారావు ఆ క్షణంలో ఆలోచించటానికి సిద్ధంగా లేడు. డబ్బిచ్చి పెట్టుబడిమీద లాభాలు ఊరికే తీసుకోమన్నా తను మందుల షాపుమాత్రం కలలో కూడా పెట్టడు! రంగారావు నడుస్తూనే ఉన్నాడు.

కొత్త కొత్త సంగతులు — ఇకవరకెప్పుడూ సూచనగానైనా తను అనుకోనివి — ఎన్నో అనుభవానికి వొస్తున్నాయి.

ప్రకటనలు...

ధరలు...

తగ్గింపు రేట్లు...

అంతకంటే తగ్గింపు రేట్లు.

ఇటు చూడండి... ఇటు — ఈ ఆకర్షణలు...

అటు కాదు. ఇటు.. ఇటు.

మీ రెక్కడ కొనాలో ఏం కొనాలో మీకు తెలియదు...మా సలహా పొందండి. సలహా ఉచితం. వస్తువు కొంటే రేపరు ఉచితం. మీకై ప్రత్యేకం.

రంగారావు తల తిరుగుతోంది.

పోటీ — పోటీ — పోటీ.

ఎక్కడ చూసినా పోటీ — ఎటు చూసినా పోటీ.

కొనేవాడే రాజా. మహారాజా.

కొనే మహారాజులు. స్వాగతం. సుస్వాగతం.

కొన్నంతసేపూ రాజరికం

కొననంతసేపూ ఛీఃరికం—కనీసం కొట్ల యజమానుల దృష్టిలో.

తను అక్కర్లేనివి అనవసరంగా బేరం చేశాడు. బేరం చేస్తున్నంతసేపూ కీలి వెనక్కి తిరిగితే— "థాంక్యూ!". రంగారావుకి అపహాస్యంగా ఉన్న థాంక్యూ అన్నట్టనిపించింది.

అవును, మరి. కొనేవాడే రాజా. డబ్బిచ్చేవాడే మహారాజా. చిరునవ్వుతో ప్రతిఫలంగా కృతజ్ఞతాభివందనాలు. ఎంత నిరీక్షణ! ఎంత ఆశ! ఎన్ని ఆకర్షణలు!

రోడ్డుమీద జనం నడుస్తున్నారు. నడుస్తున్న జనాన్ని చూసి దుకాణదారులు ఆశపడుతున్నారు. జనం ఆశగా వస్తువులవైపు చూస్తున్నారు. తీసుకోమని బతిమాలుతున్నట్టుగా యజమానులు కళ్లతో వాళ్ళని పలకరిస్తున్నారు. ఒక్కొక్క వస్తువు ఇద్దర్ని- ఇరుపక్షాలవాళ్ళనీ—అడ్డగిస్తోంది. డబ్బు! 'వెధవ డబ్బు' అనుకున్నాడు రంగారావు. గవర్నమెంటు ముద్రకొట్టించి పారెయ్యకూడదూ? వెంటనే నవ్వొచ్చింది రంగారావుకి. తన అర్థికశాస్త్రవిజ్ఞానమంతా ఏమయినట్టు? పరీక్షలో ఏకరువు పెట్టిన ద్రవ్యోల్బణ ప్రమాదాలన్నీ మళ్ళీ గుర్తుకొస్తున్నాయి. అవన్నీ జ్ఞాపకం చేసుకుని మళ్ళీ ఆ నరకయాతన అనుభవించటానికి అతను సిద్ధంగా లేడు. కాని అతని మనసులో ఏదో బాధగా ఉంది. పోనీ, ఉన్నవన్నీ తలా కాసినీ పంచుకోగూడదూ? పంచుకుంటే ప్రతివాడికీ దక్కేది ఏమిటో తనకి తెలియకపోలేదు. ఉత్పత్తి! ఉత్పత్తి ఎక్కువకావాలి. అందాకా ఏంచేసేట్టు! ఉన్నదేదో ఎంత కొద్దిఅయినా అందరూ పంచుకోటమే న్యాయమనిపిస్తోంది రంగారావుకి. అవన్నీ చిక్కువిషయాలు. ప్రస్తుతం తను అవన్నీ ఆలోచించే స్థితిలో లేడు. మనసు తిప్పుకున్నాడు రంగారావు.

కొనేవాళ్లు బేరాలు చేస్తున్నారు.

తనలాంటి కొనేవాళ్లు కాదుగదా!

తను దుకాణదారుడైతే!

రంగారావుకి ముచ్చెమటలు పట్టాయి. తనవల్లకాదు. వొచ్చిన ప్రతివాడికీ ఓ నమస్కారం పెట్టేసి వొదిలించుకుంటాడు. అలా అయితే అమ్మకం జరగదు. అమ్మకం జరక్కపోతే డబ్బు రాదు. డబ్బురాకపోతే—! తన రాజరికం నశిస్తుంది.

అకస్మాత్తుగా రంగారావుకి ఓ ఆలోచన కలిగింది. దుకాణదారులూ కొనేవాళ్లే. ప్రపంచంలో ప్రతి మనిషీ కొనేవాడే.

పెట్టుబడిదారీవ్యవస్థలో ప్రతివాడికీ రాజయోగం ఉంది. రాజయోగం! అందుకోసమే ఈ నిరీక్షణ. ఈ వేడికోలు. ఈ ఆశ!

"రండి రండి రాజులూ, కొనండి, కొనండి." అంటున్నారు యజమానులు.

ఏమిటో సర్వం హాస్యాస్పదంగా కనిపించింది రంగారావుకి ఒక్కక్షణం.

ఆలోచిస్తూ నడుస్తూనే ఉన్నాడు రంగారావు.

ఎవరో కాఫీహోటల్ ముందు తచ్చాడుతున్నారు. ఎవరు? ఓ తనకి తెలిసినవాడే. ఎలిమెంటరీ స్కూల్ టీచర్. ఏమిటి ఆలోచిస్తున్నాడు? కాఫీ తాగుదామా వద్దా అని కాబోలు. 'కొనవయ్యా అరకప్పుకాఫీ' అని హోటల్ యజమానితరఫున రంగారావు మనసులో విసుక్కున్నాడు. కాని ఆ టీచర్ కాసేపు అలాగే ఆలోచించి, చివరికి ఎదురుగా ఉన్న మల్లెపూల అంగడిలో ఓ బేడా పువ్వులు తీసుకుని వెనక్కి వెళ్లిపోయాడు. రంగారావుకి హృదయంలో కలుక్కుమంది. పాపం! డబ్బుల్లేవు కాబోలు. భార్య గడుసుదైఉండాలి. మాట జవదాటటానికి జడిసిఉంటాడు. తనో అరకప్పు కాఫీ ఇప్పిస్తే బావుండేది! పాపం!

ఆలోచనలతో నిండిన రంగారావుమనసుని మరో దృశ్యం తనవైపు లాక్కుంది. ఎన్. జి. ఓ అని చెప్పకనే తెలుస్తున్న వాలకంగల ఓ పెద్దమనిషి చిన్నపిల్లవాడిని నెమ్మదిగా నడిపించుకుంటూ ఓ దుకాణం దగ్గిర ఆగి అరప్యాకెట్ 'సిజర్' సిగరెట్లు అడిగాడు కాని ఇంతలో ఆ పిల్లవాడేదో కావాలని చెయ్యిపెట్టి చూపిస్తూ మారాం చెయ్యసాగాడు. ఆ ఎన్. జి. ఓ ఒక్కక్షణం తటపటాయించి జేబులు తడుముకుని చిన్న నవ్వు తెచ్చుకుని సిగరెట్లు అక్కర్లేదని చాక్‌లెట్లు తీసుకుని పిల్లవాడి చేతిలో పెట్టి,

చుట్టూ జనం ఉన్నారని కూడా సంకోచించకుండా వాడిని హృదయాని కదుముకుని ముందుకి సాగిపోయాడు.

రంగారావు ఒక్క క్షణం తానెక్కడున్నాడో మర్చిపోయి రోడ్డుమధ్యగా కదలకుండా నిలబడ్డాడు. ఇంతలో పోలీస్ విజిల్ విని తేరుకుని ఆ దృశ్యం జ్ఞాపకం చేసుకోసాగాడు. అతని హృదయంలో ఏదో వేదన మెదిలింది. పాపం, సిగరెట్ గతిప్రాణి అయి ఉండీ అవి లేకనే వెళ్లిపోయాడు. సిగరెట్లో, చాక్లెట్లో—అదే అతని తక్షణ సమస్య. ఏం చేస్తాడు, పాపం! మనసులోనే ఎన్. జి. ఓ. కి సానుభూతి అందజేశాడు రంగారావు.

ఆ విషయంగురించి ఎక్కువసేపు ఆలోచించాలిసిన అవస్థ రంగారావుకి తప్పిపోయింది. నాలుగడుగులు వెయ్యగానే మరో విశేషం అతని దృష్టిని ఆకర్షించింది. అప్పుడే అంగడిలో అడుగుపెట్టి ఓ పెద్దమనిషి చేతిలో ప్యాకెట్ విప్పి బల్లమీద పడేస్తూ "ప్రస్తుతం చీర అవసరం లేదులెండి. ధోవతులు చూపించండి." అంటున్నాడు. చీరలు అమ్మినవి వాపసు తీసుకోవటం కొట్టు యజమానికి కొత్త కాకపోయినా ప్రస్తుత పరిస్థితి అతని కేదో కొంచెం వింతగా కనిపించినట్టుంది; కొంచెం ఆశ్చర్యంగా చూసి ఏమీ మాట్లాడకుండానే ధోవతులు చూపించసాగాడు. ఐతే రంగారావుకి మాత్రం అదేమీ విషమ సమస్యగా కనిపించలేదు. ఆ పెద్దమనిషి కట్టుకున్న ధోవతి అనబడేది ఆ సమస్యని త్వరితంగానే పరిష్కరించింది. ఆయన శ్రీమతి కేదో పురస్కారం ఏదో సందర్భాన ఇవ్వాలని ప్రయత్నించి ఆర్థికస్థితి అందుబాటులో లేక కాలం కలిసిరానందువల్ల అవసరాలు వాయిదా వెయ్యలేకపోయాడు. 'పాపం' అనుకున్నాడు రంగారావు.

అవసరాలు వాయిదా పడవు.

'నిజం, నిజం' అనుకున్నాడు రంగారావు.

అందరూ సుఖపడితే బాగుండును.

"సర్వేజనా స్సుఖినో భవంతు!"

"తథాస్తు" అనుకున్నాడు రంగారావు.

"సుఖదుఃఖాలు కావడికుండలు" అని జ్ఞాపకం వొచ్చిందతనికి. "అంతేలే." అనుకున్నాడు. తనకి కొంచెం వేదాంతం అబ్బుతోంది. చిన్నగా నవ్వుకుని జనప్రవాహాన్ని దాటుకుంటూ నడుస్తున్నాడు రంగారావు.

ఒక్కసారిగా రంగారావుహృదయం ఝల్లుమంది. కళ్లు జిగేల్ మన్నాయి. మెరుపు మెరిసినట్టయింది.

"ఖటావ్ వాయిల్స్."

ఓ అందమైన అమ్మాయి అందంగా చీరకట్టుకుని నిలబడ్డది నాజూకుగా, వొయ్యారంగా.

అది బొమ్మే! కేవలం రంగులకలయికే నని రంగారావు వెంటనే నమ్మినా నమ్మలేకపోయాడు. ఆ బొమ్మని అతను చూడటం అదిమొదటిసారి ఎంతమాత్రం కాదు. ఎన్నోసార్లు; చెప్పటం తేలిక కాదు. అయినా ఆరోజు అది అతనికి ఎంతో కొత్తగా, తాజాగా, అందంగా, సజీవంగా, ఇంకా ఇంకా ఏమిటోగా కనిపించసాగింది.

ఆ చీర ఎంత బావుంది! చీర బావుందా? ఆమె కట్టుకోటంలోని నాజూకుతనం బావుందా? లేక ఆమె - ఆ బొమ్మ అందమే చీర బావుందనిపిస్తోందా? చీర ఎలా కట్టుకుంటారో కూడా రంగారావుకి ఆక్షణందాకా కూడా తెలియదు. ఆ మెళుకువలన్నీ చూస్తుంటే ఇన్నాళ్ళనించీ తను ఆ సుందరదృశ్యాన్ని ఎలా చూడలేకపోయాడో రంగారావుకి అవగతం కావటంలేదు. చూసినకొద్దీ తనకి చూడాలనిపిస్తోంది. ఆ చిత్రకారు డెవరో గొప్పవాడు. జీవకళ ఉట్టిపడుతోంది.

రంగారావులో ఏదో మార్పుకలిగింది. తనలో ఏదో మార్పు కలిగిందని రంగారావుకి తెలిసీ తెలియలేదు. ఏదో ఆనందంగా ఉంది.

అలా తన్మయత్వంతో చూస్తున్న రంగారావుకి అకస్మాత్తుగా అనిపించింది - తననా స్థితిలో ఎవరైనా చూస్తే బావుండదు. తెలియనివాళ్లయితే నవ్వుకుంటారు. తెలిసినవాళ్లయితే ఏడిపిస్తారు. సజీవంగా నడిచే అందమైన అమ్మాయిల్ని తను ఇదివరలో చూడకపోలేదు. చిత్తచాంచల్యం తాత్కాలికంగా కలగక పోలేదు. కాని ఇప్పు డదేదో భావం హృదయంలో కలుగుతోంది. అదే భావంతో హృదయం నిండి పోతోంది. ఏదో రసవాహిని ప్రవహిస్తోంది. వాయిల్ చీర బావుంటుంది కాబోలు!

కాని గుప్త కొట్లో చూస్తే తనకేం నచ్చినట్టు లేదే! తనుకొను వెలవులు దప్పిన—! అనవసరంగా తను అక్కర్లేని బేరాలు చేశాడు. గుప్త ఏమనుకున్నాడో!

అకస్మాత్తుగా రంగారావు మనసులో మెరుపులా ఓ ఆలోచన మెరిసింది.

తనూ ఎప్పుడో కొనాలి! కొంటాడు- చీరలు. రంగారావు హృదయం పరవశించింది. ఆ ప్రణయ బహుమానాలు మనసులో మెదులుతున్నాయి. ఆనంద తరంగాల్లో తేలిపోతూ అతను ముందుకు నడిచాడు.

నవరత్నాలు రాలేలా నవ్వుతూ పసిపాప పలకరించింది ఎదురుగా కాన్వాస్ మీద తీరిగ్గా కూచుని. ఝల్లుమంది రంగారావు హృదయం, రెండోసారి రెండో మాదిరిగా. ఆ బోసినోటితో నవ్వే పసిపాప పక్కన ఉన్న అక్షరాలు చదివాడు రంగారావు.

"అమ్మా నీకు తెలిసియుండలేదా?" ఏమి టది? ఆ చిన్ని నోటిలో చిన్ని పలుకరుస వస్తోంది కాబోలు రంగారావు హృదయం ప్రఫుల్లితమైంది. హృదయంలో ఏదో ఆవేశం ఉబికింది. పక్కనే ఉన్న ఆటవస్తువుల వైపు కోరికగా చూశాడు. ఆ క్షణంలో తన్ను తాను మర్చిపోయిన రంగారావు ఇంచుమించు ఆ ఆటవస్తువుల్లో ఏదో కొనబోయి తక్కీమని తన్ను తాను తెలుసుకుని ఆగిపోయాడు. ఆ పసిపాప చేతిలో ఏదో పెట్టాలని ప్రబలంగా అనిపించింది. ఆ ఊహకి అతనికి నవ్వు రాకపోలేదు.

తనూ కొనాలి; కొంటాడు — ఆటవస్తువులూ, అవీ ఇవీ.

ఏవి?

ఆలోచిస్తున్నాడు రంగారావు.

చీరలూ, (రకరకాలవి)

ఫ్యాన్సీసామాన్లూ, టాయిలెట్ సామగ్రీ, (కొత్త కొత్తవి) నగలూ, (మంచిమంచివి)

ఆటవస్తువులూ, చాక్‌లెట్లూ ఇంకా, ఇంకా ఎన్నెన్నో...

మందులూ, మందులు!!

భయం వేసింది రంగారావుకి. గబగబా ముందుకి నడిచాడు ఆ ఆలోచన మర్చిపోవాలని ప్రయత్నిస్తూ.

ఓ పెద్ద కాన్వాస్ మీద ఓ కుటుంబం.

యజమాని చేతిలో ఇన్సూరెన్స్ పాలిసీ.

"మీ కుటుంబం మీ పై ఆధారపడియున్నది."

జీవిత భీమా!

జీవితం! భీమా!

మధురమైన ఆలోచన లన్నీ ఉప్పొంగి కాన్వాస్‌కి కొట్టుకుని శిథిలమయాయి.

భయపెడుతోంది కాన్వాస్. జీవితం!

కొనుక్కోండి పాలిసీ.

కొనేవాడే రాజు. మగ మహారాజు. జీవితం కొని ఇచ్చేవాడు. అన్నీ కొని తెచ్చేవాడు.

చుట్టూ తిరిగి రంగారావు ఆలోచన లన్నీ మొదటికొచ్చాయి. మళ్ళీ జనంవైపూ, కొట్లవైపూ విచిత్రంగా చూడసాగాడు రంగారావు. ఆగిపోయిన వీణా నాదపు ప్రతిధ్వని ఇంకా ఆగిపోలేదు. అది అస్పష్టంగా నేపథ్యంలో వినిపిస్తుండగా రంగారావు అప్పుడప్పుడు తాళంవేస్తూ ముందుముందుకి పోతున్నాడు.

ఎవరో పాడుతున్నారు, వేలంపాట. జనం చుట్టూ మూగారు. వేలం వేసే ఆసామీ హడావిడి చేస్తున్నాడు.

"పది రూపాయలు...పది రూపాయలు...... రెండూ...రెండూ! మంచి తరుణం. ఆలోచించుకోండి. మించిపోవును పది రూపాయలు. రెండు...."

రంగారావు జనంలో జొరబడ్డాడు. పక్కనే ఓ ముసలాయన ఆదుర్దాగా డబ్బు లెక్క చూసుకుంటున్నాడు. ఎన్నిసార్లు చూసుకుంటున్నా అంతే వస్తోంది కాబోలు; మళ్ళీ మళ్ళీ చూసుకుంటున్నాడు. మధ్యమధ్య వేలం వేసే ఆసామీ వైపు చూస్తున్నాడు.

"బంగారంలాంటి సరుకు. షిఫాన్ సిల్కు. అతి చౌక. కారు చౌకగా పోతోంది. తరవాత విచారిస్తే లాభం లేదు. పది రూపాయలు...రెండూ.... రెండూ."

ముసలాయన నిస్పృహగా నుంచున్నాడు. ఆతన ముఖంలో దైన్యం తాండవిస్తోంది. రంగారావు చూశాడు ఆ ముఖ కవళికలు. పాపం! డబ్బు తక్కువైనట్టుంది. కూతురికి కొని పెట్టాలని ఉబలాట

పడుతున్నట్టున్నాడు. పేదవాడిని వేరే చెప్పాలిసిన పని లేదు. మువ్వూర్తులా కుచేలుడే. అవతల ఆసామీ ఎవరో హుషారుగా ఉన్నాడు. రంగారావుకి ఆ ఉత్సాహం చూసి వొళ్లు మండింది. ముసలాయన్ని పలకరించాడు.

"ఆ చీర కొంటా రేమిటి?"

ఆయన నిరాశగా "ప్చ్" అన్నాడు.

"పాడినట్టున్నారు."

"మన తాహతుకు దాటిపోయింది."

పది రూపాయలకి పాట పెంచిన ఆసామీ వీళ్ళిద్దరివైపూ చూస్తున్నాడు. ఆ చూపుల్లో ఏదో ఎగతాళి కనిపించింది రంగారావుకి. యువకరక్తం పొంగింది. కొనేవాడు మహా! ఎందుకా డాబు! ఎందు కేమిటి! కొనేవాడే రాజు! రాజు!

ఉన్నట్టుండి రంగారావు అరిచాడు. "పన్నెండు."

వేలంఆసామీ హుషారుగా కేకేశాడు. "పన్నెండు... రెండు... రెండు. క్లియరెన్సు సేల్— చౌక చౌక... రెండూ."

అవతల ఆసామీ తెల్లబోయాడు. తటపటాయించాడు. ఏదో అనబోయాడు. సంకోచించి ఆగాడు. మళ్ళీ ఏదో ప్రయత్నించసాగాడు. "రెండూ, రెండూ....మూడూ! తీసుకోండి."

కాలహరణం సహించని వేలంఆసామీ పన్నెండుకి పాట ఫైనల్ చేశాడు. రంగారావు గర్వంగా చూశాడు. కొనేవాడు రంగారావు!

అయితే ఆ ఉత్సాహం విసురుగా చేతుల్లో చీర పడగానే ఒక్కసారిగా అణగారింది. తనేం చేశాడు! పన్నెండు రూపాయలు! తనేం చేసుకుంటాడు చీర? ఏం చేయాలని పాట పాడాడో అంత రాంతరాలు చెప్పినా రంగారావుకి ఏదోగా ఉంది. తెగించి డబ్బు అవతల పారేసి ముసలాయనతో జనం లోంచి బయటికొచ్చాడు. ముసలాయన దృష్టి అంతా చీరమీదే ఉంది.

"మీ రెంతవరకూ పాడారు?"

"ఎనిమిది"

"ఆ ఎనిమిది రూపాయలూ ఇచ్చి, ఈ చీర తీసుకుంటారా!"

ముసలాయన ఆశ్చర్యంగా చూశాడు.

"ఎందుకు? మీకు అక్కర్లేదా?"

"నాకెందుకు? బ్రహ్మచారిని."

"అయితే ఎందుకు పాడారు?"

"చెప్పలేను." నిజంగానే అలా అనిపించింది రంగారావుకి.

"చిత్రంగా మాట్లాడుతున్నారే."

"చిత్ర మేమీ లేదు."

"చూస్తూ చూస్తూ నాలుగు రూపాయలు నష్టపడేవాళ్ళని నే నెక్కడా చూడలేదు."

"నన్ను చూశారుగా."

"అందుకే ఆశ్చర్యంగా ఉంది."

"మనుషులు ఆశ్చర్యకరంగానే ప్రవర్తిస్తారు. ఓవిధంగా నేనూ ఆశ్చర్యపడుతూనే ఉన్నాను."

"మీరు కేవలం నాకు సహాయం చెయ్యాలనే ఉద్దేశంతో వేలం పాడినట్టున్నారు."

"నా కంత ఔదార్యం ఉందని నే ననుకోను. ఆలోచిస్తే ఇలా చేసేవాడిని కాదేమో. కాని మనం అన్ని పనులూ ఆలోచించి చెయ్యం చూడండి."

"మీరు తమాషాగా మాట్లాడుతున్నారు."

"జరిగింది కొంచెం తమాషాగా ఉన్నమాట వాస్తవమే. ఐతే ఇవాళ నేను చాలా మంచి 'మూడ్'లో ఉన్నాలెండి. ఇవాళే పరీక్షలైనాయి. అదీ కారణం."

ముసలాయన కొంచెం నవ్వాడు. రంగారావు వ్యవహారంలోకి దింపాడు. ఆయన మొహమాట పడ్డాడు. తీసుకోకపోతే తనకి నాలుగు రూపాయలే కాక పన్నెండూ దండగేనని రంగారావు నచ్చచెప్పిం తరవాత ఆయన తప్పనిసరిగా తీసుకున్నాడు. ఆ చీర తీసుకుంటున్నప్పుడు ఆయన సంతోషం అంతా ఇంతా కాదు. ఆ సంతోషం చూసి రంగారావు కూడా హృదయపూర్వకంగా సంతోషించాడు— లోలోపల కొంత బెంగగా ఉన్నా. తను నాలుగు రూపాయలు పోగొట్టుకున్నాడు. కాని అది సద్వినియోగం అయినట్టేనని సమాధానపరుచుకున్నాడు.

"మీ సహాయం మర్చిపోలేను. అమ్మాయికి ఒక్క మంచిచీర కొనిపెట్టాలని ఎన్నాళ్ళనించో

ఎంతో ప్రయత్నించాను. కాని సాధ్యంకాలేదు. ఇవాళైనా అదృష్టవశాత్తూ దవగ్గా వొస్తుందని ఆశ పడితే అది కాస్తా అడియాస అయే సమయంలో మీరు సహాయం చేశారు."

"ఇదికూడా ఓ గొప్ప సహాయంలా మాట్లాడకండి."

"ఎందుకు కాదు? ముక్కూ మొహం ఎరగని వాడికి ఎవరైనా ఇలా తోడుపడతారా? మీ అడ్రస్ చెప్పండి. ఈసారి ఫస్ట్ తారీకున మీ నాలుగు రూపాయలూ ఇచ్చేస్తాను."

"అబ్బే, ఎందుకులెండి. నేను అప్పుగా ఇవ్వలేదుగా. మారుబేరానికిచ్చేశాను అంతే."

"ఇంత మంచి హృదయంగలవాడివి, నీ పేరేమిటి నాయనా?"

ఇలా అకస్మాత్ గా ఏకవచనంలో పిలిచేసరికి రంగారావు కొంచెం తికమకపడ్డాడు. ఆ సంబోధనలోని ఆర్ద్రత, స్వరంలోని కంపనం అతన్ని కొంచెం కలవరపెట్టాయి.

"ఏకవచనంలో పిలిచానని ఏమీ అనుకోకు. తండ్రిలాంటివాడిని, బహువచనంలో సంబోధించి గౌరవిస్తే ఆయుక్షీణం అంటారు."

రంగారావు హృదయం కరిగింది.

"మీ ఇష్టంవొచ్చినట్టు పిలవొచ్చు. నా పేరు రంగారావు."

"సంతోషం. ఏం చేస్తున్నావు నాయనా?"

"చెప్పాను కదూ? బి. ఏ. పరీక్ష ఆఖరి పేపరు ఇవాళే రాశాను."

"సంతోషం, బాబూ. తప్పక పాసవుతావు. నీలాంటి సహృదయుల్ని నే నెంతోమందిని చూడలేదు. జీవితంలో నీలాంటివారి అండదండలే ఉంటే ఇన్ని కష్టా లనుభవించేవాడిని కాదేమో."

రంగారావు ఆసక్తిగా అడిగాడు. "జీవితంలో చాలా ఇబ్బందులు పడ్డట్టున్నారు."

ఆయన చిన్నగా నవ్వాడు. "అవును కాని వాటినిగురించి నే నెప్పుడూ విచారించను. అయిన వాళ్ళని కాదని, లోకాన్ని ఎదిరించి వర్ణాంతరం, అందులో వితంతువివాహం చేసుకోకపోతే ఇన్ని కష్టాలు ఉండేవికావేమో. కాని తృప్తి కూడా ఉండేదికాదు. నాకు జీవితంలో ఇప్పుడు మిగిలిందల్లా అదొక్క సుఖమే. ఇప్పుడు అమ్మాయి తప్ప నా అనేవాళ్ళెవరూ నాకు లేరు. పిచ్చిపిల్ల."

ముసలాయన విషాదంగా, ముసిముసిగా నవ్వుకోటం ఎందుకో రంగారావుకి సరిగా అర్థంకాలేదు

"నేనంటే ఎంత ప్రేమ! నేను సాయంత్రం బడినించి—నేను ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌నిలే నాయనా; వేషంచూసి కనిపెట్టేవుంటావు—ఏం చెబుతున్నానూ? ఆఁ... నేను బడినించి వొచ్చేదాకా తను కూడా కాఫీ తాగకుండా నాకోసం చూస్తూనే ఉంటుంది. పాపం, ఇవాళ ఎంతో ఆలస్యమైంది. నాలుగింటికే పోయేవాడిని. ఆపనీ ఈపనీ తిరిగి ఆగిపోయాను. ఇంతలో ఈ వేలంవెర్రిలో పడ్డాను. షిఫాన్ సిల్క్! పిచ్చిపిల్ల ఎంత సంతోషిస్తుందో! డబ్బే ఉంటే! ఎందుకులే. నా అమ్మాయి నేదికలు."

రానురాను ఆయన ఆత్మగతంగా మాట్లాడటంతో రంగారావు సంభాషణలో ఏమీ కలగచేసుకోకుండా ఊరికే వినసాగాడు. సంజచీకటి పడుతోంది. ముసలాయన ఓ చిన్న పూరింటి గుమ్మం ముందు ఆగి 'ఓసారి లోపలికొచ్చి కూచునిపో బాబూ' అని ప్రార్థనాపూర్వకంగా రంగారావుతో అని తలుపుతట్టాడు.

తలుపు తెరుచుకుంది.

మెరుపు మెరిసింది; కాదు, చుక్క తళుక్కుమంది; కాదు. ఓ అమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయి రంగారావు అనే ఒకానొక వ్యక్తి ఆసమయంలో ప్రత్యక్షమవుతా డని ఏకోశానా అనుకోలేదు. అనుకుంటే చాటుగా దాగేదేమో. పారిపోయేదేమో. కాని ప్రస్తుతం బెదిరి రంగారావు కళ్ళలోకి సూటిగా చూసింది క్షణం. తరవాత జరిగింది తెలిసి, సిగ్గుపడి చివాలున లోపలికి వెళ్ళిపోయింది.

రెండూ, రెండూ నాలుగు కళ్ళు కలిసిన క్షణంలో రంగారావు శక్తిని యావత్తూ ఏదో అయస్కాంతశక్తి ఆకర్షించి రంగారావుని బొమ్మలా, శిలావిగ్రహంలా, నుంచోపెట్టింది.

ముసలాయన హెచ్చరిక విని తేరుకున్నాడు రంగారావు.

"ఆ కుర్చీ ఇలా వెయ్యమ్మా, శారదా!"

శారద!

"శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా...." బి. ఏ. పార్టు టూలోని పద్యం గిర్రున రికార్డులా రంగారావు మనసులో తిరిగింది.

యాంత్రికంగా ఆ పాతకుర్చీలో కూలబడ్డాడు రంగారావు.

"కాఫీ ఉందామ్మా?"

"ఊఁ. తెస్తున్నా"

ఆ సన్నటి స్వరంలోనే సంగీతశాస్త్రమంతా ఇమిడి ఉందనిపించింది రంగారావుకి.

కాఫీకప్పు కింద — తన దగ్గరగా — శారద పెట్టినప్పుడు బాణంలా వంగిన ఆ మృదుల తనూలతని మనసులో ఫొటోగ్రాఫు చేశాడు రంగారావు.

ముసలాయన ఏదో మాట్లాడుతున్నాడు. తను వింటున్నాడు కానీ వినటంలేదు. అమ్మాయితో తన విషయం చెప్పినట్టు చూచాయగా అతనికి తెలిసింది. అప్రయత్నంగా ఆమెవైపు చూశాడు.

మళ్ళీ... వాలుకళ్ళు!

రంగారావు హృదయంలో ఎవరో వీణ మీటుతున్నారు. వీణ మీటే దెవరు? ప్రశ్నించుకున్నాడు రంగారావు. "శారద కదూ?" అప్రయత్నంగా జవాబిచ్చింది అతని హృదయం — పోనీ, మనసు.

ధ్వనితరంగాలు — ఆనందతరంగాలు! వాటిమీద తేలిపోతూ రంగారావు!

ముసలాయన దగ్గర సెలవుతీసుకొని రంగారావు వీధిలో ప్రవేశించి ముందుకి నడుస్తూ వెనక్కి చూస్తూ సందు తిరిగి ఎలాగో రూమ్‌కి చేరుకున్నాడు. క్షణాలూ, నిమిషాలూ గడిచిపోతున్నాయి.

గదిలో క్యారికేచర్ ఎదురుచూస్తోంది. ఆ విషయం ఎప్పుడో ఓసారి జ్ఞాపకంవొచ్చి టైంచూసి ఉలిక్కిపడి ఆ మొక్కుతీర్చుకుని పడుకుని మళ్లీ ఆలోచనాసాగరంలో పూర్తిగా మునిగిపోయాడు రంగారావు.

"తనూ ఎప్పుడో కొనాలి; కొంటాడు — చీరలు"

కొంటాడేమిటి! కొన్నాడు! బి. ఏ. ఆఖరి పరీక్ష రాసేసిన రోజే — ఆ సాయంత్రమే.

ఐపోయాయి పరీక్షలు. వదిలింది భారం.

మధుర మధురమైన జీవితం. ముందున్నదంతా అదే.

ఆ చూపు! కళ్ళల్లోంచి ప్రవహించే ఆ విద్యుత్తు.

అవి చూపులు కావు. తూపులు. కళ్లలోంచి దూసుకుపోయి గుండెల్లో గుచ్చుకుని హృదయాన్ని గాయపరిచాయి.

అదే హృదయబాధ.

పుష్పబాణ విలాసం! చెఱకు విలుకాని కుంటరితనం!

ఖటావ్ వాయిల్స్ మనసులో మెదిలాయి రంగారావుకి.

షిఫాన్ సిల్కు! మధురస్మృతి.

కొనేవాడు రంగారావు కొన్నాడు. కొనేవాడే రాజు. రంగారావు రాజు. రాజాధిరాజు.

రోడ్డుమీద పోయే జనం 'మాల్స్' అతిక్రమించి రంగారావు మనసులో జొరబడ్డారు.

రంగారావు హృదయంలో ఏదో బాధ.

పుష్పబాణ విలాసం కాదు. రంగారావుకి అదే ఆలోచించాలని ఉంది. కాని మనసేదో ఆలోచిస్తోంది. రెండూ స్థలంకోసం పోటీ పడుతున్నాయి. ఆ విషయం అతనికి దప్పున తెలిసిపోయింది.

పోటీ! పోటీ!! తనలోకూడా ఏదో పోటీ! తనకి కూడా పోటీ తప్పదు!

బి. ఏ. ప్యాస్ కాగానే ఉద్యోగానికి పోటీ. ఫస్టుక్లాస్, సెకండ్‌క్లాస్ ... పోటీ దారులు. తనకి థర్డ్‌కంటే రాదు. అలా అయితే ఉద్యోగం - రాదా? రాకపోతే? డబ్బుండదు. ఉండదు. ఉండకపోతే! కొనలేడు, ఏవీ — చీరలూ, వస్తువులూ...

రంగారావుకి ముచ్చెమటలు పోశాయి.

ఇన్సూరెన్స్ బొమ్మ కనిపిస్తోంది.

జీవితం! భీమా!

కుటుంబాన్ని అన్యాయం చెయ్యకండి! భీమా చెయ్యండి. ఉత్తమోత్తమమైన భీమా కుటుంబం లేకపోవడమే!

ఎందుకో వెంటనే అలా అనిపించింది రంగారావుకి.

కాఫీ తాగలేని ఎలిమెంటరీ టీచర్; సిగరెట్ కొనలేని ఎస్. జి. ఓ.; చీర కొనలేని పెద్ద మనిషీ జాలిగా రంగారావు వైపు చూస్తున్నారు.

జీవితం వాళ్లని మోసగిస్తోంది. ఘోరం.

జీవితం! రంగురంగుల బోర్డులన్నీ పరస్పరం ద్వేషించుకుంటూ ఈర్ష్యగా చూస్తున్నాయి. పోటీ పడుతున్నాయి.

"రండి రండి, రాజులూ...ఏరి, ఏరి?"

"కావాలి, కావాలి...ఎలా, ఎలా?"

ఏం కావాలి? ఎన్నో కావాలి! ఇంకా ఎన్నో!! అదే జీవితం.

అవసరాలు

సుఖాలు

విలాసాలు!

ఇవన్నీ కలిస్తే జీవితం. వాటికోసం పోటీపడటమే జీవిత పోరాటం. అతిరథ మహారథులే, రాజాధిరాజులూ, మార్తాండ తేజులూ. యోధానుయోధులకే రాజయోగం.

రంగారావు కింకో ఊహతట్టింది.

బతికేవాళ్లందరూ యోధానుయోధులే. అతిరథ మహారథులు కాకపోవొచ్చు.

వేలంపాటలో చిత్తయిన ముసలాయన కనిపించాడు రంగారావుకి. అంతే, అంతే! అందరూ! ఆ రోజున ఆయన — తరవాత మరొకరు — ఒక్కొక్కరూ! ఎప్పుడో తనూ...!

భయం వేసింది రంగారావుకి.

జీవితాన్ని కాలసర్పం కాటు వేస్తోంది! లాభం లేదు. కాలాన్ని నిర్లక్ష్యంచేసి ఏమరుపాటుగా ప్రవర్తిస్తే జీవితం అఖరు.

నేను పుష్పబాణ విలాసానికి వశమైతే, రేపు?
కొనలేనివాడు ఉండీ లేనివాడు. జీవన్మృతుడు.
రాజుని చూసిన కళ్ళతో మొగుణ్ణిచూస్తే మొత్త బుద్ధిపుడుతుంది!

రంగారావు మనసులో ఈ ఆలోచన బాణంలా గుచ్చుకుంది. అతని ముఖం చిన్నబోయింది. తనని పైకి రానీయదు ప్రపంచం. తనని లక్ష్యపెట్టరు ఎవరూ, ఆ అమ్మాయి కూడా.

రంగారావు నిస్పృహగా, ఆలోచించటం మానేశాడు. కళ్ళు మూసుకున్నాడు. నిద్ర రావటం లేదు. ఎలా వొస్తుంది నిద్ర? తనకి నిద్ర రాదు! ఆశలన్నీ అడియాసలయాయి. మళ్లీ ఆలోచనలు.

ఆ అమ్మాయి, శారద—పాపం—నిస్సహాయురాలు. ఆ చూపులో ఏదో ఉంది. ఆ అమాయకత్వంలో ఏదో అయస్కాంతశక్తి ఉంది. కాంతిత్వంతో కాంతత్వం కలిగించవచ్చు. అలా తనవైపే చూస్తే, తన నేత్రాలుకూడా అయస్కాంతాల్లా— ఆకర్షించలేవా?

రంగారావు హృదయం జల్లుమంది. శరీరం గగుర్పొడిచింది. కాని, కాని... అయ్యో! తను నిస్సహాయుడేనా? చేతకానివాడేనా? ఏం చెయ్యగలడు? డబ్బే ఉంటే, ఈ క్షణంలో ఆమె దగ్గరవాలి... ఎందుకు దంభోక్తులు! డబ్బులేకుండా దాన్నిగురించి ఆలోచించటం అనవసరం. జీవితం ఇలా అడవిగాచిన వెన్నెలా వృథాకావలసిందేనా? ఇద్దరికోసం తనామెని కాపాడలేడా? ఆమె సంగతేమిటి? పాపం, ఆ బీద ఎలిమెంటరీ టీచర్ ఆమెకి మొగుణ్ణి ఎక్కడ కొనితేగలడు? ఆమెగతి అంతేనా, పాపం! తనూ, బీదవాడే! ఏం చెయ్యగలడు? ఆమె కసలు వివాహంకాదేమో! ఎన్నో చిక్కులు. తనకీ కాదు. తను జీవితంలోంచి పారిపోతున్నాడా?

రంగారావుకి కోపంవొచ్చింది, తనమీదే. తనెక్కడికీ పారిపోవటంలేదు. హాయిగా మంచంమీద పడుకుని నిద్రపట్టక తన్నుకుంటున్నాడు! కళ్లు మూసుకున్నాడుతను. నిద్ర రాదు. ఆలోచనలు, క్షణాలూ, నిమిషాలూ, గంటలూ గడిచిపోతున్నాయి. టైమెంతయిందో? ఎంతయితే ఏం?

చివాలున మంచంమీదనుంచి లేచి తలుపు తీశాడు రంగారావు. చీకటిగా ఉంది. అలా చల్లగాలికి తిరిగితే నిద్రపడుతుందేమో! తలుపు దగ్గరగా వేసి ఆ చీకట్లోనే బయలుదేరాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

ఆలోచిస్తూ, మానేస్తూ, నడుస్తూ, ఆగుతూ తిరుగుతున్న రంగారావుకి ఆ చీకట్లో గట్టిగా ఓ ఎదురుదెబ్బ తగిలి 'అబ్బా' అని రోడ్డుమీద కూలబడి

పోయాడు. వేలికి కంకర్రాయి తగిలి నెత్తురు వస్తున్నట్టుంది, చెయ్యి తడిఅయింది. దిమ్మెరపోయి కాసేపు ఆ వేలుపట్టుకుని అలాగే కూచున్నాడు. ఆ అవస్థలో అతనికి శారద జ్ఞాపకం వొచ్చింది. అలా తన వేలినించి రక్తం వస్తుంటే ఆమె ఏం చేసేదో! పాపం, శారద! ఆ సాయంత్రం తను ఆమెకి కాఫీ లేకుండా చేశాడు. తన ఎదటనే ఫ్లాస్కులో కాఫీ రెండుకప్పుల్లో పోసి తనకొకటే, తండ్రికొకటే ఇచ్చేసింది. అయినా ఆమె విసుక్కున్నట్టుగా ఏమాత్రం కనిపించలేదు. పైగా ఆప్యాయంగా తన దగ్గిరగా వచ్చి ఇచ్చివెళ్ళింది! అప్పటికింకా తను వాళ్ళకి సహాయం చేసింట్టుకూడా ఆమెకి తెలియదు. ఎంత మంచిది! ఆమె దగ్గిరుంటే కట్టుకున్న షిఫాన్‌సిల్కు చీర బోర్డర్ చింపి తన వేలుకి...! ఎంత మనోహర దృశ్యం!

నెమ్మదిగా లేచి నుంచుని రూముకి వెళ్ళటానికి వెనక్కి తిరిగి అడుగులో అడుగు వేస్తూ రంగారావు యాదాలాపంగా ఆకాశంలోకి ఎదురుగా చూశాడు. ఆ నీలాకాశంలో ఉజ్జ్వలంగా తెల్లటి చుక్క ధవళ కాంతులు విరజిమ్ముతూ మెరుస్తోంది. వేగుచుక్క పొడిచింది. ఆ ఉదయ సౌందర్యాన్ని రంగారావు రెప్ప వేయకుండా అలాగే చూడసాగాడు.

సౌందర్యం! అది అనిర్వచనీయం! ఎవరికి వారే అనుభవించాలిసిన అద్భుతం.

ఆ వేగుచుక్కని చూస్తే అతని కేదో జ్ఞాపకం వొస్తోంది. ఆ ఉదయ సౌందర్యం చూస్తుంటే అతని కేదో మరో సౌందర్యం మనసులో మెదుల్తోంది.

ఎవరెవరో మనుషులు రంగారావు స్మృతిలో కదుల్తున్నారు. అందరూ పాతవాళ్ళే. కాని కొత్త కొత్తగా కనిపిస్తున్నారు.

పువ్వులు కొంటున్న ఎలిమెంటరీ టీచర్. అతని వదనంలో రంగారావు కేదో అరుణకాంతి కనిపిస్తోంది.

చాక్ లెట్లు కొంటున్న ఎన్. జి. ఓ—కళ్లలో ఏదో మెరుపల్లే మెరిసి అంగుళం పాప ప్రకాశించాడు.

చీర వాపసు ఇచ్చి ధోవతులు తీసుకుంటున్న పెద్దమనిషి—సగభాగమే కనిపించాడు.

కాఫీ మానేసిన టీచర్, సిగరెట్లు మానేసిన ఎన్. జి. ఓ., ధోవతులు తీసుకున్న యువకుడూ చిరునవ్వులు నవ్వుతుంటే ఆ నవ్వుల కాంతిలో నేత్రాలు మెరుస్తున్నాయి. ఆ మెరిసే నేత్రాలన్నీ మరుక్షణంలో రెండే రెండు కళ్లుగా మారాయి. వృద్ధోపాధ్యాయుడి నేత్రాలు! ఆ బీద నేత్రాలు ఎంత కాంతిమంతాలు!

ఆ వేగుచుక్క! వేగుచుక్క ప్రకాశిస్తూ రంగారావుని చిరపరిచితంగా పలకరిస్తోంది. ఆ చుక్కని చూస్తే ఏం జ్ఞాపకం వొస్తోందో రంగారావుకి క్రమంగా తెలిసిపోతోంది. ఆ ఉదయ సౌందర్యానికి సమానమైన దేదో దిగంతాల కివతలే ఆ సాయంత్రమే తను చాలాసార్లు చూసేడు. చివరిసారిగా సంజచీకట్లో వాలుక కళ్లా కలుసుకున్నప్పుడు దేదీప్యమానంగా వెలిగిన ఆ రెండు చుక్కలికి ఆ సౌందర్యం ఎక్కడినించి వొచ్చింది? ఏదో నిరంతరజ్యోతి ఎక్కడో వెలుగుతూ కళ్లలో ప్రతిఫలిస్తుంటే, ఉదయ సౌందర్యానికి తుల్యమైన ఆ సౌందర్యాన్ని ఏదో ఇచ్చి తను కొనేశాడు.

దాని మూల్యం అమూల్యం.

అది కొనేవాడే రాజు!

'పారడైజ్ లాస్ట్'

శ్రీ ఎ. ఎఫ్. త్యాగరాజు

ఈ మహాగ్రంథం అవతరించి మూడు శతాబ్దాలైంది. నాటినుంచి నేటివరకూ ఆంగ్లవాఙ్మయంలో సాటిలేని మహోత్కృష్ట కావ్యంగా విలుగొందుతోంది. పాఠకునియొక్క గాని, పండితునియొక్క గాని, విమర్శకునియొక్క గాని, సాహిత్యాభిరుచికి, అవగాహనశక్తికి విలువలు నిర్ణయించే నికషోపలంగా వుంది. అతఃపూర్వం ఇలాంటి ఉత్కృష్ట రచన అవతరించటానికి సావకాశం వున్నదని ఎవ్వరూ ఊహించనైనా ఊహించగలిగిన సంగతి కాదు. కాని అది ఈ జగత్తులో ఉద్భవించిన ఒకటి రెండు సంవత్సరాలలోనే, డ్రైడెన్ చెప్పినట్టు, సమకాలీన రచనలనే కాక ప్రాచీన కావ్య పరంపరనంతా కూడా నరికివేసింది. ఈ రచన, అద్భుతావహమైన ఇలాంటి మహావిజయాన్ని సాధించిందంటే ఈ రచనకు వున్న విశిష్టగుణం లేదా గుణసముదాయం యేమిటి? చాలామంది 'శైలి' కారణమంటారు నిజానికి, మహాకవి మిల్టన్‌లా ఆంగ్లభాషను అంత హుందాగాను, హృదయ తంత్రులను ప్రతిధ్వనింపజేసే ఉద్గీతిగానూ, చాలనం చేసినవారు మరొకరెవరూ లేరు. ఈ విషయంలో షేక్స్‌పియర్ వంటి మహామహుడు మిల్టన్‌ముందు ఎందుకూ కొరగాడంటే, ఇతరుల విషయం తెలప నక్కర్లేదు. కాని కేవలం 'శైలి' మీదనే ఆధారపడి ఏ కళాఖండమూ చిరకాలం మనలేదు. శిల్పమూ వస్తువూ రెండూ కూడా మహోజ్వల స్థాయిలో సంయోగం పొందినప్పుడే అమరమైన మహాకావ్యం సిద్ధించగలదు. శైలికి సంబంధించినంతవరకూ మిల్టన్ సృష్టించిన సంగీత తరంగపరంపరతో విమోహితమై విమర్శకలోకం యావత్తూ అవతమై జోహారులర్పించివేసింది. కాని కావ్యవస్తువుయొక్క విలువను గాని సందేశాన్ని గాని సమగ్రంగా బోధపరచుకున్నవారు ఎంతమంది వున్నారనేది సందేహాస్పదమైన విషయం. అసలు, కావ్యం ప్రతిపాదించుతున్న మహార్థం ఇదమిద్ధం అని తేల్చటంలో విమర్శకలోకంలో ఒకరికొకరికి ఏకీభావం కుదరలేదు. తలా తోకా లేకుండా తలొకటీ చెప్పారు.

మతైకదృష్టిగల మిల్టన్ సమకాలికులు ఈ కావ్యాన్ని కేవలం ఒక మతగ్రంథంగా పరిగణించారు. అనేక ఆంగ్లేయగృహాల్లో, బైబిలు, బనియన్ రచించిన 'పిల్‌గ్రిమ్స్‌ప్రోగ్రెస్' ఫాక్స్ రచించిన 'బుక్ ఆవ్ మార్టిర్స్' మొదలైన గ్రంథాలశ్రేణిలో ఈ గ్రంథాన్ని కూడా వుంచి, ఆరకమైన మతగ్రంథంగానే ఆదరించుతూ వచ్చారు.

స్వర్గ నరకాలనుగురించి యిప్పుడు క్రైస్తవప్రపంచంలో వ్యాప్తిలోవున్న భావాలన్నీ మిల్టన్ భావనలో ప్రభవించినవే గాని, ఇతరత్రా బైబిలు ప్రతిపాదనలనుంచి ఉత్పన్నమైనవికావు. మిల్టన్ భావన అటు స్వర్గసీమలనుంచి ఇటు పాతాళగుహాకుహరాలవరకూ పరిక్రమించింది. దేవదానవులనూ, భూస్వర్గాల సృష్టికర్తనూ, భగవంతుని కుమారునీ కూడా సుపరిచితులైనట్టు వ్యక్తీకరించింది. దారీడొంకా లేకుండా దురవగాహంగా వుండే క్రైస్తవమత శాస్త్రానికి విస్పష్టమైన కావ్యరూపాన్ని ప్రసాదించి ద్యోతమానం చేసింది. మానవజాతిపట్ల భగవదిచ్ఛ ఎలా వుంటుందో? వ్యక్తీకరించి, దాని ఉత్కృష్టతను స్థాపించటానికి ప్రయత్నించింది. ఈ కారణాల చేతనే 'పారడైజ్ లాస్ట్'ను భగవద్విషయికమైన ధర్మబోధలుగా పరిగణించటం జరిగింది. ఈ పరిస్థితులను పురస్కరించుకుని, విమర్శకులేమంటున్నారంటే: ఏ మతవిశ్వాసాలను ఆధారం చేసుకుని ఈ కావ్యం నిర్మించబడివున్నదో అవన్నీ నేడు తలక్రిందులై ప్రాచీన మూఢవిశ్వాసాలక్రింద త్రోసివేయబడినై. ఆలోచనాపరులైన ఆధునికులు దేవతలనూ దయ్యాలనూ నమ్మేస్థితిలో లేరు. అందుచేత ఇప్పుడు ఈ కావ్యానికి విలువేమీ లేదు. కాకపోతే ప్రాచీన కళాఖండంగా పురావస్తుశాలల్లో వుంచి పూజించవచ్చు. ఇది ఆధునికుడెవ్వడూ అంగీకరించలేని

కాకమ్మ కథను ఆధారంగా చేసుకుని పుట్టిన రచన. సైతాను వాక్యాలలో చెప్పాలంటే: 'నవ్వుకోవటానికి పనికొచ్చే చిత్రకథ.'

సైద్ధాంతికంగా వాదించటం, కావ్యం ప్రతిపాదించుతున్న ప్రధానాంశాన్ని అవగతం చేసుకోలేకపోవటమని నా అభిప్రాయం. 'పారడైజ్ లాస్ట్' కావ్య వస్తువు భగవంతుడు కాదు — మానవుడు. తొలి రచన నుంచి తుదివరకూ మిల్టన్ ఎప్పుడేది రచించినా ఈ 'మానవుని' గురించే వ్రాశాడు. మిల్టన్ ఏ రచన చేసినా ఒకేఒక కావ్యవస్తువు — 'మానవుడు' — ఆ మానవుడు స్వయంగా తానే, మిల్టన్. ఆంగ్ల సాహిత్య ప్రపంచంలో అంత బరితెగి స్వాతిశయం ప్రకటించుకున్నవాడు మరొకడెవడైనా వున్నాడా? అవును, వీరు స్వాతిశయం అనదలిస్తే అనవచ్చు. కాని కాలరిడ్జి అన్నట్లు, అట్లాంటి వారు స్వాతిశయం ప్రకటించినప్పుడు, మహోజ్జ్వలమైన ఆ మహాపురుషుని చైతన్యస్ఫూర్తి మనకు ద్యోతమానమవుతుంది. తన కావ్యాలకన్నిటికి, తనకుతాను, మిల్టనే కావ్యవస్తువు; కాని, ఈ మిల్టన్ మానవునకు ప్రతినిధి — నిరంతర సంఘర్షణా స్వరూపుడైన మానవుడు, మిల్టన్; అమరమైన విజయమాలికను చేపట్టటానికి నిరంతర సంగ్రామం సాగుతూవుండే ధూళిధూసరితమూ జ్వాలామాలాకీర్ణమూ అయిన భయంకర రణక్షేత్ర స్వరూపుడైన మానవుడు, మిల్టన్. ఇది — తన్ను తాను వ్యక్తీకరించుకోవటమే పరమలక్ష్యంగా గల ఈ పద్ధతి — అతని రచనలన్నిటిలోనూ స్వర్ణలతలా వ్యాపించి మిలమిలగా ద్యోతమానమౌతూ, చీకటిలోకానికి వెలుగునిచ్చే జ్యోతిలా, అతని రచనలన్నిటినీ తేజోమయం చేసి వేస్తున్నది. 'వకేషన్ ఎక్సర్ సైజ్' దగ్గర నుంచి 'సాంసన్ అగొనిస్టిస్' వరకూ ఏ రచనను పరిశీలించినా ఈ సత్యమే మనకు బోధపడుతుంది. అతని కావ్యరచన యావత్తూ ఈ మానవ సమస్యనే ప్రతిపాదిస్తున్నది. మానవుని ఆత్మలో సాగుతూవుండే ఈ మహాసంగ్రామాన్నే ప్రతిపాదిస్తున్నది. మానవునియందు అత్యంత సానుభూతి కలవాడై, మానవుని సమస్యను తన సమస్యగా స్వీకరించి రణక్షేత్రంలో దిగి పోరాడి, అజేయుడై మానవునికి విజయపథాన్ని నిర్మించుతున్నాడు. ఈ సమున్నతమైన దృష్టితో మనం మిల్టన్ను అవగతం చేసుకోవలసివుంది.

అయితే, అసలు ఈ మానవ సమస్య ఏమిటి అనే ప్రశ్న వస్తుంది. ఒక్క వాక్యంలో చెప్పవలసివస్తే — నిరంతరంగా మానవుడు తనలో తాను జరుపుతున్న మహాసంగ్రామం.

సౌందర్యవిలసితమైన జగత్తులో మానవుడు ప్రతిష్ఠించబడుతున్నాడు. ఆ సౌందర్యాన్ని అనుభవించమని ప్రేరేపింపబడుతున్నాడు. కాని సుఖమయమైన ఈ నందనోద్యానంలో అడుగు ముందుకు వెయ్యగానే అవాంతరం ఎదురౌతోంది. హఠాత్తుగా నైతిక శాసనం ఆవిర్భవించి అడ్డునిలుస్తోంది — యుక్తాయుక్త సమస్య ప్రభవిస్తోంది. 'ఇది తగదు' అనే అంతరంగశక్తితో ప్రతిబంధకడ్డంగా, ఒక ప్రకటన విచిత్రంగా వెలుస్తుంది. కనులు పైకెత్తితే కనుపిస్తుంది, ముసిముసులు గులుకుతూ నిషిద్ధఫలం. ఈ నైతిక ప్రబోధంతో ప్రజ్వలితమై అతని అంతరాత్మలో ఏదో శక్తి ఉద్బుద్ధమవుతుంది. కొమ్మక్రింది గొల్లపడుచుతో కులాసాగా వినోదించాలనీ, నీలి జడనొక్కులను స్పృశించి ఆనందించాలనీ అతనికి హృదయం కొట్టుకుంటూనే వుంటుంది. కాని ఈ ఆకాంక్షలను జయించి నిష్కళంకతానికి సన్నద్ధుడైతేనే గాని, స్వచ్ఛందమైన నీ అంతరాత్మకు ఆవిష్కృతి లేదు, అని ఆ శక్తి హెచ్చరించుతుంది. దీంతో సంఘర్షణ ప్రారంభమవుతుంది:

The genius and the mortal instruments
Are there in Council, and the state of man
Like to a little kingdom, suffers then
The nature of an insurrection.

'యుయుత్సువులైన సచ్ఛక్తులూ అసచ్ఛక్తులూ
మానవ క్షేత్రమందు సమవేతములు కాగా,
విప్లవము చెలరేగిన సామ్రాజ్యమువలె
మానవ క్షేత్రము సంక్షుభితమైపోయినది.'

ఈ ఆంతరంగిక సంక్షోభాన్నంతా మిల్టన్ అనుభవించాడు — ఈ నరకకూపంలోనుంచి అనుగ్రహుడై పరిశ్రమించి జయశీలుడై బయటపడ్డాడు. ఆ అనుభవమే మహోజ్జ్వలమైన కవితా సరస్వతిగా రూపొందింది. ఎవ్వరెన్నగాని, సంఘర్షణరూపమైన ఈ గానములో నలిబిలిగా నలిగి, రక్తాన్ని చిందించుకుంటేనే గాని కళాకారుడుగా, రూపొందలేదు. ఒకవైపున

మిల్టన్ కళాజీవి — సౌందర్యోపాసకుడు. సౌందర్యం ఏరూపంలో దృగ్గోచరమైనా — పల్లెపడుచు హార్టన్ యువతి రూపంలో గాని, కామోన్మీలిత నయనలైన ఇటలీకన్యల రూపంలో గాని, లేదా, ఇంకా ప్రౌఢయౌవన సమ్మోహన విలాసాలకు ఆలవాలమైన 'డెలీలా' రూపంలో గాని — అతని హృదయతంత్రులన్నీ చలించిపోయినై. అనాదిసిద్ధమూ, నగ్నమూ, నైతికానైతిక ద్వంద్వ నిరాకరిష్ణువు, సమ్మోహన మూర్తి అయిన సౌందర్యజగత్తు, హిమానీ రుచిరములైన బాహువుల నెత్తి చేసన్న పిలిచింది. పాశజాలముల వంటి మోహనగీతికలతో ఆలవగా ఆహ్వానించింది యౌవనాన్ని వృథా చేసుకోవద్దని హెచ్చరించింది. (లిసిడాస్‌లో). (కోమస్‌లో):

'ఈజిప్టులో థోన్‌పత్ని, భగవత్పుత్రి హెలీనా కిచ్చిన మంత్రౌషధి కూడా ఇలాంటి మహదానం దాన్ని ఇవ్వలేదు' అని హెచ్చరించింది. సర్పి ఫలాన్ని చూపి మోజు కొల్పింది — ఈవ్ మృదుల హస్తంలో వున్న ఫలాన్ని — 'పారడైజ్ లాస్ట్'లో. 'పారడైజ్ రీగైన్డ్‌లో' సర్వకామ్యసంసిద్ధమైన విందు ఏర్పాటుచేసి విందనై వినోదించ మని ఉద్ఘూరించింది. 'సాంసన్ ఎగోనిస్టిస్‌లో' డెలీలా రూపం ధరించి, విభ్రాంతి గొలిపింది — అందుకే 'ప్రమాద కారణమే అయినా, సౌందర్యానికి అనిర్వచనీయమైన విచిత్రశక్తి వున్నది' అన్నాడు.

కాని మిల్టన్ కేవలమూ, సౌందర్యోపాసకుడైన కళాకారుడు మాత్రమే కాదు. భగవంతునియందు పరమపూజ్యభావం గల ఆస్తికుడు. భగవంతునిదృష్టిలో పరమపవిత్రుడైన ఉత్తమ జీవిగా బ్రతకటం అతని ఆశయం. తన జాతికి తాను సేవచెయ్యాలి; తన జాతి కొరకు తను పోరాడాలి. ఆంగ్లదేశంయొక్క భవిష్యత్తునుగురించి భగవదిచ్ఛ యేమున్నదో దాన్ని సాధించటానికి పుట్టిన కారణజన్ముడు తను. తన బాధ్యత తన్ను హెచ్చరించినప్పుడు ఇక ప్రేమడోలికలలో ఊగుతూ నిద్రపోలేడు. సౌందర్యోపసనాప్రలోభమైన స్వభావ మొకవైపూ, ఇంద్రియ వ్యాలోలత నంతా జయించి పరమశాంతిని చేపట్టాలనే నైతికశక్తి ఒకవైపూ సంఘర్షణకు దిగినై. ఇదే మిల్టన్ జీవితాని కంతకూ ఒక మహాసమస్యగా తయారైంది.

'మానవుని పతనం' (*Fall of Man*) మిల్టన్ తన మహాకావ్యానికి కావ్యవస్తువుగా ఎందుకు సేకరించాడు? అనేదానికి ఇదే సమాధానం చెప్పవలసి వుంది. మిల్టన్, 'రినైసెన్సు' యుగంలో ఆవిర్భవించిన మానవకతత్వవాదులలో (*Humanists*) ఒకడు. (ఈ వర్గం గ్రీకు సంస్కృతిని పునరుద్ధరించటానికి ప్రయత్నించారు). ప్లాటో సంప్రదాయాన్ని శిరసావహించినవాడు. గ్రీకు వేదాంతుల ప్రవచనాలు అతనికి ఊతకర్ర. గ్రీకు నాటకకర్తల విషాదాంత రచనలన్నిటిని అతను జీర్ణించుకున్నాడు. గ్రీకుల దృక్పథంలో తిరిగి జీవశక్తిని దృగ్గోచరం చేసుకున్న రినైసెన్సు యుగపు పండితులలో మిల్టన్ ప్రముఖుడు. గ్రీకు పౌరాణిక గాథలన్నీ ధర్మబోధనై అతని హృదయాంతరాళాలను జ్వలింపజేసినై. మిల్టన్ ఆర్ఫ్యూస్‌లాగా, రాలరప్పలనుసహితం కఱగింపగల దివ్య మురళిని సంపాదించాడు. ఆక్టన్‌లాగా ప్రకృతియొక్క నగ్న సౌందర్యాన్ని విస్ఫురిత నేత్రుడై తిలకించాడు. విచిత్రమైన ఎన్నా ఉద్యానంలో ప్రోసర్‌పైన్ లాగా పువ్వులు కోశాడు. గ్రీకుల వలెనే విజ్ఞాన మన్నా, సౌందర్య మన్నా అతనిలో తీరని దాహం. గ్రీకుల వలెనే స్వతంత్రేచ్ఛ, గ్రీకులవలెనే మానవుని ప్రాధాన్యతను గుర్తించాడు. అతను, ట్రాయ్ కోటగోడల ముందూ, సముద్రాంతరాలపైనా దేవతలతో తలపడి పోరాటం సలిపిన మహామహుల జాతికి చెందినవాడు. తన సర్వశక్తులనూ సమీకరించుకుని మహాకావ్య నిర్మాణానికి సన్నద్ధుడైనప్పుడు, తనకు ఆరాధ్యులైన ఆ ప్రాచీనగ్రీకు మహారచయితలు సంతోషింపగల కథావస్తువును సేకరించాడు. వారికి ముదావహములైన అనేక విషయాలను ఆ రచనలో చొప్పించాడు — ఉండీ లేనట్టు కించిత్ పరిహాసధోరణి, మానవ సమస్యకు అత్యంతమైన ప్రాధాన్యత నివ్వటం, కథను త్రిలోక పరివ్యాప్తంగా చాలనం చెయ్యటం ఇత్యాది. కాని గ్రీకులలో లేని ఒక మహాగుణం మిల్టన్‌లో ప్రభవించింది. మానవసమస్య మిల్టన్‌లో గ్రీకుమహారచయితలు తలపోసినట్లు పరిష్కారరహితమైనది కాదు. ఆ సమస్యకుగల పరిష్కారమే మానవుణ్ణి ఉత్తమజీవిగా నిలబెట్టుతోంది. ఒకే మహాపురుషుడు — అతను ఒక మహాపురుషుడు మనను పతనావస్థనుంచి ఉద్ధరించి, తిరిగి పవిత్రతరమైన ఆ ఉన్నతస్థానంలో ప్రతిష్ఠించగలడు.

ఆ విధంగా మానవతావాదం పారడైజ్ లాస్ట్‌లో ఫలోన్ముఖమైనట్టు మనం అవగతం చేసుకోగలం. మానవుడు అని పిలువబడే, బలహీనుడూ, నిస్సహాయుడూ అయిన ఈ జీవిచుట్టూ ఈ కథ అల్లుకుని వుంది. కాని ఎంత బలహీనుడైనా ఆ మానవుడే ఈ బ్రహ్మాండాని కంతకూ కేంద్రంగా వున్నాడు. అతనికోసమే ఈ సృష్టి యావత్తూ జరుగుతోంది. అతనికోసం లోకాలు నిర్మింపబడినై. అతని శ్రేయాన్ని గురించి స్వర్గసీమల్లో సహితం ఆందోళన పడుతున్నారు. అతని విముక్తికి స్వర్గంలో సభలు జరుగుతున్నయ్. అతని వినాశంకోసం నరకంలో సైతాన్ ప్రభృతులు మార్గాలు అన్వేషించుతున్నారు. ఈ పరిస్థితే మానవునికి ఒక మహోన్నత స్థానాన్ని, ప్రతిపత్తినీ కలుగజేస్తోంది.—గ్రీకు పురాణాలలోగాని నాటకాలలో గాని, మానవుని చిత్రణ కేవలం ఇందుకు భిన్నమైనది. పారడైజ్ లాస్ట్‌లో చిత్రించబడిన మానవుడు ప్రతిఘటింప సాధ్యం కాని యేకోరికకీ బద్ధుడు కాడు. 'తుంటరి పిల్లలకు ఈగ ఎలాగా మనం దేవతలకు అలా, దేవతలు తమ వినోదం కోసం మన్ని నలిపేస్తారు' అనే వెర్రి ధోరణికి మిల్టన్‌లో స్థానం లేదు.

పై రకం వెర్రి సిద్ధాంతాన్ని అంగీకరించిన తరువాత, ఆ కళాకారుడు ఎలాంటి ప్రతిభావంతుడైనా ప్రయోజనం వుండదు. అలాంటివాని రచన గ్రీకు విషాదాంత నాటకాలలో వలెనూ, థామస్ హార్డీ నవలలలో వలెనూ ప్రయోజన శూన్యమైన నిరాశావాద ధోరణిగా రూపొందుతుంది.

పారడైజ్ లాస్ట్‌లో, విమర్శకులు ఈవ్ ప్రతిపత్తిని అవగతం చేసుకున్నంత జాగ్రత్తగా ఆడమ్ ప్రతిపత్తిని అవగతం చేసుకోలేక పోయారు. నిజానికి మానవజాతికి చిహ్నంగా వున్నవాడు ఆడమ్. సర్వథా మానవుడు. ఆ పేరులోనే ఆ భావన వుంది. దేవతలతో ఆడమ్ జరిపిన దీర్ఘ సమాలోచనలలో — నిశితదృష్టిలేని విమర్శకులు వీటిని ఎంత తెగనాడినా-- సమాధానం దొరక్క అనాదిగా మానవుని వేధించుతున్న ప్రశ్నలన్నీ వున్నయ్: నే నెవరు? నే నెక్కడనుంచి వచ్చాను; నా భవిష్యత్తు ఏమిటి? విచిత్రమైన ఆకర్షణలో ఈవ్ అతని ముందు ఆవిష్కరించబడినప్పుడు ఎనలేని సమస్యాపరంపర, అయోమయస్థితి అతనిలో ఉత్పన్నమై కలవరపరచినై. ప్రేమ —ఇది లేనిది మానవుడు జీవించలేడు, నిజమే—కాని, ఇది ఒంటరిగా రాదు. దీనితోపాటు కళవళం, కన్నీరూ, అనుమానాలూ, బాధలూ ఇవన్నీ సంక్రమించుతాయి; స్నేహం వుంది— దానితోపాటు మోసం కూడా యివన్నీ వస్తయ్.

నిష్ఠురమైన ఈడెన్ ఉద్యాన జీవితానుభవంతో ఒక్క విషయం విస్పష్టంగా తేల్చాడు మిల్టన్; మానవుడు నిష్ఠురమైన ఈ గుణపాఠాన్ని తెలుసుకొని నిరాకరిస్తున్నాడు. కాని భగవన్నిర్మితమైన ఈ విశ్వంలో మనవలచివుంటే విధిగా తెలుసుకు తీరాలి. నైతిక ధర్మానికి తల వొగ్గితేనే శాంతిభద్రతలకు హామీ వుంటుంది. నైతికోల్లంఘన చేసిన వెనువెంటనే సుఖశాంతుల దివ్యస్వర్గాన్ని చేజార్చుకుంటాం— అకృత్రిమమూ అమాయికమూ అయిన హృదయంలో వుండే ఆ స్వర్గం అదృశ్యమైపోతుంది.

పారడైజ్ లాస్ట్ చదివే చాలామంది పాఠకులకు, మిల్టన్ సైతానుపట్ల అత్యంత సానుభూతి వున్నవాడుగా కనుపించి విభ్రాంతు లౌతారు. మంచికీ చెడుకూ జరిగే ఈ సంగ్రామంలో, సర్వవిదుడు, సర్వశక్తిసంపన్నుడూ అయిన పరమేశ్వరుని పక్షం వహించడానికి మారుగా నరకస్వరూపుడైన సైతానును మెచ్చుకున్నట్టు కనుపించుతున్నాడేమిటా అనిపిస్తుంది. సైతాను పాత్రను సృష్టించటంలో మిల్టన్ తనకున్న ప్రతిభాసంపత్తినంతా వినియోగించినమాట వాస్తవమే. కాని అంతమాత్రంచేత సైతానుపక్షం వహించాడనటం పొరపాటవుతుంది. భగవంతునిపట్లకంటే సైతానుపట్ల మిల్టన్ ఎక్కువ అభిలాషను చూపించటానికి ఒక కారణం వుంది: మానవునిలో ఏ సంఘర్షణ వుందో, అదే సంఘర్షణను— అదే ద్వంద్వాన్ని —సైతానులోనూ మిల్టన్ దర్శించగలిగాడు. అంతరాత్మనుంచి ఉజ్వల వాహినిగా సదసద్వివేకం ఉద్బుద్ధమౌతూ వుండటం, దాన్ని బలవంతాన అణచివేసుకుని తెలిసి తెలిసి, కావాలని అవివేకాన్నీ దౌష్ట్యాన్నీ చేపట్టి వ్యవహరించటం— మానవజాతిని వికారంగా మార్చివేసిన ఈ మహాసత్యాన్ని మిల్టన్ దర్శించి ద్యోతమానం చెయ్యటానికి ప్రయత్నించాడు. నిజానికి, మిల్టన్ సృష్టించింది తీవ్రస్వరూపుడైన మానవ సైతాన్. అతనికీ హృదయముంది. బాధలు అనుభవిస్తాడు. ఆడమ్ ఈవ్‌లు పర

స్వైరాలింగనంలో స్వర్గానందం అనుభవిస్తూవుండటం చూచి, తనకు అలాంటి ఆనందం అనుభవించే భాగ్యం ఎన్నడూ లభించ దని ఈర్ష్యతో కుమిలిపోతాడు. ఈ దృష్ట్యా సైతాను కూడా మిల్టన్ ప్రతిమూర్తి; ఆడమ్ మిల్టన్ ప్రతిమూర్తి. అనంతర రచనలలో, గాజాలో అంధుడై బానిసలతో పాటు మిల్లులో ఇడుము లను భవించి అనుభవించి, తుదిలో భగవదిచ్ఛాస్వరూపుడై దుష్టనిర్మూలన కారణుడై మహావిజయాన్ని చేపట్టిన శాంసన్ కూడా మిల్టనే.

కనుక, మానవజాతిపట్ల అనురాగం కలవారికి, మానవజాతి ఔన్నత్యంపట్ల విశ్వాసంకలవారికి, మానవుని స్వాతంత్ర్యం కొరకూ, హక్కులకొరకూ పోరాడుతూవుండే వీరులకూ, మిల్టన్ ఈ వారసత్వాన్ని అందజేసిపోయాడు—హృదయోల్లాసకరము, ఆత్మోన్నత్యప్రదమూ, వీరమార్గమూ అయిన పారడైజ్ లాస్ట్ సందేశాన్ని. ఈనాడు, పూర్వం ఎన్నడూ లేనంతగా ధర్మవీరంయొక్క అవసరం ఏర్పడివున్నదనటంలో ఎవరికీ ఎలాంటి సందేహమూ లేదు. మానవసమస్యలు మానవాళులలో పరిష్కరించటానికి వీలులేదనే అయోమయస్థితిని పటాపంచలు చేస్తూ మిల్టన్ అందచేసిన ఈ సందేశాన్ని మనం ఆశంకించవలసిన పనేమీ లేదు. ఈ మహా సత్యాన్ని శిరసావహించటంమీదనే మన భవిష్యత్తు ఆధారపడి వుంది. మిల్టన్ కలలుగన్న సజ్జనులు నివసించే ఆ నూతన స్వర్గమూ నూతన విశ్వమూ ఏర్పడగలదు.

'చిరకాలం బాధామయ జీవితం గడిపినా
సత్కార్యాలు ఫలించే
స్వర్ణదినాలు చూస్తారు
పవిత్ర సత్యం జయించి
ప్రేమోల్లాసాలు వెల్లి విరుస్తయ్.'

ఆంగ్లభాష భవిష్యత్తు

శ్రీ మొదలి శివకామయ్య

ఆధునిక యుగమున ఆంగ్లభాషకు గల వ్యాప్తియు, ప్రాముఖ్యమును, ప్రపంచ చరిత్రమున నొక అపూర్వ విషయము. ఆంగ్లదేశము యూరపు ఖండాంర్గత మగు నొక చిన్న దేశము. విస్తీర్ణతయందును, జనసంఖ్యయందును, నింతకంటె ఎన్నియోరెట్లు అధికములగు దేశములందు వ్యవహరింపబడుభాషలనేకములు కలవు. కాని ఆంగ్లభాషకుగల వ్యాప్తి వానిలో నే భాషకును లేదు. ఇందుకొక కారణము—ఆధునిక యుగమున వలసకుబోయి, దూరదేశములందు, ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా మొదలగు విశాల ఖండములందును, పెద్ద వలసరాజ్యముల నేర్పరచుకొనినవారిలో, ఆంగ్లేయులు అగ్రగణ్యులగుట. ఐరోపాఖండమునందలి, ఫ్రాన్సు, జర్మనీ, హాలెండు మున్నగు నితర దేశములవారుగూడ నిట్టి వలసరాజ్యముల నేర్పరచుకొనినను, ఆంగ్లేయుల వలసరాజ్యములకు కలిగినంత, విస్తీర్ణత, జనసంఖ్య, రాజకీయబలము, ఆర్థికసౌభాగ్యము, ఇతరదేశీయుల వలసరాజ్యముల కేర్పడలేదు. ఈ వలసరాజ్యములం దంతటను ప్రజలు ఆంగ్లేయుల సంతతి వారగుట వలనను, ఆంగ్లభాష వారి మాతృభాష యగుట మూలమునను, ఆ భాషకు ఎక్కువ వ్యాప్తి యేర్పడెను. ఇదిగాక, అనేక దేశములకు, వ్యాపారమునకై వెళ్ళి, ఆంగ్లేయులు, ఆ దేశీయులు బలహీనులగుటనో, అనాగరికులగుటనో, వెనుకబడియుండినందున, తమ ప్రభుత్వము నేర్పరచికొని పరిపాలనాధికారమున, పరిపాలకుల భాషగా నాంగ్లభాషకు వ్యాప్తి నెక్కుడు చేసియుండిరి. క్రమముగ ఆధునికయుగమున యంత్రసాహాయ్యమున వస్తూత్పత్తిచేయు విధానముల నవలంబించుటయందు, ముందంజ వేసియు, రవాణా వ్యాపారము నంతను తమ కధీనము జేసికొనియు, అంతర్జాతీయ వ్యాపార రంగమున ఆంగ్లజాతి ఉన్నతస్థానము నాక్రమించినందున, ఆంగ్లదేశముకంటె నెక్కువ విస్తీర్ణమును, జనసంఖ్యను, ప్రాచీన, నాగరికతను కలిగియుండిన పెక్కు పెద్దదేశములగు చైనా, రష్యా, ఇండియా మొదలగు దేశములందుగూడ, ఆంగ్లభాషకు కొంత వ్యాప్తి యేర్పడి అందలి ప్రజలు తమ ఆర్థిక ప్రయోజనములకును, ఆధునిక విజ్ఞాన సంపాదనకును, సాంస్కృతిక వ్యవహారములకును, ఆంగ్లభాషను నేర్చుకొని, ఉపయోగించుట కలవడిరి. కాని, ఇన్నింటను, భారతదేశమున నాంగ్లభాషకు కలిగిన ప్రాముఖ్యము అద్భుతావహము. స్వతంత్ర భారతమున కూడ నిప్పటికిని ఆంగ్లభాషయే ప్రభుత్వ పరిపాలనాభాషగా నిలచియున్నది. విద్యావిధానమున ఆంగ్లభాషకు గల స్థానము అత్యుత్కృష్టము. ఉన్నతవిద్యాసంస్థలం దంతటను నాంగ్లభాష అవశ్యపఠనీయమగుటయే కాక, ఆధునిక విజ్ఞానమంతయును ఆంగ్లభాషలోనే గఱపబడుచున్నది. దేశమునందలి వివిధప్రాంతముల వారికిని పరస్పర వాణిజ్య, సాంస్కృతిక, సాంఘిక సమావేశములందు ఆంగ్లభాషయే విరివిగా నుపయోగపడుచున్నది. ఆంగ్లభాషాజ్ఞానమున కున్నంత, ఆర్థికపువిలువ, సాంఘిక గౌరవము, వైజ్ఞానిక ప్రాచుర్యము మరి ఏ దేశీయ భాషకుగాని లేదు. విద్యార్థులందరు ప్రత్యేకముగా నవసరము లేని సందర్భములందుగూడ, తమ సాంఘిక వ్యవహారములలో అభిప్రాయప్రకటనకును, ఒక్కొక్కప్పుడు సాహిత్యసృష్టికిని గూడ ఆంగ్లభాష నే వాడుట కుత్సహించుచున్నారు. ఇట్టి విపరీత పరిస్థితి ఎంతకాలము నిలచియుండును? దేశమునకు రాజకీయ స్వాతంత్ర్యము లభించినది గనుక, ముందుముందు ఈ దేశమున ఆంగ్లభాష కెట్టిస్థాన ముండును? ఉండతగును? అను విషయములు ప్రస్తుతము వివాదగ్రస్తములు. దేశమున నీ విషయమున తీవ్రమగు నభిప్రాయభేదములు గలవు. కాని, సరియైన అభిప్రాయము నేర్పరచుకొనుటకు, ఈ పరిస్థితికి బీజభూతములైన కారణము లేవి? ఇన్నాళ్లు ఇట్టి పరిస్థితి నిలిచియుండుటకు గల కారణము లేవి? అని ఆలోచించి గ్రహించుట అవసరము.

వర్తకమునకై మన దేశమున ఇతర ఐరోపా దేశీయులతో పాటు చేరిన ఆంగ్లేయ వర్తకసంఘము దేశమునందు సుస్థిరమగు ప్రభుత్వము లేక, వివిధప్రాంతములందు, చిన్న చిన్న పరిపాలకులు స్వతంత్రులై తమలో తాము ఎల్లప్పుడును, కలహించుకొనుచున్నందున, దేశమున అరాజకపరిస్థితులు ఏర్పడినందున, అట్టి సమయమున ఆధునిక యుగమున, నాగరకతలో ముందడుగు వేసి, ప్రకృతిశాస్త్రజ్ఞాన మార్జించి, యంత్రసాహాయ్యమున విరివిగను, చౌకగను, వస్తువుల నుత్పత్తి చేయుటయందేగాక, మారణయంత్రములలోను, యుద్ధపరికరములయందును సమర్థులగు, ఐరోపాదేశీయులలో,

దూర దృష్టిలోనూ, రాజనీతిలోను, విశేషులగు, ఆంగ్లేయులు దేశీయ రాజకీయములలో జొరబడి, తమకు ఒక స్థానమును కల్పించుకొని, కొన్ని ప్రాంతముల పరిపాలనాధికారమును సంపాదించి, క్రమముగా తక్కిన ఐరోపా దేశీయులను, దేశీయ ప్రభువులను, అనేక ఉపాయముల చే నోడించియు, లోబరచుకొనియు, దేశమునందు చాలభాగము నాక్రమించిరి. పిమ్మట, తమ స్వల్ప దేశముకంటె పెక్కురెట్లు విశాలమగు, ఇంత భూభాగమును పరిపాలించు బాధ్యత నొక వర్తకసంఘమునకు వదులుటకుండలి అనౌచిత్యమును గుర్తించి బ్రిటిషు ప్రభుత్వమే దేశపరిపాలనా బాధ్యతను వహించి బ్రిటిషుపార్లమెంటుకు లోబడిన ప్రభుత్వమును దేశమున స్థాపించి, ఒక పరిపాలనా విధానమును క్రమముగా పెంపొందించెను. ఇట్టి పరిపాలనా విధానమున, పాలకులు అల్పసంఖ్యాకులగుటచే దేశీయోద్యోగుల సాహాయ్య మెంతైన నవసర మయ్యెను. దేశీయులందు ఆంగ్లభాషాజ్ఞానముగలిగి, పరిపాలకులకు, పరిపాలనయందుపయోగపడగలవారు తయారు కావలసిన అవసరము గూడ ఏర్పడెను. అట్టివారిని తయారు చేయుటే ముఖ్యోద్దేశముగా కలిగిన విద్యావిధానము కూడ నేర్పరుపబడెను. దేశీయవిజ్ఞానమును బోధించు సంస్థలకు ఆదరణ తగ్గి ప్రభుత్వవిధానమున విద్యను గఱపు సంస్థలకు వ్యాప్తి హెచ్చెను. ఈ సంస్థలందు ఆంగ్లభాషకు సహజముగ ప్రముఖస్థాన మేర్పడెను. పైగా దేశీయులకు ఆధునిక విజ్ఞానమును సంపాదించు నవకాశము నేర్పాటుచేయు నుద్దేశముతోను, దేశభాషలలో విజ్ఞానాభివృద్ధికి దోహదమగు, అనువగు, సాహిత్యము లేదను నభిప్రాయముతోను, పాశ్చాత్య నాగరకతా ప్రభావమునకు దేశీయులను లోబరచిన గాని తమ ప్రభుత్వము సుస్థిరముగ నుండదను రాజకీయ స్వార్థదృష్టితోను, విద్యాసంస్థలలో ఉన్నత విద్యయంతయు, ఆంగ్లభాషలోనే బోధించుపద్ధతి ప్రవేశ పెట్టబడెను. ఆంగ్లభాష నభ్యసించినవారికి ప్రభుత్వోద్యోగములు సులభముగా లభించుచుండినందున దేశమున నట్టి విద్యకు, ముఖ్యముగా నాంగ్లభాషాజ్ఞానమునకు, కోరిక హెచ్చయ్యెను. సహజముగ విజ్ఞానార్జనమునను, భాషాశాస్త్రాధ్యయనమునను, ప్రతిభ, ఆసక్తి గల దేశీయులు త్వరగా నాంగ్లభాష నభ్యసించి అందు ప్రావీణ్యమును పాండిత్యమును సంపాదింపగలిగిరి. ఆంగ్లసాహిత్యముయొక్కయు, ఆంగ్లభాషయందలి బహుముఖములగు, భౌతిక, సాంఘికాది శాస్త్రగ్రంథములయొక్కయు పరిచయమున, దేశీయులకు నిజముగ విజ్ఞానాభివృద్ధియు, ఆంగ్లభాషయందు ఆసక్తియు, ఆదరమును హెచ్చెను. ఆంగ్లభాషయందు ప్రావీణ్యమును సంపాదించి, తద్వారా ఆధునిక విజ్ఞానమును సేకరించి, ప్రభుత్వోద్యోగములద్వారా ఆర్థికాభివృద్ధినంది, సంఘమున గౌరవము నొందుట, విద్యాధికులకును విద్యార్థులకును, జీవితపరమలక్ష్య మయ్యెను. తిన్నగనున ఆంగ్లభాషకు క్రమముగ ప్రాముఖ్యము హెచ్చి ఇప్పటి విపరీతపరిస్థితి ఏర్పడినది.

కాని, ఎవరును నుద్దేశింపని ఫలితములు కూడ కొన్ని సంభవించినవి. ఆంగ్లభాషయొక్కయు, ఆంగ్లసాహిత్యముయొక్కయు, విశిష్టమైన సుగుణములవలన గూడ భారతదేశప్రజలు ఆకర్షింపబడిరి. ఆంగ్లదేశ చరిత్ర, ఆంగ్ల రాజనీతి, ఆంగ్ల రాజకీయ ఆశయములు ఆదర్శములు గూడ భారతీయుల నాకర్షించెను. తమ దేశము గూడ స్వతంత్రమై, సౌభాగ్యవంతమై, ఆధునిక ప్రపంచమున నొక గౌరవప్రదమగు స్థానము నాక్రమింపవలెనను వాంఛ దేశప్రజలకును, నాయకులకును గలుగుటకు కూడ ఆంగ్లభాషాజ్ఞానమే కారణమని ఎన్నువారును గలరు. దేశమునందలి వివిధప్రాంతముల విద్యాధికులు, పరస్పరము గలసికొని సమాలోచన చేయుటకును, ఆందోళన చేయుటకును, దేశాభ్యుదయమునకై పాటుపడుటకును, ఆంగ్లభాషయే సామాన్యభాషగా నుపకరించినది. దేశమునందంతటను ఒకే పరిపాలనా విధానము ఏర్పడి ఒకే ప్రభుత్వ ముండుటవలన ఎన్నడును లేని ఐక్యభావము దేశీయులకు కలిగెను. కొంతవరకు పరిపాలకు లుద్దేశించినట్లు, పరభాషా, పరసాహిత్య, పరవిజ్ఞాన, పర సంస్కృతులందు వ్యామోహమును, భావదాస్యమును, దేశీయులకు సంక్రమించినను, అందువలననే, అసంతృప్తియు, ఆత్మవిమర్శనయు తమ ప్రాచీనవిజ్ఞాన సంస్కృతుల పునర్నిర్మాణ, అభ్యుదయ, స్వాతంత్ర్య, అభిలాషలును, దేశాభిమానమును, ఆత్మవిశ్వాసమును గూడ, వారలయందు హెచ్చెను. స్వాతంత్ర్యోద్యమ కాలమున, అందును ముఖ్యముగ ఇరువదియవ శతాబ్దమునందలి, స్వాతంత్ర్య సమర సమయమున ఆంగ్లభాషాసాహిత్యములందును, సంస్కృతి యందును, విరోధభావమును, ఏవగింపును గూడ వృద్ధిపొందెను. భాషాపారతంత్ర్యమే రాజకీయ పారతంత్ర్యమునకును, భావదాస్యమునకును, మూలకారణముగ నెంచబడెను.

కాని, దేశమునకు స్వాతంత్ర్యము లభించి దేశనాయకులు పరిపాలనాధికారమును కైవసము చేసికొని, జాతీయ పరిపాలనా విధానమును, రాజ్యాంగ పద్ధతిని ఏర్పాటు చేసికొనిన పిమ్మటగూడ, ఆంగ్లభాషయొక్క విశిష్టమైన స్థానమున గణింపదగిన మార్పేమియును రాలేదు. మార్పు రావలెనను వాంఛ తీవ్రతరముగ నున్నది. కావున నది రాకతప్పదు. కాని, మార్పువలన నష్టము కలుగునను భయము, అనుమానమును గూడ

లేకపోలేదు. కనుకనే మార్పునకు ప్రయత్నములు చాల నెమ్మదిగ సాగుచున్నవి. అట్టి మార్పు క్రమముగనే రాగలదు. అధిక సంఖ్యాకులకు మాతృభాషయై సులభగ్రాహ్యమైనందున, రాష్ట్రభాషగా ప్రజాప్రతినిధులచే నిర్ణయింపబడిన హిందీ భాషలో గాని, తదితర ప్రాంతీయభాషలలో గాని, ఆంగ్ల భాషా స్థానమును పరిపాలనా విధానమునను, విద్యాసంస్థలందును, ఆక్రమించి అట్టి మార్పువలన నష్టము కలుగదను ధైర్యము నొసగు పుష్టి, సంపద గలిగిన భాషయగపడదు. ముఖ్యముగ విద్యావిధానమున ఆంగ్లభాష కున్న స్థానమును, ఆయా ప్రాంతముల నున్న దేశీయభాషలకీయవలెనా? రాష్ట్రభాషయగు హిందీకీయవలెనా? అనునది ఒక జటిలమగు సమస్య. ఆంగ్లభాష స్థానమున హిందీని గద్దె నెక్కించిన, మాతృభాష కాని పరభాషలో బోధనవలన నిబ్బంది ఏమంత తొలగునని ఆశపడవీలు లేదు. మాతృభాషకే ఆ స్థానము నొసగిన బోధనా సౌలభ్య ముండును గాని, ఆయా శాస్త్రములను గఱపుట కవసరమగు పారిభాషిక పదజాలము గాని, భావప్రకటనా శక్తిగాని, గ్రంథసముదాయము గాని, ఇన్ని భాషలలోను వెంటనే లభించుట అసంభవము. ఈ భాషలన్నియు నభివృద్ధి చెంది, పుష్టిని, తగువిశాలమైన సాహిత్యమును, సంపాదించుకొనిన పిమ్మట గాని అట్టి మార్పువలన నష్ట ముండదని ధైర్యము కలుగదు. అంతవరకు మార్పువలన కొంత నష్టము తప్పదనియే భయ ముండుట సహజము.

అదియును గాక, ఉన్నతవిద్య నభ్యసించిన విద్యాధికులును, ప్రభుత్వోద్యోగులును, మాతృభాషయందె ప్రవీణులై, తమ కార్యకలాపము లన్నిటిని నిర్వహించుకొనిన దేశైక్యమునకు కూడ దెబ్బ తగల వచ్చును. ప్రత్యేకత, విభిన్నత వృద్ధిచెంది, పరస్పర సహకారము, సామరస్యము తగ్గు నవకాశ ముండును. దేశ సమైక్యదృష్టికి భంగము కలుగకుండ, రాష్ట్ర ప్రభుత్వ భాషయై విద్యాధికులకును, ప్రజాసామాన్యమునకును గూడ హిందీ భాష పరిచితమైనప్పుడు, ప్రాంతీయభాష లన్నియు విద్యా సంస్థలలో ఆంగ్లమున కున్న స్థానము నాక్రమించుటకు తగిన సామర్థ్యమును సంపాదించిన నాడు, ఎట్టి మార్పు వలనను ఎట్టి నష్టమును వుండదు. కాని, త్వరపడిన నష్టము తప్పదు.

అదియును గాక, దేశీయభాషల నట్లు అభివృద్ధి చేయు ప్రయత్నము ముందు జరుగవలెను.

మార్పు తప్పదు కాని, ఆ పిమ్మటకూడ అంతర్జాతీయ వ్యవహారములకై మన కిదివరకు పరిచితమైన ఆంగ్ల భాష దేశమున కొంతవరకు నిలచియే యుండును. రాజకీయరంగము నటుంచి వైజ్ఞానికముగను, సాంస్కృతికముగను, ఇతర దేశములతో మనకు గల సంబంధములను వ్యవహారములను, సులభముగా నిర్వహించుటకు, పెంపొందించుకొనుటకు ఆంగ్ల భాషయే ఉపయోగింప బడవలసియుండును — ప్రపంచ సభ్యత, మానవ నాగరకత, ఏకముఖముగా నడచు దినములు ముందు దగ్గరకు వచ్చినట్లు సూచనలు కనబడుచున్నవి. భవిష్యత్తుని దృష్టితో చూచిన మన నాగరకత, మనసాహిత్యము మన ప్రాచీనపరిజ్ఞానము, సంస్కృతి యందలి ఉత్తమ రచనలను భావములను, ప్రపంచమున కందించి, ఇతర భాషల సాహిత్యమును, విజ్ఞానమును, మనము కూడా గ్రహించి ప్రపంచమున భారతదేశమున కొక గౌరవప్రదమైన అర్హస్థానమును సంపాదించి నిలుపుకొనవలె నన్న, మానవజాతి ఐక్యభావమునకు, శాంతికి, కల్యాణమునకు మనము కూడ పాటుబడవలె నన్న, ఆంగ్ల భాషయే మనకు ఎక్కువగా, ఆ పనుల కుపకరించ గలదు.

కనుక, దేశభాషలకును, రాష్ట్రభాషకును అవసరమగు పుష్టిని, సంపదను, సంపాదించు ప్రయత్నమును, త్వరితముగా సాగించుచు వీలైనంత త్వరలో పరిపాలనా భాషగా, రాష్ట్రభాషను, విద్యాబోధనకు మాతృభాషను క్రమముగ నుపయోగించుచు, ఆంగ్ల భాష కిప్పుడున్న ప్రాముఖ్యమును తగ్గించుట అవసరము. కాని, మన కున్న ఆంగ్లభాషా పరిచయము తగ్గకుండ, సర్వ అంతర్జాతీయ వ్యవహారములకును, వైజ్ఞానిక, సాంస్కృతిక ప్రయోజనములకును ఉపయోగింప దగిన స్థితిలో, మనము ఆంగ్ల భాషను నిలుపుకొనుట కూడ నవసరమే. సామాన్యముగ నందరును, ఆంగ్లభాష నభ్యసింప వలెనను నియమము గాని, ఉన్నత విద్య యంతయు ఆంగ్లమునందే గఱపబడుట గాని, అవసరము లేదు. కాని, విద్యాధికుల కందర కును సముచిత ఆంగ్లభాషా జ్ఞానము ఉండవలెనని ఏర్పాటును, అభిలాష, ఆసక్తి, అవసరము కలవారలకు, ఆంగ్లభాషయందును, అందలి సాహిత్యము నందును, ప్రత్యేక పాండిత్యమును సంపాదించుటకు అవకాశములును, తగ్గకుండ, జాగ్రత్త పడవలెను.

కలగూరగంప

శకుంతలోపాఖ్యానము

శ్రీ కొడవంటి శంకరనరసింహబ్రహ్మం

గత (ఆగష్టు) భారతి కలగూరగంపలోని సమాధాన వ్యాసమును గనుఁగొంటిని. దత్సమాధాన పరామర్శన మొనర్చి నా సిద్ధాంతము లెంతవఱకు సుప్రతిష్ఠితములో సర్వవేద్యము నొనర్చుకొనవలసియున్నది.

మిత్రులతో లిపిమర్మ శీర్షిక పైన. ఆ శీర్షికతోడనే శ్రీ మల్లేశ్వరశర్మగారు రుపక్రమింపఁగా నేనును దానినే గ్రహింపవలసినవాఁడనైతిని. శర్మగారి వ్యాసకథను వును బరిశీలించు సందర్భములో నిదిగాక రేమి రుచి తము! ఈ గాథ సంభవపర్వాంతర్గతమనుట సత్యమే. కాని 'సంభవం భరతస్యాహం చరితం చ మహామతేః శకుంతలాయా శ్చోత్పత్తిం శ్రోతు మిచ్ఛామి తత్త్వతః దుష్యంతేన చ వీరేణ యథా ప్రాప్తా శకుంతలా' ఈ మొదలుగా జనమేజయునిచేఁ గోరఁబడి వైశంపాయనుఁ డీ విస్తర కథన మొనర్చియుండుటచేతను ఇతిః పరకథాభాగమున శకుంతలావృత్తాంతమే ప్రధానముగా నుంటచేతను దీనిని శకుంతలోపాఖ్యానమనుటయే లెస్సయనియుఁ దోఁపకపోదు.

అటు ముందుగాఁ గొంతి నన్నయ ప్రాథమిక విషయము "'వ్యాసునికి మెరుగులు దిద్దె నన్నయ' యన్న దానిలో వ్యాసునిపై గౌరవభావమా బాధించునది, నన్నయపై నిర్లక్ష్యమా?" అనియు "వ్యాసులు పనిమాలి నులై నన్నయ కొకపోరొమె నా తెలుఁగువారికి?" అనియు ననవసర ప్రశ్నకల్పన తొలిప్రశ్నకు నా వ్యాసము నందలి కొందటి పేరాలోని కవిపంక్తులే సమాధానము గాఁగలవు. శకుంతలోపాఖ్యానమున వ్యాసుని లోపముల నన్నయ పరిదిద్దెనను మల్లేశ్వరశర్మగారి పలుకులో నెంత సత్యమున్నదో పరామర్శించుటకే యీ నా వ్యాస ముద్దేశింపఁబడినట్లు స్పష్టముగానున్నది. నన్నయ మహానుభావుఁడు గాఁడని కాని యీతఁ డాంధ్రజాతికి భాషకు నొనర్చిన మహోపకారము మరువఁదగినదని కాని యెవ్వఁ డనఁగలఁడు? యిన నా విషయములు వేఱు. నన్నయభట్టారకుఁడు పర్వాంధ్రభావనికిని సర్వథా సర్వథా వంద్యుఁడై యున్నాఁడు. అటఁ గావలసిన కృతజ్ఞతా భావము (ఆయన చేసినదేమో యథార్థ మెఱుఁగుట) తదితర విషయ పరిశీలనమును గలుషింపుచో నది యీ పేరికిఁ దగదు. నిజమునకు నన్నయార్యుని గుణదోషములను రెంటిని నిరూపింపవలసిన విమర్శన విధులలో లోపములను సైతము గుణములని భ్రమింపుచోఁ ఆయనకు గౌరవముఁ గొనివచ్చుట గాదు.

" 'మూల భారతమునకు కాళిదాసుగారు మెరుగులు దిద్దినార'నిరి. కావున వ్యాసభగవానుని నితర కవులతో పోల్చి తక్కువ పరచుట వారికి సమ్మతి మేయనిపించుచున్నది" అని యొక వాక్యము. నా వ్యాసములో నేను వ్యక్తిగత విశేషముల విమర్శింపఁ బూనలేదనియు సంస్కృత భారతాంతర్గత శకుంతలోపాఖ్యానమును నన్నయ యాంధ్రీకరణమును బోల్చి తారతమ్య పరీక్ష యొనర్చితిననియుఁ సర్వజనవిదితమని తెలంగును. మఱియు వ్యాసుఁ డొనర్చిన యనౌచిత్యములఁ బరిహరించి యాయన లోపములఁ దీర్చె ననుటయు వానిని రసవకు మెఱుఁగు బెట్టెననుటయు నొక్కటి కాదని యెఱుంగవలెను. తొలిదానిలో మూలకారుని దోషోద్ఘాటన మున్నది. రెండవది యాయన మార్గమునే యనుసరించి విస్తరించుటను దెల్పును. "మూలమున నున్న పితా దుహితా శబ్దములనే వాడిన కాళిదాసు మూలమునకు మెరుగెట్లు పెట్టెనో తెలియదు" అనిరి.

కాళిదాసు పదములకొక ప్రాధాన్యమును గుర్తించినాఁడు. ఆ శకుంతలాజన్మవిషయము మొల్ల తెలంగిన వైఖానసు లామెను గూర్చి 'దుహిత' అనియే చెప్పినారు. కాని దుష్యంతునకా విషయ మప్పటికి తెలియకుండుటచే నా పదమునకు సామాన్యముగాఁ గుమార్తెయని యర్థము చేసుకొనినాఁడు. భగవంతుఁడైన కాశ్యపుఁడు శాశ్వతబ్రహ్మచారిగదా యాతని కీమె యెట్లు కలిగినదని సహజమైన సందేహ మాతనికిఁ గలిగినది. తన్నివారణార్థమే 'తదాత్మజేతి కథమ్' అని ప్రశ్నించినాఁడు. ఇది యెంత స్వభావ సహజము! ఎంత సుందరము!! ఇది మెఱుఁగుఁ బెట్టుట. ఇట మూలకారుని మార్గమునే యనుసరించియు నూత

నాటకోచితము కల్పించుకొని క్రొత్తవిశేషమును గూర్చి చెప్పినాఁడు. ఆ చమత్కార కల్పన కాధారము మూలభావమే కదా.

తెనుఁగు కవు లానందవర్ధనుని యాశయమును గొంతవఱ కనుసరించిరనియు నాంధ్రీకరణ సందర్భముల యథామూల పరివర్తనము జేయలేదనియుఁ జెప్పి శ్రీనాథ భాషితము నుదాహరించి తెనుఁగుకవులు భాషాంతరీకరణమునను మార్పులు గావించుటకుఁ గొంత వఱకు స్వతంత్రత వహించిరని చూపుటకుఁ బ్రయత్నించితిని. అట్టి మార్పు లౌచితీసంపాదనార్థమే కావింపవలయుట కానందవర్ధను ననుశాసనము నిచ్చితిని. అంతియే కాని యాట శ్రీనాథుఁడా చెప్పిన దంతవఱకు సాధించెనో చూపు ప్రసక్తి లేదు. తిక్కనాదుల కవితావిశేషమును జర్చనీయాంశము గాదు. అట్టి స్వతంత్రతఁ గలిగియుండియు ననౌచిత్య భాగము లేవేని యున్న వాని నౌచిత్యవంతములుగా నొనర్చుటకు వినియోగింపవలసిన స్వతంత్రతను వినియోగించియు నౌచిత్యవంతముల ననౌచిత్యదూషితములఁ జేసినాఁడు నన్నయ యని కొన్ని యుదాహరణముల నొసంగితిని. అంతకన్న యథామూల పరివర్తనము లెస్స గదా. "ఏ కవి రచనా శిల్పము వానిదే! ఏ కథాకథన మార్గము వానిదే"నఁట. అట్లని యూరకున్న బాగుండెడిది. కాదని తారతమ్యపరీక్షకు దిగినప్పుడు యథార్థము నన్వేషించి నిరూపింపఁ బ్రయత్నించుట తప్పా?

"మహాభారతబద్ధ నిరూపితార్థమునే రచనాకౌశలమున వ్యంగ్యవైభవము మెఱయ గోరంత వాచ్యము చేసి కొండంత ధ్వనింపచేయుటకూడనా?......అతడే చెప్పెను గదా...లోనారసిన గాని వేలవెలాలపనియు. కావున దురూహ్యమే. అతనిరచన ప్రత్యక్షరవ్యంగ్య వైభవ విభాసితము" అని యొకచోట. రాజ సభామధ్యమున నన్నయభట్టును గోరినది 'భారతబద్ధ నిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపు'మని. ఇట బద్ధ, నిరూపిత, ఏర్పడ శబ్దముల సార్థక్యమును గనుఁడు. సంస్కృతమున నర్థము బంధింపఁబడి యున్నది. అనఁగా గూఢముగా నున్నదనుట. దానిని నిరూపింపవలయును. అట్టి నిరూపితా (సుప్రకటితా)ర్థము నేర్పడునట్లుగా తేటతెల్లముగా (తెనుఁగున) రచింపుమని కోరెను. సంస్కృతమను కోశగర్భమున బంధింపఁబడిన యర్థసంపదను నిరూపించి దొల్లఅటను గొల్లగా నొసంగుటకై యీ ప్రయత్నము. నన్నయ భట్టారకుఁడు నందులకుఁ బూనుకొనినాఁడు. 'ప్రసన్న కథాకలితార్థయుక్తి'* మేలనునట్లుగా నిర్వహింతునని ప్రతిజ్ఞ యొనర్చినాఁడు. ప్రసన్నత యనఁగా శబ్దార్థముల స్ఫుటతరవ్యాప్తియే కదా! అట్టి విధముగాఁ జెప్పిన తన కథాకలిత (*Narrative Poetry*) యందలి (మూల) అర్థ సంఘటనము పరియనవిలేనఁట. ఇదియే కదా ఏర్పడ రచించుట. ఎట్టిన యేసునుమున్నాఁడో యాలకింపుఁడు.

"భాసుర భారతార్థముల
 భంగులు నిక్క మెఱుంగ నేరమిన్
గాసిలి చీకటిం బడిన గాథలు
 త్రిప్పి తెనుంగువారికిన్
వ్యాసముని ప్రణీత పరమార్థము
 తెల్లఁగఁ జేసినట్టి యా
జ్ఞానన కల్పలన్ దలఁతు వాఙ్మల
 నన్నయ తిక్కనార్యులన్."

ఇట్టిపట్టున నన్నయ చెప్పినదానికన్న సూచించిన దెక్కువనుట యసందర్భము. అతని రచన "సురసాహ్య"మనుట భారతోపక్రమణికాపరిమార్గము తెలుఁగకుండుటే. లేనిచో బద్ధనిరూపణీయావస్థయే పట్టి యేర్పడఁ దెల్పుట కాకపోవలసివచ్చునుకదా! నన్నయ రచన "ప్రత్యక్షరవ్యంగ్యవైభవ విభాసిత"మఁట. ఇది విమర్శనమా? కవిత్వమా? అతిశయోక్తులకు సూచ్యగ్రసునిశితవిమర్శనపద్ధతులలోఁ దావు లేదు. ఈ విమర్శకులు ప్రత్యక్షరవ్యంగ్యవైభవము నుదాహరణపూర్వకముగా నిరూపించియుండిన బాగుండెడి కదా.

ఇఁక నీ యల్పవిషయములనటుంచి ప్రధానార్థమునకు వత్తము. పితృ, సుహృత్శబ్దములకు నన్నయ గావించిన జనక, ఆత్మజ శబ్దముల మార్పునుగూర్చి (విగతార్థమునకే—నా ముందు వ్యాసమున విశేషార్థమున) విశ్వాల మాట రెట్టించన్నను రసికులకుఁ జెప్ప నక్కరలేదు. "వ్యాసశకుంతలకు కణ్వుఁడు పాలన పోషణకర్తగనే భావన. నన్నయ శకుంతలకు కన్నతండ్రిగ — ఏది యుక్తిస్పష్టమో చూడుఁడు" అని హెచ్చరిక. నన్నయ భారతగాథ ననుసరించిరైనఁ గణ్వుఁడు శకుంతలకు జనకుఁడా (జనిదా)? రక్షించినవారలను 'నాతండ్రి' అనుట లోకసిద్ధము గాని 'నా కన్నతండ్రీ' అనుట కాదే. (అభినవ) కవిసార్వభౌములును దనకు మహోపకృతిఁ జేసిన శ్రీరామచంద్రునిఁగూర్చి శతానందుని వాక్యముగా

శా. ఏమీ! యమ్మ శిలాతపస్వినియుఁ
 దా నీకుఱ్ఱ కాల్గాకినన్
శ్రీమన్మోహన మానుషాకృతిని
 దాల్చెన్ జెప్పవే గాధిజా
ఓ! మా తండ్రియు రామచంద్రుఁడుఁ
 డితఁడా నే రాఘవుం డేమి నో

* 'కలిత' అను ఈ పాఠము క్రొత్తదిగా నున్నది.
—సం.

హా! మాయమ్మ మహాల్య
యిప్పటికి నొప్పుకొ శాపనిష్కారమై.

అని బల్కించినచోట 'మా తండ్రియు రాయ చంద్రుఁడే'నియు 'మా యమ్మ యహల్య' యనియు నొకదాని క్రింద నొకటి చెప్పింపఁగల్గియుఁ దండ్రి యనుమాత్రమే కాని కన్నతండ్రి యని యనిపింపఁ జాలకపోయెనుకదా. ఈ రూఢకకు శాస్త్రవాక్య మునకుఁ దప్పక సంబంధమున్నది. అట్టిచో నీ కన్న తండ్రి యను భావన యసద్భావన గాక యేమగును? మఱి యిట్టి కన్నతండ్రిభావన లేకున్నచోఁ గాళి దాసుని చతుర్థాంకసార్వరస్య మేమున్నదని ప్రశ్న. ఇది కేవల మనాలోచిత జల్పమని నా మనవి. 'యాస్యత్యద్య శకుంతలేతి' శ్లోకము (4.6) లోని 'వైక్లబ్యం మమ తావదీదృశ మహో స్నేహాదరణ్యౌకసః పీడ్యంతే గృహిణః కథం ను తనయావిశ్లేషదుఃఖైర్నవైః" అను కాళిదాసోక్తిని యందలి యాథార్థపదోక్తి విద్యానిరూఢిని మా మిత్రులు గుర్తించియుండిన నిట్లనియుండెడివారు గారని తలంతును. 'మమ', 'అరణ్యౌకసః' అనుటకు 'తనయా', 'గృహిణః' శబ్దములు వ్యతిరేకస్ఫోరకములు. కష్టముల కల వాటుగా నరణ్యమునమున్నట్టి పోషకుఁడుమాత్ర మైన తనకే వైక్లబ్యకారణమైనచో సుఖముగా గృహముల వసించెడువారలకుఁ దమకుఁ బుట్టిన కుమార్తెల విషయకమైన యీ పాటు దానెంత పీడాకరమగునోగదా యని యాశ్చర్యచకితుఁడైనాఁడు మహాముని. "తనయావిశ్లేషదుఃఖైః సాక్షాదాత్మజ విరహవ్యథాభిః శకీన భూతత్వాత్ సంవర్ధనాదినా స్నేహోత్పాదితయథా దుస్సహైః రిత్యర్థః" అని శ్రీనివాసాచార్యుల వ్యాఖ్య. తనకుఁ గలిగినది వైక్లబ్యమే, నాగరులకు పీడ. ఇట ప్రతిపద సార్వరస్యమున్నది. 'అహో' అనుటచే నిట శ్లోకము నతిశయించి శాంత భావమంగిగాఁ బ్రకటితమైనది. ఇది కదా ప్రత్యక్షతర వ్యంగ్యవైభవ సూచనాప్రాయము. ఈ శ్లోక పర్యాలోకనమునఁ జతుర్థాంక రసానుభూతికి కన్న తండ్రి భావన లేకుండుటయు నవసరము లేకుండుటయే కాక బాధకము గూడఁ గాఁగలదు. మఱియు నీ పట్టున నింకొక్కటి. "భయాత్రాణ మనగా— అపత్యముమునుండియు, భవభయమునుండియు నని తెలియుదినుము. కాన నే గురువుల మనెను" అని సమాధాన కల్పన. శకుంతలకుఁ గణ్వుఁడు భవభయమును దొలఁగించినట్లు విమర్శకుల కే రహస్య వార్తాహారుల వల్లఁ దెలియవచ్చినదో కదా! ఈ సందర్భమున మల్లేశ్వర శర్మగారి వ్యాసమున 6 వ చిహ్నముగల పేరా (పు. 85. కాలం. 2. పే. 2) చూచెదనుము. సన్న్యాసి భక్తుడు గురువు లెవ్వరో కూడ నట నే నిర్ణయించియు న్నాఁడు. అట నీ భవభయత్రాత వేలుగాఁ గనఁ బడదే!

తరువాత మేనకా విశ్వామిత్ర ఘట్టము. అప లిది చెప్పవలయు కారణమేమని తొలి విచారణ. ఒక సమాధానాభాసము. మూల కథయందుఁ గారణ మున్నది. 'శకుంతలా నామ తే పుత్రి శ్రోతు మిచ్ఛామి' అని జనమేజయుని కోరిక. ఆ విషయ వివరణకై యొక యవకాశ కల్పన. పునరుక్తి లేకుండుటకై కణ్వుఁడింకొకరితోఁ జెప్పినట్లుగా శకుంతల నోట. ఇఁక నన్నయ భారతకథలో నీ జనమేజయ ప్రశ్న లేకుండుటచే నసలు కారణమే లేదు. కావున నీ కథాభాగ మెల్ల నప్రస్తుతమే; తొలఁగింప నగునేది. అయినను నన్నయ యీ యనౌచిత్య కల్పనఁ గావించి నాఁడు. మఱి 'దిగంబరయై సిగ్గుతో భూమికి దిగి' అను సున్నితమైన కథాకథనమునకు 'బయల్పడియె వల్దు కుదంబులుఁ గతాయుగ్గుమున్' నెందులైన వివరణమునకు తావును లేదన్నచో నిఁక విమర్శకులకు స్వస్తి. వస్తు వొక్కటేయైన నుక్తి విధానమున నుచితానుచితములు గలవనుటకు లక్షణికుఁడైన దండివాక్యమే ప్రమాణము. 'కన్యే కామయమానం మాం న త్వం కామయసే కథం ఇతి గ్రామ్యోऽయ మర్థాత్మా వైరస్యాయైవ కల్పతే' అనియు 'కామం కందర్ప చండాలో మయి వామాక్షి నిర్దయః త్వయి నిర్మత్సరో

దిప్తేష్ట శృంగారహాస్యోద్ధృత రసాభావాః' అనియు నా మహామహులు ఏయాదేశము. రెంటను చెప్పఁదలఁచిన భావార్థ మెంక్క శైలియైనను నీ నీ సంస్కృత రసాభ హాత్వము లు క్తివిధాన భేదముచేఁ దిటస్థించినవే కదా! అది యట్లుంచి యీ విమర్శకుల సమాధానసారమును గనుఁడు. "ఇప్పటి దుష్యంతునకు మరింత సందేహో న్నప్పుడు నీను." మఱికొన్ని విషయముల గురించి కూడ సందేహోత్పత్తుఁడు డాలచేనో! శకుంతల యొనికూడఁ జెప్పవలసినది పాపము! తాను మేనకా విశ్వామిత్రుల తనయ నని చెప్పినచో వారిద్దరకు నెట్లు సంఘటన గల్గినదని రాజు సందేహించునఁట. అది తీఱుటకై, కాఁగుకా దట్టి సందేహము గలుగకుండుటకై మేనక 'వల్లకుదంబు'ల నీ వయసులో నున్న మునిబాలిక యీ నాగరిక పరపురుషునితోఁ బ్రస్తావించెనఁట. ఇంకను బరిశీలింపుఁడు. "అదియును గాక తనతండ్రి వచ్చుదనుక దుష్యంతుడు తన కతిథి గాన నాతనితో మాట్లాడుచుండవలెను. అప్రస్తుతమును, రసభంగకరమును నైన విషయము పనికిరాదు కదా?" అహో! ఎక్కడివో యీ శాస్త్రమర్యాదలు. తమ యింట్లో కెవ్వరేని వచ్చినప్పుడు తమ యాడుపిల్లలింటిలోనుండి యీవలకు వచ్చి 'వారు లేర'ని చెప్పఁగా 'నీ వవరిపిల్ల వమ్మాయి!' అని యాగంతుకుఁ డడిగినచో నా పిల్ల తనతండ్రి వచ్చునంతకు నాతని మాటలాడించవలయుటయు రసవంతముగా మాటలాడవలయుటయు ధర్మము లన్నమాట. ఆ రసవంతములైన మాటలు నెట్టివిగా నుండవలెనో యీ ఘట్టమునుబట్టి నేర్చుకొనవలసినట్లున్నది. "అదియు గాక ఆతిథ్యక్రియ చెప్పుచున్నది. ఎంత యుత్సాహముండును." అయుత్సాహ వశమున నింకను నేవేవో చెప్పక యింతటితో విడిచినందులకైన సంతోషింపతము. ఇది యేమిరసమో నాకుఁ దెలియదు. రసిక శేఖరుల కీ విషయనిర్ణయభారము వదలుచున్నాను. పైగాఁ బరపురుషుఁడైనఁ దప్పేమియైనను గాంధర్వధర్మగనుక స్వప్రయోజకమఁట! గాంధర్వ విషయములఁ బట్టి గతించిన నవనాటకమొక్క ధర్మాధర్మ నిర్ణయమా? ఒక యువతియు యువకుఁడును స్వేచ్ఛావిహారులై సంచరించియుఁ బరిస్థితులు వికటించి, తప్పక, పెండ్లియొనర్చుకొన్నచోఁ గాంధర్వ దంపతులు గనుక వారి పూర్వపు నడత మంచిదనఁ జెల్లునా? సాధుతా నిర్ణయముపట్ల నిదియా నిదానము? "నేఁటి మన పరిసరానుభవములతో మన నాగరిక తాద్భృత్వథముతో నాఁటి యాశ్రమమర్యాదల జూడఁగూడ"దఁట. "కాళిదాసుని శకుంతలకును వ్యాసుని శకుంతలకును భేద ముండవచ్చు"నఁట. ఇట మా మిత్రులు సాధింప యత్నించుచున్నది నన్నయ శకుంతల ప్రవర్తనము నందలి సాధుత్వము. మన నాఁటకము, కాళిదాసుని నాఁటకము, వ్యాసుని నాఁటకము కూడ లేని నూతన ధర్మప్రమాణము లా నాఁట నున్నవని వారివాద సారాంశము. ఐనను దత్తిర్ప్రమాణములఁ జూచిన నిచ్చటి కల్పన మహాచిత్యమూషిత మని పై వాక్యములచే నారోపించుకొనకయు నొప్పుకొనినట్లైనది. ఇంతకును వారి సమాధానపద్ధతిచే నన్నయకుఁ దెచ్చిపెట్టినది గౌరవమో యన్యాయమో సహృదయు లూహించుకొనఁ గలరు.

ఇఁక 'అతి రుచిరాగతుండయుగః' అను పద్యార్థమును గూర్చి. నా విమర్శనమున నేను సంస్కృత భాగమునకు వ్యాసభగవానుని భావమును వివరించినాను. అది దండాన్వయముగాఁ బొరపడి మన్మిత్రులది సరిగా లేదనియు నింకను నేమేమో వ్రాసినారు. మఱియు రాజును దిజితరులు నమట తప్పఁట. ఇతరులెవ్వరును లేరఁట. పరిశీలింపవలసినదని వారికి నామనవి. 'ద్రుమాః కుసుమ శాఖినః పుష్పవృష్టిం విచిత్రాంగు విసృజంతే పునః పునః' ఇత్యాదిగాఁ జెప్పఁబడిన వెనుక రాజా వనముఁజొచ్చి కొంత మేర యేగినట్లును పిమ్మట "మహాన్తం కౌశ్యపం ద్రష్టుం తథ కణ్వం తపోధనం ధ్వజినీ మశ్వసంబాధాం పదాతి గజ సంకులాం అవస్థాప్య" అని చెప్పఁబడినది. కాఁగాఁ బై పుష్పవృష్టిసమయమునకుఁ దదితరులును గలరనుట నిర్వివాదము నన్నయయు నీ సేనలు నిల్పుటను 17 వ పద్యమునఁ జెప్పి "దనిదని యుండుట" యని 22 వ పద్యమును రచించి "వలయు నమాత్యులన్ దగినవారిల నుండఁగఁ బంచి" అని 26 వ పద్యముచే నంతవఱకుఁ దనతో వారుంట స్పష్టపఱచినాఁడు. "పూలు రాలుటకు కారణమును చూపవలెనుగదా?" అని యాదినారాయణగారు సంగీకరించినారు. పక్షుల యులజడియే దానికిఁ గారణముగా మాలకొరుఁడు చిత్రించినాఁడనియు నదియే నన్నయ కల్పించిన తుమ్మెదల సందడనుకన్న (సంపతత్ అనునది నివాదిమునకు సవ్యయించును) మంచిదియును సహజమును నని యెంచుఁగవలెను. ఇప్పట్టున వాల్మీకమును గనుఁడు—"షట్పదైః ద్విజగణైః పత్రైః సాన్నలా స్వనా హతాః అనేకవర్ణా వివిధా ముముచుః పుష్పవృష్టయః"—పక్షులు లేగిరిపోయినవని వ్యాసుఁడు నాద్యముఁగా జెప్పలేదు, నిజమే, కూపినవచెను. నిశ్చలమును ప్రశాంతమునైన వనవాటికలో వృక్షాగ్రములఁ బక్షులుండ రథాశ్వగజ సమ్మర్దముగా జనమందుఁ బ్రవేశించుచో నా ప్రశాంతతకు భంగము సంభవించి పక్షులు సంచలించుచు—ఎగిరిపోవుచు చరిల వ్రాలుచు—కూయుట స్వభావసిద్ధమును సహజసుందరము నని చెప్పనక్కఱలేదుకదా! ఆ సంక్షోభమునఁ బుట్టిన గాలిచేత పూలు రాలుట జరిగినది. ఈ విషయమును దృష్టించినాఁడు కవి. ఇది

భావాన్వయము. ఈ మాత్రమును చిత్రించినను 'స్వభావోక్తి' యని మెచ్చుకొనియుందుము. కాని కవి యాశించుకొనుట కింతమాత్రము చాలదు. "దర్శనాత్ వర్ణనా చ్చాథ లోకే రూఢా కవిశ్రుతిః" అని భట్టతేతుని గమనిక; 'విచిత్రభావ ధర్మాంశ తత్త్వ ప్రఖ్యా చ దర్శనమ్' అని వివరణము. 'కనులగొనుకంటె నద్భుతముగా నెఱిఁగింతు రతీంద్రియార్థముల్ ...... సత్కవుల్'. ఈ కవియు నా సంఘటనయం దొక దివ్యభావమును దర్శించినాఁడు; మహోదాత్త ధర్మమును గుర్తించినాఁడు; దానా యతీంద్రియార్థము నిటఁ జిత్రించినాఁడు. నే నాసమస్తమును విపులముగా వివరింపక సూచనగా "ద్విజాశీర్వాదములతోఁ జేసు లెత్తి పూలు చల్లి యభాగ్యగతుని సత్కరించు నీతి చెట్లును నెట్లు నేర్చెనో యనిపించి కణ్వాశ్రమప్రభావ మని సూచించెనని వ్రాసియుంటిని. అవలీ ఘట్టము నే యర్థము చేసుకొనక, నా వాక్యమును గుర్తింపక "వృక్షములు కర్తృత్వము వహించి కోరి వదలుచున్న వని యర్థము." ఇత్యాదిగా నా మిత్రు లేమేమో నే నెఱుంగని దిది చెప్పుచున్నట్లు వ్రాసిరి. అట్లగుట నిప్పుడిట సంపూర్ణముగా వివరింపవలసివచ్చినది. తత్పూర్వ మింకొక విషయము. స్త్రీలు మేడలెక్కి పూలు చల్లుట నాగరకపద్ధతి యనియు ఋషివాటికల నాశీర్వాదములతో నక్షతలు చల్లుట స్త్రీజనము కొక్క మునులే చేయు టాచారమును ధర్మము ననియు నేను వ్రాసినదాని కాదినారాయణగారు గావించిన యాక్షేపమును కాళిదాస నవమాలికావృత్తాంత నిదర్శనమును శుష్కములు. త్రోవలోఁ దారసిల్లిన రాజు నాశీర్వదించినది వైఖానసులు. నవమాలికాగుల్మ పూలను జల్లలేదు, రాజు త్రోవం దారసిల్లినవాఁడును గాఁడు. ఇఁక రెండవది, పక్షులు బెదరిన వనుట తప్పఁట. ఏల? కాళిదాసు 'విశ్వాసోపగమాదభిన్నగతయః శబ్దం సహంతే మృగాః' అనెనఁట. ఆదినారాయణగా రిప్పటి 'మృగాః' అను శబ్ద సారస్యమును గ్రహింపరైరి. లేళ్లను దపోవనవాసులు పెంచి మచ్చిక చేయుచుండే కనవచ్చును కదా! పెంపుడు లేళ్లు బెదరలేదు. ఇది యాధారముగా వాస్తవ మాత్రమే ప్రాంతమనుట రాజు గుర్తించెను. కాళిదాస కవితావిశేషముల గుర్తింపక యిట పక్షు లెట్లు బెదరు నని యాక్షేపణ మేమి? పక్షులం బెంచుట రాజవాసములఁగాని మునివాసములఁగాదు. ఈ శంకల కిట్లు సమాధాన మిచ్చి యిఁక ప్రధానఘట్టవివరణము వత్తము. దుష్యంతుఁ డింటినుండి బయలువెడలిన సందర్భములో 'తాః స్త్రియః ప్రేక్ష్య నరాధిపం తుష్టువుః పుష్పవృష్టిం చ ససృజు స్తస్య మూర్ధని' అని వ్యాసభగవానుఁడు చెప్పియున్నాఁడు. ఇది నగర విషయము. మఱి యిటనో 'ద్రుమాః కుసుమశాఖినః పుష్పవృష్టిం విచిత్రాం తు వ్యసృజం స్తే పునః పునః' అని చెప్పినాఁడు. ఇట వృక్షకర్తృకమే కొదసలు విశేషము; 'ద్రుమాః' అను పదప్రయోగము. అది పుంలింగ బహువచనరూపము. కుసుమశాఖినః — చేతులయందు పూలుగల మునిజనముతో సామ్య మిట ధ్వనితము. బహువచనసారస్యముచేఁ దోవపొడుగునను దన కెదురైన యట్టి యనుట. ఇట్లు కావించినది జడములైన వృక్షము లగుటచే మును లొనర్పవలసిన సత్కారము నివియును జేయఁగడంగుట యా స్థలవిశేష మని భావన. ఈ యతీంద్రియార్థ పరంపరను తాను స్వయముగా దర్శించి వ్యంగ్యముఖమునఁ జిత్రించినాఁడు వ్యాసభగవానుఁడు. నన్నయ 'లతాలలనల' విషయము. ముత్తైదువలు సేసలు జల్ల రాదా యని ప్రశ్న. స్త్రీజన మట్లు చేయుట మునాశ్రమ ధర్మము గాదని చెప్పియే యుంటిని. మఱియును వారు 'లలన'లఁట. లలన యను పదము స్త్రీ సామాన్యవాచి గాదు, విశేషవాచకము, 'లలతి విలసతీతి లలనా' అని వ్యుత్పత్తి. విలాసవతులని యర్థము. ఇఁక దాని యౌచిత్య మెంతవఱకో చదువరులే గ్రహింపఁగలరు.

'తన్వీ, సరోజదళాయతాక్షీ *' పద్యమును గూర్చి "ఈవర్ణనము చేసినది కవియా దుష్యంతుఁడా? దుష్యంతుఁడే యైన నష్ట మేమి?" అని రెండు ప్రశ్నలు. కవి మాటలుగ నె యున్నదనుట నిజమే. కాని యిట వర్ణన ప్రధానము గాదు, దుష్యంతుఁ డా శకుంతలను జూచెనని చెప్పుటయే విధేయాంశము. కావున నిది వర్ణనఁగాదు, కవి చేసిన వర్ణనమును గాదు. దుష్యంతుఁ డీవర్ణనఁ జేసె ననుటయు సందర్భము లేనిమాట. ఐనచో నిఁక నేమందురా? కవి దుష్యంతుఁడు శకుంతలను జూచెనన్న విషయమును జెప్పుచు నెట్టి దానిఁగాఁ జూచెనో యనఁగా నాతని దృష్టి ప్రసరించిన తావులేవో సూచించె నన్నమాట. ఇది కామాంధమైన దృష్టి గాదా? అగుచో మిగిలిన సమాధానభాగము నిఁకఁ బరామర్శింపనక్కఱలేదు.

కణ్వునిశిష్యు లేమైరని మల్లేశ్వరశర్మగారు శంకించుట దుష్యంతుఁడు వచ్చునాఁటిమాట గదఁట. ఆదినారాయణగారు శర్మగారి వ్యాసమునందలి 1 గా గుర్తింపబడిన పేరాను (82 పు. 2 కాలం. 2 పేరా) చదివినట్లు లేదు. లేనిచోఁ జదువఁ బ్రార్థితులు.

శకుంతలా దుష్యంతులలో నెవరు భయపడవలసినవారు చర్చ. "తండ్రికి చెప్పకుండ వరుడు దొంగకగనే స్వతంత్రించి వివాహమాడిన శకుంతల భయము

గుట నీచ పాత్ర కెంతయు మెరుగు" అని యొక వాక్యము. వ్యాస శకుంతల యట్లు చేయలేదు. పైఁగాఁ దపస్సు చేతను దమము చేతను విరాజిల్లు చుండినది. నన్నయగారి శకుంతల కిట్టి తపోదమమ్ములున్నట్లు తోపకున్నను "అనంత విలాసంబున జయంతుం డెపోలె నున్న" దుష్యంతుని చూచి బహుశః చకితురాలైనను దన తండ్రి యంతలో రాఁగలఁడనియు వచ్చిన వెనుక వారిఁ డోసంగెదఁ దన్నుఁ గైకొనవచ్చు ననియే చెప్పినది కాని స్వతంత్రించి వరుఁడు దొరుకఁగనే వివాహమాడలేదే! ఆమెపై యీ వట్టి దూషణేల? ఈ యుపనింద నామెకుఁ గట్టి యామెయే ధిక్కరింపవలసినదని నిర్ణయమా? ఏమి యన్యాయము? "దుష్యంతుఁడు సర్వసంగపరిత్యాగియై సన్యసింప వచ్చెనా ఆశ్రమమునకు?" లేదు కంటఁబడిన కాంతాజనమును గర్రగ్రహణ మొనరింపవచ్చెను. అగుఁగాక. పరాధీనయైన ఋషివాటికలోని బాలికను రహస్యమును నిర్మంత్రకమునైన వివాహవిధాన మొకటున్నదని ధర్మసూత్రము చెల్లించి కలంచి వనుకమూడక పలాయితుఁడైన దుష్యంతుఁడే ధిక్కరింపవలయుఁ గాక. "దుష్యంతుఁడు చేసినది విధిచోదిత ధర్మమే కనుక ధిక్కారము కరలేదు. కణ్వుడటి పట్టిల కవలసిని దుష్యంతు డెరుగును" అని కొంద రభిప్రాయపడెదరు. విధిచోదితధర్మమఁట. అనఁగా బుద్ధిపూర్వకముగాఁ జేయలేదనియా? శకుంతల "వరుఁడు దొరుకఁగనే స్వతంత్రించి వివాహమాడిన" దఁట, ఇతఁడు "విధిచోదితుఁ"డఁట! ఇది వక్రోక్తి స్పృష్టి. 'అంతయు నెఱింగియు నెఱుంగని వాఁడపోలె" (భా. ఆది. 4. 76) సభామధ్యమున శకుంతలం దిరస్కరించిన వాఁడు దుష్యంతుఁడు! ఎట్టి కేని ఏ యల్పదోషమేని నిరాకింపఁబడెరిది శకుంతల! ధర్మ్య ధర్మము లెటి తెరునూ రంగము! కాదు "విధిచోదిత ధర్మ" మనఁగా శాస్త్ర నిర్దిష్టమైన విధాన మని యూహ యందురా? అట్టిచో దుష్యంతునకు విధిచోదితధర్మమైన గాంధర్వము శకుంతలకుఁ గాదా? 'తనకు మాలె తాన దుట్టంబు దాన తనకు గతియుఁ దన్ను దాఁ జోఁ దాన కర్త యనఁగ వినఁ జేత్రి! గాంధర్వ వివాహ మతి రహస్యమును నమంత్రకమును నగుదు నొప్పు' (భా. ఆ. 4. 58). అట్టిచో శకుంతల మాత్ర మేల ధిక్కరింపవలె? ఈ సమస్తమును జల్పనామాత్రము. యథార్థమును బరిశీలింపుఁడు. "నీకును నాకును నెమ్మిఁ బరస్పర ప్రేమంబు కాముండు పెంపఁ దొడఁగె.' (4. 55) ననుచున్నాఁడు దుష్యంతుఁడు. ఇది తనపట్ల నిక్కము. ఆమె యెడ నాతని భ్రమ గావచ్చును. 'సర్వం తిక్కల మత్పరాయణ మహో కామినా స్వతాం పశ్యతి' అను కాళిదాసోక్తి నాలకింపుఁడు. మఱియు 'నీ బల్లరాజీవములకు నీ వన్య ఫలాశనముల కీ వల్కలకుటీరావాసములకు నుచితమె నీ విలసిత రూపకాంతి నిర్మలగుణముల్.' ఈ మునిపల్లెనుండు టిదియేల కరం బనురాగ మొప్పఁగా భామిని! నాకు భార్యవయి భాసురలీల నశేష రాజ్యలక్ష్మీ మహానీయ సౌఖ్యముల నింపుగ నందు మనిందితేందుపాదామల తుంగ హర్మ్యములఁ జారు హిరణ్మయ కుట్టిమంబులన్' (4. 53, 54) అని యాశచూపినాఁడు. చూపి గాంధర్వవిధిని వివాహము కమ్మన్నాఁడు. అందుకు శకుంతల 'ఇంతకు మదీయజనకులు చనుదెంతురు వారు వచ్చి నీ కిచ్చెదరఁ బాణిగ్రహణము సేయుము నన్నుఁగా' (4.56) అని ధర్మబద్ధమైన సమాధాన మిచ్చినది. 'ఇచ్చెదరని' అని యున్నది. ఈ యుక్తిని? ఏల యీ సందిగ్ధమునఁ బడుట. గాంధర్వ వివాహధర్మము నుపన్యసించినాఁడు. 'అని దుష్యంతుఁడు గాంధర్వ స్వరూపంబు చెప్పి శకుంతల నొడంబఱిచి' (4.59) నాఁడఁట. వరూధినీ ప్రవరాఖ్యఘట్టము స్ఫురణకుఁ దగులుటలేదా? గొంటుదనం బెఱుంగక తం గెటజూంటె బంపెంబున నొంటిపాటునఁ జిక్కిన ప్రవరుని నొడంబఱుమనప్పటి వరూధిని తత్తఱము కన్నులఁ గట్టలేదా? ఇఁక చాలును; తప్పెవరిదో తేలిపోయినది. సత్యము నకు దుష్యంతుఁ డొనర్చినది ధర్మబద్ధమే యైనచో నాతఁ డెద్దానిని ధర్మబద్ధమనియే గిలంచెఁ జోఁ గణ్వుని దూముటయే ప్రయోజనము గావచ్చిన తాను ఫలాహారార్థమేగిన కణ్వుని, 'ఇంతలో రాఁగల కణ్వుని రాగమనమునకై యాగక వుట్టమునిగిపోయినట్లు 'శీఘ్రబుద్ధిః పలాయనో' మ్మను మంత్రము నేల పఠింపవలసివచ్చెను? ఇది దోషాంతఃకరణ ప్రభావము!

ఈ వ్యాస మింతటితో ముగించి ప్రచురణార్థమై తే 17-8-55 ది నాఁటికే 'భారతి' సంపాదకులకుఁ బంపియుంటిని. కాని కాలాభావమునో స్థలాభావమునో వారిద్దాని సెప్టెంబరు సంచికలో ముద్రింపక యిచ్చుట సెప్టెంబరు సంచికలోని సంగమేశ్వర రావుగారి వ్యాసమునకుఁ గూడ సమాధాన మొసంగు నవకాశము నా కిచ్చినారు. ఇందలి పెక్కు విషయములకు — ముఖ్యముగాఁ బ్రధాన విషయముల కెల్ల — నీ వ్యాసపు పూర్వభాగమునందే సమాధానము గలదు. ఇంతికు నీ వ్యాసకర్తలు నన్నయ విశ్వతోముఖ మాహాత్మ్యవాగులు గారు. పైఁగా మూలభిన్నుఁడై యనుచితపదప్రయోగమును నన్నయ గావించినట్లు "'ఖాండవ'పద ముచితప్రయోగము గావట్లు దోచుచున్నది", "నన్నయ వ్రాసిన 'అమ్మని యాల్గి మూచు

డును సాతత్వమాత్రేన గోత్రధారు లేత్రనుత్కలం...' యను పద్యము సంస్కరించుక నున్నట్లు గన్పట్టగు", "శాపపరంపరలకి భాజనులు వోవ నోపరే" యనుటకున్న 'ప్రకృష్టం పౌరుషనిన కర్మ మన్యదివ్యథా బాలా తే మన్విప్రశేత్' అనుట మెరుగుగా నున్నట్లున్నది" ఈ మొదలగువానిచే వారు సంగీకరించినారు. నే నన్నదియు సంశయన్న నేను గాదుగదా! ఇపను వారి వ్యాసమునందలి రెండవ రెండు విషయముల నిట స్పృశించి ముగింతును.

"శాండోకచో చేరుముక్క శ్లోకపాదము తన యభిప్రాయమును ఖండించునో దానిని విడిచి"నట్లును "తను వాదమును వ్యతిరేకించునట్లున్న యాఖరు పాదమును మాత్రము విడిచి మిగతా పాదములను వ్రాసి"నట్లును నాపై నేరారోపణ మొనర్చి 'దివస్ప్రశోః సంఘుష్టాః పక్షిభి ర్మధురస్వనైః, విరేజుః పాదపాస్తత్ర విచిత్ర కుసుమాంబరాః' అన్నది యట్టి పరిత్యక్త శ్లోకమనియుఁ దానికలన "ఇట్టి గెలంకుల నాకాశమునంటు వృక్షములపై విచిత్ర కుసుమాంబరములు ధరించిన స్త్రీల పుష్పవృష్టి నాతని శిరస్సుపై జారవిడిచిన ట్లాతనికి భాసింపఁ జేయుట తెలియఁ దగునని"యు నీ విమర్శకు లధిక్షేపించిరి. ఈ సందర్భమును గొంత యీ వ్యాసపూర్వభాగమునఁ జర్చించి యున్నాను. ఇట 'కుసుమశోభితాః' అన్న యీ విమర్శకుల పాఠ మసాధువు; 'కుసుమశోభినః' అనుట యొప్పు. ఇక విరోధ్యంగల 'పాదపాః' అను పుంలింగ బహువచనసారస్యము చేతను, 'కుసుమాంబర' (*Saffron dress*) శబ్దసమాస్తిని విశేషము చేతను ఋషి సంఘమే యిట వర్ణింపబడినదనియు నిది నావాదమునకే యుపస్కారకమనియు నా తెలుసుకొనుగాక! ఇట వన స్త్రీల సూచన కించిన్మాత్రమును లేదని తెలియవలెను. నా సిద్ధాంతమును బలపరచు నీ శ్లోకమును నైతము స్మరణకు దెచ్చినందులకు విమర్శకులకు నేను కృతజ్ఞుఁడను.

ఇంకొక విషయము శకుంతల భయపడినట్లు నన్నయ వ్రాయుట సరియైనదా కాదా యనునది గాను చర్చింతును. వ్యాసభగవానుఁడు దుష్యంతుని భీరునిగా నిరూపింప నన్నయ తద్వ్యతిరేక మార్గమున ప్రోక్కుట యనుచితకరమా యని మాత్రమే. శ్రీ లక్ష్మీనారాయణగారి నన్నయ పక్ష సమర్థనము విచారాంశనిర్ధారకము గాఁగలదు. కాఁగా 'భీతా' అను మూలశ్లోకవాక్యముచే నా పూర్వనిర్ణయము కొట్టివేయఁ గలుగఁబోదు.

వ్యాసునిలోపముల నన్నయ పరిదిద్దెనను పింగళి లక్ష్మీకాంతంగారి ప్రతిజ్ఞకును "మొత్తమున తేలిన విషయములు" గా "మూలమునందున్న సొగసులను, సహజసౌందర్యశక్తిసిలను, స్వభావోక్తులను కొన్నిచోట్ల నన్నయ వదలివేసి"నట్లును, "చాలచోట్ల మూలమును ననుసరించి కథాప్రాధాన్యతకే ఎక్కువ విలువనిచ్చి వ్రాసి"నట్లును, "అతని కవితయందలి సొగసు లనేకములు మూలమునందలివే" యైనట్లును, "సాధ్యమైనంత వరకు మూలమునందలి సొగసుల తెనుగునకు దెచ్చె"నట్లును వంగ వేంకటేశ్వరరావుగారు సాధించిన సిద్ధాంతమునకును గల సంబంధము విచక్షణులు తెలుసుకొనగలరు.

"కేవలము నన్నయను పొగడువానివిగూర్చి" కోపము నాకున్నదనుట పొరపాటు. నా కెవ్వరిగూర్చియుఁ గోపము లేదు. ఇఁక నేనును 'కేవలము పొగడు' వాచారముమాత్రము తగదనియు గుణదోషములు రెంటిని విస్తరించి యథార్థనిరూపణ మొనర్చుటయే విమర్శకపద్ధతి యని మాత్రము హెచ్చరించుచు నీ విషయమును విస్తరభీతిచే నింతటితో ముగింతును.

---

* ఈ చర్చను ఇంతటితో ముగింపు చేస్తున్నాము. —సం

చిత్ర కళా ప్రదర్శనము

ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ హెచ్. వి. రామగోపాల్ కళాకౌశలాన్ని సమగ్రరూపంలో అవగతం చేసుకోవటానికి మద్రాసు ప్రజలకు ఇటీవల ఒక మంచి అవకాశం లభించింది. తాము అధ్యాపకులుగా వుంటున్న 'గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్' మ్యూజియం హాలులో వారే స్వయంగా ఒక ప్రదర్శనాన్ని యేర్పాటు చేశారు. ఈ ప్రదర్శనంలో వర్ణ చిత్రాలూ, రేఖాచిత్రాలూ, శిల్పాలూ, ఇందుమించు వారు రచించిన వాటి నన్నిటినీ ప్రదర్శించారు.

ఆగస్టు 29 తేదీనుంచి సెప్టెంబర్ 6 వ తేదీ వరకూ జరిగిన ఈ ప్రదర్శనాన్ని మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గా॥ శ్రీ పి. వి. రాజమన్నారు ఆవిష్కరించారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో తయారుచేసిన 'బాలకునిశీర్షం' అనే శిల్పం పలువురు ప్రేక్షకులను ఆకర్షించింది.

చిత్రరచనలో వీరి కళావిన్యాసం యేదో వొక ప్రత్యేక శాఖలోకి కుంచితమైపోకుండా విస్తృతమైన వైవిధ్యవైభవం కలిగివుంది.



సమయవేది
ట్యూబ్ పెయింటింగ్



బాలకుని శీర్షం
పారిస్ ప్లాస్టర్ శిల్పం

రేఖాచిత్రణ—ముఖ్యంగా రాయచౌదరిగారి చిత్రం శ్రీ రామగోపాల్ ప్రతిభకు మచ్చుతునకగా వుంది.

ఈ ప్రదర్శనలో తక్కినవాటి అన్నిటికంటే 'ట్యూబ్ పెయింటింగ్' అనే పద్ధతిని రచించిన చిత్రాలు మరింత చూడ ముచ్చటగావున్నయ్. బ్రష్‌తో నిమిత్తంలేకుండా కళాకారుడు రంగుల ట్యూబులను గ్రహించి వాటితో నే చిత్రాన్ని రచించే పద్ధతిని 'ట్యూబ్ పెయింటింగ్' అంటారు. ఈ పద్ధతి చిత్రరచన ఈ ప్రాంతంలో విశేష వ్యాప్తిలో లేదు. ఈ పద్ధతిలో నే రచించిన, 'చిత్రకారుడు,' 'పంట భూములు,' 'ఆనంద చంద్రుడు' అనే చిత్రాలు కొనియాడదగివున్నయ్. వాటి ప్రక్కను నీటిరంగుల చిత్రాలు కొంత వెలా తెలా బోతున్నయ్.

శ్రీ రామగోపాల్ కళాకౌశలం పరిణతస్థాయి నందుకుంటున్నది.

గ్రంథ విమర్శనము

శ్రీశైల పండితారాధ్య చరిత్రము

పుల్లకవి ప్రణీతము; ప్రకాశకులు: శ్రీ జ. ని. పుస్తకభాండారం, నెం 49, హెచ్. బి. సమాజం రోడ్డు, బెంగుళూరు 4. వెల రు. 5-0-0.

కృతయుగమున రేణుకుడు త్రేతలో మరుళుడు ద్వాపరమున ఏకోరాముడు కలిలో మల్లికార్జునపండితుడు శైవమతమునకు గురువు లని అభియుక్తోక్తి. పాల్కురికి సోమన ద్విపదరూపమునను శ్రీనాథుడు పద్యరూపమునను రచించిన పండితారాధ్య చరిత్ర పై మల్లికార్జున పండితునిదే. పండిత త్రయ మని ప్రసిద్ధు లయిన శ్రీపతి, మంచెన, మల్లికార్జున పండితులను వారిలో కడపటి వానినిగ మల్లికార్జున పండితుని పరిగణించుటయు గలదు. తెలుగుదేశమున శ్రీపతి, మల్లికార్జున పండితుల వంశజులను 'పండితారాధ్యుల' వారని వ్యవహరించుట కలదు. ప్రకృతము ఈ శ్రీశైల పండితారాధ్య చరిత్రము వీరెవ్వరికి సంబంధించినది గాదు. వీరశైవమతపీఠము లైదింటిలో 'పండితారాధ్యుల' ను పేర శ్రీశైల మఠాధిపత్యమును వహించిన జంగమస్వాములని. ఈ పీఠమునకు శిష్యులగుటచేతనే శ్రీపతి పండితాదులకు 'పండితారాధ్య' పదము పీఠాధిపతులగు జంగమస్వాములచే ననుగ్రహింపబడిన దని ఈ గ్రంథము చెప్పుచున్నది. ఇది మిగుల వివాదాస్పదమైన విషయము. ఆరాధ్య పదము తెనుగు దేశమునందలి శ్రౌతశైవులయందే రూఢ మని ప్రసిద్ధముగ దెలియుచున్నది. వీరికి చాతుర్వర్ణ్య గురుత్వమును గలదు. బసవేశ్వరోపజ్ఞ మతానుయాయులు జంగమములు. వీరు 'ఆరాధ్యులు' గ వ్యవహరింపబడుట ఇంతవరకును వినఁబడదు.

సుప్రసిద్ధమైన పండితారాధ్య చరిత్రము కాదని తెలియుటకు 'శ్రీశైలపండితారాధ్యచరిత్ర' మని నామకరణము చేయబడిన ప్రకృతగ్రంథములో పండితారాధ్యుల ప్రసక్తియే యెచ్చటను కనబడుట లేదు. విరూపాక్షదేశికుడు బసవేశ్వరున కర్వాచీనుడని ఈ గ్రంథములోనే కలదు. ఈయన మల్లికార్జున పండితారాధ్యునివలెనే భీమేశ్వర మహాలింగమునుండి యుద్భవించెనట! 'పూర్వము ధేనుకకర్ణ నామమున ఒక పండితారాధ్యు డుద్భవించి శైవము నుద్ధరించెననియును నీ వాతని సింహాసనము నధిష్ఠించి పండితారాధ్యపదముతో వీరశైవమును ప్రచార మొనరింపు మనియును శ్రీశైల మల్లికార్జునస్వామి విరూపాక్ష దేశికున కాదేశించిన ట్లీ గ్రంథమున గలదు. బసవేశ్వరాదులు కైలాసప్రాప్తినందిన పిమ్మట భూమిలో శివభక్త్యుద్ధరణమునకు శివాజ్ఞచే విరూపాక్షదేశికు డుద్భవించెనని, ఈ గ్రంథ ఫక్కిక! బసవేశ్వరునకు మల్లికార్జున పండితుడు సమకాలికు డనుట చరిత్ర సిద్ధము. ఇట్టి మల్లికార్జున పండితునకన్న పూర్వుడును, పండిత త్రయములో ప్రథముడు నగు శ్రీపతి పండితుడు అర్వాచీనతముడైన ఈ విరూపాక్షునిచే పరాజితుడై లింగధారణము చేయింపబడి (అంతకు మునుపు శ్రీపతి పండితునకు ధారణ లేదనుటకు ప్రమాణము లేదు) పండితారాధ్య పదముచే అనుగ్రహింపబడెననుట జంగమములు స్వోత్కర్షార్థము చేసిన కల్పన యని బుజువగుచున్నది! మఠాధిపత్యముతోను, సన్న్యాసముతోను ప్రసక్తిలేని జగద్గురుత్వము. పండితారాధ్యపదము, శ్రీపతి, మల్లికార్జున పండితులకూ తద్వంశజులకు చిరప్రసిద్ధములై యున్నవి.

వివాదాస్పదములైన పై విషయములను విడిచినచో ఈ గ్రంథము 'నిడుమామిడి' మఠాధిపతులైన జంగమస్వాముల పరంపరను వర్ణించు చరిత్రగ్రంథ మని యేర్పడుచున్నది. ఆయా కాలములలో ఈ మఠాధిపతులు చేసిన దేశసంచారములు — జానపదవశీకరణముగా ప్రవర్తించిన మహిమలు — రాజులవలన

పొందిన సమ్మానములు — దేవాంగులు, సజ్జనులు, (తెలకులు) రెడ్లు, మున్నగు వర్ణములవారిని శిష్యులనుగ పరిగ్రహించి లింగధారణముచేసి జగద్గురుత్వమును వెలయించుట — ఆయా క్షేత్రములలో ఉపమఠములను స్థాపించి 'దరంతు' లను నిలిపి వీరశైవమును ప్రచారముచేయుట— పునఃపునః అనువృత్తమైన ఇందలి వస్తువు.

ఇది వచనరూపమున నిబంధింపబడినను సేగి లేదు.

దేశములో పద్యరచనాభినివేశము నేటికిని వెనుక పట్టలేదు. కవి పదునెనిమిదవశతాబ్దివాఁడు. గ్రంథాంతమున నీయబడిన పట్టికలు నిఘంటుమాదిరి మత విషయజిజ్ఞాసువులకు ఉపయోగించునవిగ నున్నవి. వస్తువెట్టిది? కావ్యత్వసిద్ధికలదా? లేనిదా? అన్న విచారణతో పని లేదు. ఏవస్తువునైనను పద్యరూపమున అవతరింపవచ్చును. కనుక ఆనాఁడిది పద్యరూపమున నిబంధింపబడియుండుటలో అంత ఆశ్చర్యము లేదు నిజమునకు — ఇందలి రచనయు నంత తీసివేయఁదగినది కాదు. మున్నటివరకు కవి యగుటకు కావలసిన కనీసపు సాధనసంపత్తి— అనేక కవిసమయజ్ఞత, పూర్వప్రబంధముల సమగ్రపరిశీలన, నిఘంటుబలము, శబ్దముమీఁది యధికారము — ప్రకృత గ్రంథకర్తలో కొఱవడలేదు. ధారాళమైన శైలి. అప్రయత్నపతితములైన సంస్కృతపదగుంఫనలు, ఇందలి పద్యభాగమునకన్న గద్యభాగమునే ఓజోవంతము పెంపగ్గిన దని చెప్పవలయును. ఇక — ప్రతిభ, భావన, ఉక్తివైచిత్రి మొదలగునవి దైవమీయవలసిన కవితాగుణములు. గ్రంథకర్తయైన ప్రతిరచయితయందు వీనికై యన్వేషించుట సాధ్యము కాదు. మొత్తముమీఁద రచనాశక్తికి సరిపోయిన వస్తువును కవి స్వీకరించినట్లు తోఁచదు

పీఠికాకర్తలు సూచించినట్లు 'గ్రంథము కన్నడదేశమున ముద్రితమగుట సంపాదకులకు ఆంధ్రభాషావ్యాకరణవిధులతో తగినంత పరిచయము పరిపాటి లేకుండుట కారణములుగ' అనుపదము దొరలిన ముద్రాదోషముల నోప్పరికించి, గ్రంథముద్రణము మాత్రము సుందరముగ నున్నదని ప్రకాశకులతోఁ బాటు సంతోషించుటకన్న చేయదగినది లేదు. ఈ తెనుగుగ్రంథమునకు నూఱుపుటలకు పైబడిన కన్నడపు పీఠిక ఎట్టి పాఠకులను దృష్టియందుంచికొని కూర్పబడినదో తెలియుటలేదు. —శి. శి.

అడిదము సూరకవి జీవితము

రచన : శ్రీ అడిదము రామారావు; కవి జనరంజనము (పిల్లవసుచరిత్ర), చంద్రాలోకము (అలంకారశాస్త్రము), కవి సంశయ విచ్ఛేదము (వ్యాకరణ లక్షణ గ్రంథము), ఆంధ్ర నామశేషము (నిఘంటువు), మొదలైన ఉద్గ్రంథములను రచించి ఆంధ్ర వాఙ్మయమునకు ఆంధ్ర సారస్వతమునకు అపూర్వమైన సేవజేసిన మహామహుఁడు అడిదము సూరకవి. నేటివరకూ లభించిన చారిత్రక విషయము లన్నిటినీ సేకరించి, సూరకవి చరిత్రను సమగ్రరూపములో నందజేయ ప్రయత్నించిన శ్రీ అడిదము రామారావు గారి కృషి అభినందనీయమైనది; ప్రచురణ: వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ మద్రాసు; వెల : రు. 1-8-0.

మహాంధ్రోదయం

ఖండకావ్య సంపుటి; రచన : శ్రీ దాశరథి; ప్రచురణ: తెలంగాణా రచయితల సంఘం; 327 రెసిడెన్సీ రోడ్డు, హైదరాబాదు. వెల రు 1-8-0.

ఈ సంపుటిలో తెలంగాణ, మహాంధ్రోదయం, కోటి గొంతులు, శిల్పి, మంగళగీతి, నటస్వామి, గుండెలో దీపాలు, పూలలో జ్వాలలు, తెలంగాణా విముక్తి, తెలంగాణా తల్లి, పాపలక్ష్మి, మధురథము, మాధురి, రాగబంధము, మూర్ఛన, కపోతీ సందేశము, మంజీర, - కుమారమూర్తి, కాపయనాయకుడు, సాహిత్య సామ్రాజ్యము, అని యిరవై శీర్షికలున్నాయి. ఈ రచనలో చాలభాగము లోగడ భారతి, ఆంధ్ర పత్రిక, కృష్ణాపత్రిక, స్రవంతి మొదలగు పత్రికలలో ప్రకటించినవే. హైద్రాబాదు ఆంధ్రముఖ్యమంత్రులు శ్రీయుతులు బూర్గుల రామకృష్ణరావు, బెజవాడ గోపాలరెడ్డి గార్లు ఈ సంపుటికి ప్రశంసావాక్యాలు రచించారు. దాదాపు పదునాల్గు పేజీలవరకూ విస్తరించివున్న శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి పీఠిక ఈ సంపుటిలోని రచనలమీద నే కాక నవ్యాంధ్ర సాహిత్య రంగమంతటిపైనా వెలుగులు జిమ్మి ద్యోతమానం చేస్తున్నది.

'నా యింటి చిన్నది నడుము సన్నముది క
న్నులలోతెల్గు సిగ్గులు మొలకలెత్తి
నా వైపు చూచి నన్ వలపించుకొన్నది
పాతకాలంపు సౌభాగ్య గరిమ.

క్రొత్తవాటి వెలుంగు కూడగట్టినయట్టు
అంగరమ్ముల జొత్తు కొత్తకట్టి
తెలుగు సింగారాలు తలప్రాలుగా జార
పూలు ముడిచి ముద్దరాలు వోలె
నవ్వుల వెలార్చి నా యింటి నడుమ సోర
దీపమును కూర్చి పెట్టిన తెలుగుపిల్ల
కన్నడమ్ము కన్నడింపని కవన లక్ష్మి
రసభర విజృంభమాణ పూర్ణ కుచకుంభ'

దాశరథి రసస్నిగ్ధ హృదయుడైన కవి. ప్రాచీ నాధునాతన శోభా విలాసములతో కవనలక్ష్మి అతనికి దృగ్గోచరమై వలచి వలపించుకొన్నది. ఇంట నిల్లాలై కూర్చున్నది. అది రసభర విజృంభమాణ పూర్ణ కుచ కుంభ. ఇతడు తద్రసతన్మయుడు.

దాశరథి ప్రతిభా వ్యుత్పత్తులు రెండునూ కలవాడు. ఈ పద్యాన్ని ఒక్కదాన్ని పరిశీలనచేస్తే ఆ విషయం ఇట్టే తెలిసిపోతుంది.

'గుమగుమలాడి నా మనసు
గొన్న నవాబ్దసఖీముఖానురా
గమున సుమించె చంపకము;
కౌగిలిలో ప్రసవించె గోరటల్
కుకురమణీయమై తగె న
శోకము తచ్చరణాహతిన్; ప్రహా
సమున సుమించె పొన్నలు ప
సందగు నందనదివ్యవాటిలో'

నవాబ్దసుందరి వచ్చినది; దాని రాకతో 'నందన' దివ్యవాటిక ప్రఫుల్లమైనది. ప్రాచీనులనుండి సంప్రదాయముగా వచ్చుచున్న దోహదక్రియలలో క్రొత్త పూవులు పూయించినాడు కవి. ఇందు ప్రతిభను వ్యుత్పత్తి, వ్యుత్పత్తిని ప్రతిభ పరస్పరము దోహదము చేసుకొని విచిత్రముగా విరియబూసినవి. వ్యుత్పత్తి విషయం అటుంచి, రససృష్టిలో అతనికి గల ప్రతిభ ఏ రెండు పద్యపాదాలను స్పృశించినా తెలిసిపోతుంది:

'నేను వేస్తంభాల నీడలో నొక తెల్గు
తోటవాటి సుమాలు చూసినాను'

* * * *

'కాంచనాధ్యాణ విరాజమాన
కటిరై అరుదెంచిన మా నవాబ్ద
లక్ష్మి నవహాసముల్ బ్రతుకు మీదను
పువ్వుల దివ్వె లెత్తెడిన్'

* * * *

'ఆంధ్ర సురత్రాణుడై ధిల్లీ సుల్తాను
పీఠు చిట్లించిన వీరమూర్తి.'

* * * *

'నిప్పుల్ గ్రక్కు ఫాలాక్షిలో
పిడుగుల్ పిల్లలు పెట్టుకొన్నటు మహా
మేఘావళీ గర్జనల్
చెవులుబ్బ్రాడి భయమ్ము గొల్పినటు తోచెన్
శంఖ ఢక్కాధ్వనిన్'.

* * * *

'ఈ శిథిలాలయమ్మున జనించిన చిక్కని శర్వరీతమోరాశి శిఖాగ్రసీమ పదరా! ఒక దీపము పెట్టి వత్తి మావేశము లేని ఈ బ్రతుకు వీధుల వెద్చని దీపమాలికా పేశల కాంతి నింపుదము పెక్కు తరాల తమమ్ము లింకగన్!'

ఈ సొగసు లిలా ఎన్నయినా ఎత్తి చూపవచ్చు. కాని కేవలం ఇలాంటి రచనా వైచిత్రి మాత్రం చేతనే శ్రీ దాశరథి పైకి రాలేదు. దానికి ప్రత్యేక కారణం ఉంది. ప్రతిభావ్యుత్పత్తులున్నంత మాత్రం చేత కవిగా ప్రఖ్యాతిలోకి రావచ్చునంటారు. కాని అది యెంతవరకు విశ్వసనీయమో తెలియదు. ఆ రచయితను కావ్యరచనోన్ముఖుణ్ని చేయగల మహావేశ మేదో ఒకటి ఉంటేనే గాని సంపన్నమైన కావ్యం ఉత్పత్తి అయ్యే అవకాశం లేదనిపిస్తుంది. ఉదాహరణకు కృష్ణరాయలయుగం అనంతరంనుంచీ జాతీయోద్యమ ప్రారంభం వరకూ వ్యాపించిన ఈమధ్య కాలంలో ఆంధ్రసాహిత్యక్షేత్రం బీడై బంజరై ఉజ్జంకులు పండటానికి గల కారణమేమిటి. చదువుకున్న పండితులు లేకనా, శబ్దవైచిత్రి తెలిసినవారు లేకనా? నిజానికి ఆ దశలో ఉద్భవించిన కావ్యాలలో (వాటికా పేరు వాడవచ్చునంటే) ఈ రెండు గుణాలూ మినహా ఇతరత్రా ఏమీ లేదు. అందుచేతనే పరిమళకుసుమరహితములైన ఆకుపసందు చెట్లయి ఎందుకూ కొరగాకుండా పోయినై.

అదృష్టవశాత్తూ దాశరథికి అట్టి మహావేశం కూడా లభించింది. ఈ మహావేశమే ఆంధ్రభూమిలో

అనేకమంది మహాకవుల ఉద్భవానికి కారణభూతమైంది. భారతస్వాతంత్ర్య సమరం ఇల్లాంటి కవియోద్ధులను అనేకమందిని తయారుచేసింది. వీరు ఆంధ్ర ప్రాచీనోజ్జ్వల చరిత్ర నంతా త్రవ్వి యెత్తి వీరావేశంలో శంఖారవాలు చేసి ప్రజాబాహుళ్యాన్ని సమరోన్ముఖులను చేశారు. ప్రత్యేకంగా తెలంగాణా స్వాతంత్ర్య సమరం దాశరథికి అట్టి అవకాశాన్నిచ్చింది. ఆ ఆవేశంలో అతను కవిగా వైతాళికుడేగాక కృష్ణ జన్మస్థానంకూడా అలంకరించాడు. ఆ వీరావేశం వచ్చినప్పుడు దాశరథి కోదమసింగంలా గర్జించుతాడు!

'ప్రాణము లొడ్డి ఘోర గహ
నాటవులన్ పశుకొట్టి మంచి మా
గాణములన్ సృజించ నెను
కల్ మసిజేసి పొలాలు దున్ని భో
షాణములన్ నవాబునకు
స్వర్ణము నింపిన రైతుదే తెలం
గాణము రైతుదే!'

* * * *

'విషము గుప్పించినాడు నొప్పించినాను
మా నిజాం రాజు జన్మజన్మాల బూజు'

* * * *

'బలమగు ముష్టిబంధనము
బద్దలుగొట్టి తరాలనాటి క
త్తుల పెనుకైదు, దాస్యమును
తుత్తునియల్ పొనరించి క్రొత్త వె
ల్గుల జలకమ్ములాడి తన
కున్ తన వారల కిల్లొకండు కా
వలెనని పట్టుపట్టె పెర
వారల కొంగ్రొత్త దారి జూపెడిన్.'

* * * *

నేనురా తెలగాణ నిగళాలు తెగ...
ఆకాశ మంత రెత్తరచినాను
నేను రాతిని పిండి నీరుగా పద్యాలు
పాడి మానవుని కాపాడినాను.

* * * *

కుంకుమ చిల్కరించు నిదిగో
పరిగర్జిత మేఘ మాలికా
పంకిల రోచిషీకుహూర
భాగ దిగాంత భయంకరార్భటీ
సంకుల కాళరాత్రి తెర
జారిన నాటకశాలవంటి ప్రా
గంకమునన్ మదీయ ఘుసృ
ణారుణహస్తతలద్వయమ్మునన్.

* * * *

మంగళగీతి పాడెద
హిమాచల శృంగ సరత్ సురాపగా
భంగ తరంగ రంగముల
పాదము లూని నటించు బాల పా
రంగధరున్ వినీల చికురమ్ములలో
ధరియించినట్టి ధ
న్యాంగుని ఫాలనేత్రమున
నగ్ని కణమ్ముల జిమ్ము దారులన్.

మాతృభూమియైన తెలంగాణముపై గల భక్తి భావము శ్రీ దాశరథికి మహదాశీస్సుగా పరిణమించి నవ్యాంధ్ర సాహిత్యరంగంలో ఆయనకు ఒక ప్రముఖ స్థానాన్ని యిచ్చింది.

ఇచ్చట నొక చిన్న విషయము చెప్పవలసి యున్నది. దీనికి బాధ్యులెవరో తెలియదు గాని, దాశరథి రచనలలోనుండి ఉన్నత శ్రేణి రచనల నన్నిటినీ సేకరించి ఈ సంపుటిలో మన కందించినారు. అందుకు వారికి కృతజ్ఞులము. ఈ సంపుటినుండి 'కపోతీ సందేశము'ను గూడ తొలగించిన బాగుండెడిది. ఈ శాంతి పావురముల తెచ్చికోలు సంప్రదాయములో, ఈ రచన ఈ సంపుటిలో చాల పేలవముగ కన్పించుచున్నది. శ్రీ దాశరథి కలలు గనుచున్న మహాంధ్రోదయము మృగతృష్ణగా మారునట్లు కనుపించుచున్న ఈ సమయమున ఈ గ్రంథము వెలువడుట ముదావహము. మహాంధ్రోదయ మగుటకు శ్రీ దాశరథి మొదలైన తెలంగాణా కవులే మహామంత్రముల పఠింతురో ముందు చూడవలసి యున్నది. 'మహాంధ్రగీతి 'పాడుటకు' మూడుకోటుల నొక్క ప్రేముడి బిగింపవలెనుకదా!

—తె. మా.

Printed & Published For Nageswara Rao Estates Ltd., by S. Radhakrishna,
at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1.
Editor: S. Sambhu Prasad.